
'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 49

శనివారం 11-5-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 49

శనివారం 11-5-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కేజ్రీవాల్‌కు 'ప్రచార' బెయిల్

మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. ఆయనకు జూన్ 1వ తేదీ వరకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న తిరిగి తిహార్ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. అధికారిక కార్యాలయంలో, సచివాలయంలో అడుగుపెట్టొద్దని స్పష్టం చేసింది.

6లో



ఉదయం 11.15 గంటలకు గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు 'ఫ్యాన్'ను ప్రజలకు చూపిస్తున్న సీఎం జగన్

గొంతు నొక్కేస్తున్నారు

మంగళగిరి, పుత్తూరు, కడప ఎన్నికల సభల్లో సీఎం వైఎస్ జగన్

- 5 ఏళ్లకు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని 57 నెలలకే అంతం చేసే కుట్రలు
- మీ జగన్ నొక్కిన బటన్లకు కోడ్ పేరుతో డబ్బులు ఆపేశారు
- మీరు నులిమేది నా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, రైతన్నలు, విద్యార్థుల గొంతులనే
- ఇవేవో ఎన్నికల కోసం తెచ్చిన పథకాలు కావు..
- ఎన్నికలకు 2, 3నెలల ముందు తెచ్చినవి అంతకంటే కాదు
- ఐదేళ్లుగా కొనసాగుతున్న స్కీమ్‌లనూ అడ్డుకున్నారు

5లో

- అవ్వాతాతలకు ఇంటికే పెన్షన్లనూ అడ్డుకున్నారు
- వీటి కోసం మీ బిడ్డ కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి తెచ్చారు
- చంద్రబాబువి ఊసరవెల్లి రాజకీయాలు.. వెనుకబాటుతనం ఆధారంగానే ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు
- మైనార్టీలకు మీ బిడ్డ జగన్ ఎప్పటికీ తోడుగా ఉంటాడు
- వైఎస్సార్ బాటలో మరో నాలుగడుగులు ముందుకేశాం
- ముస్లింలకు 7 అసెంబ్లీ సీట్లిచ్చి రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన ఘనత మనదే

కదిలించిన కడప చైతన్యం

కడప ఎన్నికల సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

దేశంలోని వ్యవస్థలన్నీ మీ బిడ్డ మీద ప్రయోగించిన వారితో కలిసిపోయినోళ్లు వైఎస్సార్ వారసులా?.. కాంగ్రెస్‌కి ఓటేస్తే వైఎస్సార్ పేరు కనపడకుండా చేసే కుట్రలో భాగస్తులం అయినట్లే

ఆ పార్టీకి ప్రజలు, వైఎస్సార్ అభిమానులు ఏనాడో సమాధి కట్టారు

8లో

చంద్రబాబు, షర్మిల మిలాఖత్

టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి ప్రయోజనం చేకూర్చేలా ఆమె ప్రచారం



- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై చంద్రబాబు గ్యాంగ్ చిమ్ముతున్న విషాన్నే వెదజల్లుతున్న పీసీసీ చీఫ్
- చంద్రబాబు సూచించిన మేరకే అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక
- ప్రతిఫలంగా కడప లోక్‌సభ స్థానంలో షర్మిలకు టీడీపీ-బీజేపీ ఓట్లు బదలాయించేలా లోపాయికారి ఒప్పందం
- అందులో భాగంగానే అక్కడ డమ్మీ అభ్యర్థిని బరిలోకి దించిన బాబు
- చింతలపూడిలోనూ మిలాఖత్.. టీడీపీ అభ్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి చెట్టాపట్టాల్
- కుప్పం, మంగళగిరి, పిఠాపురం నియోజకవర్గాల వైపు కన్నెత్తి కూడా చూడని షర్మిల

8లో

బాబు బార్ కోడ్ కుట్ర

'వుయ్' యాప్ పేరుతో ఎన్నికల అక్రమాలకు బరితెగింపు

రూ.వేల కోట్లతో ఓట్ల కొనుగోలుకు సిద్ధం

- అధికారంలో ఉండగా ప్రజా సాధికార సర్వే పేరుతో డేటా చౌర్యం
- ఇప్పుడు 'వుయ్' యాప్‌లో ఓటర్ల సమగ్ర సమాచారం.. ఓటర్ల స్లిప్పులతో ప్రత్యేక బార్‌కోడ్ ఉన్న కరపత్రాల పంపిణీ
- బార్‌కోడ్ స్కాన్ చేయగానే హైదరాబాద్ నుంచి డిజిటల్ చెల్లింపులు.. ఓటరుకు రూ.5 వేలు చెల్లిస్తున్నట్టు సమాచారం
- ఇందుకోసం మూడంచెల వ్యవస్థ ఏర్పాటు
- బూత్ కమిటీల ద్వారా ఇంటింటా స్లిప్పుల పంపిణీ.. దీని పర్యవేక్షణ, బార్‌కోడ్ స్కాన్‌కు మరో బృందం
- మొత్తం పర్యవేక్షణకు హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్.. నియోజకవర్గానికి రూ.87.50 కోట్ల చొప్పున డిజిటల్ చెల్లింపులు
- మూడంచెల వ్యవస్థలకు అదనపు చెల్లింపులు
- మాచర్ల, మైలవరం, ఒంగోలులో బయటపడ్డ వ్యవహారం.. చర్యలు తీసుకోవాలని ఈసీకి, డీజీపీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదులు





ఓటర్లకు డబ్బులిచ్చి ప్రలోభపెట్టేందుకు టీడీపీ తీసుకువచ్చిన వుయ్ యాప్.. ఒంగోలులో ఓటర్ స్లిప్‌లతో పాటు పంపిణీ చేసిన కరపత్రాలపై బార్ కోడ్, క్యూఆర్ కోడ్

సాక్షి, అమరావతి: ఈ ఎన్నికల్లో ప్రజా నిర్ణయం వ్యతిరేకంగా ఉందని, టీడీపీ కూటమికి ఓటమి తప్పదని స్పష్టం కావడంతో చంద్రబాబు తన వికృత రాజకీయానికి తెరతీశారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేసి, ఆ డేటా ద్వారా వేల కోట్లు వెదజల్లి ఓట్లు కొనేందుకు హైదరాబాద్ కేంద్రంగా పక్కా భారీ కుట్ర పన్నారు. కేవలం ఓట్ల కొనుగోలుకే ఏకంగా రూ. వేల కోట్లు వెదజల్లుతూ దేశంలోనే అత్యంత ఖరీదైన ఎన్నికలుగా మార్చేస్తున్నారు. అందుకోసం 'వుయ్' అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. దీనిద్వారా పకడ్బందీగా కుట్రను అమలు చేస్తున్నారు. ఓటర్లకు ఓటర్ స్లిప్పులతో పాటు

మిగతా 12వ పేజీలో ▶





హైకోర్టుకన్నా మీరే ఎక్కువా..?

ప్రజలు వారి సొమ్మును వారు పొందకుండా ఎందుకు అడ్డుకుంటున్నారు?

సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదు?

- మీ ఉత్తర్వులను అబయన్స్‌లో పెట్టిన తరువాత ప్రభుత్వాన్ని వివరణ కోరడం ఏమిటి?
- గతంలో ఏపీలో పసుపు కుంకుమకు, అన్నదాత సుఖీభవకు, తెలంగాణలో రైతుబంధుకు అనుమతినిచ్చారుగా?
- ఇప్పుడెందుకు అనుమతివ్వరు? ఇవీ పాత పథకాలేగా.. మీ భిన్న వైఖరులు ఆందోళన కలిగిస్తున్నాయి
- ఎన్నికల సంఘంపై నిప్పులు చెరిగిన సీజే ధర్మాసనం
- రిజిస్ట్రీని బెదిరించడంపై పిటిషనర్ల మీద మండిపడ్డ ధర్మాసనం
- ఎన్‌వోసీ ఇవ్వకుండా ఈసీ మరిన్ని వివరణలు అడిగింది
- ఎన్‌వోసీ లేకుండా బ్యాంకులు నిధులు పంపిణీ చేయవు.. ఈసీ తీరుతో నిధులు పంపిణీ చేసే పరిస్థితి లేదు

9లో

- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్
- ఈసీ వల్ల నిధుల పంపిణీ ఆగిపోయిందని ఉత్తర్వుల్లో పేర్కొన్న ధర్మాసనం
- అనామక నవతరం పార్టీ చేత అప్పీళ్లు వేయించిన చంద్రబాబు
- రంగంలోకి ఖరీదైన సుప్రీంకోర్టు లాయర్లు

మోకాలడ్డింది చంద్రబాబే!

ప్రజలకు సంక్షేమ పథకాలు అందకుండా అడ్డుకోవడంలో చంద్రబాబు నక్కజిత్తులు మరోసారి బయటపడ్డాయి. నవతరం పార్టీతో పిటిషన్లు దాఖలు చేయించడం ద్వారా రైతులు, మహిళలు, విద్యార్థులకు సంక్షేమ నిధులు అందకుండా టీడీపీ అధినేత నారా చంద్రబాబు మరోమారు మోకాలడ్డారు. సింగిల్ జడ్జి ఉత్తర్వుల మేరకు వివిధ పథకాలకు సంబంధించి ప్రభుత్వం రూ.14,165 కోట్లు శుక్రవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై నేరుగా కోర్టును ఆశ్రయిస్తే ప్రజల్లో ఆగ్రహావేశాలకు గురికావాల్సి వస్తుందని భయపడిన చంద్రబాబు దొడ్డిదారిని వెతుక్కున్నారు. తనతో సన్నిహితంగా ఉండే గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నవతరం పార్టీ అనే అనామక పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యంతో హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేయించారు. ఒక్క రోజు వాదనలకు రూ.20 లక్షల వరకు వసూలు చేసే మీనాక్షి అరోరా (రామోజీరావు తరఫున మార్గదర్శి కేసుల్లో హాజరయ్యే న్యాయవాది), దేవ్‌దత్ కామత్ (రాజధాని కేసులో న్యాయవాది), ఎస్.నాదకర్ణిలను నవతరం పార్టీ తరఫున వాదనలకు దించారు. ఇంత ఖరీదైన లాయర్లను పెట్టుకొనే స్తోమత ఆ పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యంకు లేదు. ఈ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగినప్పటికీ, వాదనలతో సాయంత్రం అయిపోయింది. దీంతో నిధుల విడుదలపై సింగిల్ జడ్జి ఇచ్చిన గడువు ముగిసిపోయింది. ఫలితంగా ప్రభుత్వం నగదు విడుదల చేసినప్పటికీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయలేకపోయింది.



టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో రావు సుబ్రహ్మణ్యం

చంద్రబాబు చేసిన ఈ పాపానికి లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ ఎన్నికల్లో రావు సుబ్రహ్మణ్యం నవతరం పార్టీకి రెండు చోట్ల గాజు గ్లాసు గుర్తు వచ్చింది. దీంతో ఆయన బాబును కలిసి లోపాయికారీ ఒప్పందంతో ఎన్నికల నుంచి తప్పుకున్నారు. పైగా టీడీపీ కేంద్ర కార్యాలయం కేంద్రంగా తన మద్దతును టీడీపీకి ప్రకటించడం గమనార్హం.

నేటితో ప్రచారానికి తెర

- సాయంత్రం 6 గంటల నుంచి 'సైలెంట్ పీరియడ్'
- 48 గంటలపాటు మద్యం బంద్
- 'సైలెంట్ పీరియడ్'లో ఇతర ప్రాంతాల వ్యక్తులు ఎవరూ ఉండకూడదు
- పోలీస్ కేసులున్నా ఏజెంట్లుగా నియమించుకోవచ్చు
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా

8లో

- కూటమి కళ్ల ముందు ఓటమి

తారస్థాయికి చేరిన టీడీపీ అరాచకాలు

తీవ్ర ఫ్రస్ట్రేషన్‌లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్

- చెప్పుకోవడానికి చేసిన మేలేమీ లేక సీఎం జగన్‌పై పడిన పచ్చ నేతలు
- ఎవరి భూములపై వారికి సర్వహక్కులు కల్పించే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై విష ప్రచారం.. రైతులు, విద్యార్థులు, మహిళల ఖాతాల్లో నిధులు జమ కాకుండా మోకాలడ్డు
- జగన్‌పై దూషణలు, దాడులకు ఉసిగొల్పుతూ రెచ్చిపోతున్న బాబు, పవన్
- బాబు రెచ్చగొట్టడంతోనే విజయవాడలో సీఎం జగన్‌పై హత్యాయత్నం

12లో



- బీసీ నేత ఆర్.కృష్ణయ్య పైనా దాడి
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలపై గూండాయిజం

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీకి ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ మద్దతు

సాక్షి, అమరావతి: ముస్లిం మైనారిటీల రక్షణ వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని, అందుకే తమ సంపూర్ణ మద్దతు సీఎం జగన్‌కు ఉంటుందని ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ బాషా తెలిపారు. శుక్రవారం ఆయన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతో జట్టుకట్టిన టీడీపీ, జనసేన ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ బహిరంగంగా ప్రకటించినా బాబులో ఏమాత్రం స్పందనలేదన్నారు. ముస్లింలకు అండగా ఉంటామని ప్రకటించిన సీఎం జగన్ మాటలను తాము నమ్ముతూ మద్దతు తెలుపుతున్నామని ఆయన వివరించారు.

ముస్లింలందరూ వైఎస్సార్‌సీపీని గెలిపించండి

ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సద్‌రుద్దీన్ ఖురేషి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముస్లింలు

మచిలీపట్నంటౌన్: రానున్న ఎన్నికల్లో ముస్లింలందరూ వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ సద్‌రుద్దీన్ ఖురేషి పిలుపునిచ్చారు. నగరంలోని 50వ డివిజన్ పంబలగూడెంలో ఉన్న బిలాల్ మసీద్ వద్ద '4% రిజర్వేషన్లకు పూర్తి మద్దతు తెలిపిన సీఎం జగన్‌కే మన ఓట్లు అంటూ' శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. సద్‌రుద్దీన్ ఖురేషి మాట్లాడుతూ ముస్లింల 4 శాతం రిజర్వేషన్‌ను తొలగిస్తామని మోదీతో పాటు కేంద్రమంత్రులు, నాయకులు హెచ్చరిస్తున్నారన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ ముస్లింలకు 4శాతం రిజర్వేషన్‌ను అమలు చేయడంతో రాష్ట్రంలోని పేద ముస్లిం పిల్లలు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు పొందారన్నారు. ఈ ఎన్నికల్లో మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు ఓట్లు వేయాలని కోరారు. అబ్దుల్ ఖయ్యూం, మునీర్, చాంద్ పాల్గొన్నారు.

జగన్‌కే రజకుల మద్దతు

రాష్ట్ర రజక సంఘం గౌరవ అధ్యక్షుడు పాతపాడు అంజిబాబు



అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడసెంట్రల్): రజకుల అభ్యున్నతికి కోసం నిరంతరం పాటుపడిన సీఎం జగన్‌కే రజక సమాజం మొత్తం మద్దతిస్తుందని రాష్ట్ర రజక సంఘం గౌరవ అధ్యక్షుడు పాతపాడు అంజిబాబు స్పష్టం చేశారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని సెంట్రల్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రజకులు, బీసీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. చంద్రబాబు పాలనలో రజకుల హక్కుల కోసం పోరాడిన రజక సోదరులెందరినో టీడీపీ, బోండా ఉమా ఎన్నో హింసలకు గురిచేసి అరెస్ట్ చేయించారని గుర్తు చేశారు. రజకులను ఎస్సీల్లో చేర్పిస్తానని, రజకులకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు రజకులపై 89 కేసులు పెట్టించిన దుర్మార్గుడు బోండా ఉమాను ఓడించేందుకు రజకులంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కందకట్ల శ్రీనివాస్, ఉకోటి శేషగిరిరావు, ముదిగొండ గోపాలకృష్ణ, తాడేపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం సభ్యులు



తెనాలి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే మరోసారి జగనన్నను గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం సభ్యులు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ దేశ విదేశాల్లో స్థిర పడిన ఎన్‌ఆర్‌లు రాష్ట్రంలో చేపట్టిన ప్రచారరథం శుక్రవారం సాయంత్రం తెనాలి చేరుకుంది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌ను ఎన్‌ఆర్‌ఐలు కలిసి తమ సంఘీభావం తెలిపారు. మనోహర్ నక్కా (లండన్), డాక్టర్ నీరజ కొల్లి (కరేబియన్ దీవులు), రోజారాణి బండ్లమూడి (కాలిఫోర్నియా), కార్తీక్ (ఐటీ ఉద్యోగి) మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో నాలుగు లక్షలకు పైగా ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటయ్యాయని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం ప్రథమస్థానంలో నిలిచిందని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. విద్య, ఉపాధితో పాటు అన్ని రంగాల్లో రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందిందని, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌ఆర్‌ఐల బృందానికి కె.భిక్షాల్ రాయల్, జె.రామకృష్ణ తదితర స్థానిక నాయకులు స్వాగతం పలికారు.

తారస్థాయికి చేరిన

టీడీపీ అరాచకాలు

కూటమి కళ్ల ముందు ఓటమి

ఓటమి ఖాయమవడంతో తీవ్ర ఫ్రస్ట్రేషన్‌లో బాబు, పవన్

సాక్షి, అమరావతి: ఇదిగో.. ఓటమి.. కళ్ల ముందు కదలాడుతోంది.. పోలింగ్ రోజున ప్రజలు వరుసగా వచ్చి, జన నేత, సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ పార్టీ వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేస్తున్నట్టే కనిపిస్తోంది.. చంద్రబాబు కళ్ల ముందు కూటమి ఘోర ఓటమి కనిపిస్తోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు వణుకు ఎక్కువైంది. మరో 48 గంటల్లో ఎన్నికల పోలింగ్.. చంద్రబాబు, ఆయన కూటమికి మరోసారి కళ్ల ముందు ఘోర పరాజయం ఖాయమైంది. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ప్రజలకు మనమేం చెప్పాలీ అని అంటే.. చెప్పుకొనే పనులేమీ చేయలేదు. చేసినవన్నీ మోసాలు, మాయలే. పోనీ పవన్.. గత ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల్లో ప్రజలు ఘోరంగా తిరస్కరించడం ఒక్కటే ఉంది. మూడు జెండాలు జతకట్టినా, మరో మూడు జెండాల సహాయం తీసుకుంటున్నా.. కోట్ల నోట్ల కట్టలు వెదజల్లుతున్నా.. మందు మంచి నీళ్లలా పోస్తున్నా.. 2019 ఎన్నికల కంటే ఘోర ఓటమే కళ్ల ముందు కనిపిస్తోంది. కించిత్తు ఆశ లేదు. పిచ్చెక్కిపోయింది.. పచ్చ ద్వయం చంద్రబాబు, పవన్‌కి ఫ్రస్ట్రేషన్ పీక్స్‌కి చేరింది. ఇద్దరూ నోటికి పని చెప్పారు. దుష్ప్రచారం, దూషణలు, బూతులు, దాడులు, ఎన్నికల అక్రమాలతో చెలరేగిపోతున్నారు. సీఎం జగన్ పైన, ఆయన ప్రభుత్వం పైన విషం కక్కుతున్నారు .నాలుక ఎటు తిరిగితే అది మాట్లాడేస్తున్నారు. బూతులూ వచ్చేస్తున్నాయి. చంద్రబాబయితే చంపుతామనీ అంటున్నారు. దుష్ప్రచారంతో ప్రజల్లో గందరగోళం సృష్టించి ఉనికిని చాటుకోవాలన్న దింపుడు కళ్లం ఆశతో మైకు ముందుకొస్తున్నారు. ఎవరి భూములపై వారికి సర్వ హక్కులు కల్పించి, భద్రతనిచ్చే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పైన విష ప్రచారం ప్రారంభించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు నీతి ఆయోగ్ రూపొందించిన ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై యథేచ్ఛగా దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలనూ అడ్డుకొంటున్నారు. రైతులు, విద్యార్థులు, మహిళల ఖాతాల్లో నిధులు జమ కాకుండా అడ్డుపడ్డారు.



సిగ్గు విడిచిన చంద్రబాబు

నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు స్థాయిని మరిచిపోయారు. సిగ్గెగ్గులు గాలికి వదిలేశారు. అమ్మ మొగుడు.. అమ్మమ్మ మొగుడు.. అంటూ పిచ్చి కూతలు కూస్తున్నారు. జగన్‌ను చంపితే ఏమవుతుందంటూ అరుస్తున్నారు. రాళ్లతో కొట్టండంటున్నారు. లక్ష పుస్తకాలు చదివానని చెప్పుకొనే స్వయంప్రకటిత మేధావి పవన్ కళ్యాణ్ కూడా వైఎస్సార్‌సీపీ నేతలను తరిమితరిమి కొట్టండి అంటూ జనసేన–టీడీపీ రౌడీలను రెచ్చగొడుతున్నారు. వీరి వీరంగంతో టీడీపీ, జనసేన గూండాలు రెచ్చిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. సీఎం జగన్‌ను కొట్టండంటూ చంద్రబాబు రెచ్చగొట్టిన తర్వాతే జగన్‌పై విజయవాడలో హత్యాయత్నం జరిగింది. గురువారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడులో ప్రచారానికి వచ్చిన బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్యపై టీడీపీ–జనసేన మూక రాళ్ల దాడికి తెగబడింది. మాచర్ల నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య రమాదేవి, కార్యకర్తలపై టీడీపీ అభ్యర్థి, ఏడు హత్య కేసుల్లో నిందితుడైన జూలకంటి బ్రహ్మారెడ్డి తన అనుచరులతో దాడి చేయించారు. నంద్యాల జిల్లా బనగానిపల్లెలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డి భార్య, తనయుడిపై టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దనరెడ్డి గూండాలతో దాడులు చేయించారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో ప్రచారం ముగించుకుని భోజనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, హోంమంత్రి తానేటి వనితపై టీడీపీ నేత, జెడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు తన అనుచరులతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇవే కాదు.. రాష్ట్రంలో అనేక చోట్ల ప్రశాంతంగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలుస్తామన్న మహిళలు, వృద్ధులు, యువతపైనా దాష్టీకాలకు దిగుతున్నారు. విధ్వంసం, భయోత్పాతం సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలన్న కుతంత్రంతో చంద్రబాబు, పవన్ ముందుకెళ్తున్నారు.

పట్టుబడుతున్న రూ.కోట్ల కట్టలు, మద్యం కేసులన్నీ కూటమివే..

ఓ వైపు విధ్వంసం సృష్టిస్తున్న చంద్రబాబు–పవన్ కళ్యాణ్.. మరో వైపు ఎన్నికల అక్రమాలకూ తెగబడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నోట్ల కట్టలు, మద్యం యథేచ్ఛగా పంచుతున్నారు. 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ధనాన్ని దోచేసి నింపుకొన్న నల్ల ఖజానాను తెరిచి.. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వందల కోట్లు రాష్ట్రంలో దించారు. ప్రతి నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెదజల్లుతున్నారు. కర్ణాటక, గోవా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున మద్యాన్ని రాష్ట్రంలోకి అక్రమంగా తరలించి, వీధి వీధిలో సీసాలు పంచుతున్నారు. ఎన్నికల అధికారుల దాడుల్లో పట్టుబడుతున్న కోట్లాది రూపాయల నోట్ల కట్టలు, కేసులకు కేసుల మద్యం అంతా కూటమిదే కావడం గమనార్హం.

జగన్ వెంటే క్రిస్టియన్ మైనార్టీలు

ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ



సాక్షి, అమరావతి: పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు అన్ని వర్గాలను మోసం చేశాడని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పేదలందరినీ ఆదుకున్నారని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ స్పష్టం చేశారు. ముఖ్యంగా క్రిస్టియన్ మైనార్టీలంతా జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని తెలిపారు. క్రైస్తవులను దగా చేసిన టీడీపీకి మద్దతు ప్రకటిస్తూ జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ చైర్మన్ మోసిగంటి జోసెఫ్ చేసిన విమర్శలను జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ఇప్పుడు దేవుళ్లను కూడా మోసం చేస్తూ చర్చిలు, దేవాలయాల్లో రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు పాలనలో నాలుగున్నరేళ్లపాటు మైనార్టీ శాఖకు మంత్రి పదవి కూడా లేకుండా చేసిన విషయాన్ని ఎవరూ మర్చిపోలేదని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మైనార్టీ శాఖకు ఉపముఖ్యమంత్రిని నియమించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్ పాస్టర్లకు నెలకు రూ.5వేలు ఇస్తున్నారని, ఇది చట్ట వ్యతిరేకమంటూ చంద్రబాబు తన మనుషులతో కేసులు వేయించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. క్రైస్తవుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ఐదేళ్లలో రూ.438 కోట్లు కేటాయించారని జాన్‌వెస్లీ స్పష్టం చేశారు. మళ్లీ జగన్‌నే సీఎంగా గెలిపించుకుంటామని జాన్‌వెస్లీ స్పష్టం చేశారు.

బాబు బార్ కోడ్ కుట్ర

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక బార్ కోడ్ ఉన్న కరపత్రాలను పంపిణీ చేస్తూ.. హైదరాబాద్ నుంచి గుట్టు చప్పుడు కాకుండా ఓటర్ల బ్యాంకు ఖాతాల్లోకి నగదు బదిలీ చేస్తున్నారు. అందుకోసం ఐటీ చట్టాన్ని ఉల్లంఘించి, డేటా చౌర్యానికి పాల్పడి, ఓటర్ల వివరాలను వుయ్ యాప్‌లో పొందుపరిచారు. ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని, ఎన్నికల కమిషన్ (ఈసీ) మార్గదర్శకాలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా ఓట్ల కొనుగోలుకు బరితెగించి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా దొరక్కుండా ఎన్నికల కమిషన్‌ను బోల్తా కొట్టిస్తున్నారు.

'వుయ్' యాప్ ఇలా..

గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజాసాధికార సర్వే పేరుతో సేకరించిన ఓటర్ల సమాచారాన్ని సేకరించి, అప్పట్లోనే డేటా చౌర్యానికి పాల్పడి టీడీపీ సేవా మిత్ర యాప్‌లో పొందుపరిచిన విషయం తెలిసిందే. దానికి అప్‌డేటెడ్ వెర్షన్ కింద ఇప్పుడు 'వుయ్' యాప్ తెచ్చారు. ఇందులో రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఆధార్, ఫోన్ నంబర్లు, ఓటరు ఐడీ నంబర్లు, వృత్తి తదితర వ్యక్తిగత వివరాలన్నీ పొందుపరిచారు. వారు ఏ పార్టీ సానుభూతిపరులో కూడా ఇందులో ఉంది. ఇది ప్రజల వ్యక్తిగత గోప్యత హక్కుకు పూర్తి విరుద్ధం.

మూడంచెల వ్యవస్థతో..

ఈ యాప్ ద్వారా ఎన్నికల అక్రమాల కోసం చంద్రబాబు మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల ద్వారా స్లిప్పుల పంపిణీ, వీటిని పర్యవేక్షించి, స్కాన్ చేసేందుకు మరో ప్రత్యేక బృందం, ఈ మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. యాప్‌లో ఉన్న వివరాల ఆధారంగా బూత్ కమిటీ సభ్యులు ఓటర్ల వద్దకు వెళ్లి, ఓటరు స్లిప్పులు, బార్‌కోడ్ ఉన్న కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. ఈ బార్ కోడ్‌ను ప్రతి ఓటరుకు ప్రత్యేకంగా (యూనిక్)గా కేటాయించారు. స్లిప్పుల పంపిణీ అయిన తరువాత రెండో బృందం ఓటర్ల ఇళ్లకు వెళ్లి స్లిప్పులపై ఉన్న బార్ కోడ్‌ను స్కాన్ చేస్తుంది. ఆ వెంటనే హైదరాబాద్ నుంచి ఫోన్ పే, గూగుల్ పే తదితర డిజిటల్ చెల్లింపుల ద్వారా ఓటర్ల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. ఒక్కో ఓటుకు సగటున రూ.5 వేల వరకు చెల్లిస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే చేస్తున్నారు. డబ్బులు హైదరాబాద్ నుంచి ఓటర్ల ఖాతాల్లో జమ అవుతున్నందున.. పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేసినా బూత్ కమిటీలు, పర్యవేక్షక బృందాల వద్ద డబ్బు దొరకదు.





ఓట్ల కొనుగోలు కోసం టీడీపీ రూపొందించిన 'వుయ్ యాప్', టీడీపీ ఓటర్లకు పంపిణీ చేస్తున్న బార్ కోడ్ ఉన్న కరపత్రాలు

నియోజకవర్గానికి రూ.87.50 కోట్లు

'వుయ్' యాప్ ద్వారా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో సగటున 1.75 లక్షల ఓట్లు కొంటున్నారు. ఓటుకు రూ.5 వేలు రేటు కట్టినట్టు సమాచారం. ఆ ప్రకారం నియోజకవర్గానికి రూ.87.50 కోట్లు చొప్పున అన్ని నియోజకవర్గాలకు కలిపి మొత్తం రూ.15,312 కోట్లు వెచ్చిస్తున్నారు. నేరుగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేసేది దీనికి అదనం. బార్ కోడ్ స్లిప్పులను సక్రమంగా పంపిణీ చేసిన బూత్ కమిటీలకు ఒక్కో దానికి రూ. 5 లక్షలు, పర్యవేక్షక బృందానికి రూ.5 లక్షల చొప్పున ప్రత్యేక ప్రోత్సాహకాలు చెల్లిస్తునట్టు తెలుస్తోంది. ఇందుకోసం మరో రూ.2,500 కోట్ల వరకు చంద్రబాబు ప్రకటించినట్టు సమాచారం. వుయ్ యాప్‌ను రూపొందించి హైదరాబాద్ కేంద్రంగా కుట్రను అమలు చేస్తున్న బృందానికి మరో రూ.2 వేల కోట్లకు పైగా ప్యాకేజీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఆ ప్రకారం రూ. వేల కోట్లతో చంద్రబాబు ఓట్ల కొనుగోలుకు భారీ కుట్ర అమలు చేస్తున్నారన్నది సుస్పష్టమైంది. దేశ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఎన్నికల అక్రమానికి చంద్రబాబు తెగించారన్నది బహిర్గతమైంది.

కుట్ర ఇలా బట్టబయలు..

రెండు రోజుల క్రితం మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ పంపిణీ చేసిన బార్ కోడ్ ఓటరు స్లిప్పులు బయటపడ్డాయి. తర్వాత మైలవరంలో, తాజాగా ఒంగోలులోనూ ఈ బార్ కోడ్ స్లిప్పుల బాగోతం బట్టబయలైంది. ఆ నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థుల ఫొటోలు ముద్రించిన కరపత్రాలు, బార్ కోడ్ ఉన్న ఓటరు స్లిప్పులు లభించాయి. బార్ కోడ్‌ను పరిశీలించగా వాటిపై 'వుయ్ యాప్'కు అవి అనుసంధానించి ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది. చంద్రబాబు టీడీపీ శ్రేణుల కోసం గూగుల్‌లో అందుబాటులో ఉంచిన 'వుయ్ యాప్'ను పరిశీలించగా మొత్తం ఎన్నికల అక్రమాల గుట్టు బట్టబయలైంది.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనే

ప్రస్తుత లోక్‌సభ, రాష్ట్ర శాసన సభ ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ (ఈసీ) ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(1) ప్రకారం స్పష్టమైన విధి విధానాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని వెల్లడించింది. దాంతోపాటు ఓటర్ల నమోదు, సర్వే పేర్లతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని, పథకాలను ప్రకటించవద్దని, అవినీతి కార్యకలపాలకు పాల్పడవద్దని స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. కానీ చంద్రబాబు ఈసీ మార్గదర్శకాలు, ఎన్నికల నియమావళిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ వుయ్ యాప్ ముసుగులో ఎన్నికల అక్రమాలకు బరితెగించారు. ఇది ఎన్నికల నియమావళి ఉల్లంఘనే కాకుండా డేటా చౌర్యం కూడా. దాంతోపాటు ఐటీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తున్నారు.

ఈసీ, డీజీపీలకు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

వుయ్ యాప్ పేరుతో టీడీపీ పాల్పడుతున్న ఎన్నికల అక్రమాలపై ఎన్నికల కమిషన్(ఈసీ), రాష్ట్ర డీజీపీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఎ.నారాయణమూర్తి, లీగల్ సెల్ నేత కె. శ్రీనివాసరెడ్డి ఈసీకి, డీజీపీకి ఫిర్యాదు చేశారు. మాచర్ల, ఒంగోలులో టీడీపీ వారి నుంచి స్వాధీనం చేసుకున్న బార్ కోడ్ ఉన్న ఓటరు స్లిప్పులు, డౌన్‌లోడ్ చేసిన వుయ్ యాప్, ఇతర వీడియో ఆధారాలను కూడా సమర్పించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, ఐటీ చట్టాలను ఉల్లంఘిస్తూ ఎన్నికల అక్రమాలకు పాల్పడుతున్న టీడీపీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకులు, దర్యాప్తు అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ కార్యాలయాల్లో తనిఖీలు చేసి వుయ్ యాప్‌కు సంబంధించిన ఆధారాలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధం

ఈసీకి, డీజీపీకి ఫిర్యాదు అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ.. వుయ్ యాప్‌లో ప్రజల వ్యక్తిగత సమాచారం మొత్తం ఉందని చెప్పారు. ప్రజల ఓటర్ ఐడీలు, వారి సచివాలయ పరిధి, ఓటర్ నంబరు, ఏ పార్టీ సానుభూతిపరులు తదితర వివరాలన్నీ ఉన్నాయన్నారు. వాటితో టీడీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ స్లిప్‌తో పాటు బార్ కోడ్ కలిగిన స్లిప్‌ను, మేనిఫెస్టోను ఇస్తున్నారని, ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమని తెలిపారు. బార్ కోడ్ స్లిప్ స్కాన్ చేసిన అనంతరం వారిని ప్రలోభాలకు గురిచేస్తున్నారని తెలిపారు.

ఓట్ల కోసం చంద్రబాబు.. జనం కోసం జగన్

మేనిఫెస్టో రూపకల్పనలో ఎవరిలో చిత్తశుద్ధి ఉందో ప్రజలకు తెలుసు

- చంద్రబాబు ఇచ్చేవన్నీ అబద్ధపు హామీలు
- ప్రజల కోసం అమలు చేయగల వాటినే జగన్ మేనిఫెస్టోలో పెట్టారు
- జగన్‌కు ఓటేయొద్దనడానికి, చంద్రబాబుకి వేయమనడానికి ఒక్క కారణం కూడా లేదు
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు చేస్తున్నది దుష్ప్రచారమే
- ఈ చట్టం అమలులో ఉన్న 90 దేశాల్లో భూ వివాదాలే లేవు
- విలేకరుల సమావేశంలో మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, ఎన్‌ఆర్‌ఐలు
- టీడీపీ గెలిస్తే ఈనాడు ఆఫీసు ముందు ఆత్మహత్య చేసుకుంటానన్న జర్నలిస్ట్ తిలక్
- ఓడిపోతే రామోజీ సంస్థలపై ఆయనే సీబీఐ విచారణ కోరగలరా అని సవాలు

సాక్షి, అమరావతి: ఓట్ల కోసం చంద్రబాబు అబద్ధపు హామీలు ఇస్తుంటే.. ప్రజల కోసం జగన్ అమలు చేయగల వాటినే మేనిఫెస్టోలో పెట్టారని, ఈ విషయంలో ఇద్దరిలో ఎవరికి చిత్తశుద్ధి ఉందో ప్రజలకు బాగా తెలుసని పలువురు మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, ఎన్‌ఆర్‌ఐలు, జర్నలిస్టులు స్పష్టం చేశారు. వీరంతా శుక్రవారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడారు.

రాజకీయ పార్టీలు రకరకాల హామీలతో ఓటర్లను అయోమయంలోకి తీసుకెళ్లడం, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేయడమే మనం ఇంతవరకు చూశామని, కానీ అన్ని హామీలను అమలు చేసి, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తూ సుపరిపాలన అంటే ఇదీ అని చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమేనని ఓపెన్ మైండ్స్ సంస్థ అధ్యక్షుడు ఎస్. రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సీఎం జగన్ విద్య, వైద్యం వంటి రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని చెప్పారు. జగన్ అంటే ప్రజలకు ఒక నమ్మకం, భరోసా అని అన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పరిపాలనతో బేరీజు వేసుకొంటే గత ఐదేళ్లలో వైఎస్ జగన్ పరిపాలన అద్భుతంగా ఉందని, రాష్ట్రం ఇప్పుడే సరైన దిశలో ఏపీ పయనిస్తోందని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ప్రజలు జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలని చెప్పారు. వైఎస్ జగన్‌కు ఎందుకు ఓటేయాలో చెప్పడానికి చాలా కారణాలున్నాయని, వేయొద్దని చెప్పడానికి ఒక్క కారణం కూడా లేదని తెలిపారు. చంద్రబాబుకి ఓటేయమనడానికి ఒక్క కారణం కూడా లేదని చెప్పారు. అందువల్ల అందరం వైఎస్సార్‌సీపీకి ఓటేద్దామని పిలుపునిచ్చారు. ప్రత్యర్థులపై దాడులను ఈసీ అరికట్టి, ఎన్నికలను ప్రశాంతంగా జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

దమ్మున్న నాయకుడు సీఎం జగన్

తన 63 ఏళ్ల జీవితంలో ఏ పార్టీకీ బహిరంగంగా మద్దతివ్వలేదని, కానీ.. 'నేను మీకు మేలు చేసి ఉంటే, నా పరిపాలన నచ్చితే నాకు ఓటేయండి' అని చెప్పగలిగే గుండె ధైర్యం, దమ్ము ఉన్న నాయకుడైన సీఎం వైఎస్ జగన్ కోసం బయటకు వచ్చి మద్దతిస్తున్నానని సీనియర్ న్యాయవాది చోడిశెట్టి మన్నధరావు చెప్పారు. సీఎంను కలవడం కాదు.. ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని మంత్రులు, ఎమ్మెల్యేలను పంపిన నాయకుడు జగన్ అని తెలిపారు. జగన్‌ను ఏమీ చేయలేక బాబు జాతీయ పార్టీల దగ్గర్నుంచి చిన్న చిన్న పార్టీల వరకూ అందరితో కూటమి కట్టారన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తిలక్, వెంకట్ మేడపాటి తదితరులు

కరోనా సమయంలో బాబు, పవన్ ఎక్కడున్నారు?

కరోనా సంక్షోభ సమయంలో బాబు, పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారని సీనియర్ జర్నలిస్టు తిలక్ నిలదీశారు. ఆపత్కాలంలో వీరు రాష్ట్రంలో ఎందుకు కనపడలేదన్నారు. ప్రజలతో పాటు నిలబడి ఆప్రమాదాన్ని ఎదుర్కొని రాష్ట్రాన్ని కాపాడింది సీఎం జగన్ అని చెప్పారు. బాబు కేవలం ఓట్ల కోసమే హామీలిస్తారని, సీఎం జగన్ మాత్రం ప్రజల జీవన ప్రమాణాల మెరుగు కోసం హామీలిస్తున్నారని వివరించారు. టీడీపీ గెలిస్తే ఈనాడు ఆఫీసు ముందు ఆత్మహత్య చేసుకుంటానని, ఓడిపోతే రామోజీ ఆయన సంస్థలపై సీబీఐ విచారణ కోరాలని సవాలు విసిరారు.

భూహక్కు చట్టంపై అపోహలు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు, ఎల్లో బ్యాచ్ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని న్యాయవాది సీడీ భగవాన్ చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.2.5 లక్షల కోట్లు ప్రజలకు ధారబోసి, వేలాది ఎకరాలను ప్రజలకు ఇచ్చిన సీఎం జగన్ ప్రజల భూములు లాక్కుంటారా అని ప్రశ్నించారు. అసలు జగన్ మాత్రమే ఈ చట్టాన్ని తెచ్చారని నిరూపించగలరా, లేదంటే చంద్రబాబు, పవన్ వారి పార్టీల అధ్యక్ష పదవులకు రాజీనామా చేస్తారా అని సవాలు విసిరారు.

30 రకాల భూ రికార్డులన్నిటినీ క్రోడీకరించడమే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్

30 రకాల భూ రికార్డులన్నింటినీ క్రోడీకరించడమే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అని, దాని ప్రకారం పట్టాదారు పాసు బుక్ ఇస్తే ప్రభుత్వం ఆ భూమికి ఇన్సూరెన్స్ కల్పిస్తుందని న్యాయవాది షేక్ సయ్యద్ బాబు వివరించారు. పైగా ఈ ప్రతిపాదన నీతి ఆయోగ్ చేసిందని, ఇదే చట్టాన్ని అమలు చేస్తున్న 90 దేశాల్లో భూ వివాదాలు లేవని తెలిపారు.

విశ్వసనీయతకు, మోసానికి మధ్య ఎన్నికలు

ఇవి విశ్వసనీయతకు, మోసానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి అన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై జరుగుతున్నది కేవలం దుష్ప్రచారమని, ప్రజలు, రైతులు ఆ విష ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. జగన్ పథకాల వల్ల రాష్ట్ర జీడీపీ పెరిగిందన్నారు.

ఆర్టీసీకీ మేలు చేశారు

సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని పేదల్లో ప్రతి ఒక్కరికీ మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు, ఉద్యోగులకు కూడా మేలు చేశారని ఏపీఎస్‌ఆర్టీసీ మాజీ ఉన్నతాధికారి ఎ.కోటేశ్వరరావు చెప్పారు. 2019కి ముందు ఏటా వెయ్యి కోట్ల రూపాయల చొప్పున దాదాపు రూ.6 వేల కోట్ల అప్పుల్లోకి ఆర్టీసీ వెళ్లిపోయిందని తెలిపారు. జగన్ సీఎం అయ్యాక ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, ఫలితంగా అప్పులు సగానికి తగ్గాయని వెల్లడించారు.

ప్రజలు ఇది గమనించాలి

ఇవి బైపోలార్ ఎలక్షన్లని, ఏ నాయకుడు తమకు అవసరమైనవన్నీ సమకూర్చారనేది ప్రజలంతా గమనించాలని ప్రవాసాంధ్రుల సంఘం అధ్యక్షుడు వెంకట్ మేడపాటి కోరారు. కొద్ది రోజులుగా రాష్ట్రంలో తమ బృందం బస్సులో ఊరూరా పర్యటించిందని, ప్రజలు వైఎస్ జగన్ పట్ల చాలా సంతృప్తిగా ఉన్నారని ఎన్‌ఆర్‌ఐ కార్తీక్ యల్లాప్రగడ తెలిపారు.





సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 49

శనివారం 11-5-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అటు మోసం.. ఇటు నమ్మకం

మేనిఫెస్టో అంటే ప్రజలకు నాయకుడు ఇచ్చే మాట. మేనిఫెస్టోను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా పవిత్రంగా చూస్తారు. అందుకే అమలు చేయదగిన హామీలతో మేనిఫెస్టోను ప్రకటించారు. కానీ చంద్రబాబు అబద్ధాలకు రెక్కలు కడుతూ మేనిఫెస్టోను విడుదల చేయడం, అధికారంలోకి వచ్చాక దానిని తుంగలో తొక్కడంతోపాటు ప్రజలు నిలదీస్తారేమోనన్న భయంతో మేనిఫెస్టోను మాయం చేస్తారు. 2014 మేనిఫెస్టో అమలే అందుకు తార్కాణం.

– వివరాలు జైత్రయాత్రలో

మీ భూమి మీదే..

ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమల్లోనే లేదు

- ఈ చట్టం గురించి చంద్రబాబు హీనాతిహీనంగా దుష్ప్రచారాలు చేస్తున్నాడు
- రాజకీయ లబ్ధికోసం భూముల పేరుతో ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నాడు
- అసత్య ప్రచారాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు
- ప్రజలు కన్నతల్లిలా భావించే భూమిపై కుట్రలు చేస్తున్నాడు
- ఈ చట్టానికి, భూ సంబంధిత ఫిర్యాదులకు సంబంధం ఏమిటి?
- చట్టమే అమలుకానప్పుడు భూ సంబంధిత ఫిర్యాదులెలా వస్తాయి?
- భూ ఆక్రమణల ఫిర్యాదులు లేనేలేవు
- రీ సర్వేలో 40 వేలకు పైగా భూ వివాదాలు పరిష్కారమయ్యాయి

ఇక దుర్మార్గాలేంటి?

- మీ దస్తావేజులు మీకే ఇస్తారు. ప్రస్తుతం కూడా ఇస్తున్నారు. గత 3 నెలల్లో 10 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వారందరికీ ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇచ్చారు.
- చంద్రబాబు బావమరిది, వియ్యంకుడైన నందమూరి బాలకృష్ణ ఇటీవల రిజిస్ట్రేషన్ చేయించుకుని ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకున్నాడు.
- అలాగే, పవన్‌కళ్యాణ్ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఒరిజినల్స్ తీసుకున్నాడు. కానీ, ప్రజలను మాత్రం జిరాక్సు కాపీలని భయపెడుతున్నాడు.
- అధికారం, డబ్బు, కండబలంతో మీ భూముల్ని ఎవరూ కొట్టేయలేరు. అది అసాధ్యం
- మీ వారసుల్ని నిర్ణయించేది మీరే. అందులో అధికారుల ప్రమేయం ఉండనే ఉండదు
- జగన్ మీ స్థలాన్ని బ్యాంకులో తనఖా పెట్టవచ్చనేది చంద్రబాబు చేసే తప్పుడు ప్రచారం
- ప్రస్తుతం ల్యాండ్ టైట్లింగ్ చట్టమేలేదు. అలాంటప్పుడు ల్యాండ్ టైట్లింగ్ ఆఫీసర్‌ని ఎలా నియమిస్తారు?
- ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా కోర్టుకు వెళ్లొచ్చు.

బాబు సృష్టించిన తప్పుడు ప్రచారాలు..

- మీ ఆస్తులకు జిరాక్సు కాపీలు ఇస్తారు. ఒరిజినల్ పత్రాలు ఇవ్వరు.. - ఇది పచ్చి అబద్ధం
- మీ ఆస్తులకు గ్యారంటీ ఉండదు. మీ భూములు లాక్కుంటారు.. - ప్రజల ఆస్తులకు ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుంది..
- మీ ఇళ్ల స్థలాలు ఎత్తుకెళ్తారు. మీ యాజమాన్య హక్కులు నిరూపించుకోవాలి.. - స్థలాలను ఎత్తుకెళ్తారనేది అపోహే
- కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదు.. - నిరభ్యంతరంగా కోర్టుకు వెళ్లొచ్చు.
- మీ వారసులకు భూములు దక్కవు.. - మీ వారసులకే భూములు దక్కుతాయి
- ఇది కేంద్ర చట్టం కాదు. రాష్ట్రమే తెచ్చింది.. - కేంద్రం అన్ని రాష్ట్రాలకు ఈ చట్టం గురించి సిఫారసు చేసింది
- మీ పాసు పుస్తకాలు మీ దగ్గర ఉండవు.. - మీ పాస్ పుస్తకాలు మీ దగ్గరే ఉంటాయి

ప్రజలారా చంద్రబాబు మాటలు విని మోసపోవద్దు

- భూముల్ని మింగిన చంద్రబాబు మీ భూముల్ని కాపాడతాడా?
- అమరావతిలో రూ.వేల కోట్ల విలువైన భూముల్ని దోచేసిన వాడు భూముల రక్షకుడా?
- విశాఖలో లక్ష ఎకరాల భూముల రికార్డుల్ని మాయం చేసిన మాయావి మీ భూములకు భద్రత కల్పిస్తాడా?
- వైఎస్ జగన్ హయాంలో ఒక్క భూకుంభకోణం జరగలేదు
- చంద్రబాబు హయాంలో అమరావతి భూముల కుంభకోణం, విశాఖ లక్ష ఎకరాల కుంభకోణం, సదావర్తి భూముల కుంభకోణం వంటివి ఎన్నో జరిగాయి.
- జగన్ హయాంలోనే భూములకు రక్షణ.
- చుక్కల భూములకూ విముక్తి కల్పించింది జగనే..
- షరతుల గల పట్టా భూములకూ విముక్తి కల్పించింది జగన్
- అసైన్డ్ భూములకూ హక్కులు ఇచ్చినవాడు జగన్
- చంద్రబాబు భూములు లాక్కుంటే.. జగన్ భూములు ఇచ్చాడు.




ల్యాండ్ టైట్లింగ్ చట్టం వాస్తవాలు..

- ప్రజల ఆస్తులను కాపాడ్డానికే 'ల్యాండ్ టైట్లింగ్'
- దీన్ని ఇంకా అమలు చేయడంలేదు. అమల్లోకి తెస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన మాత్రమే ఇచ్చింది. అమలుకు నోటిఫికేషన్ ఇంకా ఇవ్వలేదు
- నోటిఫికేషన్ ఇవ్వకుండా ఏ చట్టం అమలుచేయలేరు
- రాష్ట్రమంతటా ఈ చట్టం ఒకేసారి అమల్లోకి రాదు. భూముల సర్వే తర్వాత అభ్యంతరాలన్నీ పరిష్కరమయ్యాక, గ్రామాల వారీగా భూముల తుది రిజిస్టర్ రూపొందించిన చోట్ల కాలానుగుణంగా చట్టం అమల్లోకి వస్తుంది.
- నోటిఫికేషన్ ఇవ్వాలంటే రీసర్వే పూర్తవ్వాలి. ఆరు వేల గ్రామాల్లోనే సర్వే పూర్తయింది. ఇంకా 11 వేల గ్రామాల్లో పూర్తవ్వాలి. అప్పుడే చట్టం అమలుచేసే అవకాశం ఉంటుంది.
- ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి, రిజిస్ట్రేషన్లకు సంబంధంలేదు. భూపత్రాలు యాజమానుల వద్దే ఉంటాయి. జిరాక్సు కాపీలు ఇస్తారనేది దుర్మార్గపు ప్రచారం
- ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమలైనా కోర్టుకు నిస్సంకోచంగా వెళ్లవచ్చు.
- వారసత్వ ఆస్తులను మ్యుటేషన్ తరహాలోనే చేసుకోవచ్చు. టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ దాన్ని నిర్ణయించలేడు.
- ఈ చట్టం 90 దేశాల్లో అమల్లో ఉంది. మహారాష్ట్ర కూడా ల్యాండ్ టైట్లింగ్ మోడల్ చట్టం చేసింది.
- 2019లో నీతి ఆయోగ్ అన్ని రాష్ట్రాలు ఈ చట్టం చేసుకోవాలని చెప్పింది
- ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టినప్పుడు టీడీపీ మద్దతు తెలిపింది.

బీజేపీ ఏపీ శాఖ నిద్రపోతోందా?



- ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై ప్రకటనల్లో బీజేపీకీ భాగస్వామ్యమా?
- ఆ చట్టానికి కర్త, కర్మ బీజేపీనే.. క్రియ మాత్రమే రాష్ట్రాలు
- ఆ ప్రకటన ఇచ్చింది టీడీపీ తరపునా, కూటమి తరపునా?
- ప్రభుత్వ మాజీ సీఎస్, బీజేపీ నేత ఐవైఆర్ కృష్ణారావు మండిపాటు



3లో

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ గురించి బాబు.. మోదీని అడగాల్సింది..

- ఎల్లో మీడియా ద్వారా చంద్రబాబు తప్పుడు ప్రచారం
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

సాక్షి,అమరావతి: ల్యాండ్ టైట్లింగ్ యాక్టు గురించి కోట్లు ఖర్చు చేసి ప్రకటనలిచ్చే బదులు.. చంద్రబాబు తన కూటమి భాగస్వామి ప్రధాని మోదీని అడగాల్సిందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్లో మీడియాలో చంద్రబాబు ప్రకటనలు చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారని చెప్పారు. గెలవలేక బాబు దారుణాలకు ఒడిగడుతున్నారని చెప్పారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెస్తున్నది కాదని, అది కేంద్ర ప్రభుత్వ చట్టమన్నారు. ఈ చట్టానికి అసెంబ్లీలో టీడీపీ మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు సూచనలతో పయ్యావుల కేశవ్ మద్దతుగా మాట్లాడిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ యాక్ట్ ఇంకా అమల్లో లేదని, రాష్ట్రంలో 17 వేల గ్రామాలకు గాను 6 వేల గ్రామాల్లోనే సర్వే పూర్తయిందన్నారు. అంతా పూర్తయ్యాకే అమల్లోకి వస్తుందని తెలిపారు. సర్వే, ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ, ఆపై మార్పులు చేసి అమలు చేసేందుకు సమయం పడుతుందన్నారు. టీడీపీ కొంతమంది రిటైర్డ్ అధికారులతో అసత్యాలతో కూడిన తప్పుడు ప్రచారం చేస్తోందని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ప్రజలను భయభ్రాంతులు చేసేలా ప్రసంగాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం జగన్ భూములు లాక్కుంటున్నారని విష ప్రచారం చేస్తున్న చంద్రబాబు.. అలా ఎన్ని భూములు లాక్కున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వలన భూ వివాదాలు తగ్గుతాయని, అమ్మకాలు, కొనుగోలు సులభమవుతుందని చెప్పారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో 124 చట్టాలున్నాయని, వాటన్నిటి కంటే ఈ ఒక్క యాక్ట్ వల్ల భూహక్కుదారులకు ఉత్తమ ప్రయోజనాలు కలుగుతాయని మనోహర్‌రెడ్డి వివరించారు.

మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే

- బీజేపీకి 'ఏ' టీం చంద్రబాబు.. అతనికి ఓటేసినా బీజేపీకి వేసినట్లే
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే

సాక్షి, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనని.. మోదీ గ్యారంటీ, బీజేపీ గ్యారంటీ అని చెప్పడమే తప్ప, ఆచరణలో ఏదీ జరగదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో విజయవాడ జింఖానా మైదానంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పేదలను పట్టించుకోని మోదీ, పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్నారన్నారు. అదానీ, అంబానీలకు ఎటువంటి పన్నులు ఉండవా అని.. ఈడీ, ఐటీ దాడులు వారిపై ఎందుకు జరగవని ప్రశ్నించారు. దేశ సంపదను, ప్రజల ఆస్తులను మోదీ, అమిత్‌షా ఇద్దరూ వారికే దోచిపెడుతున్నారని ఆరోపించారు. హిందూ, ముస్లిం అంటూ మత విద్వేషాలను బీజేపీ రెచ్చగొడుతోందని, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో, ఏం అభివృద్ధి చేశారో మోదీ ప్రకటించాలని ఖర్గే డిమాండ్ చేశారు. మోదీ పదేళ్లలో పేదల పొట్ట కొట్టారని, మహిళల మంగళసూత్రాలను తెంచారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దుచేయడానికి మోదీ ఎవరని ప్రశ్నించారు. స్విస్ బ్యాంకులో కాంగ్రెస్ నేతల కోట్ల డబ్బు ఉందని ప్రచారం చేశారని, రూ.15వేల కోట్లు తీసుకొస్తామని చెప్పారని, అయితే ఎంత తెచ్చారో ప్రధాని చెప్పాలన్నారు. ఇక బీజేపీకి చంద్రబాబు 'ఏ' టీం అని, టీడీపీకి ఓటు వేసినా బీజేపీకి ఓటు వేసినట్లే అనే వాస్తవాన్ని ప్రజలు గుర్తుపెట్టుకోవాలని ఖర్గే కోరారు. ఈ సభలో పీసీసీ వర్కింగ్ కమిటీ సభ్యుడు మాణిక్యం ఠాగూర్, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ క్రికెటర్ మనోజ్ చౌహాన్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఇదండీ జగత్



వీక్షకులను ఇలా పెంచుకోవాలనుకోవడం కరెక్ట్ కాదేమో సార్!

మీ దస్తావేజులు మీకే ఇస్తారు

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో మాట్లాడేందుకు 'పచ్చ'ముఠాకు ఏమీలేక భూముల పేరు చెప్పి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ చంద్రబాబు తనకు ఉచ్చనీచాలు లేవని చాటుకుంటున్నాడు. ప్రజలు, రాష్ట్రం ఏమైపోయినా పర్వాలేదు, తాను మాత్రం ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఏకైక లక్ష్యంతో ల్యాండ్ టైట్లింగ్ చట్టం గురించి భయంకరమైన కుట్రకు తెరలేపాడు. మీ భూములు పోతాయని, దస్తావేజులు ఇవ్వరని, భూ యజమానులను జైల్లో పెడతారంటూ దారుణమైన అపోహల్ని సృష్టించాడు. వాటిని తాను స్వయంగా చెప్పడంతో పాటు ఏకంగా పత్రికల్లో ఫుల్‌పేజీ ప్రకటనలు జారీ చేశాడు. ప్రజలను భయపెట్టేందుకు ఫుల్ పేజీ యాడ్స్ ఇచ్చిన మొట్టమొదటి నేతగా చంద్రబాబు చరిత్ర సృష్టించాడు. భూములపై దుష్ప్రచారాలను తొలుత ఎల్లో మీడియాతో చేయించి ఆ తర్వాత తానే ఆ విషయాలను చెబుతూ వికృత తాండవం చేశాడు. ఇప్పుడు ఏకంగా ఆ దుష్ప్రచారాన్ని పత్రికల్లో భారీ ప్రకటనల ద్వారా మరీ చేస్తుండడం చంద్రబాబు బరితెగింపునకు పరాకాష్ట. ఈ దుష్ప్రచారాలపై వాస్తవాలివే..

ఏవీ జిరాక్సులు కాదు.. అన్నీ నిఖార్సైన ఒరిజినల్సే

- ఏడాదిగా 9.58 లక్షల రిజిస్ట్రేషన్లు చేసి ఒరిజినల్స్ ఇచ్చారు
- ఈ–స్టాంపింగ్ 2016లోనే మొదలైంది
- ఐదేళ్లలో 60 లక్షలకు పైగా డాక్యుమెంట్లు ఈ–స్టాంపింగ్ ద్వారా జారీ
- మీ ఆస్తి మీది కాదని టైటిల్ రిజిస్టర్ ఆఫీసర్ అనే అవకాశమేలేదు
- మీ వారసులను మీరే నిర్ణయిస్తారు
- సరైన కాగితాల్లేవని యజమానుల్ని జైల్లోపెట్టే పరిస్థితి ఉండనే ఉండదు
- ఇవన్నీ చంద్రబాబు చేసే తప్పుడు ప్రచారాలే
- వీటిపై ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఆయనపై కేసు నమోదు చేయించింది
- ఎన్నికల్లో చెప్పుకునే అంశాలు లేక భూములపై దారుణ ప్రచారం
- భూములకు భద్రత పెరుగుతుందే తప్ప ఎలాంటి ముప్పు ఉండదు

పచ్చి అబద్ధం..

స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు జరిగాక యజమానులకు దస్తావేజులు ఇవ్వరనేది టీడీపీ సృష్టించిన భయంకరమైన అపోహ. ఏడాదిగా 9,58,296 స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లుగా జరగ్గా సంబంధిత రైతులకు ఒరిజినల్ దస్తావేజులే ఇచ్చారు. 15,91,814 ఇళ్ల స్థలాలను రిజిస్టర్ చేసి ఒరిజినల్ డాక్యుమెంట్లను ఇళ్ల యజమానులకు ఎప్పటిలాగే ఇచ్చారు. 1.75 లక్షల మందికి టిడ్కో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి ఒరిజినల్ పత్రాలు ఇచ్చారు. ఈ–స్టాంపింగ్ పైనా ఎడతెగని దుష్ప్రచారం చేస్తున్నారు. నిజానికి ఈ ప్రక్రియ 2016లోనే మొదలైంది. 2016 నుంచి 2019 వరకు 2,27,492 డాక్యుమెంట్లను ఈ–స్టాంపింగ్ ద్వారా జారీచేశారు. 2019 నుంచి ఇప్పటివరకు 60,66,490 డాక్యుమెంట్స్ జారీచేశారు. ఇవన్నీ ఒరిజినల్సే. ఏవి జిరాక్స్ కాపీలు కాదు.

మీ వారసులను నిర్ణయించేది మీరే.. సమస్య వస్తే కోర్టులకూ వెళ్లొచ్చు..

మీ వారసులను అధికారులే నిర్ణయిస్తారనేది మరో దారుణమైన వక్రీకరణ. భూ యజమానులు తమ వారసులను తామే నిర్ణయించుకోవచ్చు. ఇంకా అమల్లోకి రాని ల్యాండ్ టైటిలింగ్ చట్టం సెక్షన్ 25 (3) ప్రకారమైనా.. టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వారసత్వాన్ని నిర్ధారణలో ఏదైనా వివాదం ఉందని భావిస్తే సంబంధిత సివిల్ కోర్టుకు రిఫర్ చేస్తారు. ప్రస్తుతం అమలులో ఉన్న రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) చట్ట ప్రకారం వారసత్వ నిర్ధారణలో వివాదం ఉంటే భూ యజమానులే కోర్టుకు వెళ్లాల్సి వుంటుంది.

మీ ఆస్తి మీది కాదని టైట్లింగ్ ఆఫీసర్ చెప్పలేరు..

రీ సర్వే ప్రకారం రికార్డుల్లో ఒకసారి రైతు పేరు చేరితే ల్యాండ్ టైట్లింగ్ చట్టం ప్రకారం వారు ఎటువంటి రికార్డు సమర్పించాల్సిన అవసరంలేదు. ఆ డేటాపై ఆ గ్రామంలో నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత 90 రోజుల వరకు అభ్యంతరాలు సమర్పించవచ్చు. ఆ తర్వాత వారి పేర్లు టైటిల్ రిజిస్టర్లో నమోదవుతాయి. ఈ రిజిస్టర్‌లోని పేర్లపై రెండేళ్లలోగా ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే అప్పుడు కన్‌క్లూజివ్ టైటిల్ నిర్ధారణ అవుతుంది. టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (టీఆర్ఓ) ఇచ్చిన ఈ నిర్ధారణ ఆర్డర్‌పై అభ్యంతరం ఉంటే ల్యాండ్ టైట్లింగ్ అప్పిలేట్ ఆఫీసర్‌కి (ఎల్‌టీఏఓ)కి అప్పీలు చేసుకోవచ్చు. దానిపైనా సంతృప్తి చెందకపోతే హైకోర్టుకు వెళ్లే అవకాశం కూడా ఉంది.

భూ యజమానులను జైల్లో ఎందుకు పెడతారు?

సరైన కాగితాలు లేవని యజమానులనే జైల్లో పెడతారని, తాతల నాటి భూములైనా నేతల దయ ఉండాల్సిందేనని, జగన్ మీ స్థలాన్ని బ్యాంకులో తనఖా పెట్టవచ్చంటూ చంద్రబాబుకు మతి చెడిపోయి పత్రికల్లో పిచ్చి ప్రకటన ఇచ్చాడు. ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి ఇవన్నీ వక్రభాష్యాలే. సరైన పత్రాల్లేవని యజమానులను జైల్లో పెట్టే స్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండదు. ప్రజల్లో భయానక స్థితిని కల్పించేందుకు ఈ ప్రచారాలు చేస్తున్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్, వాయిస్ రికార్డింగ్స్ ద్వారా ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తుండడంతో ఎలక్షన్ కమిషన్ చంద్రబాబుపై సీఐడీ కేసు నమోదు చేసింది. దీనిపై విచారణ జరుగుతోంది. అయినా, రాజకీయ లబ్ధికోసం చంద్రబాబు బట్టలు విప్పేసుకుని మరీ దుష్ప్రచారానికి తెగబడుతూనే ఉన్నాడు. ఈ ప్రచారాన్ని ప్రింట్ మీడియాలో చేస్తే ఈసీ అనుమతి అవసరంలేదనే లొసుగును అడ్డంపెట్టుకుని ప్రభుత్వంపై బురద జల్లుతున్నాడు. మూడుసార్లు సీఎంగా పనిచేసిన అనుభవం ఉన్న వృద్ధ నేత చేసే పనేనా ఇది? సిగ్గు విడిచి, ప్రజల ప్రయోజనాలు గాలికొదిలేసి తన కోసం చేస్తున్న కుతంత్రం ఇది.



విశాఖ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అనంతరం ఒరిజినల్ డాక్యుమెంట్ చూపుతున్న మహిళ

చట్టం ఇంకా అమల్లోకి రాలేదు..

ఈ చట్టానికి సంబంధించి ఇంకా నిబంధనలు రూపుదిద్దుకోలేదు. దీని పరిధినీ నిర్ధారించలేదు. ఈ చట్టంలో డిజిగ్నేట్ చేయబడిన అధికారులనూ నియమించనేలేదు. ప్రజల నుంచి సలహాలు, సూచనలను తీసుకున్నాక మార్పులు, చేర్పులకు ప్రభుత్వం సిద్ధమంది. నిబంధనలు తయారుచేసి, కాంపిటెంట్ అథారిటీ అనుమతి వచ్చాకే చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చే అవకాశం ఉంటుంది.

ఈ చట్టానికి టీడీపీ మద్దతిచ్చింది..

నిజానికి.. ల్యాండ్ టైట్లింగ్ బిల్లును అసెంబ్లీలో పెట్టినప్పుడు టీడీపీ దానికి పూర్తి మద్దతిచ్చింది. అంతేకాదు.. సుదీర్ఘ అధ్యయనం, ఎంతో కసరత్తు తర్వాత ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. లీగల్ అడ్వైజర్‌గా నల్సార్ యూనివర్సిటీని నియమించుకుని ముసాయిదా బిల్లును రూపొందించింది. 2011 నుండి 2019 వరకు తయారుచేసిన వివిధ మోడల్ చట్టాలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో ఈ చట్టాన్ని రూపొందించారు. ఆ తర్వాత ఇందుకు సంబంధించిన బిల్లును 2019లో అసెంబ్లీలో ప్రవేశపెట్టగా సుదీర్ఘ చర్చ జరిగింది. దీనికి అప్పుడు టీడీపీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఆ తర్వాత ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. కేంద్ర ప్రభుత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్, లా డిపార్ట్‌మెంట్ , ఐటీ, హోమ్, సోషల్ వెల్ఫేర్ వంటి డిపార్ట్‌మెంట్లన్నీ మూడేళ్లపాటు జాగ్రత్తగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆ మేరకు మార్పులు చేర్పులు చేసి తిరిగి మళ్లీ అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. ఏ కేంద్ర చట్టాలకీ వ్యతిరేకంగా ఈ చట్టం లేదని నిర్ధారించిన తర్వాతే రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు.

బాబు బినామీ ఆస్తులు బయటకు వస్తాయనే దుష్ప్రచారం..

వాస్తవానికి.. రీ సర్వే పూర్తయ్యాకే ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమల్లోకి వస్తుంది. అది జరిగితే అమరావతి, విశాఖపట్నం, తిరుపతిలో చంద్రబాబు ఆయన ముఠా బలవంతంగా లాక్కుని బినామీ పేర్లపై పెట్టిన ఆస్తులు ఎక్కడ బయటికి వస్తాయోననే భయంతో సాధారణ జనంతో దీనికి ముడిపెట్టి అడ్డంకులు సృష్టిస్తున్నారు. సాధారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకరకాల చట్టాలు చేస్తుంటాయి. వాటివల్ల ప్రజలకు ఏమైనా ఇబ్బంది ఉంటుందని భావిస్తే సవరణలు తెస్తారు. కానీ, ఒక చట్టాన్ని రద్దుచేస్తామని మేనిఫెస్టోలో పెట్టడం ఎప్పుడూ జరగలేదు. చంద్రబాబు ఇప్పుడు ఆ పని కూడా చేసి తన విలువల స్థాయి ఏంటో ప్రదర్శించుకున్నారు. మేనిఫెస్టోలో అమలుచేయలేని అనేక హామీలిచ్చినా ఈ ఒక్క దానిపైనే ఇంత దృష్టిపెట్టి గందరగోళం సృష్టించడాన్ని ఎలా అర్థంచేసుకోవాలి? వారు దోచుకున్న, ఆక్రమించిన బినామీ భూములు, ఆస్తులు ఎక్కడ బయట పడతాయోననే భయంతోనే ఇదంతా చేస్తున్నారు. ఈ చట్టం రాష్ట్రపతి ఆమోదం పొందినప్పుడు కేంద్రంలో ఉన్న బీజేపీ నాయకుల్లో ఎవరైనా ఇది మంచిది కాదని ఒక్క మాటైనా చెప్పారా? రాష్ట్రంలో జరిగిన ఎన్నికల సభల్లో ప్రధాని, కేంద్ర హోం మంత్రి అనేకమంది బీజేపీ ముఖ్యనేతలు తమ ప్రసంగాల్లో ఈ చట్టం గురించి ఎక్కడైనా ప్రస్తావించారా? ఈ చట్టం మంచిది కాదని బీజేపీ నాయకులతో చంద్రబాబు చెప్పించగలరా? కేవలం తమ బినామీ ఆస్తులను రక్షించుకునేందుకే ఎల్లోగ్యాంగ్ చేస్తున్న గందరగోళమే ఇదంతా?

ల్యాండ్ టైట్లింగ్ ప్రకటన 'కోడ్' ఉల్లంఘనే

సాక్షి, అమరావతి: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై శుక్రవారం వివిధ దినపత్రికల్లో టీడీపీ ఇచ్చిన ప్రకటనపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తంచేసింది. తమ ప్రాథమిక విచారణలో ఇది పూర్తిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని తేలిందన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఇచ్చిన ఈ ప్రకటనపై వైఎస్సార్‌సీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. స్పందించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం టీడీపీ ప్రధాన కార్యదర్శికి నోటీసులిచ్చింది.

'ల్యాండ్ టైటిల్లింగ్'పై దుర్మార్గ రాజకీయం

సాక్షి, అమరావతి: కూటమి కట్టినా ఎన్నికల్లో గెలిచే అవకాశం లేకపోవడంతో ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై చంద్రబాబు దుర్మార్గ రాజకీయం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. ఒకవేళ కూటమి అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలతో చంద్రబాబు చెప్పించగలరా అని నిలదీశారు. కుట్ర పూరితంగా చట్టంపై దుష్ప్రచారానికి తెగబడ్డారని మండిపడ్డారు. నీతిఆయోగ్ ప్రతిపాదనతో కేంద్రం తెచ్చిన ఈ చట్టం 24 రాష్ట్రాల్లో అమల్లో ఉందని.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ అమలవుతోందని గుర్తు చేశారు. ఆ రాష్ట్రాల్లో ప్రజల భూములను ఎవరైనా దోచేశారా అని ప్రశ్నించారు. పత్రికల్లో అసత్య ప్రకటనలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం ప్రమాదకరమైతే టీడీపీ శాసనసభల్లో ఎందుకు మద్దతిచ్చిందని నిలదీశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

కూటమి వస్తే రద్దు చేస్తామని మోదీతో చెప్పించగలవా బాబూ?

- దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల్లో ఈ చట్టం ఉంది
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ అమలవుతోంది
- అక్కడి ప్రజల భూములను ఎవరైనా దోచేశారా?
- అసత్య ప్రకటనలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు
- ప్రమాదకరమైతే శాసనసభలో టీడీపీ ఎందుకు మద్దతిచ్చింది?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల ధ్వజం



చంద్రబాబు చీడపురుగు..

ఉగ్రవాది కంటే ఘోరంగా ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై చంద్రబాబు విష ప్రచారానికి ఒడిగట్టారు. ఎన్నికలకు ముందే ఆయన ఎత్తిపోయారు. ప్రజలు నమ్మే పరిస్థితి లేకపోవడంతో సీఎం జగన్‌ను రాక్షసుడిగా చిత్రీకరిస్తున్నారు. 2019 జూలైలో శాసనసభలో ల్యాండ్ టైట్లింగ్ బిల్లుకు టీడీపీ ఆమోదం తెలిపింది. ఆ రోజు 13 మంది టీడీపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. శాసన మండలిలో స్వయంగా చంద్రబాబు తనయుడు లోకేశ్ కూడా ఉన్నారు. టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ 'ల్యాండ్ టైట్లింగ్ బిల్లు' అమల్లోకి వస్తే ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో కూలంకషంగా వివరించారు (ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడిన వీడియోను ప్రదర్శించారు). ఆ రోజు మద్దతు తెలిపిన చంద్రబాబు.. తాను అధికారంలోకి వస్తే రద్దు చేస్తానని చెప్పడం సిగ్గుచేటు. రద్దు చేస్తానంటే కూటమి ఆమోదం ఉండాలి కదా? అది కూడా మోదీ, అమిత్‌షాతో చెప్పించకుండా ఉత్తుత్తి ప్రచారం చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. టీడీపీ పోలింగ్‌కు ముందు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ దుష్ప్రచారంపై ఎన్నికల సంఘం సీఐడీని కేసు నమోదు చేయమని చెప్పాక కూడా ఇలాంటి ప్రకటనలను ఈసీ ఎలా అనుమతించింది? ఎన్నికల్లో ఎప్పుడూ సక్రమ మార్గంలో గెలవని చంద్రబాబు లాంటి చీడపురుగుకు సమాజంలో ఉండే అర్హత లేదు. ప్రజలు తనను నమ్మట్లేదని, సూపర్ సిక్స్ పని చేయట్లేదని ఆయన గ్రహించాడు. దీంతో ఓటమి భయంతో, దింపుడు కళ్లెం ఆశతో దిగజారుడు రాజకీయానికి పాల్పడుతున్నాడు. నిన్న మొన్నటి వరకు పింఛన్ అందకుండా అవ్వాతాతలను రోడ్లపైకి తీసుకొచ్చి బలితీసుకున్నాడు. మహిళలకు అందాల్సిన పథకాల నగదును జమ కాకుండా అడ్డుకున్నాడు. నేడు భూములు లాగేసుకుంటారంటూ సిగ్గూ శరం లేకుండా మాట్లాడుతున్నాడు.

రైతుల భూమికి ప్రభుత్వం గ్యారంటీ..

భూ దోపిడీకి కేరాఫ్ చంద్రబాబు. వెబ్‌ల్యాండ్ పేరుతో ఆయన చేసిన భూదోపిడీ, తీసుకొచ్చిన భూ తగాదాలు అన్నీఇన్నీకావు. చుక్కల భూముల పేరుతో ఎందరో భూ యజమానులను తీవ్ర ఇబ్బందులు పెట్టారు. 22ఏలో పెట్టి.. డబ్బులు ఇస్తేవాటిని విడిపించే సంస్కృతిని తీసుకొచ్చారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక లక్షల ఎకరాల చుక్కలు, ఈనాం భూములకు విముక్తి కల్పించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమలులోకి రావడానికి చాలా సమయం పడుతుంది. దాదాపు 120 ఏళ్ల కింద బ్రిటీష్ వాళ్లు సర్వే చేశారు. సీఎం జగన్ వచ్చిన తర్వాత సమగ్ర భూ సర్వే చేపట్టారు. యజమానుల ఆధ్వర్యంలో భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో జియో ట్యాగ్ చేస్తారు. తద్వారా తగాదాలు వచ్చే పరిస్థితి ఉండదు. డివిజన్, సబ్ డివిజన్లు కూడా సమగ్రంగా జరుగుతాయి. ఇవన్నీ పూర్తి చేశాక యజమానికి ప్రభుత్వం పూచీకత్తుతో, ఇన్సూరెన్స్ చేసి భూమికి భద్రత కల్పిస్తూ టైట్లింగ్ ఇస్తుంది. ఆ తర్వాత వేరొకరు ఆ భూమి తనదంటూ వచ్చినా టైట్లింగ్‌దారుడికి ప్రభుత్వం గ్యారంటీ ఉంటుంది. ఎవరైనా ఆస్తిని కొని నిశ్చింతగా ఉండొచ్చు.




పవన్‌కళ్యాణ్, బాలకృష్ణలు ఈ-స్టాంపుతో కొనుగోలు చేసిన ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కాపీలు

ఏపీలో ఈ-స్టాంపులు మొదలైంది చంద్రబాబు హయాంలోనే.. ఆ లావాదేవీలు ఇలా..

ఆర్థిక సంవత్సరం	వసూలైన స్టాంప్ డ్యూటీ (రూ.ల్లో)	రిజిస్ట్రేషన్ల సంఖ్య
2016-17	1,75,00,836	1,948
2017-18	33,36,09,863	77,187
2018-19	61,29,31,713	1,48,357
2019-20	83,58,44,733	1,87,397
2020-21	99,52,81,163	2,18,131
2021-22	91,95,65,654	2,36,396
2022-23	121,19,21,557	3,97,215
2023-24	228,55,37,106	62,93,982

సిగ్గు లేకుండా రాజకీయానికి వాడుకుంటున్నాడు..

దేశవ్యాప్తంగా అమలవుతున్న ఈ–స్టాంపు విధానాన్ని కూడా చంద్రబాబు సిగ్గులేకుండా తన రాజకీయానికి వాడుకుంటున్నాడు. ఈ–స్టాంపులను ట్యాంపర్ చేయడానికి ఉండదు. దీన్ని చంద్రబాబు హయాంలోనే 2016–17లో తీసుకొచ్చారు. అప్పట్లో తెల్గీ స్కామ్‌లో చంద్రబాబు ప్రమేయం కూడా ఉందని తేలింది. ఈ ఏడాది జనవరి 8న నందమూరి బాలకృష్ణ విశాఖలో భూములు కొని 12న రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అలాగే ఫిబ్రవరి 8న ఈ–స్టాంపుతో పవన్ కళ్యాణ్ కూడా మంగళగిరిలో భూమిని కొనుగోలు చేసి అదే నెల 12న రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ రిజిస్ట్రేషన్లకు విలువ లేకపోతే.. వారికిచ్చిన పత్రాలను చించేసి చంద్రబాబు తుడుచుకోవచ్చు కదా. మీ బావమరిది బాలకృష్ణ, దత్తపుత్రుడు పవన్ ఆస్తికి ఇప్పుడేమైనా అయ్యిందా? వాళ్ల స్థలాల్లో ఎవరైనా వెళ్లి జెండా పాతి నాది అంటే వదిలేస్తారా? వాస్తవానికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2017–18లో ఈ–స్టాంప్ ద్వారా 77 వేలకు పైగా ఆస్తుల క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు చేస్తే అది 2023–24కు వచ్చేసరికి ఏకంగా 62.93 లక్షలకు పెరిగింది (2016–17లో ప్రారంభమై నాటి నుంచి బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ ఆస్తులు కొనుగోలు చేసిన రిజిస్ట్రేషన్ పత్రాల వరకు వీడియోలో చూపిస్తూ). ఈ విధానంలో లోపాలు లేకపోవడంతోనే చాలా మంది ఈ–స్టాంప్‌ల ద్వారా క్రయవిక్రయాలు చేశారు. వాళ్లందరి భూములు సక్రమంగా ఉన్నాయి కదా! ఎలాగైనా అధికారంలోకి వచ్చేసి రామోజీరావు ప్రజల సొమ్ముతో తన అక్రమ వ్యాపారాలు చేసుకోవాలని, బాబు అమరావతిలో రూ.వేల కోట్లు దోచుకోవాలని కుట్రలు చేస్తున్నారు.

ఈసీ అడ్డుకోవడం దారుణం

2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు పసుపు–కుంకుమ ఇస్తే మేము అడ్డుకోలేదు. పైగా నేరుగా చెక్కులు పంపిణీ చేశారు. ఇది ఓటర్లను ప్రలోభపెట్టడం కాదా? అప్పుడు కొత్త పథకానికి అనుమతించిన ఎన్నికల సంఘం ఇప్పుడు ఐదేళ్లుగా కొనసాగుతున్న పథకాలను ఎలా అడ్డుకుంటుంది? టీడీపీ, బీజేపీతో పొత్తుపెట్టుకుని ఈసీపై ఒత్తిడి చేసి ఆపేసింది. హైకోర్టు విండో ఓపెన్ చేసినా కూడా ఈసీ అడ్డుకోవడం దారుణం.

రామోజీ.. ఈ కథనం నువ్వు వేసిందేగా!

- కేంద్రంలో ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని త్వరగా ఆమోదించుకోలేకపోతున్నారంటూ ఈటీవీ భారత్‌లో కథనం
- ఇప్పుడు దానిపై ఎడతెగని దుష్ప్రచారం

సాక్షి, అమరావతి: ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని వక్రీకరించి ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్న రామోజీరావు 7 నెలల క్రితం దాన్ని జగన్ ప్రభుత్వం అమల్లోకి తేలేకపోతుందంటూ ఈటీవీ భారత్‌లో ప్రత్యేక కథనాన్ని ప్రసారం చేశారు. గతేడాది ఆగస్టు 11న ఈటీవీ భారత్‌లో 'వైసీపీ ప్రభుత్వ ప్రచారాలకే పరిమితమైన చట్టాలు.. ఖాతాలో మరో యాక్ట్' అంటూ ప్రత్యేక కథనాన్ని ప్రసారం చేసింది. రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి పంపించిన బిల్లులకు కూడా కేంద్రం నుంచి ఆమోదం తెచ్చుకోలేకపోతున్నారని అందులో వివరించారు. అసెంబ్లీలో ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను ఆమోదించినా కేంద్రం నుంచి అనుమతి తేలేకపోతున్నారని ఆక్షేపించింది. అనేకసార్లు ఢిల్లీలో ప్రదక్షిణలు చేసిన సీఎం జగన్ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు కేంద్రం నుంచి ఆమోదం పొందడంలో విఫలమయ్యారని ఆ కథనంలో రామోజీ గుండెలు బాదుకున్నారు. ఆ కథనం వచ్చిన కొద్దినెలలకే కేంద్రం ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదముద్రా పడింది. ఇప్పుడు ఏకంగా విష ప్రచారం చేయడం రామోజీ ద్వంద్వ నీతికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది. ఎంతో విజన్ ఉన్న చట్టం అని చెప్పిన దాని గురించి ఇప్పుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అప్పుడు ఈ చట్టం వస్తే భూ యజమానులకు వరంగా మారుతుందని చెప్పిన ఈటీవీ ఇప్పుడు అది వస్తే భూములు పోతాయని రైతులను భయభ్రాంతులకు గురిచేసే కథనాలు వండి వారుస్తోంది. ఈ చట్టం గురించి వ్యతిరేక ప్రచారం చేసి భూములకు సంబంధించి వారిలో భయాలు సృష్టించి తద్వారా ఎన్నికల్లో చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేందుకు రామోజీ ఈ దిగజారుడు పాత్రికేయానికి తెగబడ్డారు. భూ హక్కుల చట్టంతో భూములకు భద్రత వస్తుందని ఈటీవీలో పలు కథనాలు ప్రసారం చేసి ఇప్పుడు దానికి వ్యతిరేకంగా ఇష్టమొచ్చినట్లు బురద జల్లడం ద్వారా తనకు కుట్రలు, కుతంత్రాలు తప్ప విలువలు, నీతి అనేదే లేదని రామోజీ నిరూపించుకున్నారు.



ఈటీవీ భారత్‌లో ప్రసారమైన కథనం

ఈసీకి పక్షపాతమేల?

- ఆన్‌గోయింగ్ పథకాల డబ్బులను అడ్డుకోవడం అన్యాయం
- మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం అర్బన్: 'ఫిర్యాదు చేసేది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వాళ్లయితే చాలు ప్రజల కష్టాలను తెలుసుకోకుండా వాళ్లు చెప్పినట్లే చేస్తారా?.. ఐదేళ్లుగా పేదవర్గాలకు క్యాలెండర్ ప్రకారం ఇస్తున్న ఆన్ గోయింగ్ పథకాల సొమ్ము కూడా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయకుండా అడ్డుకుంటారా? ఎన్నికల కమిషన్(ఈసీ) ఇంత పక్షపాతం ఎందుకు వహిస్తోంది..? ఇది ధర్మం కాదు... అడ్డదిడ్డంగా ఫిర్యాదులొస్తే అందులో ఎంత వాస్తవం ఉంది... ఎవరు నష్టపోతున్నారు... రాజకీయ లబ్ధి ఏమైనా ఉందా.. ప్రజలు ఇబ్బంది పడుతున్నారా.. వంటివి చూడాలి కదా...' అంటూ ఎన్నికల కమిషన్ తీరును మంత్రి బొత్స సత్యనారాయణ తప్పుబట్టారు. విజయనగరంలోని తన స్వగృహంలో శుక్రవారం



మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ పేద రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పొదుపు సంఘాలకు చేయూత, విద్యార్థులకు విద్యాదీవెన వంటి పథకాల నిధులు సీజనల్‌గా అందించినప్పుడే వాటి లక్ష్యాలు నెరవేరుతాయని అన్నారు. 'ప్రాధాన్యతగల ప్రోత్సాహకాలను అడ్డుకుంటున్నారంటే పేదలపై వీరికి ఎందుకంత కక్ష...? గత ఎన్నికల్లో పసుపు కుంకుమ నిధులు జమచేసినప్పుడు ఇదే ఈసీ ఎందుకు అడ్డుకోలేదు..? నిధులను జమచేయాలని తాజాగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుమోటోగా ఈసీ ఎందుకు తీసుకోవడం లేదు' అని బొత్స ప్రశ్నించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని వక్రీకరిస్తూ 'మీ భూమి మీది కాదు..' అంటూ భారీ ప్రకటనలు ప్రచురించడంపై డబ్బు కోసం అడ్డమైన గడ్డి తినడమేనా రామోజీరావు పత్రికా స్వేచ్ఛ... అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. విలువల్లేని పత్రికా యాజమాన్యానికి రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. నీతి ఆయోగ్ రూపొందించిన ముసాయిదా ప్రకారం దేశవ్యాప్తంగా అమలు చేయనున్న ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై నీతి ఆయోగ్ చైర్మన్, ప్రధాని మోదీలను ఎందుకు చంద్రబాబు ప్రశ్నించలేదని నిలదీశారు. 'రాజకీయాల్లో ఉన్నవాళ్లు ఎవడబ్బ సొమ్ము, ఎవడమ్మ సొమ్ము అనే భాషను వాడొచ్చా.. ఇలాంటి భాషను నా 40ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదు' అని బొత్స ఆవేదన వ్యక్తంచేశారు. ఎవరి పని అయిపోతుందో జూన్ 4న తేలుతుందంటూ చంద్రబాబుపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలను పీడిస్తున్న చంద్రబాబును దేవుడు కూడా క్షమించరన్నారు. 'విశాఖలో పట్టుబడిన డ్రగ్స్ కేసు ఏమైంది..? సీబీఐ ఏం చేస్తోంది? చంద్రబాబు, పురందేశ్వరి బంధువుల వ్యాపారంగా నమోదైన ఈ కేసు గురించి మీడియా ఎందుకు ప్రశ్నించదు' అని మంత్రి బొత్స పేర్కొన్నారు.

ప్రజలందరూ జగన్‌కు ఆశీస్సులివ్వాలి

- ఎన్టీఆర్ పాలనలో సైకిళ్లు వాడేవారు..
- అదిప్పుడు తుప్పుపట్టడంతో మోటార్‌బండ్లు, కార్లు వాడుతున్నారు
- గాజు గ్లాసు పగిలితే ప్రాణహాని అని స్టీల్‌గ్లాసు వాడుతున్నారు
- వైఎస్ జగన్‌కు ఓటు వేయకపోతే నష్టపోతాం
- పిఠాపురం, రాష్ట్ర ప్రజలకు కాపు ఉద్యమ నేత 'ముద్రగడ' లేఖ

కిర్లంపూడి: ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ జగన్‌కు ప్రేమతో ఆశీస్సులు అందజేయాలని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కోరారు. పేదలు ఐదు వేళ్లతో తృప్తిగా అన్నం తినేలా.. పేద పిల్లలు ఇంగ్లిషు మాట్లాడేలా.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని, మెరుగైన వైద్యం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఆయనను ప్రజలు గౌరవించుకోవాలని ఆకాంక్షించారు. గతంలో ఎంతోమంది ముఖ్యమంత్రుల వద్ద పనిచేశానని.. ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డి వంటి వారు తప్ప పేదవారి ఆకలి తీర్చాలనే ఆలోచన ఎవ్వరూ చేయలేదన్నారు. మళ్లీ అలా చేసింది జగనేనన్నారు. పిఠాపురం, రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఆయన శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖ ప్రతిని కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని తన నివాసంలో శుక్రవారం మీడియాకు ముద్రగడ అందజేశారు. లేఖలో ఆయన ఏం పేర్కొన్నారంటే..

ఇన్ని సంక్షేమ పథకాలు దేశంలో ఏ ముఖ్యమంత్రీ ప్రవేశపెట్టలేదు. ప్రతి ఇంట్లోనూ ఫ్యాన్లు ఉంటాయి. అలాగే, గాజు గ్లాసులు



పగిలిపోయి, ఆ ముక్కలు ప్రాణహాని కలిగిస్తాయనే ఉద్దేశంతో వాటికి బదులు స్టీలు గ్లాసులు వాడుతున్నారు. ఎన్టీ రామారావు పాలనలో అందరూ సైకిల్ వాడేవారు. కానీ, ఇప్పుడు ఆ సైకిల్ పూర్తిగా తుప్పుపట్టడంవల్ల అందరూ మోటారుబండ్లు, కార్లు వాడుతున్నారు. ముఖ్యమంత్రిని ఎన్నుకునే విషయంలో తప్పుచేస్తే శాశ్వతంగా నష్టపోతాం. ఆ తరువాత వచ్చే పాలకులు మనందరికీ రాక్షస పాలన చూపిస్తారు. గతంలో వారి రాక్షస పాలనకు సాక్ష్యంగా ఉన్న వీడియోలు ఫేస్‌బుక్, వాట్సాప్‌లో ఉన్నాయి. వారుచేసిన పాపాలవల్ల గత ఐదేళ్లుగా బీజేపీ తప్ప కూటమి పార్టీలు సముద్ర గర్భంలో ఉన్నాయి. అవి అక్కడే శాశ్వతంగా ఉండిపోయేలా ప్రజలు తీర్పు ఇవ్వాలి. మనందరి ఇళ్లల్లో చల్లని గాలినిస్తున్న ఫ్యానే మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తు.

లోక్‌సభకు 4,44,216 పోస్టల్ బ్యాలెట్లు

- అసెంబ్లీకి పోలైనవి 4,44,218
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా

సాక్షి, అమరావతి: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో 25 పార్లమెంటరీ నియోజకవర్గాలకు 4,44,216 పోస్టల్ బ్యాలెట్‌లు పోలైనట్టు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా తెలిపారు. అదేవిధంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు 4,44,218 పోస్టల్ బ్యాలెట్ పోలైనట్టు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ నెల 5న ప్రారంభమై ఈ నెల 9వ తేదీతో ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో పెద్దఎత్తున ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా అత్యధిక మొత్తంలో 22,650 పోస్టల్ బ్యాలెట్ నెల్లూరు నియోజకవర్గంలో పోల్ కాగా.. అత్యల్పంగా 14,526 ఓట్లు అమలాపురం (ఎస్సీ) నియోజకవర్గంలో పోల్ అయ్యాయని పేర్కొన్నారు.

తారస్థాయికి టీడీపీ ఫేక్ ప్రచారం

తన పేరిట జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించిన చిరంజీవి

సాక్షి, అమరావతి: ఎన్నికల పోలింగ్ డే దగ్గరపడుతున్న కొద్దీ టీడీపీ ఫేక్ ప్రచారం తారస్థాయికి చేరుతోంది. మేం గెలిస్తే మీకు ఫలానా మేలు చేస్తామని ప్రజలకు చెప్పి, వారి నమ్మకం చూరగొనే సత్తాలేక కేవలం తప్పుడు ప్రచారాలపైనే ఆ పార్టీ ఆధారపడింది. ఇందుకు వారుచేస్తున్న తప్పుడు ప్రచారాలే నిదర్శనంగా ఉంటున్నాయి. ఈ క్రమంలో సినీనటుడు చిరంజీవితోపాటు అక్కినేని నాగార్జున, మరికొందరు నటులు, డైరెక్టర్లు, ఇతర ప్రముఖులు వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా మాట్లాడినట్టు వారి పేరిట సోషల్ మీడియాలో టీడీపీ ప్రచారం మొదలుపెట్టింది. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ ఇతర సామాజిక మాధ్యమాల్లో వీటిని టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు పోస్టుచేయడంతో పాటు ఇతరులకు షేర్ చేస్తున్నారు. తన పేరిట జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని చిరంజీవి ఖండించారు. ఆయన ఒక టీవీ చానల్‌తో మాట్లాడుతూ.. తాను రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని, తానెక్కడా రాజకీయంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఈ క్రమంలో టీడీపీ చేసిన తప్పుడు ప్రచారాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. గత ఐదేళ్లలో ప్రజల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా పాలన సాగించిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఎదుర్కోలేకనే టీడీపీ ఇలా తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడుతున్నారు. టీడీపీ చేస్తున్న తప్పుడు ప్రచారంపై వైఎస్సార్‌సీపీతో పాటు పలువురు ఈసీకి, పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.



బీజేపీ ఏపీ శాఖ నిద్రపోతోందా?

ప్రభుత్వ మాజీ సీఎస్, బీజేపీ నేత ఐవైఆర్ కృష్ణారావు మండిపాటు

సాక్షి, అమరావతి: ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రూపొందించి, దానిని అమలు చేయాలని సిఫార్సు చేసిందే బీజేపీ అని, అదే చట్టానికి వ్యతిరేకంగా బీజేపీ గుర్తుతో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రకటనలు జారీ చేస్తుంటే ఏపీ శాఖ నిద్రపోతోందా అని రిటైర్డు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), బీజేపీ నాయకుడు ఐవైఆర్ కృష్ణారావు తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'ఎక్స్'లో (ట్విటర్) లో పోస్ట్ చేశారు. 'ఈ ప్రకటన ఇచ్చింది టీడీపీ తరపునా లేక కూటమి తరపునా? కూటమిలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ భాగస్వామి. ల్యాండ్ టైట్లింగ్ చట్టం కర్త, కర్మ బీజేపీయే. క్రియ మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాలు. మరి ఇటువంటి ప్రకటనలకు బీజేపీ ఆంధ్రప్రదేశ్ ఎలా భాగస్వామ్యం తీసుకుంటుంది? ఆంధ్రప్రదేశ్ బీజేపీ నిద్రావస్థలో ఉందా? మరింకేమైనా కారణమా?' అని నిలదీశారు. 'ఎక్స్'లో పోస్టు చేసిన తన పోస్టుకు బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ గుర్తులతో టీడీపీ వివిధ పత్రికల ప్రధాన పేజీలలో జారీ చేసిన ప్రకటన కాపీలను ఆయన జత చేశారు.

మోదీ స్పష్టత ఇచ్చినా.. దుష్ప్రచారమేనా?

- దేశమంతా ఈ చట్టాన్ని అమలు చేస్తామని చెప్పారు కదా?
- చంద్రబాబుపై మంత్రి ధర్మాన ప్రసాదరావు ధ్వజం



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లాలోని గార మండలంలో మంత్రి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్లు సీఎంగా పని చేసిన వాడివి.. నీ జ్ఞానమంతా ఏమైంది బాబూ? అని ప్రశ్నించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై బాబు చేస్తున్న దుష్ప్రచారం క్షమించరాని పాపమన్నారు. తప్పుడు సమాచారంతో పబ్బం గడుపుకుంటావా? అని నిలదీశారు. అనకాపల్లి మీటింగ్ సందర్భంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ చట్టంపైన వివరణ ఇచ్చారని, దేశ వ్యాప్తంగా ఈ చట్టం అమలు చేస్తామని ఆయన అన్నట్టు తాను సోషల్ మీడియాలో చూశానన్నారు. ఓ వైపు బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. '2014లో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశావో చెప్పగలవా ? చెప్పలేవు.. నీ విధానం ప్రజలకు తెలుసు.. అబద్ధాలు చెప్పడం, ప్రజల్ని తప్పు దారి పట్టించడం.. తప్ప నిజాయితీగా రాజకీయాలు చేయడం చంద్రబాబుకి చేతకాదు' అని అన్నారు. దీన్ని సెంట్రల్ గవర్నమెంట్ నీతి ఆయోగ్ నమూనా చట్టం రూపొందించిందని పీఎం చెబుతుంటే మరో పక్క రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఈ చట్టం నీతి ఆయోగ్ ప్రతిపాదన అని చెబుతున్న తీరు విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు మాత్రం సిగ్గు లేకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేయించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని దుయ్యబట్టారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తప్పుడు ప్రకటనలు

ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ గురించి ప్రజలను తప్పుదోవపట్టించే విధంగా వివిధ దినపత్రికల్లో ప్రకటనలు ఇచ్చిన టీడీపీపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, లీగల్‌సెల్ నాయకుడు కొమ్మసాని శ్రీనివాసరెడ్డి శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. నారాయణమూర్తి, శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 'ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు, లోకేశ్ ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా దుష్ప్రచారం చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న విషయంపై ఇప్పటికే ఈసీకి మూడుసార్లు ఫిర్యాదు చేశాం.మళ్లీ టీడీపీ నేతలు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దారుణంగా పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి ఓటర్లను తప్పుదోవపట్టిస్తున్నారు. శుక్రవారం పత్రికల్లో వచ్చిన ప్రకటనలపై ఈసీకి మళ్లీ ఫిర్యాదు చేశాం. ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి తెలుగుదేశం పార్టీపైనా, ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుపైనా తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాం. మేం ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఈసీ ఎందుకు స్పందించడం లేదో అర్థంకావడం లేదు. అదేమని అడిగితే నోటీసులు ఇస్తామంటున్నారు. అంతేగానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.' అని చెప్పారు.

ఎంపీ ఆర్.కృష్ణయ్యపై దాడి దుర్మార్గం

ఎమ్మెల్సీ పోతుల సునీత

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్యపై టీడీపీ గూండాల దాడి దుర్మార్గమని, యావత్తు తెలుగుజాతి దీన్ని ఖండిస్తోందని ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ పోతుల సునీత చెప్పారు. ఆమె శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీసీలంటే చంద్రబాబుకు చిన్నచూపని చెప్పారు. ఈ దాడికి ప్రతిదాడి అన్నట్లు ఈనెల 13న ఓటు ద్వారా చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని ఆమె సూచించారు. ఆమె ఇంకా ఏమన్నారంటే.. వైఎస్సార్‌సీపీకి వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు ఇలా దాడులు చేస్తున్నారు. ఎన్నో ఉద్యమాలు చేసి పేదలకు అండగా నిలిచిన నేత కృష్ణయ్య. కోర్టు ఆదేశాలిచ్చినా ఈసీ కొర్రీలు పెట్టి డీబీటీని ఆపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విధంగా కూటమికి ఈసీ లొంగిపోవడం సరికాదు. అని అన్నారు. ఇప్పటికైనా సమాజం గురించి చంద్రబాబు ఆలోచించాలి. చంద్రబాబు చేసే ప్రతి పనిలో తన సామాజికవర్గానికి చేసుకుంటున్న సేవ కనిపిస్తోంది. మరోవైపు తప్పుడు ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఈ పత్రికలకు కూడా ప్రజలు ఎన్నికల్లోనే తగిన బుద్ధి చెబుతారు. ఈ రోజు పత్రికల్లో వారు మాట్లాడిన, రాసిన రాతలు 13వ తేదీ తర్వాత రాయలేరు. 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం.

దాడిని తీవ్రంగా ఖండించిన బీసీ సంఘాలు

కాచిగూడ/అంబర్‌పేట (హైదరాబాద్): జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్ కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం మాట్లాడుతూ కృష్ణయ్యపై టీడీపీ దాడిని యావత్ 70 కోట్ల బీసీలపై దాడిగా పరిగణిస్తున్నామని, ఇలాంటి పిరికిపంద రాజకీయాలు చేస్తే ఎవరూ భయపడరని చెప్పారు. కృష్ణయ్యపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బహుజన వాదులంతా ఈ దాడిని గుర్తుంచుకుని బీసీ వ్యతిరేకులకు ఓటు ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. కృష్ణయ్యపై జరిగిన దాడిని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) తీవ్రంగా ఖండించింది.

నిశ్చయంగా ఆ దివ్యపురుషుడు (పరబ్రహ్మ) ఆకార రహితుడు.
సమస్త జగత్తు లోపల, వెలుపల కూడా వ్యాపించినవాడు.
పుట్టుక లేనివాడు, మనస్సు లేనివాడు, అందుచేత అత్యంత పరిశుద్ధుడు.
– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 11 మే 2024

చిక్కుల్లో హరియాణా సర్కారు!

రాష్ట్రాల్లో అవకాశం చిక్కినచోటల్లా విపక్ష ప్రభుత్వాలను అస్థిరపరిచి, అధికారాన్ని చేజిక్కించుకోవటం అలవాటైన బీజేపీకి తొలిసారి సంకటస్థితి వచ్చిపడింది. హస్తినకు కూతవేటు దూరంలోవున్న హరియాణాలో ఆ పార్టీ ప్రభుత్వం సమస్యల్లో చిక్కుకుంది. సార్వత్రిక ఎన్నికల వేళ... రోడ్ షోలతో హోరెత్తించాల్సిన సమయంలో బీజేపీకి ఇదేమంత మంచి శకునం కాదు. అసలే ఉత్తరాదిలో బీజేపీ బలహీనపడిందని విపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. కనుక హరియాణా మాత్రమే కాదు... ఎన్నికలు జరగాల్సిన వేరే రాష్ట్రాల్లో కూడా వోటర్లకు వేరే సంకేతాలు వెళ్తాయి. ఈ నెల 25న ఆ రాష్ట్రంలోని పది లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగబోతుండగా మంగళవారం ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకున్నారు. దాంతో 90 మంది సభ్యులున్న హరియాణా అసెంబ్లీలో బీజేపీ ప్రభుత్వం మైనారిటీలో పడింది. పైకి గంభీరంగా కనబడుతున్నా లోక్‌సభ ఎన్నికల హడావుడిలో తలమునకలైన బీజేపీకి దీంతో ఊపిరాడటం లేదు. ఎంపీలుగా పోటీ చేసేందుకు ఇద్దరు బీజేపీ సభ్యులు రాజీనామా చేయటంతో అసెంబ్లీలో ప్రస్తుతం 88 మంది సభ్యులున్నారు. ప్రభుత్వం సాగాలంటే బీజేపీకి 45 మంది మద్దతు అవసరం కాగా ఇద్దరు ఇండిపెండెంట్లు, హరియాణా లోక్‌హిత్ పార్టీ సభ్యుడు బీజేపీకి మద్దతునిస్తున్నారు. అంటే బీజేపీ బలం 43కి పడిపోయింది. రెండు నెలల క్రితం బీజేపీ–జేజేపీ కూటమి సర్కారుకు నాయకత్వం వహిస్తున్న ఖట్టర్‌ను తొలగించి ఆయన స్థానంలో బీజేపీ అధిష్టానం నయాబ్‌సింగ్ సైనీని తీసుకొచ్చింది. దాంతోపాటు పదిమంది ఎమ్మెల్యేలున్న జన్‌నాయక్ జనతాపార్టీ (జేజేపీ)తో తెగతెంపులు చేసుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వున్న పది స్థానాలూ గెల్చుకున్న బీజేపీ ఈసారి ఎన్నికల్లో జేజేపీకి ఒక్క సీటు కూడా ఇవ్వదల్చుకోలేదు. సహజంగానే అంతవరకూ ఉపముఖ్యమంత్రిగా వున్న జేజేపీ నేత దుష్యంత్ చౌతాలాకు ఇది ఆగ్రహం తెప్పించింది. కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హుడా చలవతోనే ముగ్గురు ఇండిపెండెంట్లు బీజేపీ సర్కారుకు మద్దతు ఉపసంహరించుకున్నారన్నది వాస్తవం. అయితే కాంగ్రెస్ గనుక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామంటే మద్దతిస్తామంటున్న జేజేపీ వాస్తవ బలమెంతో చెప్పలేం. ప్రస్తుత బేరసారాల్లో ఆ పార్టీకున్న పదిమంది ఎమ్మెల్యేల్లో ఎందరు మిగులుతారన్నది అనుమానమే. వారిలో నలుగురి మద్దతు తమకే వున్నదని సైనీ చెప్పుకుంటున్నారు. వారిని అనర్హులుగా ప్రకటించాలని జేజేపీ కోరినా అది బీజేపీకే తోడ్పడుతుంది. ఉన్న 88 మందిలో నలుగుర్ని అనర్హులను చేయగానే సభలో సభ్యుల సంఖ్య 84కి పడిపోతుంది. దాంతో 43 మంది మద్దతున్న బీజేపీ ప్రభుత్వం సునాయాసంగా బయటపడుతుంది.

లోక్‌సభ ఎన్నికల ప్రచారం హోరెత్తుతుండగా ప్రభుత్వ అస్తిత్వానికే ముప్పు ఏర్పడటం హరియాణా ప్రజానీకానికి మంచి సంకేతం పంపదు. ఎమ్మెల్యేల బేరసారాలు కళ్లముందు స్పష్టంగా కనబడుతుండగా సుదీర్ఘ క్యూ లైన్‌లలో ఓపిగ్గా నిలబడి వోటేసేంత ఉత్సాహం ఎందరికుంటుంది? వచ్చే అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా ఈ కుర్చీలాట మొదలుకావటం వింత. రాష్ట్రంలో బీజేపీకి ఎదురుగాలి వీస్తున్నదనటానికి ఈ సంక్షోభం సంకేతమని కాంగ్రెస్ నాయకుడు హుడా చెబుతున్నారు. నిజానికి జనం అలా అను కోవాలని, లోక్‌సభ ఎన్నికల్లో తమకే పట్టం కట్టాలని ఆయన ఆత్రుత పడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఫిరాయింపులకు ఎవరు పాల్పడినా తప్పే. వేరే రాష్ట్రాల్లో బీజేపీ చేసినప్పుడు విమర్శించిన కాంగ్రెస్ హరియాణాలో అదే పనికి పూనుకోవటం నైతికంగా సరైందేనా? రాష్ట్రపతి పాలన కాంగ్రెస్ ఉద్దేశమని కొందరంటున్నారు. అందుకే మద్దతిస్తామంటూ జేజేపీ ముందుకొచ్చినా హుడా సాను కూలత చూపలేదని వారి వాదన. లోక్‌సభ ఎన్నికల జంజాటం లేకపోతే కొన్ని గంటల్లోనే బీజేపీ సునాయాసంగా చక్కదిద్దగలిగేది. కేంద్రంలో తాముండగా హరియాణాలో సొంత ప్రభుత్వాన్ని దించి రాష్ట్రపతి పాలనకు బీజేపీ సిద్ధపడటం కల్ల.

ఈ పరిస్థితుల్లో అందరి దృష్టీ హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయపై పడింది. బీజేపీకి లబ్ధి చేకూరేందుకు వీలుగా ప్రస్తుత ఎన్నికలు ముగిసేవరకూ సంక్షోభాన్ని కొనసాగించటం మాత్రం మంచిది కాదు. పాలకపక్షం సత్తాపై సంశయం ఏర్పడినప్పుడు నేరుగా అసెంబ్లీలోనే బలపరీక్షకు సిద్ధపడాలని కోరటం అన్నివిధాలా శ్రేయస్కరం. సంక్షోభాన్ని కొనసాగనిస్తే అనారోగ్యకర పరిణామాలకు చోటిచ్చినట్టవుతుంది. ప్రభుత్వాల బలాబలాలు చట్టసభల్లో తేలాలి తప్ప రాజ్‌భవన్‌లలో కాదని చాన్నాళ్ల క్రితమే సుప్రీంకోర్టు చెప్పింది. ఒకవేళ వెంటనే బలపరీక్ష నిర్వహించటం సాధ్యం కాదనిపిస్తే కొంత వ్యవధి తీసుకోవచ్చు. అయితే ఈలోగా రాష్ట్రపతి పాలన విధించటమే ఉత్తమం. కేంద్రం తీసుకొచ్చిన సాగుచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పంజాబ్ రైతులతోపాటు హరియాణా రైతులు కీలక పాత్ర పోషించారు. ఇటీవలి రైతు ఉద్యమంలో కూడా వారి పాత్ర తక్కువేమీ కాదు. రిజర్వేషన్లు కావాలంటూ 2016లో జాట్‌లు సాగించిన ఉద్యమం హింసాత్మకంగా మారింది. అది కులాల మధ్య కుంపట్లు రాజేసింది. మరోపక్క ఉపాధి అవకాశాలు కరువై యువతలో తీవ్ర నిరాశా నిస్పృహలు అలుముకున్నాయి. ఖట్టర్‌ను సీఎం పదవి నుంచి తొలగించి సైనీని ప్రతిష్ఠించటం జాట్‌లకు ఆగ్రహం కలిగించిందంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయపు టెత్తుల్లో అధికార, విపక్షాలు రెండూ తలమునకలైతే ఇప్పటికే ఉన్న సమస్యలు రెట్టింపవుతాయి. కనుక ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే కోణంలో కాకుండా సాధ్యమైనంత త్వరగా ఈ రాజకీయ సంక్షోభానికి ముగింపు పలకాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: శు.చవితి తె.4.45 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి పంచమి, నక్షత్రం: మృగశిర ప.12.30 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: రా.9.02 నుండి 10.40 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.34 నుండి 7.15 వరకు, అమృతఘడియలు: రా.2.44 నుండి 4.19 వరకు

సూర్యోదయం: 5.34
సూర్యాస్తమయం: 6.18
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

అందరివాడికే అందలం

తన వల్ల మేలు జరిగిందీ అంటేనే ఓటేయండి అని జగన్ అడిగిన తీరు ఎన్నడూ కననిదీ, విననిదీ. బహుశా దేశంలోనే ఏ నాయకుడు కూడా ఇంత ఆత్మవిశ్వాసంతో సూటిగా అడిగి ఉండరు. అన్ని వర్గాల ప్రజలూ వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులే అన్నది ఈ విశ్వాసానికి కారణం. దానికి రుజువే ఎన్నికల ప్రచారంలో ఆయనకు లభిస్తున్న అమితమైన ఆదరణ! ఆంధ్రప్రదేశ్ ఓటర్లు మరోసారి ఆయన్ని అధికార పీఠం ఎక్కించడానికి 'సిద్ధం'గా ఉన్నారని దీన్నిబట్టి అర్థమవుతోంది.

'కాణి' ముత్యాలు ఇంటికే – మళ్లీ పట్టం జగన్‌కే!

విశ్లేషణ



పి. విజయబాబు

ఆంధ్రప్రదేశ్ ప్రజలు మరోమారు విస్పష్టంగా జగన్‌మోహన్ రెడ్డికి అధికారం ఇవ్వనున్నారు. ఇది తెలుసుకోవడానికి 'సర్వేశ్వరులను' అడగనవసరం లేదు. గతంలో సర్వేలన్నీ సుప్రసిద్ధ మీడియా సంస్థలు నిర్వహించేవి. ఇప్పుడు ఎవరికి నచ్చిన విధంగా వారు సర్వేలు చేయించుకుంటూ 'స్వింగ్' ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ప్రకటన వెలువడిన దగ్గర నుంచి ఇటు వైసీపీ, అటు కూటమి ప్రచార సరళి, అభ్యర్థుల ఎంపిక, ప్రజాస్పందన నిశితంగా పరిశీలిస్తే, తీర్పు ఎలా ఉండబోతోందో మనకే అర్థమవుతుంది.

జగన్ అన్ని పార్టీల కంటే ముందుగానే విడతల వారీగా అభ్యర్థులను ప్రకటించారు. టీడీపీ, జనసేన అవగాహన కుదుర్చుకున్నా, చివరి వరకూ బీజేపీ జత కడుతుందో లేదో తెలియని సందిగ్ధం. అందుకే చాలాచోట్ల ముందుగానే అభ్యర్థుల్ని ప్రకటించేసుకున్నారు. తీరా బీజేపీ వచ్చి చేరాక, మళ్ళీ అభ్యర్థుల ప్రకటనలో కుస్తీ పట్టాల్సి వచ్చింది. ఆశించిన స్థాయిలో కాక అతి తక్కువ సీట్లు జనసేన తీసుకోవడం, బీజేపీ పూర్వ అధ్యక్షుడు సోము వీర్రాజుతో సహా సిసలైన బీజేపీ వారికి టికెట్లు దక్కకపోవడం వంటివి లుకలుకలకు కారణమయ్యాయి. పేరుకే మూడు పార్టీల జెండాలు. జన శ్రేణులు మాత్రం కలిసి పనిచేసే పరిస్థితి చాలా చోట్ల లేకుండా పోయింది.

పోనీ నిలబెట్టిన టీడీపీ అభ్యర్థుల్లో ఆణిముత్యాల లాంటి వారు ఉన్నారా అంటే, అబ్బే! చాలావరకు కాణి ముత్యాలే! ఇంచుమించు చంద్రబాబు మహా దోపిడీలో భాగస్వాములు లేదా ఆ దోపిడీ నుంచి స్ఫూర్తి పొందినవారే. ఇటు బెజవాడ దుర్గమ్మ, అటు విశాఖ కనకమహాలక్ష్మి, ఆ పక్క అనకాపల్లి నూకాలమ్మ సాక్షిగా వీరంతా కాణి ముత్యాలు. ఇలాంటివాళ్లే చంద్రబాబుకు కావాలి. టిప్పర్ డ్రైవర్లు, కమతగాళ్లు అంటే ఆయనకు అసహ్యం. ఈ బాపతు కాణి ముత్యాల్ని జనం ఆదరించరని చరిత్ర చెబుతున్న సత్యం. అందుకే వీళ్ళు ఎక్కువగా 'బ్యాక్ డోర్ పాలిటిక్స్' నడుపుతుంటారు.

ఇక ప్రచార తీరు పరిశీలిస్తే, తన వల్ల మేలు జరిగిందీ అంటేనే ఓటేయండి అని జగన్ అడిగిన తీరు... బహుశా దేశంలోనే ఏ నాయకుడు ఇంత ఆత్మ విశ్వాసంతో సూటిగా అడిగి ఉండరు. ఆయన ప్రచారాస్త్రాలు కూడా విలక్షణంగా ఉన్నాయని చెప్పాలి. ఎక్కడా నిగ్రహం కోల్పోకుండా విమర్శలకే పరిమితమయ్యారు తప్ప స్థాయి మరచి తిట్లు లంకించుకోలేదు, హుందాతనాన్ని కోల్పోలేదు. మరి కూటమి విషయానికొస్తే– వెకిలితనం, బూతు పురాణం, కొట్టండి, చంపండి, నరకండి అని జనాల్ని ప్రేరేపించటం సభ్య సమాజాన్ని విస్తుపరిచాయి. జగన్‌పై విసిరిన రాయి దాడిని ఖండించాల్సింది పోయి 'గులక రాయి' అని వెకిలితనాన్ని ప్రదర్శించటం, వలంటరీ వ్యవస్థను కట్టడి చేయడం, పండుటాకుల, పుండు రెక్కలపై ఆక్రోశం వెలిబుచ్చి వాళ్ళ చావుకి కారణం కావడం, లేని భూయాజమాన్య హక్కు చట్టంపై దుష్ప్రచారానికి పూనుకోవడం వంటివి అన్నీ బూమరాంగ్ అయ్యాయి. అయితే జగన్ పని అయిపోయింది, ఇక తామే అధికారంలోకి వస్తున్నామనే ఫేక్ సర్వేలలో మాత్రం ముందున్నారు.




రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 4 కోట్ల 13 లక్షలు. ఇందులో అర్బన్ ఓటర్లు కేవలం 87 లక్షలు. జగన్‌కు పెట్టని కోటల వంటి గ్రామీణ ఓటర్ల సంఖ్య 3 కోట్ల 20 లక్షలు. అందులో సంక్షేమ పథకాల లబ్ధిదారులే అధికం. ఇక కులాల ప్రాతిపదికగా చూస్తే... ఎస్సీలు 35 లక్షల 46 వేల 748, ఎస్టీలు 25 లక్షల 85 వేల 726, ముస్లింలు 23 లక్షల 84 వేల 449, బీసీ యాదవులు 25 లక్షలు, మత్స్యకారులు 15 లక్షల 74 వేల 868, గౌడలు 19 లక్షల 78 వేల 866, చంద్రబాబు చేత తీవ్ర అవమానాలకు గురైన రజకులు, నాయీ బ్రాహ్మణులు 8 లక్షల 41 వేల 400+ 4 లక్షల 15 వేల 520, బ్రాహ్మణులు 7 లక్షల 4 వేల 165. క్రైస్తవులు 3 లక్షల 15 వేల 320... ఈ సామాజిక వర్గాలలో అత్యధికులు జగన్ వైపే ఉన్నారు.

అధిక శాతం ఉన్న మరొక వర్గం, గోదావరి జిల్లాల్లో నిర్ణయాత్మక శక్తి అని చెబుతున్న కాపులు, రాయలసీమలోని బలిజలు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ ప్రాంతాల్లో ప్రధానంగా, ఇంకా ఇతర ప్రాంతాల్లో ఉన్న తూర్పు కాపులు, ఒంటరులు మొత్తం 52 లక్షల 97 వేల 748 మంది. వీరిలో జనసేన వైపు ఆశగా చూసి భంగపడిన వారు, చంద్రబాబు సామాజిక వర్గంతో దశాబ్దాల వ్యతిరేకత ఉన్నవారు, వైసీపీలోని కాపు నాయకుల వెంట ఉన్నవారు... ఇలా భిన్నాభిప్రాయాలతో అటూ ఇటూ ఉంటారు. ఇక రెడ్డి వర్గంలోని 26 లక్షల 748 మందిలో అధికులు జగన్ వైపు ఉండగా, కమ్మ వర్గంలోని 26 లక్షల 46 వేల 748 మందిలో అత్యధికులు చంద్రబాబు వైపు ఉంటారు. ఇతర బీసీలు, 13 లక్షల పైచిలుకు ఉన్న వైశ్యులు ఆయా ప్రాంతాల పార్టీ అభ్యర్థుల ప్రాతిపదికన రెండు వైపులా చీలతారు. మొత్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలలో అధిక శాతం వైసీపీ వైపే ఉన్నారు. గెలుపును నిర్ణయించే మరో శక్తి, నారీ శక్తి. అలాంటి మహిళలు జగన్ వైపే ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. దీనిని బట్టి, 'మళ్లీ పట్టం జగన్‌కే – కాణి ముత్యాలు ఇంటికే!'

వ్యాసకర్త పూర్వ సంపాదకుడు

ముస్లింలు బీజేపీని ఓడించాలి – వైసీపీని గెలిపించాలి!

సందర్భం



ఏఎం ఖాన్ యజ్దానీ డానీ

ప్రధాని నరేంద్ర మోదీజీ, బీజేపీల నాయకత్వంలో పదేళ్ళుగా కేంద్రంలో అధికారంలో వున్న ఎన్డీయే ప్రభుత్వం దేశ సంపదను అస్మదీయ కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. ఒకవైపు భారతదేశాన్ని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తానంటూనే మరోవైపు దేశ ప్రజల్ని పేదరికం లోనికి నెట్టి వేస్తున్నది. దేశ ప్రజలంటే 80 శాతం హిందువులు, 14 శాతం ముస్లింలు, 6 శాతం క్రైస్తవులు, సిక్కులు, తదితరులు. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన హ్యాపీనెస్ రిపోర్టులో భారతదేశం 126వ స్థానంలో వుంది. భారత ప్రజలు సంతోషంగా లేరు. అణిచివేతకు గురవుతున్న ప్రతి ఆరుగురిలో ఒకరు మాత్రమే ముస్లిం, ఐదుగురు హిందువులు. దీని అర్థం ఏమంటే మోదీ పాలనకు ప్రధాన బాధితులు హిందువులు. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చడానికి, హిందూ–ముస్లింల మధ్య తగువుపెట్టి ఎన్నికల్ని ఒక మత యుద్ధంగా మార్చడానికి స్వయంగా మోదీజీ నడుం బిగించారు. 2019 లోక్ సభ ఎన్నికల్ని ఆ పార్టీ 1761 నాటి పానిపట్టు యుద్ధంతో పోల్చేది. ఆ యుద్ధంలో అహ్మద్ షా అబ్దాలీ దుర్రానీ చేతుల్లో పీష్వా బాలాజీ బాజీరావు ఓడిపోవడంతో హిందువులు 250 ఏళ్ల అధికారాన్ని కోల్పోయారని గుర్తు చేసి, మళ్ళీ అలాంటి దుఃస్థితి వస్తుందని భయపెట్టింది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్ని ఔరంగజేబ్, శివాజీ మహారాజ్‌ల మధ్య పోరాటంగా ప్రచారం చేసింది. గతేడాది జరిగిన కర్ణాటక ఎన్నికల్లో టిప్పూ సుల్తాన్‌కు ఓటేస్తారా? రాణి అబ్బక్కకు ఓటేస్తారా? అని అడిగింది.

వివిధ రాష్ట్రాలు విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లింలకు ఇస్తున్న రిజర్వేషన్లను రద్దు చేసి హిందూ సమాజంలోని కింది కులాలకు కేటాయిస్తామని బీజేపీ చెపుతున్నది. కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అంశాన్ని విస్తారంగా ప్రచారం చేశారు. ఆ రెండు రాష్ట్రాల ప్రజలూ ఈ మాటల్ని నమ్మలేదు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లను బీజేపీ ఆమోదించదని మరో బూటకపు ప్రచారాన్ని ప్రధాని సాగిస్తున్నారు. నిజానికి మత ప్రాతిపదికనే కులాలుంటాయి. భారత రాజ్యాంగం కొన్ని సమూహాలకు ఇచ్చిన రిజర్వేషన్లు వాస్తవానికి మత రిజర్వేషన్లే. మాల సామాజిక వర్గానికి చెందిన ఒక వ్యక్తి తాను హిందువుననిగానీ, సిక్కును అనిగానీ ప్రకటించుకుంటేనే ఎస్సీ రిజర్వేషను పొందుతాడు. క్రైస్తవుడినని ప్రకటించుకుంటే బీసీ రిజర్వేషను పొందుతాడు. ఏమిటి దీనర్థం?

బీజేపీ ముస్లిం రిజర్వేషన్‌గా ప్రచారం చేస్తున్నది కూడా నిజానికి ముస్లిం రిజర్వేషన్ కాదు. ముస్లిం సమాజంలో ఓసీలుగా పరిగణించే సయ్యద్, పఠాన్, మొఘల్, బేగ్‌లకు బీసీ రిజర్వేషన్ వర్తించదు. మహా అయితే వాళ్ళు ఆర్థికంగా వెనుకబడిన సమూహాల (ఇడబ్ల్యూఎస్) కోటాలో లబ్ది పొందవచ్చు. ముస్లింలను సాంస్కృతిక రంగంలో వివక్షకు గురి చేయడం, ఆర్థిక రంగంలో అతి క్రూరంగా బుల్ డోజర్లతో కూల్చివేయడం బీజేపీ విధానంగా మారింది.

ఏపీలో ప్రధాన పోటీదారులు అధికార వైఎస్సార్ కాంగ్రెస్, ప్రతిపక్ష తెలుగుదేశం. ఆంధ్రప్రదేశ్ మొదటి నుండీ మత సామరస్యవాదుల నేల, సామ్యవాదుల భూమి. మతవిద్వేషాన్ని రగిల్చితే తప్ప రాజకీయ మనుగడ సాగించలేని బీజేపీ ఈ నేల మీద తనంత తానుగా మొలకెత్తలేని విత్తనం. 2019 ఎన్నికల్లో విడిగా పోటీచేస్తే బీజేపీకి ఒక్క శాతం ఓట్లు కూడ రాలేదు. లోక్ సభ, అసెంబ్లీల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదు.

జాతీయ స్థాయిలో ఎన్డీయేకు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి మాత్రమే. ఏపీ ముస్లింలు ఈసారి ఒక లెక్క ప్రకారం కాంగ్రెస్‌కు మద్దతు పలకాలి. అయితే, కర్ణాటక, తెలంగాణాల్లా ఏపీలో కాంగ్రెస్ నిర్మాణం బలంగా లేదు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఎంచుకున్న ప్రాధాన్యతల్ని ఆ పార్టీ ఏపీ నాయకులు పట్టించుకుంటున్నట్లు లేదు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు బీజేపీని ఓడించాలనే పట్టుదల వున్నట్టు లేదు. కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిని గెలిపించాలా? బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమిని ఓడించాలా? అనేది ఏపీ ముస్లింల ముందున్న ప్రశ్న.

రాష్ట్ర ఆర్థిక అవసరాల కోసమో, మరో కారణాలతోనో వైసీపీ జగన్ ఇన్నాళ్ళు అధికారంలో ఉన్న ఎన్డీయేతో సఖ్యంగా వున్నారు. ఇప్పుడు ఆయనే ఏపీ నేల మీద బీజేపీని ఎదుర్కోవాల్సిన స్థితిలో పడ్డారు. ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసేలోగా బీజేపీ, జగన్‌ల మధ్య పోరు మరింత వుధృతం అవుతుంది. భారత జాతీయ కాంగ్రెస్సా? వైఎస్సార్ కాంగ్రెస్సా? అనే ప్రశ్న మళ్ళా ముస్లింల ముందుకు వచ్చి నిలిచింది. ఇది రాజకీయ సమస్య మాత్రమే కాదు. ఒక విధంగా నైతిక సమస్య కూడా. ఆంధ్రప్రదేశ్ భౌతిక రాజకీయ సమీకరణలు, కాంగ్రెస్ ఏపీ యూనిట్ వాస్తవిక బలాబలాలు, పనితీరుల్ని పరిగణన లోనికి తీసుకుంటే ముస్లింలు వైసీపీకి మద్దతు ఇవ్వడమే మెరుగైన నిర్ణయం అవుతుంది. అది అవసరం కూడా. ఇటీవల విజయవాడలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ (ముస్లిం జేఏసీ), ముస్లిం ఆలోచనాపరుల వేదిక (ఎంటీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన ముస్లిం ఉలేమాలు, ఆలోచనాపరులు, అడ్వకేట్లు, డాక్టర్లు, ప్రొఫెషనల్స్‌తో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం కూడా ఈ మేరకు ఒక తీర్మానం చేసింది.

వ్యాసకర్త ముస్లిం ఆలోచనాపరుల వేదిక (ఎంటీఎఫ్) కన్వీనర్

సోషల్ మీడియా

పరిస్థితి మారేనా?



చాలామంది విశ్లేషకులు, బ్యూరోక్రాట్లు, ఆఖరికి బీజేపీ జనాలతో కూడా మాట్లాడాను. బిహార్‌లో ఇండియా కూటమి కనీసం 10–12 స్థానాల్లో గెలవనుంది. అదే నిజమైతే ఇది అసలైన గేమ్ చేంజర్. (2019లో ఎన్డీయే 39/40 స్థానాలు గెలిచింది.) – అర్ఫా ఖానమ్ షేర్వానీ, జర్నలిస్ట్

హెచ్చరిక!



జర్మనీలో ర్యాలీని చూడండి. 'ఇస్లామిస్టుల నుంచి తప్పించు కోవడానికి జర్మనీకి వచ్చాం. మా పిల్లలు మళ్లీ ఎటు పారిపోవాలి?' అని చాలామంది ఇరానియన్లు అడుగుతున్నారు. ఇస్లామిస్టులు పాశ్చాత్య నాగరికతను ధ్వంసం చేసి, ప్రపంచాన్ని ఏలాలనుకుంటున్నారు. మేలుకోకపోతే యూరప్ చేజారిపోతుంది. – దర్యా సఫాయి, బెల్జియం ఎంపీ


అలా చేశారు!



ఈ భూమ్మీద ఉన్న అందరు యూదులకు ఇప్పుడు బెంజమిన్ నెతన్యాహూ ప్రాతినిధ్యం వహిస్తున్నారని గుర్తుంచుకోండి. గాజాలో ఆయన విధానాలను ఏమాత్రం విమర్శించినా అది యూదు వ్యతిరేకత అవుతుంది. – అలీ ఎ. రిజ్వీ, రచయిత

పనులను నమ్మిన మనిషి

అభిప్రాయం



డా॥ ఇండ్ల రాధారెడ్డి

ఆశయాలు అందరికీ ఉంటాయి. కానీ వాటిని ఏ ప్రలోభాలకూ లొంగకుండా అమలు చేసే మంచితనం, మానవత్వం కొందరిలోనే ఉంటుంది. అలాంటి మనసున్న మంచి వ్యక్తి వైఎస్ జగన్. తండ్రి వైఎస్సార్ మరణం తర్వాత పరిణామాలు జగన్‌ను రాటుతేల్చాయి. పరిస్థితులు ఆయన్ని వైఎస్సార్‌సీపీని స్థాపించి ప్రజాక్షేత్రంలోకి దిగేలా చేశాయి. ప్రజల కష్టాలు, బాధలు, నష్టాలు, సమస్యలు పాదయాత్ర సమయంలో విన్నారు. వాటన్నింటినీ తన మనసులోనే ముద్ర వేసుకున్నారు. తను అధికారంలోకి వస్తూనే ఆ కష్టాలను, సమస్యలను తీర్చేందుకు 'నవరత్నాల'ను ప్రవేశపెట్టారు. చిన్నపిల్లలూ, మహిళలూ, వృద్ధులూ, రైతులూ... ఇలా అన్ని రకాల, సామాజిక వర్గాల వారినీ అన్ని దశల్లో ఆదుకునేలా ఈ పథకాలు ఉన్నాయి. వలంటీర్ల వ్యవస్థ ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు ఇంటి దగ్గరకే ప్రభుత్వ పథకాల ఫలాలను చేరుస్తున్నారు.

గత 59 నెలలుగా ఏ రాష్ట్ర చరిత్రలో చూడని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. జగన్ ఉచిత పథకాల వల్ల రాష్ట్రం దెబ్బతింటుందని గోల చేసిన ప్రతిపక్షాలు తమ ఉమ్మడి మేనిఫెస్టోలోనూ అవే పథకాలను పోలినవాటిని వాగ్దానం చేయడం పెద్ద ట్విస్ట్. ఇక్కడే ఆయన పథకాలు ఎంత గొప్పవో అర్థమవుతుంది. జగన్ నాయకత్వం రామరాజ్యాన్ని తలపిస్తుందని ప్రజలందరూ అనుకుంటున్నారు. ప్రజలు తమ కూడు, గూడు, గుడ్డతోపాటు తమ పిల్లల భవిష్యత్తుకు బంగారుబాట వేస్తున్న జగన్‌ను తమ కుటుంబంలోని వ్యక్తిగా భావిస్తున్నారు.


పేదలు, బడుగు, బలహీన వర్గాల వారి పిల్లలకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు పెట్టి విద్యా సంస్థల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. నెల నెలా పెన్షన్, బియ్యం తీసుకుంటున్న వారందరూ తమ కొడుకులు, కూతుళ్ళు కూడా తమకు నెల నెలా ఇలా ఇవ్వరని చెబుతూ జగన్ మా బిడ్డ అంటున్నారు. ఇలా... జగన్ పథకాలను చెబుతూపోతే ఒక పుస్తకమే అవుతుంది. పథకాలను అనుభవించే వారే వాటి గురించి బాగా చెప్పగలరు. చేయగల్గినవి చెప్పడం, చెప్పినవి చేయడమే 'జగనిజం'. తాను చెప్పిన మేనిఫెస్టోను 99.99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్. ఆయన మేనిఫెస్టోను పవిత్ర గ్రంథం అన్నారు. అలాగే చూశారు కూడా! అక్కడే జగన్ నిబద్ధత, నిలకడ తెలిసిపోతుంది. 'నేను కేవలం దేవుడిని, మిమ్మల్ని మాత్రమే నమ్మాను. నేను చేసింది ఏమిటో ఆ దేవుడికి తెలుసు, మీకు తెలుసు' అంటూ ధైర్యంగా చెబుతున్నారు. ఆ ధైర్యం ఆయన చేసిన పనుల వలన వచ్చింది.

ప్రజల్లో ఆయన పట్ల ఉన్న విశ్వసనీయత, ఆయన వ్యక్తిత్వం, దూరదృష్టి వంటివి మళ్ళీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తాయి. తమ నాయకులందరినీ ప్రజల్లో ఉండేట్లు చూస్తూ ఎక్కడా మోసం, లంచగొండితనం, అన్యాయం జరగకుండా చూస్తూ అందరినీ ఒకే తాటిపై నడిపిస్తున్న నిజమైన నాయకుడు జగన్. ప్రతిపక్షాలు పెట్టే ప్రలోభాలకు ప్రజలు లొంగకుండా వారి మాయ మాటలకు పడిపోకుండా తమ ఓటును ప్రజల మనిషికి వేయాలి. అప్పుడే రాబోయే కాలంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచేందుకు తోడ్పాటు నిచ్చినవారవుతారు. మనకు ఏ అవసరం వచ్చినా, మన ఇంటిముందు వాలే ఒక ఆత్మీయ బంధువును ఎవరూ వదులుకోవద్దు.

వ్యాసకర్త రచయిత్రి, జర్నలిస్ట్

మోదీ జీ ... ఆప్ క్యా సందేశ్ దియా?!

సందర్భం



డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల రెండు సార్లు ఏపీకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ఆ యా సభల్లో మాట్లాడిన తీరుపై ఇప్పుడు తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు ఆందోళన చెందుతున్నట్లు కనిపిస్తోంది. తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమిలో కీలక నేతగా ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగాల్లో ఎక్కడా కూడా సీఎం జగన్ పేరును ఎందుకు ప్రస్తావించలేదో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఇంకో పక్క రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణం అంశాలను లేవనెత్తుతూ అవి నీతి జరిగిందన్న ప్రధాని 2014–2019 మధ్య చంద్రబాబు ఈ రెండింటిలోనూ అవినీతికి పాల్పడ్డారని చెప్పకనే చెప్పారు. అంతెందుకు 2019 ఎన్నికల సమయంలోనూ పోలవరం ఏటీఎంగా చంద్రబాబు వాడుకున్నారు అని చెప్పారు. ఈ క్రమంలోనే రాజమండ్రి, కలికిరి సభల్లో చంద్రబాబు మోదీ పక్కన నిలబడలేదు అన్న ప్రచారం కూడా సాగుతోంది. మేనిఫెస్టోలో కనీసం మోదీ ఫోటో కూడా లేకుండా ఉండటం – ఇప్పుడు ఎన్నికల ప్రచార సభల్లో మోదీ వ్యవహరించిన తీరు గర్హనీయమని అటు తెలుగు తమ్ముళ్లు, ఇటు జనసైనికులు ఆవేదన చెందుతున్నారు.

ఎన్నికల్లో గెలవాలంటే తాము ఇది చేస్తామని ప్రజలకు హామీలు ఇవ్వాలి. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, లోటు బడ్జెట్, ప్రత్యేక రైల్వే జోన్, విద్యుత్ బకాయిలు... ఇలా విభజన చట్టంలోనివి అమలు చేయాల్సిన అంశాలు చాలా సమస్యలే ఉన్నాయి. కానీ, ఈ సమస్యల్లో ఏ ఒక్క దాన్ని కూడా ప్రధాని ప్రస్తావించలేదు.

కూటమిలో ఉంటూనే కూటమికి అనుకూలంగా ప్రచారం చేయడంలో ప్రధాని మోదీ ఎందుకో కినుకు వహించారన్నది కూటమి నేతలకు నిద్రపట్టకుండా చేస్తున్న అంశంగా తయారైంది. అలాగే ప్రత్యేక హోదాపై ఒక్క మాట కూడా మోదీ మాట్లాడకపోవడాన్ని కూడా వీరు చర్చిస్తున్నట్లుంది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి ప్రస్తావించకుండా ఇక్కడ లేని కాంగ్రెస్ ప్రభుత్వం గురించి తన ప్రసంగం మొత్తంలో పదే పదే ప్రస్తావించడాన్ని కూడా కూటమి నేతలను నిరుత్సాహ పరిచిందనిపిస్తోంది.

ఇక కేంద్రం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును తామే



తెచ్చామని మోదీ చెప్పుకోలేని పరిస్థితిని రాష్ట్రంలో చంద్రబాబు అండ్ కో కల్పించారని ప్రధాని భావించినందునే ఆయన ఒకింత అసహనానికి గురై ఉంటారని కూటమి నేతల ఆలోచన. దీనిపై ఎన్నికల కమిషన్ కూడా స్పందించడం, సీఐడీని దర్యాప్తుకు ఆదేశించడం చకచకా జరిగిపోయాయి. ఈ క్రమంలోనే... అసెంబ్లీ సాక్షిగా పీఏసీ ఛైర్మన్‌గా ఉన్న తెలుగుదేశం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఈ చట్టం మంచిదని, దీనిని తెలుగుదేశం పార్టీ స్వాగతిస్తోందని చెప్పిన వీడియోలు, ఎల్లో మీడియాలో ల్యాండ్ టైట్లింగ్ యాక్టు గొప్పదనం గురించి ప్రత్యేక కథనాల ప్రసారాలను వైఎస్సార్‌సీపీ బయటపెట్టడంతో చంద్రబాబు వ్యవహారాన్ని మోదీ పసిగట్టారని అంటున్నారు. చంద్రబాబు అసత్య ప్రచారాలకు సాక్షీభూతంగా నిలిచిందని ప్రధాని బలంగా నమ్మిన నేపథ్యంలోనే ఎన్నికల ప్రచార సభల్లో నిర్దిష్టమైన ఆరోపణలేవీ చేయలేదేమో అని కూటమి నేతలు అనుకుంటున్నారు.

జీఎస్‌డీపీలో మన రాష్ట్ర స్థూల ఉత్పత్తి చూస్తే తెలుగుదేశం హయాంలో 2014–2019 మధ్య 4.4 శాతం ఉంటే కరోనా ఉన్నా కూడా జగన్ పాలనలో ఈ ఐదేళ్లలో 4.87 శాతం ఉంది. ఇండస్ట్రీస్‌లో చంద్రబాబు హయాంలో 2.9 శాతం ఉంటే ఇప్పుడు 4 శాతం అయింది. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ సగటున రూ. 15,200 కోట్లు ఉంటే ఇప్పుడు రూ. 17,700 కోట్లకు చేరింది. ఇవన్నీ కాగ్ లాంటి సంస్థలు చెప్పినవే. కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే కంట్రిబ్యూషన్ తగ్గింది. అప్పుల గ్రోత్ తగ్గింది. నేషనల్ జీడీపీ షేర్‌లో మన వాటా పెరిగింది. మాన్యు ఫ్యాక్చరింగ్‌లో వృద్ధి పెరిగింది. ఇదంతా ఎలా సాధ్యమైందంటే సీఎం జగన్ ప్రతి రూపాయినీ నేరుగా లబ్ధిదారులకు పంపారు. డెలివరీ మెకానిజం సరిగ్గా చేశారు. అంతేకాకుండా నీతి ఆయోగ్ చెప్పినదాని ప్రకారం 2013–2019 మధ్య పేదరికం 11 శాతం ఉంటే 2020–2024 మధ్య 4 శాతానికి తగ్గింది. ఈ గణాంకాల ద్వారా అభి వృద్ధి ఎవరి హయాంలో జరిగిందో కేంద్రమే చెప్పింది. కాబట్టి సీఎం జగన్‌ని ప్రధాని మోదీ ఏమీ విమర్శించలేకపోయారన్నది వైసీపీ శ్రేణుల వాదనగా ఉంది.

జగన్ మోహన్ రెడ్డి మాటల మనిషి కాదు... చేతల మనిషి. కాబట్టే ప్రధాని మోదీ కూడా పల్లెత్తి మాట అనలేక పోయారని అంటున్నారు. ఇవన్నీ చూస్తే 2024లో మళ్లీ జగన్ అధికారం చేపట్టబోతున్నారన్నది వాస్తవం.

వ్యాసకర్త వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు
మొబైల్: 98481 05455

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



అవనిగడ్డలో ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన, టీడీపీ నేతలు



వెల్లుర్తిపాడులో వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను



పెండ్యాలలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్



తూర్పుపాలెంలో శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఆచంట కాపులు

కొత్తపేట (అవనిగడ్డ)/వెల్లుర్తిపాడు(పెనుగంచిప్రోలు)/కంచికచర్ల/పెనుగొండ/ కుక్కునూరు/ మండవల్లి/పట్నం బజారు: కృష్ణా జిల్లా అవనిగడ్డలో శుక్రవారం కొత్తపేటకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో వెల్లుర్తి పాడు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలోని పెండ్యాలకి చెందిన 20 కుటుంబాలు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరాయి. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆచంట (నటరాజ్ థియేటర్)కు చెందిన 30 మంది కాపు సామాజిక వర్గం నేతలు జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే చెరుకువాడ సమక్షంలో పార్టీలో చేరారు. పెనుగొండ మండలం ములపర్రు సీతారాముని చెరువు ఎస్సీ సంఘాల నేతలూ చెరుకువాడను కలిసి మద్దతు తెలిపారు. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం టీడీపీ సీనియర్ నాయకుడు ముప్పాళ్ళ సత్యనారాయణ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మండవల్లి మండలంలోని తక్కెళ్లపాడు మాజీ సర్పంచ్ వరగంజి అరుణ్‌కుమార్‌తోపాటు గ్రామంలోని టీడీపీ, జనసేనకు చెందిన 100 మంది నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమక్షంలో పార్టీలో చేరారు. గుంటూరులోని 24, 35, 39 వార్డులకు చెందిన 120 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు మంత్రి విడదల రజిని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

రూ.300 పింఛన్‌ను రూ.400 చేస్తా

మరోసారి నోరుజారిన టీడీపీ నేత నారా లోకేశ్



మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ మరోసారి నోరు జారి.. నవ్వుల పాలయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా లోకేశ్ గురువారం రాత్రి కురగల్లు, నిడమర్రు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నిడమర్రులో ఆయన మాట్లాడుతూ.. రూ.300 పింఛన్‌ను రూ.400కు పెంచుతాననడంతో సభకు హాజరైన వారు అవాక్కయ్యారు. వెంటనే పక్కనే ఉన్న మరో నాయకుడు కలుగజేసుకొని.. రూ.3 వేల నుంచి రూ.4 వేలకు అని చెప్పడంతో లోకేశ్ నాలుక కరుచుకున్నారు.

శ్రీవారి సేవలో రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ



తిరుమల: తిరుమల శ్రీవారిని రాజస్థాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

బాలికపై లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

విజయవాడ పోక్సోకోర్టు తీర్పు

విజయవాడస్పోర్ట్స్: ప్రేమ పేరుతో బాలికను నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి తిరుమల వెంకటేశ్వర్లు శుక్రవారం తీర్పు చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన బాలిక(16) విజయవాడ సూర్యారావుపేటలోని ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతోంది. ప్రతి రోజూ ఇంటి నుంచి కాలేజీకి వచ్చేది. 2016, జూలై 29వ తేదీన కళాశాలకు వెళ్లిన బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో.. కళాశాల యాజమాన్యాన్ని విచారించిన అనంతరం బాలిక తండ్రి సంబంధిత సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు జిల్లా దెందులూరు గ్రామానికి చెందిన తానికొండ పవన్‌కుమార్ బాలికను తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలడంతో అతనిపై కేసు నమోదు చేశారు. నిందితుడు పవన్‌కుమార్ మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో బాలికకు దగ్గరైనట్లు, ఏలూరులోని అతని మిత్రుడి ఇంటికి తీసుకెళ్లి బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో నిందితుడిని అదే ఏడాది ఆగస్టు 17వ తేదీన అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. బాధితురాలి తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగిరెడ్డి కోర్టుకు వాదనలు వినిపించారు. 14 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు పవన్‌కుమార్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఏపీఎల్ ట్రయిల్స్‌కు విశేష స్పందన

విశాఖ స్పోర్ట్స్: ప్రతిభ కలిగి గుర్తింపు లేకుండా ఉన్న మారుమూల ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక క్రికెటర్లకు ఏపీఎల్ రైజింగ్ స్టార్స్ పేరిట శుక్రవారం నిర్వహించిన ట్రయిల్స్‌కు భారీ స్పందన లభించింది. ఇప్పటికే ఏసీఏ విడుదల చేసిన వేలం అర్హత జాబితాలో చోటుదక్కని సుమారు వెయ్యి మంది క్రీడాకారులు హాజరయ్యారు. త్వరలో ప్రారంభం కానున్న ఏపీఎల్ మూడో సీజన్‌కు వీరిని పరిశీలించనున్నామని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ రెడ్డి తెలిపారు. విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం బి గ్రౌండ్‌తో పాటు మంగళగిరి ఏసీఏ స్టేడియం, కడపలోని వైఎస్సార్ స్టేడియాల్లోనూ ఈ ట్రయిల్స్ నిర్వహించారు.

కేజ్రీవాల్‌కు 'ప్రచార' బెయిల్

పలు షరతులు విధించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

జూన్ 1 వరకూ బెయిల్.. 2న తిరిగి లొంగిపోవాలి	వచ్చే నెల 5వ తేదీదాకా బెయిల్ ఇవ్వాలన్న కేజ్రీవాల్ తరఫు న్యాయవాది	తిరస్కరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఆయనకు జూన్ 1వ తేదీ వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇందుకు పలు షరతులు విధించింది. జూన్ 2న తిరిగి తిహార్ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. కేజ్రీవాల్‌కు వచ్చే నెల 5వ తేదీ వరకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరగా, ధర్మాసనం అంగీకరించలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేయడానికి మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఎన్నికల ప్రచారం అనేది ప్రాథమిక హక్కు లేదా రాజ్యాంగపరమైన హక్కు కాదని, మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన కేజ్రీవాల్‌కు ఎట్టిపరిస్థితుల్లోనూ మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చేసిన వాదనను ధర్మాసనం తిరస్కరించింది. మధ్యంతర బెయిల్ ఇవ్వడం లేదా జైలు నుంచి విడుదల చేయడం వంటి అంశాల్లో సదరు నిందితుడికి సంబంధించిన ప్రాధాన్యతలు, అతడి చుట్టూ ఉన్న పరిణామాలు, పరిస్థితులను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించింది. వాటిని విస్మరించడం పొరపాటే అవుతుందని ఉద్ఘాటించింది. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు ఈ సంవత్సరంలో చాలా ముఖ్యమైన కార్యక్రమం అని గుర్తుచేసింది.

కేజ్రీవాల్ దోషిగా నిర్ధారణ కాలేదు

కేజ్రీవాల్‌పై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయనడంలో సందేహం లేదని.. కానీ, ఆయన ఇంకా దోషిగా నిర్ధారణ కాలేదని, ఆయనకు గతంలో నేర చరిత్ర లేదని, సమాజానికి ఆయన వల్ల ముప్పు సంభవించే పరిస్థితి కూడా లేదని వివరించింది. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం చట్టబద్ధమేనా? అది చెల్లుబాటు అవుతుందా? అని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైందని, దానిపై ఇంకా తుదితీర్పు వెలువడలేదని వెల్లడించింది. కేజ్రీవాల్ కేసు ఇప్పుడు న్యాయ వ్యవస్థ పరిధిలోనే ఉంది కాబట్టి అతడికి బెయిల్ ఇచ్చే అంశాన్ని సానుకూలంగా పరిశీలించామని తెలియజేసింది. నిందితులకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు తనకున్న అధికారాన్ని అత్యున్నత న్యాయస్థానం ఎన్నో సందర్భాల్లో ఉపయోగించుకుందని ధర్మాసనం గుర్తుచేసింది. ప్రతి కేసుకు సంబంధించిన వాస్తవాలను దృష్టిలో పెట్టుకొని కోర్టులు మధ్యంతర బెయిల్ ఇస్తుంటాయని పేర్కొంది.

21 రోజులు బెయిలిస్తే పెద్దగా తేడా ఉండదు

తన అరెస్టును సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌పై ఇప్పటికిప్పుడు విచారణ పూర్తిచేసి, తీర్పు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆయన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నామని ధర్మాసనం వివరించింది. కేజ్రీవాల్ అప్పీల్ తమవద్దే పెండింగ్‌లో ఉందని, ఈ పరిస్థితుల్లో మధ్యంతర బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలంటూ ఆయనను ఆదేశించడం సరైంది కాదని భావించామని పేర్కొంది. తొమ్మిది సార్లు సమన్లు ఇచ్చినా కేజ్రీవాల్ లెక్కచేయలేదని, అందుకే అరెస్టు చేశామంటూ ఈడీ లేవనెత్తిన వాదనపై ధర్మాసనం స్పందించింది. ఇందులో ఇతర కోణాలు కూడా చూడాలని, వాటిని పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడింది. కేజ్రీవాల్ ఒక ముఖ్యమంత్రి, ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడు అని ప్రస్తావించింది. మద్యం కుంభకోణంలో దర్యాప్తు 2022 ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉందని, కేజ్రీవాల్‌ను ఈ ఏడాది మార్చి 21న అరెస్టు చేశారని, ఇప్పుడు 21 రోజులపాటు మధ్యంతర బెయిల్ ఇస్తే పెద్దగా తేడా ఏమీ ఉండదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్‌కు వచ్చే నెల 1వ తేదీ దాకా మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. షరతులకు కట్టుబడి ఉండాలని ఆదేశించింది. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వడాన్ని ఈ కేసు మెరిట్‌పై అభిప్రాయాల వ్యక్తీకరణగా చూడొద్దని సూచించింది.



కార్యకర్తలకు కేజ్రీవాల్ అభివాదం

తిహార్ జైలు నుంచి విడుదల

సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం తిహార్ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు ఎదుట భారీ సంఖ్యలో గుమికూడిన ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కేజ్రీవాల్ తన కాన్వాయ్‌తో జైలు నుంచి ఇంటికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన వెంట భార్య సునీతా కేజ్రీవాల్, కుమార్తె హర్షితా, ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ ఉన్నారు.

సుప్రీంకోర్టు షరతులివే..

1. రూ.50,000 బెయిల్ బాండు సమర్పించాలి, అంతే మొత్తం పూచీకత్తును తిహార్ జైలు సూపరింటెండెంట్‌కు అందజేయాలి.
2. బెయిల్‌పై బయట ఉన్నప్పుడు అధికారిక కార్యాలయంలో గానీ, ఢిల్లీ సచివాలయంలోని గానీ అడుగు పెట్టరాదు.
3. లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోకుండా అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయొద్దు
4. మద్యం కుంభకోణం కేసు గురించి బయట ఎక్కడా మాట్లాడొద్దని, సాక్షులతో భేటీ కావడం, సంప్రదింపులు జరపడం వంటివి చేయొద్దు.
5. మద్యం కేసుతో సంబంధం ఉన్న అధికారిక ఫైళ్లను చూడొద్దు.



ఎన్నికల విచిత్రం

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో శుక్రవారం రాష్ట్రీయ సంవిధాన్ సమ్మేళన్ చర్చా కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. వేదిక పైనున్న ఆయన వద్దకు వచ్చి ఆప్యాయంగా పలకరిస్తున్న ఓ చిన్నారి.

పీవోకేలో భగ్గుమన్న నిరసనలు

మిర్‌పూర్: పన్నుల పెంపు, నిరసనకారుల అరెస్టులపై పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో శుక్రవారం నిరసనలు భగ్గుమన్నాయి. మిర్‌పూర్ జిల్లా దద్యాల్ తహశీల్ పరిధిలో నిరసనకారులు భద్రతా బలగాలపై రాళ్లు రువ్వడంతోపాటు వారితో తలపడ్డారు. బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగించి వారిని చెదరగొట్టాయి. కొన్ని టియర్ గ్యాస్ తూటాలు సమీపంలోని పాఠశాల ఆవరణలో పడగా విద్యార్థినులు గాయపడ్డారు. . పెరుగుతున్న ధరలు, పన్ను భారం, విద్యుత్ కొరతకు సంబంధించి ఫిబ్రవరిలో కుదిరిన ఒప్పందాన్ని ప్రభుత్వం అమలు చేయనందుకు ఆగ్రహిస్తూ జమ్మూకశ్మీర్ జాయింట్ ఆవామీ కమిటీ 10వ తేదీన శుక్రవారం బంద్‌కు, 11న లాంగ్ మార్చ్‌కి పిలుపునిచ్చింది. దీంతో, భద్రతా బలగాలు గురువారం కమిటీ నాయకులు సహా 70 మందిని అదుపులోకి తీసుకున్నాయి.

నేను వచ్చేశా...

నియంతృత్వం నుంచి దేశాన్ని కాపాడుకోవాలి ● కేజ్రీవాల్ పిలుపు

న్యూఢిల్లీ: త్వరలో తిరిగి వస్తానని చెప్పాను కదా! చెప్పినట్లే వచ్చేశా అని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. తనకు మధ్యంతర బెయిల్ ఇచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు, ఇన్నాళ్లూ తనకు అండగా నిలిచి ఆశీస్సులందించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం తిహార్ జైలు నుంచి విడుదలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నియంతృత్వం నుంచి మన దేశాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకోసం తన శక్తిమేరకు పోరాడుతానని, తనకు 140 కోట్ల మంది ప్రజల మద్దతు కావాలని కోరారు. ప్రజలంతా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. తాను ఎంతగానో విశ్వసించే హనుమంతుడి ఆశీర్వాదంతో జైలు నుంచి బయటకు వచ్చానని తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు ఢిల్లీ కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ ఆలయాన్ని దర్శించుకోబోతున్నానని, తనను చూడాలంటే ప్రజలు అక్కడికి రావాలని కేజ్రీవాల్ సూచించారు. ఆయన శనివారం మధ్యాహ్నం ఆప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతారు. రోడ్ షోలో పాల్గొంటారు.

'ఇండియా' కూటమిలో హర్షాతిరేకాలు

అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో మధ్యంతర బెయిల్ మంజూరు కావడంతో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తోపాటు విపక్ష 'ఇండియా' కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. మరో నాలుగు దశల పోలింగ్ మిగిలి ఉన్న నేపథ్యంలో కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం తమ కూటమికి లాభిస్తుందని వారు చెప్పారు. సత్యమేవ జయతే అని ఆప్ నేతలు నినదించారు.

''సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ లభించిన ఈ విజయం మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది. కేజ్రీవాల్ విడుదల న్యాయానికి ప్రతిబింబం. ఆయన రాకతో 'ఇండియా' కూటమిని మరింత బలోపేతం అవుతుంది. ఈ ఎన్నికల్లో మా విజయావకాశాలు ఇంకా పెరుగుతాయి'' - ఎంకే స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి

''హనుమాన్‌జీ కీ జై.. ఇది ప్రజాస్వామ్య విజయం. లక్షలాది మంది ప్రజల ప్రార్థనలు, ఆశీస్సులతో అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ లభించింది. వారందరికీ నా కృతజ్ఞతలు''
- సునీతా కేజ్రీవాల్, అరవింద్ కేజ్రీవాల్ భార్య

కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పొందడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ పరిణామం ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమి విజయానికి దోహదపడుతుందని భావిస్తున్నా''
- మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

''కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇస్తూ సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వును స్వాగతిస్తున్నాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంలో మన దేశం దృఢంగా వ్యవహరిస్తోంది''
- శరద్ పవార్, ఎన్సీపీ(ఎస్పీ) అధినేత

మా జోక్యం లేదు

రష్యా ఆరోపణలను ఖండించిన అమెరికా

వాషింగ్టన్: భారత ఎన్నికల్లో అమెరికా ప్రభుత్వ జోక్యం ఎంతమాత్రం లేదని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ స్పష్టంచేశారు. భారత అంశాల్లో అమెరికా ఉద్దేశపూర్వకంగా తలదూర్చుతోందని రష్యా సంచలన ఆరోపణ చేసిన నేపథ్యంలో అమెరికా అధికార ప్రతినిధి శుక్రవారం స్పందించారు. '' భారత్‌లోనేకాదు ప్రపంచంలో ఏ దేశానికి సంబంధించిన ఎన్నికల ప్రక్రియలు, దేశ పాలనా విధానాల్లో అమెరికా కలగజేసుకోదు. ఎన్నికల నిర్ణయాలన్నీ భారతీయ ప్రజలే తీసుకుంటారు'' అని అన్నారు. ఖలిస్తానీ ఉగ్రవాది గురుపత్వంత్‌సింగ్ పన్నూ గత ఏడాది భారత రీసెర్చ్ అండ్ అనాలసిస్ (రా) అధికారి, మరో భారతీయుడు కలిసి చంపేందుకు పన్నిన కుట్రను అమెరికా భగ్నం చేసిందని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జఖారోవా ఆరోపించారు. ఈ విషయాన్ని మిల్లర్ వద్ద మీడియా ప్రస్తావించగా.. '' అవన్నీ నిరాధార ఆరోపణలు. ప్రస్తుతం ఆ ఆరోపణలన్నీ జ్యూరీ వద్ద విచారణలో ఉన్నాయి. చట్టసంబంధ ఇలాంటి విషయంపై నేను ఇప్పుడే ఏమీ మాట్లాడలేను. అందుకే ఈ విషయాన్ని నేను ఇక్కడితో వదిలేస్తున్నా' అని మిల్లర్ వ్యాఖ్యానించారు.

రష్యా ఆరోపణలను భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి సైతం ఖండించారు. భారత్‌లో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ అమెరికాలో ఇటీవల ఒక నివేదిక వెలువడటం, దానిపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసిన తరుణంలో గార్సెట్టి శుక్రవారం భారత్‌ను పొగడ్తల్లో ముంచెత్తడం గమనార్హం. ''ఢిల్లీలో బంధాన్ని అమెరికా వందశాతం విశ్వసిస్తోంది. 21వ శతాబ్దిలో చక్కటి సత్సంబంధాల్లో ఒకటిగా భారత్–అమెరికా బంధం నిలుస్తుంది. అమెరికాలో రెండు కిలోమీటర్లు నడచివెళ్లి ఓటేయడానికి బద్ధకిస్తారు. కానీ భారత్‌లో ఎక్కడో కొండల్లో ఉండే మఠాధికారి సైతం రెండు రోజులు కాలినడకన వెళ్లి మరీ ఓటు వేస్తారు. ట్రక్కుల్లో అనధికార నగదు తరలింపులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు. ఇలాంటి అంశాల్లో అమెరికా కంటే భారత్ మెరుగ్గా పనిచేస్తోంది. కేంద్రప్రభుత్వం లాగే అక్కడి విపక్షాల పాలిత రాష్ట్ర ప్రభుత్వాలూ శక్తివంతమైనవే. భారత చరిత్ర చూస్తే అక్కడి అందరి హక్కులకు గౌరవం దక్కుతుంది. మనల్ని మనం ఇష్టపడేకంటే భారతీయులే మనల్ని ఎక్కువగా ఇష్టపడతారు. ఇప్పుడున్న ప్రపంచంలో ఇది నిజంగా అరుదైన విషయం' అని భారత్‌ను ప్రశంసించారు.



ప్రజలు నన్ను సమాధి కానివ్వరు

వారే నాకు రక్షణ కవచం: మోదీ

నందూర్బర్: తనను సజీవంగా సమాధి చేయాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని, కానీ, దేశ ప్రజలే తనకు రక్షణ కవచమని, తనకు ఎలాంటి హాని కలుగకుండా వారే కాపాడుకుంటారని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. మహారాష్ట్రలో ఓటు బ్యాంక్‌ను బుజ్జగించడానికి నకిలీ శివసేన తనను దూషిస్తోందని, బెదిరింపులకు దిగుతోందని శివసేన(ఉద్ధవ్)పై మండిపడ్డారు. శనివారం మహారాష్ట్రలోని నందూర్బర్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. విపక్షాలపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాలు ప్రజల మద్దతును, విశ్వాసాన్ని కోల్పోయాయని అన్నారు. తనను అంతం చేయడానికి సాగుతున్న కుట్రలు ఫలించబోవని తేల్చిచెప్పారు. తనను సజీవంగా గానీ, నిర్జీవంగా గానీ సమాధి చేయకుండా ప్రజలు అడ్డుకుంటారని పేర్కొన్నారు. మహారాష్ట్రలో మొఘల్ రాజు ఔరంగజేబును సమాధి చేసినట్లు మోదీని సైతం సమాధి చేయాలంటూ శివసేన(ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ ఇచ్చిన పిలుపును మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. మోదీకి సమాధి తవ్వుతామంటూ కాంగ్రెస్ బెదిరిస్తోందని ఆక్షేపించారు. శివసేన(ఉద్ధవ్) కూడా తనకు హెచ్చరికలు జారీ చేస్తోందని, బాల్‌థాక్రే బతికి ఉంటే చాలా బాధపడేవారని చెప్పారు.

లోక్‌సభ బరిలో ఖలిస్తాన్ మద్దతుదారులు

● జైలు నుంచే అమృత్‌పాల్ సింగ్ పోటీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఖలిస్తాన్ వేర్పాటువాదుల మద్దతుదారులు లోక్‌సభ ఎన్నికల్లో బరిలో దిగారు. పార్లమెంట్‌లో అడుగుపెట్టడంతో పాటు ఖలిస్తాన్ ఉద్యమానికి మద్దతు తెలిపే వారందరినీ ఏకం చేసేందుకు ఎన్నికలను ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. అకాలీదళ్‌కు చెందిన సిమ్రన్‌జీత్ సింగ్ మాన్, జైలులో ఉన్న 'వారిస్ పంజాబ్ దే' చీఫ్ అమృత్‌పాల్ సింగ్‌తో సహా ఎనిమిది మంది వేర్పాటువాదులు పంజాబ్ బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ రాజీనామాతో 2022లో జరిగిన సంగ్రూర్ ఉప ఎన్నికలో సిమ్రన్‌జీత్ సింగ్ మాన్ విజయం సాధించారు. ఇది ఖలిస్తానీ మద్దతుదారులకు ప్రేరణగా మారింది. సిమ్రన్‌జీత్ ఈసారి కూడా సంగ్రూర్ నుంచే పోటీ చేస్తున్నారు. ఆనంద్‌పూర్ సాహిబ్ నుంచి కుశాల్‌పాల్ సింగ్ మాన్, ఫరీద్‌కోట్ నుంచి బల్‌దేవ్ సింగ్ గాగ్రా, లుధియానా నుంచి అమృత్‌పాల్ సింగ్ చంద్ర, పటియాలా నుంచి మోహిందర్‌పాల్ సింగ్ పోటీ చేస్తున్నారు. కర్నాల్ నుంచి హర్జీత్ సింగ్ విర్క్, కురుక్షేత్ర స్థానం నుంచి ఖాజన్ సింగ్ బరిలోకి దిగారు. దిబ్రూగఢ్ జైల్లో ఉన్న ఖలిస్థానీ వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్ ఖదూర్ సాహిబ్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.



అమృత్‌పాల్ సింగ్

ఎలక్షన్ బీట్

యూపీలో 'ఇండియా' తుపాను

మోదీ మరోసారి ప్రధాని కాలేరు: రాహుల్ గాంధీ

కనౌజ్/కాన్పూర్: విపక్షాల 'ఇండియా' కూటమి తుపాను ఉత్తరప్రదేశ్‌లోకి దూసుకొస్తోందని ఈ ధాటికి మరోసారి మోదీ ప్రధాని కాలేరని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. యూపీలో 80 స్థానాలకుగాను కనీసం 50 చోట్ల మా కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని కనౌజ్, కాన్పూర్‌లలో ఎన్నికల ప్రచార ర్యాలీల్లో రాహుల్ మాట్లాడారు. '' దేశ ప్రధానిగా మోదీ మరోసారి పగ్గాలు చేపట్టలేరని లిఖితపూర్వక గ్యారెంటీగా భావించండి. ఇక అంతా అయిపోయింది. బీజేపీ ఓటమి ఖాయం. అందుకు అనుగుణంగానే విపక్షాల కూటమి చాన్నాళ్ల క్రితమే ఎన్నికల ప్రచార వ్యూహాలు రచించింది. విద్వేష బజార్లలో ప్రేమ దుకాణాలను తెరిచాం. భారత్ జోడో యాత్ర, న్యాయయాత్ర చేశాం. దేశవ్యాప్తంగా విపక్షాల సమావేశాలు నిర్వహించాం'' అని అన్నారు. పారిశ్రామికవేత్తలు అదానీ, అంబానీలతో కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందం చేసుకుందన్న మోదీ ఆరోపణలపై రాహుల్ స్పందించారు. '' ఓటర్లు పదేళ్ల నుంచి చూస్తున్నారు. ఒక్కసారైనా మోదీ అదానీ, అంబానీల పేరెత్తలేదు. కానీ ఇప్పుడు ఓటమి సుడిగుండం నుంచి కాపాడతారేమోనని వాళ్ల పేర్లు తొలిసారిగా ప్రస్తావిస్తున్నారు. ఓడిపోతున్నాను.. కాపాడండి అదానీ, అంబానీజీ అంటూ మోదీ ప్రాథేయపడుతున్నారు'' అని రాహుల్ వెటకారంగా మాట్లాడారు.

మోదీకి టెంపో బాగా తెలుసు

టెంపోల నిండా అదానీ, అంబానీల నుంచి నగదు మూటలు వచ్చినందుకే కాంగ్రెస్ నోరుమూసుకుందని మోదీ అనడంపై రాహుల్.. '' అంటే మోదీకి తరచూ అదానీ డబ్బులను టెంపోలో పంపిస్తారన్నమాట. ఏ రకం టెంపోలో డబ్బులు పంపిస్తారో ఆయనకు బాగా తెలుసు. టెంపోల గురించి మోదీకి బాగా అవగాహన ఉన్నట్లుంది'' అని అన్నారు.

కాంగ్రెస్ 80 సవరణలు చేసింది: గడ్కరీ

ఛత్రపతి శంభాజీనగర్: బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ ప్రతిపక్షాలు ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నాయని పార్టీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా స్పందించారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా మజల్‌గావ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార ర్యాలీలో మంత్రి మాట్లాడారు. నిజం చెప్పాలంటే, దేశ రాజ్యాంగానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు 80 సవరణలు చేశాయన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి సవరణలు చేయగలవే తప్ప, మార్చలేవని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ప్రచారంలో 'టెంపో' ప్రతిపక్షాలదే: థరూర్

న్యూఢిల్లీ: సగానికి పైగా లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల ప్రచారంలో పైచేయి(టెంపో) ప్రతిపక్షాలదేనని కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ పేర్కొన్నారు. 'అధికార బీజేపీ నేతలు ఎన్నో అసత్యాలు ప్రచారం చేస్తున్న వేళ, ఎన్నికల ప్రచారంలో టెంపో మాత్రం ప్రతిపక్షాల వైపే ఉందని చెప్పకుండా ఉండలేకపోతున్నా'అని ఆయన శుక్రవారం పేర్కొన్నారు. అణ్వస్త్రాలున్న పాక్ జోలికి పోవద్దంటూ కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అంటున్నట్లుగా ఉన్న పాత వీడియోను బీజేపీ తాజాగా బయటికి తెచ్చింది. అదేవిధంగా, బుధవారం ప్రధాని మోదీ అంబానీ, అదానీల నుంచి రాహుల్ గాంధీకి టెంపోల కొద్దీ నల్లధనం అందిందంటూ వ్యాఖ్యానించడం తెల్సిందే. ఈ రెండింటి నేపథ్యంలోనే శశి థరూర్ 'టెంపో' మాటను వాడటం గమనార్హం.

పీవోకేలో ప్రతి అంగుళమూ మనదే: షా

ఖూంటీ(జార్ఖండ్): పాకిస్తాన్ వద్ద అణుబాంబు ఉన్నందున, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) గురించి మాట్లాడొద్దంటున్న కాంగ్రెస్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. పీవోకేలోని ప్రతి అంగుళమూ భారత్‌దేనని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన జార్ఖండ్‌లో ఖూంటీలో బీజేపీ ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. 'అణుబాంబు కలిగిన పాకిస్తాన్‌ను గౌరవించాలని కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చెబుతున్నారు. అణుబాంబులు కలిగిన పాక్‌తో పీవోకే గురించి మాట్లాడొద్దని కొన్ని రోజుల క్రితం ఇండియా కూటమి నేత ఫరూక్ అబ్దుల్లా కూడా చెప్పారు. కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలకు నేను ఒక్కటే చెప్పదలుచుకున్నా..పీవోకే భారత్‌దే, దాన్నెవరూ లాక్కోలేరు'అని అమిత్ షా స్పష్టం చేశారు.

దేవుడి పేరుతో ఓట్లా: ప్రియాంక

అమేథీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఉద్యోగాల కల్పన, ద్రవ్యోల్బణం కట్టడి గురించి మాట్లాడకుండా దేవుడి పేరు చెప్పి ప్రజలను ఓట్లడుగుతోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆరోపించారు. అమేథీలో శుక్రవారం ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. 'ఎన్నికల ప్రచారానికి వస్తున్న మీ ఎంపీ స్మృతీ ఇరానీ, బీజేపీ నేతలు దేశంలో ద్రవ్యోల్బణం కట్టడి, వ్యవసాయానికి ప్రోత్సాహం, ఉద్యోగాల కల్పన వంటి వాటిపై మాట్లాడటం లేదు. మీ ఇళ్ల వద్దకు వచ్చి దేవుడి పేరుతో తమకు ఓటేయాలని అడుగుతున్నారు. పదేళ్లలో చేసిన అభివృద్ధిని చూపి వాళ్లు ఓట్లెందుకు అడగరు? మతాన్ని రాజకీయాల కోసం వాడుకోవడం తప్పు'అని ఆమె అన్నారు.

భారత్‌లో ఎన్నికలుంటే పాక్ ప్రస్తావనెందుకు?

భారత్‌లో ఎన్నికలు జరుగుతుండగా మధ్యలో పాకిస్తాన్ ప్రస్తావనెందుకు వస్తోందని ప్రియాంక ప్రశ్నించారు. ఎన్నికల్లో వాస్తవ అంశాలపైనే మాట్లాడాలని బీజేపీని ఆమె కోరారు. పీటీఐ ప్రతినిధితో ప్రియాంక మాట్లాడుతూ.. 'మా పార్టీ సీనియర్ నేత మణి శంకర్ అయ్యర్ గతంలో పేర్కొన్నట్లుగా ఉన్న వీడియోపై బీజేపీ ఎన్నికల వేళ ఇప్పుడు చర్చకు పెట్టింది. అసలు ఎన్నికలు జరిగేది భారత్‌లోనా, లేక పాకిస్తాన్‌లోనా?' అని ప్రశ్నించారు.

ఖర్గే వ్యాఖ్యలపై ఈసీ కన్నెర్ర

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి దశలవారీగా జరుగుతున్న పోలింగ్‌కు సంబంధించిన వివరాలను ఆలస్యంగా విడుదలచేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం సందేహాలకు తావిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానాలపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా స్పందించింది. ఎన్నికల క్రతువులో ఈసీ సమయపాలన, నిబద్ధతను ఖర్గే ప్రశ్నించడాన్ని ఈసీ తప్పుబట్టింది. ' పోలింగ్ డేటాపై విమర్శలు చేస్తూ ఓటర్లలో పోలింగ్ వ్యవస్థపై అనవసర సందేహాలు లేవనెత్తుతున్నారు. ఓటర్లను గందరగోళపరుస్తున్నారు. తన ఆందోళనలను ఇతర విపక్ష పార్టీలతో పంచుకునే స్వేచ్ఛ ఖర్గేకు ఉంది. అంతేగానీ ఆ లేఖను బహిరంగపరిచి జనాల్లో కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. ఇలాంటి అసంబద్ధ ప్రకటనలకు ఖర్గే దూరంగా ఉంటే మంచిది' అని ఈసీ ఆగ్రహం వ్యక్తంచేసింది.

బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలు నమోదు చేయండి

● పోలీసులకు ఢిల్లీ కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) మాజీ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపులు, ఇతర అభియోగాలను నమోదు చేయాల్సిందిగా ఢిల్లీ కోర్టు పోలీసులను ఆదేశించింది. తమను వేధించారంటూ ఐదుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఆరోపణల్లో బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా తగు ఆధారాలున్నట్లు కోర్టు తెలిపింది. కేసులు నమోదు చేయాల్సిందిగా అడిషనల్ చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్(ఏసీఎంఎం) ప్రియాంకా రాజ్‌పుత్ ఢిల్లీ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో సహ నిందితుడు, డబ్ల్యూఎఫ్‌ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌పైనా అభియోగాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. బ్రిజ్ భూషణ్‌పై ఆరో మహిళా మైనర్ రెజ్లర్ చేసిన ఆరోపణలకు తగు ఆధారాలు లేనందున ఆమె పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపారు. కోర్టు ఈనెల 21న అధికారికంగా అభియోగాలను నమోదు చేయనుంది.

అయ్యర్ వీడియో కలకలం

న్యూఢిల్లీ: వరసబెట్టి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ నేతల జాబితాలో మణిశంకర్ అయ్యర్ చేరిపోయారు. దక్షిణభారత వాసులు ఆఫ్రికన్లలా ఉంటారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన శ్యామ్ పిట్రోడా వివాదం ముగిసేలోపే అయ్యర్ పాత వీడియో ప్రస్తుతం బీజేపీ ఎన్నికల ప్రచారాస్త్రంగా మారిపోయింది. పాక్ పట్ల కాంగ్రెస్ పక్షపాత ధోరణి మరోసారి బట్టబయలైందని బీజేపీ దుమ్మెత్తిపోయగా అవి అయ్యర్ వ్యక్తిగత అభిప్రాయాలని, పార్టీతో సంబంధం లేదని కాంగ్రెస్ ఖరాకండీగా చెప్పేసింది.

అయ్యర్ అన్నదేంటి?

ఏప్రిల్‌లో 'చిల్‌పిల్ మణిశంకర్' పేరిట జరిగిన ఒక ఇంటర్వ్యూలో అయ్యర్ చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. '' పొరుగుదేశమైన పాకిస్తాన్‌కు మనం గౌరవం ఇవ్వాల్సిందే. ఎందుకంటే అది కూడా సార్వభౌమ దేశమే. దాయాది దేశంతో తగాదాలకు పోతే భారత్‌పై అణుబాంబు వేయాలనే దుర్బుద్ధి పాక్ పాలకుల్లో ప్రబలుతుంది. పాక్‌తో కఠినంగా వ్యవహరించొచ్చు. కానీ చర్చలైతే జరపాలికదా. సరిహద్దుల్లో తుపాకీ పట్టుకుని తిరిగినంతమాత్రాన ఒరిగేదేమీ ఉండదు. ఉద్రిక్తతలు అలాగే కొనసాగుతాయి. పాక్‌లో పిచ్చోడు అధికారంలోకి వస్తే భారత్‌కు ప్రమాదమే కదా. పాక్ వద్ద కూడా అణుబాంబులు ఉన్నాయి. మన అణుబాంబును లాహోర్‌లో పేలిస్తే తిరిగి దాని రేడియోధార్మిక ప్రభావం కేవలం ఎనిమిది సెకన్లలోనే మన అమృత్‌సర్‌పై పడుతుంది. అందుకే పాక్‌తో చర్చల ప్రక్రియ మొదలెట్టాలి'' అని అన్నారు.

రఫా నుంచి 1.10 లక్షల పౌరుల వలస

రఫా: దక్షిణ గాజా స్ట్రిప్‌లోని రఫా నగర శివార్లలో ఇజ్రాయెల్ సైన్యం, హమాస్ మిలిటెంట్ల మధ్య పోరాటం ఆగట్లేదు. దాడులు, ప్రతిదాడులతో ఈ ప్రాంతం అట్టుడుకుతోంది. ఇతర ప్రాంతాల నుంచి ఆహార ధాన్యాలు, నిత్యావసరాల సరఫరా పూర్తిగా ఆగిపోయింది. దీంతో రఫా ప్రజలు ఆ ప్రాంతాన్ని వీడుతున్నారు. ఇప్పటిదాకా 1,10,000 మంది రఫా నుంచి బయటకు వెళ్లిపోయారని ఐక్యరాజ్యసమితి తెలిపింది.

దభోల్కర్ హత్యోదంతంలో ఇద్దరికి జీవితఖైదు

పుణె: అంధవిశ్వాసాలను రూపుమాపేందుకు మహారాష్ట్రలో సామాజిక ఉద్యమం చేసిన హేతువాది డాక్టర్ నరేంద్ర దభోల్కర్ హత్యోదంతంలో ఇద్దరు నిందితులకు పుణె ప్రత్యేక న్యాయస్థానం జీవితఖైదు విధించింది. దభోల్కర్ హత్య జరిగిన 11 సంవత్సరాలకు తీర్పు వెలువడటం గమనార్హం. ఈ కేసులో ముగ్గురు నిందితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. ఈ హత్యలో కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొన్న వీరేంద్రసిన్హా తావ్డేకు వ్యతిరేకంగా సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా నిర్దోషిగా ప్రకటిస్తూ అదనపు సెషన్స్ జడ్జి తీర్పు చెప్పారు. షూటర్లు సచిన్ అందూరే, శరద్ కలాస్కర్‌లకు జీవితఖైదుతో పాటు చెరో రూ.5 లక్షల జరిమాన విధించారు. సరైన సాక్ష్యాలు లేని కారణంగా తావ్డే, సంజీవ్, విక్రమ్‌ను కోర్టు నిర్దోషులుగా విడిచిపెట్టింది. 67 ఏళ్ల దభోల్కర్ 2013 ఆగస్టు 20న పుణెలో ఉదయపు నడకకు వెళ్లినపుడు బైక్‌పై వచ్చిన ఆగంతకులు కాల్పులు జరిపి పారిపోయారు. తీవ్రగాయాలైన దభోల్కర్ ఆస్పత్రిలో చనిపోయారు.

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్.. 12 మంది నక్సల్స్ మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ జిల్లాలో శుక్రవారం మరో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. గంగలూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిడియా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ సాగిస్తున్న భద్రతా బలగాలపై నక్సల్స్ కాల్పులకు దిగారు. ఇరువురి నడుమ ఎదురుకాల్పులు గంటలపాటు కొనసాగాయి. కాల్పుల అనంతరం ఘటనా ప్రాంతంలో 12 మంది మావోయిస్టుల మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఎం విష్ణుదేవ్ సాయ్ తెలిపారు. అదేసమయంలో, మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో ఒక బారెల్ గ్రెనేడ్ లాంఛర్, 12 బోర్ గన్, దేశవాళీ రైఫిల్, భారీగా పేలుడు పదార్థాలు లభించాయన్నారు. ఏప్రిల్ 16, 30వ తేదీల్లో చోటుచేసుకున్న భారీ ఎన్‌కౌంటర్లలో 39 మంది మావోయిస్టులు చనిపోవడం తెల్సిందే. బస్తర్ ప్రాంతంలో ఈ ఏడాదిలో వివిధ ఎన్‌కౌంటర్లలో108 మంది నక్సల్స్ చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.



మంగళగిరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



కడపలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

గొంతు నొక్కేస్తున్నారు..

మంగళగిరి, పుత్తూరు, కడప ఎన్నికల సభల్లో సీఎం జగన్






ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య, చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డప్ప, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా, కడప ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అంజాద్‌బాషా, వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించాలని కోరుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> ఒక ప్రభుత్వాన్ని ఐదేళ్ల కోసం ఎన్నుకుంటారు. కానీ వీళ్లందరూ 57 నెలలకే మీ బిడ్డ ప్రభుత్వాన్ని గొంతు పట్టుకుని పిసికేయాలని ఆలోచన చేస్తున్నారు. వీళ్లు గొంతు పట్టుకుని పిసికేది మీ బిడ్డ ప్రభుత్వాన్ని కాదు.. నా అక్కచెల్లెమ్మల గొంతులను, నా అవ్వాతాతల గొంతులను, నా రైతన్నల గొంతులను, నా పేద విద్యార్థుల గొంతులనే అని ప్రతి ఒక్కరూ గమనించమని కోరుతున్నా
>
> \- మంగళగిరి సభలో సీఎం జగన్

> నేను ప్రతి సందర్భంలోనూ నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు అని ఎందుకు అంటానో తెలుసా? ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి బాహాటంగా "నా.." అని పిలుచుకుంటూ వారిపై ప్రేమ చూపించినప్పుడు ఆయా సామాజిక వర్గాలకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా గౌరవం, ఆత్మగౌరవం, ఆత్మస్థైర్యం పెరుగుతుంది. అది జరగాలనే తపనతోనే మీ బిడ్డ ఒక యజ్ఞాన్ని చేస్తున్నాడు.
>
> \- కడప సభలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు, సాక్షి, తిరుపతి, సాక్షి ప్రతినిధి, కడప: 'మీరంతా ఐదేళ్ల కోసం అధికారం ఇస్తే 57 నెలలకే మీ బిడ్డ గొంతు నొక్కేస్తున్నారు! వీళ్ల దుర్మార్గాలు, కుట్రలు ఏ స్థాయిలో ఉన్నాయంటే జగన్‌కు ఎక్కడ ప్రజల్లో మంచి పేరు వస్తుందోననే ఆందోళనతో ఇంటికే వచ్చే పెన్షన్‌కు కూడా అడ్డుపడి రానివ్వకుండా చేస్తున్నారు. మీ బిడ్డ బటన్లు నొక్కి రెండు నెలలైంది. ఎన్నికల కోడ్ రాకముందే బటన్లు నొక్కినా ఎక్కడ అక్కచెల్లెమ్మలకు డబ్బులు వెళ్లిపోతాయో, ఎక్కడ జగన్‌ను వాళ్లంతా మంచివాడు అని అనుకుంటారేమోనని అది కూడా అడ్డుకుంటున్న దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉన్నారు. నా అక్కచెల్లెమ్మలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పథకాల డబ్బులు అందాలని ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న మీ బిడ్డ కోర్టుకు వెళ్తున్నాడంటే ఈ వ్యవస్థ ఏ స్థాయిలో దిగజారిపోయిందో ఆలోచన చేయండి. బాగా ముదిరిపోయిన తొండ లాంటి చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారు. ఒకవైపు ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామన్న బీజేపీతో జత కట్టి మరోవైపు మైనార్టీల ఓట్ల కోసం కపట ప్రేమ నటిస్తున్నారు' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరి, చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం పుత్తూరు, వైఎస్సార్ జిల్లా కడపలోని వన్‌టౌన్ సమీపాన మద్రాస్ రోడ్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు.

విశ్వసనీయతతో అడుగులు..

మరో మూడు రోజుల్లో కురుక్షేత్ర మహాసంగ్రామం జరగబోతోంది. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి కావు. వచ్చే ఐదేళ్లు మీ ఇంటింటి అభివృద్ధి, పథకాల కొనసాగింపును నిర్ణయించబోయే ఎన్నికలివి. జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు. మళ్లీ ఇంటింటి అభివృద్ధి. అదే పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ ముగింపు, మళ్లీ మోసపోవడమే. సాధ్యం కాని హామీలతో చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టోకు అర్థం ఇదే. చంద్రబాబుకు ఓటు వేయడం అంటే కొండ చిలువ నోట్లో తలపెట్టడమే. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. మరోవైపు మీ బిడ్డది మనసున్న ప్రభుత్వం. మీ బిడ్డ పేదవాడిని పేదవాడిగానే చూశాడు. ఏ రోజూ కులమతాలు చూడలేదు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా గత 59 నెలల కాలంలో 130సార్లు బటన్లు నొక్కి వివిధ పథకాల ద్వారా రూ.2.70 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లో జమ చేశాడు. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. గతంలో రాష్ట్రంలో నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఉంటే మీ బిడ్డ ఏకంగా మరో 2.31 లక్షల ఉద్యోగాలు కొత్తగా ఇచ్చాడు. 1.30 లక్షల మంది నా తమ్ముళ్లు, చెల్లెమ్మలే సచివాలయాల్లో కనిపిస్తున్నారు. ఎన్నికలు ముగిశాక మేనిఫెస్టోను చెత్తబుట్టలో పారేసే సంస్కృతికి తెర దించి ఏకంగా 99 శాతం హామీలను అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్నాం. విశ్వసనీయతకు అర్థం చెప్పాం మన మేనిఫెస్టోను గడపగడపకూ పంపించి మీరే టిక్ పెట్టాలని కోరుతూ అక్కచెల్లెమ్మల ఆశీర్వాదం తీసుకున్నాం. మేనిఫెస్టోకి విశ్వసనీయత తెచ్చిన ఇలాంటి కార్యక్రమం గతంలో ఎప్పుడైనా జరిగిందా ?

మచ్చుకు కొన్ని గడగడా చెబుతా..

మన ప్రభుత్వం తెచ్చిన కొన్ని పథకాలు మచ్చుకు కొన్ని గడగడా చెబుతా. 'నాడు–నేడు'తో బాగుపడ్డ గవర్నమెంట్ బడులు, ఇంగ్లిష్ మీడియం, 6వ తరగతి నుంచే ఐఎఫ్‌పీలతో డిజిటల్ బోధన, 8వ తరగతికి రాగానే ట్యాబ్‌లు, 3వ తరగతి నుంచి టోఫెల్ క్లాసులు, సబ్జెక్టు టీచర్లు, సీబీఎస్ఈ నుంచి ఏకంగా ఐబీ దాకా ప్రయాణం, బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్, బడులు తెరవగానే విద్యాకానుక, రోజుకో రుచికరమైన మెనూతో గోరుముద్ద, పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ అమ్మఒడి, పూర్తి ఫీజులు చెల్లిస్తూ జగనన్న విద్యాదీవెన, ఖర్చుల కోసం వసతి దీవెన లాంటి వినూత్న పథకాలు, కార్యక్రమాలు గతంలో ఉన్నాయా? ఉన్నత విద్య అభ్యసిస్తున్న 93 శాతం మంది విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో లబ్ధి చేకూరుస్తున్నాం. తొలిసారిగా అంతర్జాతీయ వర్సిటీల నుంచి ఆన్‌లైన్ సర్టిఫైడ్ కోర్సులను మన డిగ్రీలలో భాగస్వామ్యం చేయడం, తప్పనిసరి ఇంటర్న్‌షిప్ లాంటివి మీ బిడ్డ తెచ్చిన విప్లవాలు కావా? ఈ రోజు ఒకటో తరగతి ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్న పిల్లవాడు 2035లో ఐబీ సర్టిఫికెట్‌తో పదో తరగతి పాస్ అవుతాడు. ఆ తర్వాత ఏ హార్వర్డ్ నుంచో, ఎల్ఎస్సీ, స్టాన్‌ఫర్డ్ నుంచో, ఏంఐటీ నుంచో సర్టిఫికెట్ కోర్సులతో డిగ్రీ పట్టా తీసుకుంటాడు. ఆ పిల్లవాడు అనర్గళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో మిమ్మల్ని ఆలోచన చేయమని కోరుతున్నా. పేదల తలరాతలు మార్చేందుకు మీ బిడ్డ వేస్తున్న అడుగులు ఎంత ముఖ్యమో, ఎంత అవసరమో ఆలోచన చేయండి.

విప్లవాత్మక పథకాలు, సేవలు..

నా అక్కచెల్లెమ్మలు సొంత కాళ్లపై నిలబడి ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తంతోపాటు వారి పేరిటే ఏకంగా 31లక్షల ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాం. 22లక్షల గృహ నిర్మాణాలను సైతం చేపట్టాం. అక్కచెల్లెమ్మల బాగు కోసం ఇంతగా తపించిన ప్రభుత్వాలు గతంలో ఉన్నాయా? అవ్వాతాతలకు ఇంటికే రూ.3 వేలు పెన్షన్, ఇంటి వద్దకే పౌరసేవలు, రేషన్, పథకాలు అందడం గతంలో ఎప్పుడైనా చూశారా? రైతన్నలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా, ఉచితంగా పంటల బీమా, నష్టపోతే సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ, పగటిపూటే 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు, చేయిపట్టుకుని నడిపించే ఆర్బీకేలు లాంటి కార్యక్రమాలు గతంలో జరిగాయా? స్వయం ఉపాధికి తోడుగా ఉంటూ వాహనమిత్ర, నేతన్ననేస్తం, మత్స్యకార భరోసా, చిరువ్యాపారులకు తోడు, చేదోడు, లాయర్ల కోసం లా నేస్తం పథకాలను తెచ్చాం. ఏ పేదవాడు వైద్యం కోసం అప్పులపాలయ్యే పరిస్థితి రాకూడదని ఆరోగ్యశ్రీని విస్తరించి రూ.25 లక్షల వరకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తున్నాం. విశ్రాంతి సమయంలో ఆరోగ్య ఆసరా కూడా ఇస్తున్నాం. గ్రామంలోనే విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, ప్రతి ఇంటినీ జల్లెడ పడుతూ ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాలతో ప్రజారోగ్యంపై ఇంతగా ధ్యాస పెట్టిన ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడైనా చూశారా? ఇవాళ ఏ గ్రామానికి వెళ్లినా 600 రకాల సేవలందిస్తున్న సచివాలయాలు కనిపిస్తున్నాయి. 60–70 ఇళ్లకు ఇంటికే వచ్చి సేవలందించే వలంటీర్లు, నాడు–నేడుతో బాగుపడ్డ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, గ్రామంలోనే ఫైబర్ గ్రిడ్, నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీలు, అక్కచెల్లెమ్మలకు భద్రతగా గ్రామంలోనే మహిళా పోలీసు, దిశ యాప్ లాంటివి తీసుకొచ్చాం. 14 ఏళ్ల పాటు పరిపాలన చేశానని చెప్పుకునే చంద్రబాబు పేరు చెబితే ఏ పేదవాడికైనా ఒక్క పథకమైనా గుర్తుకొస్తుందా?

ముస్లింలకు మీ జగన్ ఇస్తున్న మాట...

బాగా ముదిరిపోయిన తొండ లాంటి చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారు. ఒకపక్క 4 శాతం ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని శపథం చేసిన బీజేపీతో జత కట్టి ఎన్డీఏలో కొనసాగుతూ మరోపక్క మైనారిటీల ఓట్ల కోసం దొంగ ప్రేమ నటిస్తున్నాడు. ఇంత మోసాలు, ఇలాంటి దగుల్బాజీ రాజకీయాలు చేసే వ్యక్తి ప్రపంచ చరిత్రలో ఎవరైనా ఉంటారా? ఆరు నూరైనా సరే ముస్లిం మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్లు ఉండి తీరాల్సిందే. ఇది మీ జగన్, మీ వైఎస్సార్ బిడ్డ ఇస్తున్న మాట. మరి చంద్రబాబుకు ప్రధాని మోదీ సమక్షంలో ఇదే మాట చెప్పే ధైర్యముందా? వారు మైనారిటీ రిజర్వేషన్లకు వ్యతిరేకం అని చెప్పినా కూడా చంద్రబాబు ఎందుకు ఎన్డీఏలో కొనసాగుతున్నాడు? మైనారిటీ రిజర్వేషన్లు అంటే చాలు రాజకీయాలు చేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందరికీ అర్థం కావటానికి మీ అందరి సమక్షంలో ఒక విషయం చెబుతున్నా. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు మతం ప్రాతిపదికగా ఇచ్చినవి కాదు. ముస్లింలలో కూడా ఉన్నత వర్గాలకు రిజర్వేషన్లు వర్తింపచేయటం లేదు. పఠాన్లు, సయ్యద్‌లు, మొఘల్‌లకు వర్తించడం లేదు. ఇవి కేవలం వెనకబాటుతనం ప్రాతిపదికగా ఇస్తున్న రిజర్వేషన్లు. అన్ని మతాల్లోనూ బీసీలు, ఓసీలు ఉంటారు. మరి అలాంటప్పుడు మైనారిటీలను వేరుగా చూడటం ధర్మమేనా? రాజకీయాల కోసం వారి జీవితాలతో చెలగాటం ఆడటం న్యాయమేనా? ఎట్టి పరిస్థితిలోనూ ఈ 4శాతం రిజర్వేషన్లు కచ్చితంగా కొనసాగుతాయి. ఇవే కాదు.. ఎన్ఆర్‌సీ, సీఏఏతో సహా ఏ విషయంలోనైనా మైనారిటీల మనోభావాలు, వారి ఇజ్జత్ ఔర్ ఇమాన్‌కు అండగా ఉంటాం. డీబీటీ స్కీమ్‌లే కాకుండా ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం, షాదీ తోఫా, ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటించడం, నలుగురు మైనారిటీలను ఎమ్మెల్సీలుగా, నలుగురు మైనార్టీలను ఎమ్మెల్యేలను గెలిపించుకోవడం, నా మైనారిటీ సోదరుడికి ఉప ముఖ్యమంత్రి పదవి, నా మైనారిటీ సోదరికి శాసన మండలి ఉపాధ్యక్షురాలి పదవులు ఇచ్చి గౌరవించాం. మైనారిటీ సబ్ ప్లాన్ బిల్లు తేవడం మొదలు ప్రతి సందర్భంలోనూ సముచిత స్థానం కల్పించాం. ఆ దివంగత నేత, నాన్నగారు వైఎస్ రాజశేఖరరెడ్డి మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్లు ఇచ్చి రెండు అడుగులు ముందుకు వేస్తే.. ఆయన బిడ్డ మీ జగన్ మరో నాలుగు అడుగులు ముందుకేసి 7 ఎమ్మెల్యే స్థానాలు మైనార్టీలకు ఇవ్వడం ద్వారా 4శాతం రాజకీయ రిజర్వేషన్లు కూడా ఇచ్చినట్లయ్యింది.

మన అభ్యర్థులను దీవించండి

మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.లావణ్య, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్కే రోజా, చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డప్ప, కడప ఎమ్మెల్యే అభ్యర్థి అంజాద్ బాష, కడప ఎంపీగా పోటీ చేస్తున్న నా తమ్ముడు వైఎస్ అవినాష్‌రెడ్డిని మీరంతా ఆశీర్వదించి గొప్ప మెజార్టీలతో గెలిపించాలని కోరుతున్నా.

మీ బిడ్డ ఎన్నికల కోసం ఏదీ చేయలేదు..

వీళ్ల దుర్మార్గాలు, కుట్రలు ఏ స్థాయిలో ఉన్నాయంటే... అవ్వాతాతలకు మొన్నటి వరకు ఇంటికే వచ్చే పెన్షన్‌కు కూడా అడ్డుపడి రానివ్వకుండా చేసిన దౌర్భాగ్యులు వీళ్లు! మీ బిడ్డ చేసిందేదీ ఎన్నికల కోసం చేయలేదు. మీ బిడ్డ ఏదీ ఎన్నికలకు రెండు నెలల ముందు, మూడు నెలల ముందు చేసిన దాఖలాలు లేవు. మీ బిడ్డ ఏం చేసినా ముందే కేలండర్ ప్రకటించి ఇదిగో ఈ నెలలో రైతుభరోసా, అమ్మఒడి, చేయూత ఇస్తామని చెప్పి క్రమం తప్పకుండా ఐదేళ్లుగా అందించాడు. సాధారణంగా ఎవరైనా మోసం చేస్తే చీటింగ్ కేసు పెడతాం. ఛీటర్ అంటాం. దొంగతనం చేస్తే దొంగోడు అని కేసు పెడతాం. మరి ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మేనిఫెస్టో అంటూ అందమైన హామీలిచ్చి మన జీవితాలతో ఆడుకుంటున్న వాళ్ల మీద ఎలాంటి కేసులు పెట్టాలి? పట్టపగలే ఇంత దారుణంగా ప్రజలను మోసం చేస్తున్నారు.

మంగళగిరి బీసీలదే

మంగళగిరి సీటు బీసీలది.. వెనుకబడిన వర్గాలది. గతంలో నేను ఆర్కేకు ఇచ్చా. ఈసారి మాత్రం మనం ఈ సీటును త్యాగం చేయాలని ఆర్కేకు చెప్పా. మనం బీసీలకు సీటు ఇస్తే... అటువైపు వాళ్లంతా డబ్బు మూటలతో నెగ్గేందుకు ప్రయత్నిస్తున్నారు. మీ బిడ్డ మాదిరిగా చంద్రబాబు ఎక్కడా బటన్లు నొక్కలేదు కాబట్టి ఆయన దగ్గర బాగా డబ్బులున్నాయి. అందుకని ఓటుకు రూ.5 వేలు కూడా ఇస్తానంటాడు. ఆయన డబ్బులిస్తే వద్దనకుండా తీసుకోండి. అదంతా మన దగ్గర దోచేసిన సొమ్మే. కానీ ఓటేసేటప్పుడు మాత్రం ఎవరి వల్ల మీకు మంచి జరిగిందో ఆలోచించండి. ఎవరు ఉంటే ఈ మంచి కొనసాగుతుందో ఆలోచన చేయండి. మీ అందరికీ మంచి చేసిన ఫ్యాను ఇంట్లోనే ఉండాలి. చెడు చేసిన సైకిల్ ఇంటి బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ సింక్‌లోనే ఉండాలి. వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, అవ్వాతాతల పెన్షన్ మళ్లీ ఇంటికే రావాలన్నా, బటన్లు నొక్కిన పథకాల సొమ్ము నా అక్కచెల్లెమ్మల ఖాతాలకి రావాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు, వివక్ష లేని పాలన కొనసాగాలన్నా, పేదల భవిష్యత్, తలరాతలు మారాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా, మన వ్యవసాయం, మన వైద్యం మెరుగుపడాలన్నా ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కాలి.

2014 బాబు విఫల హామీల్లో ముఖ్యమైనవి

- రూ.87,612కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ అయ్యాయా? రూ.14,205కోట్ల పొదుపు రుణాల్లో ఒక్క రూపాయి మాఫీ చేశాడా?
- ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకులో డిపాజిట్ చేస్తామన్నారు. ఎవరికైనా రూపాయి ఇచ్చాడా?
- ఇంటికో ఉద్యోగం లేదంటే నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. ఈ లెక్కన ఐదేళ్లలో ఏ ఇంటికైనా రూ.1.20 లక్షలు ఇచ్చాడా ?
- అర్హులందరికీ మూడు సెంట్లు స్థలం, పక్కా ఇళ్లు ఇస్తామన్నాడు. ఏ ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చాడా?
- రూ.10వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్, చేనేత పవర్ లూమ్స్ రుణాల మాఫీ హామీ అమలైందా? ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా?
- సింగపూర్‌ని మించి అభివృద్ధి, ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మాణం జరిగిందా? మంగళగిరి, నగరిలో ఎవరికైనా కనిపిస్తున్నాయా?
- ప్రత్యేక హోదా తేకపోగా అమ్మేశాడు.
- అదే ముగ్గురు ఇప్పుడు మళ్లీ కూటమిగా ఏర్పడి సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, ఇంటింటికీ కేజీ బంగారం, బెంజ్ కారు అంటూ నమ్మబలుకుతున్నారు.



పుత్తూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

నేడు సీఎం జగన్ ఎన్నికల ప్రచారం ఇలా..

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు నరసరావుపేట లోక్‌సభ స్థానం పరిధిలోని చిలకలూరిపేటలో ఉన్న కళామందిర్ సెంటర్‌లో జరిగే ఎన్నికల ప్రచార సభలో సీఎం జగన్ పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని కైకలూరులో ఉన్న తాలూకా ఆఫీస్ సెంటర్‌లో జరిగే సభకు హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం 3గంటలకు కాకినాడ లోక్‌సభ స్థానం పరిధిలోని పిఠాపురంలో ఉన్న ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో జరిగే సభలో సీఎం జగన్ పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.


మంగళగిరిలో సీఎం వైఎస్ జగన్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజలు



మంగళగిరిలో సీఎం జగన్‌కే నా ఓటు అంటూ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న లబ్ధిదారురాలు


మేమంతా సిద్ధం అంటూ కడపలో నినదిస్తున్న ప్రజలు


మంగళగిరిలో మేమంతా సిద్ధం అంటూ నినదిస్తున్న ప్రజలు


మంగళగిరిలో ఓ వ్యక్తి భుజాలపై నిలుచున్న అభిమాని

కదిలించిన కడప చైతన్యం

కడప ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- దేశంలోని వ్యవస్థలన్నీ మీ బిడ్డ మీద ప్రయోగించిన వారితో కలిసిపోయినోళ్లు వైఎస్సార్ వారసులా?
- కాంగ్రెస్‌కి ఓటు వేస్తే వైఎస్సార్ పేరు కనపడకుండా చేసే కుట్రలో భాగస్తులం అయినట్లే
- ఆ పార్టీకి రాష్ట్ర ప్రజలు, వైఎస్సార్ అభిమానులు ఏనాడో సమాధి కట్టారు
- వారంతా ఇన్నేళ్లకు ఇడుపులపాయకు ఎందుకు వస్తున్నారో ఆలోచించండి
- కడప జిల్లాలో రాజకీయ వ్యాక్యూమ్ క్రియేట్ చేసి అందులోకి చొరబడే కుట్రలు



అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగనే రావాలి అంటూ కడపలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న ప్రజలు



మంగళగిరిలో ఓ అభిమాని ప్రదర్శన

సాక్షి ప్రతినిధి, కడప: ''ఈరోజు కడప జిల్లా రాజకీయాల్లో ఏం జరుగుతోందో మీ అందరికీ తెలుసు. కడప జిల్లాలో ఉన్నంత రాజకీయ చైతన్యం రాష్ట్రంలో బహుశా అతి కొద్ది జిల్లాలకు మాత్రమే ఉంటుంది. ఎందుకంటే నాకు బాగా గుర్తుంది.. నాన్నగారు చనిపోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ నన్ను ఏ విధంగా ఇబ్బందులు పెట్టిందో మీరంతా చూశారు. ఆ సమయంలో మీ బిడ్డ ఇదే కడప గడ్డ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించాక సింబల్ వచ్చి కేవలం 14 రోజులు మాత్రమే అయినా మీ బిడ్డతో మీరంతా నిలబడి 5,45,000 మెజారిటీ ఇచ్చారు. మీరు ఇచ్చిన ఆ రికార్డు మెజారిటీతో మీ బిడ్డ ఆరోజు ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేస్తుంటే పార్లమెంట్ భవనంలో ఉన్న ప్రతి తలకాయ కూడా ఎవరీ జగన్? అని చూసింది. అంతటి చైతన్యం ఉన్న జిల్లా నా కడప'' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప వన్‌టౌన్ సమీపంలోని మద్రాస్ రోడ్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు.

ఎవరు నిర్ణయించాలి?

ఇటువంటి కడప రాజకీయాన్ని మన ప్రజలు, వైఎస్సార్ మీద అభిమానం ఉన్న వారు నిర్ణయించాలా? లేక ఆ పేరే కనపడకుండా చేయాలని ప్రయత్నిస్తున్న వైఎస్సార్ శత్రువులు నిర్ణయించాలా? అనేది మీరంతా ఆలోచన చేయాలని కోరుతున్నా. నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చిన పార్టీలతో, రాష్ట్ర విభజన చేసిన దుర్మార్గులతో మన ప్రజలు జత కట్టాలా? అని మీ బిడ్డ అడుగుతున్నాడు. రాజకీయంగా వైఎస్సార్ కుటుంబాన్ని అణగదొక్కాలని దేశంలో ఉన్న అన్ని వ్యవస్థలను మీ బిడ్డ మీద ప్రయోగించిన వారితో కలిసిపోయి.. అదే కాంగ్రెస్, అదే టీడీపీతో ప్రత్యక్షంగా ఒకరితో, పరోక్షంగా ఇంకొకరితో కలిసిపోయి వైఎస్సార్ అనే పేరే కనపడకుండా చేయాలనే కుట్రలో వీరందరూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్న ఇలాంటి వాళ్లా వైఎస్సార్ వారసులు?

దుర్మార్గంగా అబద్ధాల ప్రచారం...

వైఎస్సార్ మరణం తర్వాత ఆయన పేరును, ఆ కీర్తి ప్రతిష్ఠలను సమాధి చేయాలని చూసిన పార్టీ, ఆయన పేరును ఛార్జ్‌షీట్‌లో పెట్టిన పార్టీ ఆయన కుమారుడిని అన్యాయంగా 16 నెలలు జైల్లో పెట్టింది. ఆ 16 నెలలు నాకు ఎవరు ఇస్తారు? ఇంత అన్యాయంగా జైల్లో పెట్టిన పార్టీ ఇప్పుడు రాజకీయ స్వార్థం కోసం మరింత బరి తెగించింది. ఆ ఛార్జ్‌షీట్‌లో నాన్నగారి పేరును మనంతట మనమే పెట్టించామట! ఇంత దుర్మార్గంగా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారంటే అసలా పార్టీకి మానవతా విలువలు ఉన్నాయా? ఆ పార్టీకి కృతజ్ఞత అనే పదానికి అర్థం తెలుసా?

రాజకీయ శూన్యత సృష్టించి...

నా పక్కన అవినాష్ ఉన్నాడు. నాకన్నా 13 ఏళ్ల చిన్నోడు. మా అందరికన్నా చిన్న పిల్లోడు. ఈ పిల్లోడి జీవితం నాశనం చేయడం కోసం చంద్రబాబు దగ్గర నుంచి కుట్రలు పన్నుతున్నారు. ఈనాడు నుంచి ఆంధ్రజ్యోతి, టీవీ 5 దాకా కుట్రలు పన్నుతున్నారు. కడప జిల్లాలో ఒక రాజకీయ వ్యాక్యూమ్ క్రియేట్ చేసి అందులోకి వాళ్లు రావాలని కుట్రలు పన్నుతూ ఈ పిల్లాడి జీవితం నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్న వీళ్లంతా మనుషులేనా? అవినాష్ ఎలాంటి వాడో మీకు, నాకు తెలుసు. అవినాష్ మీద నాకు, మీ అందరికీ నమ్మకం ఉంది. అవినాష్‌ను గొప్ప మెజారిటీతో గెలిపించమని మీ అందరినీ కోరుతున్నా.

ఇన్నేళ్లకు ఇడుపులపాయకు..

నాన్న 2009లో హఠాన్మరణం పాలైతే ఆ తర్వాత వైఎస్సార్ కుటుంబాన్ని వాళ్లు ఏ రకంగా ఇబ్బందులు పెట్టారో మీ అందరికి తెలుసు. ఇన్ని సంవత్సరాల తర్వాత ఇప్పుడు నాన్న సమాధి దగ్గరకి వాళ్లు వస్తారట! ఇడుపులపాయ దగ్గరకు వస్తారట! చూడటానికి వస్తారట! ఢిల్లీ నుంచి వస్తారట! ఇన్నేళ్ల తర్వాత ఎన్నికల వేళ వస్తారట..! ఎన్నికల కోసం వస్తారట! ఆ పార్టీకి ఆంధ్రప్రదేశ్ ప్రజలు, వైఎస్సార్ అభిమానులు ఏనాడో సమాధి కట్టారు. కాంగ్రెస్‌కి ఓటు వేస్తే వైఎస్సార్ పేరు కనపడకుండా చేసే కుట్రలో భాగస్తులం అయినట్లే. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మన కళ్లను మనమే పొడుచుకున్నట్లే. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అది నేరుగా మన ఓట్లను చీల్చి టీడీపీని, ఎన్డీఏని గెలిపించడం కాదా?


పుత్తూరులో కేరింతలు కొడుతున్న యువత

పగలు బీజేపీతో, రాత్రి కాంగ్రెస్‌తో కాపురం..

ఎన్నికల వేళ వీళ్లు ఎందుకు మన రాష్ట్రానికి వస్తున్నారో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయండి. చంద్రబాబును గెలిపించడం కోసం ఏ రకంగా కుట్రలు జరుగుతున్నాయో గమనించండి. చంద్రబాబును గెలిపించడం కోసం, మన ఓట్లను చీల్చడం కోసం ఈరోజు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో రంగప్రవేశం చేసింది. చంద్రబాబు రాజకీయాలు ఎలా ఉన్నాయో చూడండి. ఇదే చంద్రబాబు మనిషి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ముఖ్యమంత్రి. ఈ పెద్దమనిషి చంద్రబాబు పట్టపగలు బీజేపీతో కాపురం చేస్తాడు, రాత్రి పూట కాంగ్రెస్‌తో కాపురం చేస్తాడు! రాజకీయాలు ఎంత దిగజారిపోయాయో గమనించండి. నాన్నగారు బతికున్నప్పుడు ఎవరితో విబేధించి యుద్ధం చేశారో, ఆయన్ను అభిమానించే ప్రతి కార్యకర్తా ఎవరితో యుద్ధం చేశారో, ఇవాళ వైఎస్సార్ వారసులు అని చెప్పుకుంటున్న వాళ్లు అదే ఈనాడుతో, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణతో, చంద్రబాబుతోనూ చెట్టాపట్టాలు వేసుకుని వాళ్లను గెలిపించడం కోసం మన ఓట్లను చీల్చే యత్నం చేస్తున్నారంటే ఇంతకంటే హేయమైన రాజకీయాలు రాష్ట్ర చరిత్రలో ఉంటాయా?

క్లుప్తంగా...

మాదిగలను దూరం చేసే కుట్ర: రావెల



సాక్షి,అమరావతి: మాదిగలను వైఎస్సార్‌సీపీకి దూరం చేయాలని చంద్రబాబు కుట్ర చేస్తున్నారని.. అందుకే కోర్టులో ఉన్న వర్గీకరణ అంశం గురించి అసత్యాలు మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు అన్నారు. శుక్ర వారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే వర్గీకరణ చేస్తామని బాబు నమ్మబలుకుతున్నారని, 14 ఏళ్లు సీఎంగా ఉండి కూడా వర్గీకరణ ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు.

పేదలపై చంద్రబాబుకు కక్ష

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి



మహారాణిపేట: పేదల పట్ల చంద్రబాబు కక్ష పూరితంగా వ్యవహరిస్తాడని మరోసారి రుజువైందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పెన్షన్ల పంపిణీని చంద్రబాబు అడ్డుకోవడంతో రాష్ట్రంలో ఎంతమంది వృద్ధులు మరణించారో ప్రజలంతా చూశారన్నారు. తాజాగా ఇన్‌పుట్ సబ్సిడీ, చేయూత, విద్యాదీవెనలాంటి పథకాలకు నిధులు విడుదల చేయకుండా బాబు తన అనుచరులతో ఈసీకి ఫిర్యాదు చేయించి అడ్డుకున్నారని ధ్వజమెత్తారు.

పేదలకు నిధులందకుండా ఈసీపై బాబు ఒత్తిడి

- వైఎస్సార్‌సీపీ నేత వాసిరెడ్డిపద్మ



సాక్షి, అమరావతి: డీబీటీ నిధులను కోర్టు విడుదల చేయమంటే మళ్లీ ఈసీ మీద చంద్రబాబు ఒత్తిడి చేయడమేంటని వైఎస్సార్‌సీపీ నేత, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ నిలదీశారు. పేద ప్రజల మీద చంద్రబాబుకు ఎందుకు అంత కోపం అంటూ మండిపడ్డారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పేదలకు నిధులందితే వారు టీడీపీకి ఓటెయ్యరని చంద్రబాబు భయపడుతున్నారని చెప్పారు. ఎన్నికల సంఘం కాళ్లు, చేతులు కట్టేసేలా చంద్రబాబు ఎందుకు ఒత్తిడి చేస్తున్నారని ప్రశ్నించారు.

సునీత, రాజశేఖర్‌రెడ్డి, రాంసింగ్‌లకు గట్టి ఎదురుదెబ్బ

- పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ
- కేసు కొట్టివేత కోసం వారు వేసిన పిటిషన్లు కొట్టేస్తూ తీర్పు
- తీవ్ర నేరారోపణలకు ప్రాథమిక ఆధారాలున్నాయన్న న్యాయస్థానం
- సీబీఐ అధికారి రాంసింగ్ తీరును ఎండగట్టిన జస్టిస్ శ్రీనివాసరెడ్డి
- తప్పుడు సాక్ష్యం ఇవ్వాలని కృష్ణారెడ్డిని బెదిరించారు
- అందువల్ల ఆయన ప్రాసిక్యూషన్‌కు అనుమతి అవసరం లేదని వ్యాఖ్య

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, అప్పటి సీబీఐ దర్యాప్తు అధికారి రాంసింగ్‌లకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వారిపై పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేసేందుకు హైకోర్టు నిరాకరించింది. కేసు కొట్టివేత కోసం సునీత, రాజశేఖర్‌రెడ్డి, రాంసింగ్‌లు వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలను కొట్టేసింది. కేసు నమోదుకు కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తీర్పు వెలువరించారు. న్యాయమూర్తి తన తీర్పులో వివేకా హత్య కేసులో రాంసింగ్ వ్యవహరించిన తీరును ఎండగట్టారు. వివేకా పీఏ కృష్ణారెడ్డిని తప్పుడు సాక్ష్యం ఇవ్వాలంటూ ఒత్తిడి చేశారని, ఇది ఖచ్చితంగా విధుల కిందకు రాదని న్యాయమూర్తి తేల్చిచెప్పారు. అందువల్ల సీఆర్‌పీసీ సెక్షన్ 197 ప్రకారం రాంసింగ్ ప్రాసిక్యూషన్‌కు ఎలాంటి అనుమతి అవసరం లేదన్నారు.

తప్పుడు సాక్ష్యం ఇవ్వాలని ఒత్తిడి చేశారు..

'వివేకా హత్యతో సంబంధం లేని వారిని ఆ కేసులో ఇరికించేందుకు సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద మేజిస్ట్రేట్ ముందు తప్పుడు సాక్ష్యం చెప్పాలని కృష్ణారెడ్డిపై రాంసింగ్ తీవ్ర ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలున్నాయి. కృష్ణారెడ్డి రెండో కుమారుడి వివాహం జరగకుండా ఆయనను రాంసింగ్ బెదిరించారు. ఇందుకు అనుగుణంగానే సునీత, రాజశేఖర్‌రెడ్డి పెళ్లి కూతురు తల్లిదండ్రులను పిలిచి బెదిరించారు. దీంతో కృష్ణారెడ్డి కుమారుడి వివాహం ఆగిపోయింది. రాంసింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డి కుట్రపూరితంగా కృష్ణారెడ్డికి వ్యతిరేకంగా నేరం చేశారని కనిపిస్తోంది. ప్రాసిక్యూషన్ నుంచి నిజాయితీపరులైన, సమర్థవంతులైన అధికారులను రక్షించేందుకే ముందస్తు అనుమతి అవసరం. అయితే ప్రస్తుత కేసులో తప్పుడు సాక్ష్యం ఇవ్వాలంటూ కృష్ణారెడ్డిపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలు రాంసింగ్‌పై ఉన్నాయి. ఈ చర్యలు ఖచ్చితంగా ప్రభుత్వ అధికారి విధి నిర్వహణలో భాగం కాదు. పోలీసులు క్రూరమైన హింసకు పాల్పడటం పౌరుల మనస్సుల్లో తీవ్ర భయాన్ని కలిగిస్తుంది. క్షేత్రస్థాయి వాస్తవాలను మరిచి వ్యవహరించడం వల్ల సామాన్యులకు న్యాయం అందకుండా పోతుంది' అని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాంసింగ్‌ను దర్యాప్తు అధికారి బాధ్యతల నుంచి సుప్రీం కోర్టు తొలగించిన విషయాన్ని న్యాయమూర్తి ప్రముఖంగా ప్రస్తావించారు.

సునీత తదితరులపై ప్రాథమిక ఆధారాలున్నాయి..

సునీత తదితరులపై ఉన్న తీవ్ర నేరారోపణలకు ప్రాథమిక ఆధారాలున్నాయని, అయితే ఈ నేరారోపణల్లో నిజం ఉందా? లేదా? అన్నది అంతిమంగా కోర్టు ట్రయల్‌లో తేలుతుందని జస్టిస్ శ్రీనివాసరెడ్డి తన తీర్పులో పేర్కొన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ 156(3) కింద మేజిస్ట్రేట్ తగిన కారణాలను తెలపకుండానే ఉత్తర్వులు జారీ చేయడం వల్ల నిందితులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడదన్నారు. ఎందుకంటే పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశారని తెలిపారు. చార్జిషీట్‌లో సునీత, రాజశేఖర్‌రెడ్డి, రాంసింగ్‌లపై తీవ్ర నేరారోపణలున్నాయని, అవి చాలా తీవ్రమైనవన్నారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వుల్లో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని తేల్చిచెబుతూ రాంసింగ్, సునీత తదితరుల పిటిషన్లను కొట్టేశారు. వివేకా హత్య విషయంలో తాము చెప్పినట్లు వినకుంటే అంతుచూస్తామంటూ బెదిరించడమే కాకుండా తనను శారీరకంగా, మానసికంగా వేధించారంటూ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన కోర్టు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు పులివెందుల పోలీసులు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రాంసింగ్‌లపై కేసు నమోదు చేశారు. పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ సునీత, రాజశేఖరరెడ్డి, రాంసింగ్‌లు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

నేటితో ప్రచారానికి తెర

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ప్రచారంతో హోరెత్తించిన రాజకీయ పార్టీల మైకులు మూగబోనున్నాయి. మే 13న జరిగే పోలింగ్‌కు 48 గంటల ముందు ఎటువంటి ప్రచారం లేకుండా నిశ్శబ్ద కాలం అమల్లో ఉంటుంది. ఈ సమయంలో ఎటువంటి సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ ప్రచురించడం, ప్రసారం చేయకూడదు. పోలింగ్ ప్రక్రియ దగ్గరపడటంతో వచ్చే 72 గంటల్లో అధికారులు చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా ఆదేశాలు జారీ చేశారు. హింసకు, రీ పోలింగ్‌కు తావు లేకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్లు, ఎస్పీలను మీనా ఆదేశించారు. ఆ ఆదేశాల్లో పేర్కొన్న ప్రకారం. 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుండి నిశ్శబ్ద కాలం (సైలెంట్ పీరియడ్) అమల్లోకి వస్తుంది. ఆ సమయంలో ఎన్నికల ప్రచారానికి పూర్తిగా తెరపడుతుంది. చట్టవిరుద్ధమైన సమావేశాలపై నిషేధం ఉంటుంది. పోలింగ్ ముగింపు సమయం ఆధారంగా మద్యం దుకాణాలకు 48 గంటల డ్రై డే నవరించబడుతుంది. నియోజకవర్గం వెలుపల నుంచి ప్రచారం నిమిత్తం తీసుకువచ్చిన, నియోజకవర్గ ఓటర్లు కాని రాజకీయ కార్యకర్తలు/పార్టీ కార్యకర్తలు అంతా ప్రచార సమయం ముగిసిన వెంటనే నియోజకవర్గం నుంచి వెళ్లిపోవాలి. 48 గంటల వ్యవధిలో ఓటర్లు కాని ఇతర వ్యక్తులు స్థానిక లాడ్జిలు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లు మొదలైన వాటిలో లేరని అధికారులు నిర్ధారించుకోవాలి.

ఏజెంట్ల జాబితా ఇవ్వాల్సిన అవసరం లేదు

పోలింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియపై ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ ఏజెంట్ల నియామక జాబితాను రిటర్నింగ్ అధికారికి ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. పోలింగ్ తేదీ రోజు ప్రిసైడింగ్ అధికారికి పోలింగ్ ఏజెంట్ తమ వివరాలు సమర్పించి విధులకు హాజరు కావచ్చు.

చంద్రబాబు–షర్మిల మిలాఖత్

- టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి ప్రయోజనం చేకూర్చేలా ప్రచారం
- సీఎం జగన్‌పై చంద్రబాబు గ్యాంగ్ చిమ్ముతున్న విషాన్నే వెదజల్లుతున్న పీసీసీ చీఫ్ షర్మిల
- చంద్రబాబు సూచించిన మేరకే అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక
- ప్రతిఫలంగా కడప లోక్‌సభ స్థానంలో షర్మిలకు టీడీపీ-బీజేపీ ఓట్లు బదలాయించేలా లోపాయికారి ఒప్పందం
- అందులో భాగంగానే డమ్మీ అభ్యర్థిని బరిలోకి దించిన బాబు

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోవడానికి బెంబేలెత్తిపోయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేన, బీజేపీలతో జతకట్టి.. చివరికి పీసీసీ చీఫ్ షర్మిలతోనూ మిలాఖత్ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్‌పై దుష్ప్రచారం చేసి, తాను సూచించిన అభ్యర్థులను కాంగ్రెస్ తరఫున బరిలోకి దించేలా బాబు స్కెచ్ వేశారు. ఇందుకు ప్రతిఫలంగా కడప లోక్‌సభ స్థానంలో షర్మిలకు టీడీపీ–బీజేపీ ఓట్లు బదలాయించేలా వారిద్దరి మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరింది. కడప లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా సీనియర్ నేతలు ఆర్. శ్రీనివాసులురెడ్డి, మల్లెల లింగారెడ్డి వంటి వారిని కాదని ఎవరికీ పెద్దగా తెలియని భూపేష్‌రెడ్డిని చంద్రబాబు బరిలోకి దించారు. నిజానికి.. భూపేష్‌రెడ్డి చిన్నాన్న ఆదినారాయణరెడ్డి అదే లోక్‌సభ స్థానం పరిధిలోని జమ్మలమడుగు అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తుండటం గమనార్హం. ముందస్తుగా కుదిరిన లోపాయికారి ఒప్పందం మేరకు కడప లోక్‌సభ అభ్యర్థిగా డమ్మీని బరిలోకి దించిన చంద్రబాబు.. ఇప్పుడు షర్మిలకు టీడీపీ–బీజేపీ ఓట్లను బదలాయించేలా కూటమి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు–షర్మిల మధ్య కుదిరిన ఈ రహస్య ఒప్పందం చింతలపూడి నియోజకవర్గంలోనూ ప్రతిబింబిస్తోంది. ఇక్కడ టీడీపీ అభ్యర్థి రోషన్, కాంగ్రెస్ అభ్యర్థి ఎలీజా ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని ప్రచారం చేస్తుండటమే అందుకు నిదర్శనం.

దారితప్పిన బాటసారి..

నిజానికి.. తెలంగాణలో రాజకీయ శూన్యత లేకపోయినా వాస్తవాన్ని అంచనా వేయలేక.. రాజకీయంగా తనను తాను ఎక్కువగా ఊహించుకుని 2021, జూలై 8న వైఎస్సార్టీపీని షర్మిల స్థాపించారు. అదే సమయంలో.. షర్మిల, ఆమె భర్త అనిల్ వ్యక్తిత్వాలను హననం చేస్తూ గతంలో దుష్ప్రచారం చేసిన ఎల్లో మీడియా ఆమెకు అనుకూలంగా కథనాలు వండివార్చడం మొదలుపెట్టింది. వైఎస్సార్టీపీ స్థాపించడానికి కొద్ది ముందు ఇడుపులపాయలో, పులివెందులలో ఏవేవో జరిగిపోతున్నట్లుగా ఎల్లో మీడియా రాసిన విషపు రాతలను షర్మిల ఖండించలేదు. ఈ పరిణామాలన్నీ పరిశీలిస్తే.. షర్మిల ఎల్లో మీడియాతోపాటు చంద్రబాబు డైరెక్షన్‌లోనే రాజకీయ ప్రయాణం మొదలైందని అప్పట్లో రాజకీయ పరిశీలకులు విశ్లేషించారు. 'తెలంగాణలోనే నా బతుకు.. చావు ఇక్కడే'.. అంటూ వైఎస్సార్‌టీపీ స్థాపించినప్పుడు శపథం చేసిన షర్మిల.. తాను పాలేరు, మరోచోట పోటీచేస్తానని.. మొత్తం 119 స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించుతానని ప్రకటించారు. పైగా.. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటో పెట్టుకుని ఓట్లు అడగడానికి కాంగ్రెస్ నాయకులకు సిగ్గుండాలి' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీన్ కట్‌చేస్తే.. గతేడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే చంద్రబాబు డైరెక్షన్‌లో కాంగ్రెస్ పార్టీకి షర్మిల భేషరతుగా మద్దతు ప్రకటించారు. ఆ తర్వాత ఆయన ఆదేశాలతోనే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్టీపీని కాంగ్రెస్‌లో విలీనంచేసి ఆమె ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ పదవిని దక్కించుకున్నారు.

'పచ్చ'మూక విషాన్నే వెదజల్లుతున్న షర్మిల..

ఇక పీసీసీ చీఫ్ పదవి దక్కించుకున్నాక.. హైదరాబాద్ నుంచి కడపకు.. కడప నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు చంద్రబాబు బినామీ సీఎం రమేష్ (ప్రస్తుత అనకాపల్లి బీజేపీ అభ్యర్థి) స్పెషల్ ఫ్లైట్లను షర్మిల వినియోగించుకున్నారు. షర్మిల భర్త అనిల్ అయితే ఏకంగా వైఎస్ రాజకీయ శత్రువులైన బీటెక్ రవి వంటి వారితో చెట్టాపట్టాలేసుకుని తిరిగారు. మరోవైపు.. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ఇప్పటివరకు సీఎం జగన్‌పై చంద్రబాబు, పచ్చమూక చిమ్ముతున్న విషాన్నే షర్మిల కూడా వెదజల్లుతూ వస్తున్నారు. అలాగే, పొత్తులో భాగంగా సీపీఐ, సీపీఎంకు కేటాయించిన స్థానాలు మినహా మిగిలిన స్థానాల్లో చంద్రబాబు సూచించిన మేరకే షర్మిల అభ్యర్థులను ఎంపిక చేశారు. వైఎస్సార్‌సీపీ ఓట్లను చీల్చి.. టీడీపీ–బీజేపీ–జనసేన కూటమికి లబ్ధిచేకూర్చేందుకు సీఎం జగన్‌పై విషం చిమ్ముతూ రాష్ట్రవ్యాప్తంగా షర్మిల ప్రచారం చేశారు. కానీ, చంద్రబాబు పోటీచేస్తున్న కుప్పం, లోకేశ్ బరిలోకి దిగిన మంగళగిరి, పవన్ పోటీచేస్తున్న పిఠాపురంలలో అభ్యర్థులను బరిలోకి దించినా వారి తరఫున షర్మిల ప్రచారానికి వెళ్లకపోవడం కొసమెరుపు.

హైకోర్టుకన్నా మీరే ఎక్కువా?

ప్రజలు వారి సొమ్మును వారు పొందకుండా ఎందుకు అడ్డుకుంటున్నారు? సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదు?

మీ ఉత్తర్వులను అబయన్స్‌లో పెట్టిన తరువాత ప్రభుత్వాన్ని వివరణ కోరడం ఏమిటి?

గతంలో ఏపీలో పసుపు కుంకుమకు, అన్నదాత సుఖీభవకు, తెలంగాణలో రైతుబంధుకు అనుమతినిచ్చారుగా?

ఎన్నికల సంఘంపై నిప్పులు చెరిగిన సీజే ధర్మాసనం..

సాక్షి, అమరావతి: 'హైకోర్టుకన్నా మీరే ఎక్కువను కుంటున్నారా? సంక్షేమ పథకాల నిధుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఎందుకు అమలు చేయలేదు' అంటూ ఎన్నికల సంఘం (ఈసీ)పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం నిప్పులు చెరిగింది. '2019లో పసుపు కుంకుమ, అన్నదాత సుఖీభవ పథకాలకు నిధుల విడుదలకు అనుమతిచ్చారు. మొన్న తెలంగాణలో రైతు బంధు పథకానికి అనుమతించారు. ఇక్కడా అనుమతి కోరింది పాత పథకాలకే కదా! అప్పుడు పసుపు కుంకుమ, అన్నదాత సుఖీభవకు అనుమతిచ్చిన వాళ్లు ఇప్పుడెందుకు అనుమతి ఇవ్వరు' అని గట్టిగా నిలదీసింది. సంక్షేమ పథకాల అమలుకు అనుమతినిచ్చే విషయంలో ఈసీ తీరు ఆందోళన కలిగిస్తోందని, ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరించడం ఏమిటని వ్యాఖ్యానించింది. నిధుల పంపిణీకి బ్రేక్ వేస్తూ మీరు ఇచ్చిన ఉత్తర్వులను సింగిల్ జడ్జి అబయన్స్‌లో పెట్టిన తరువాత కూడా నిధుల పంపిణీకి ఎన్‌వోసీ ఇవ్వకుండా తిరిగి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలా వివరణ కోరతారని మండిపడింది. అసలు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఇలా నిధుల పంపిణీ చేయకూడదని చట్టం ఏదైనా ఉందా అని ధర్మాసనం ప్రశ్నించింది. 'సింగిల్ జడ్జి తీర్పుపై ఎన్నికల సంఘం అప్పీల్ చేసిందా? ఎన్నికల సంఘానికి లేని అభ్యంతరం మీకెందుకు' అని ధర్మాసనం పిటిషనర్‌ను ప్రశ్నించింది.



సింగిల్ జడ్జి ఉత్తర్వులపై ధర్మాసనం ముందు అప్పీల్

రాష్ట్రంలోని పేదల అభ్యున్నతికి వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాల్లో కొన్నింటికి నిధులు పంపిణీ చేయాల్సి ఉంది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఈ నిధుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఈసీ అనుమతి కోరింది. పోలింగ్ ముగిసే వరకు నిధుల పంపిణీ చేయవద్దని ఈసీ ఆదేశాలివ్వడంతో నిధుల పంపిణీ ఆగిపోయింది. ఈసీ నిర్ణయంపై పలువురు రైతులు, మహిళలు, విద్యార్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి ఈనెల 10 వరకు ఈసీ ఉత్తర్వులు అమలు చేయవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వానికి వెసులుబాటునిస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, వాటిని అమలు చేయకుండా, ఎన్‌వోసీ జారీ చేయకుండా ఈసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని మరిన్ని వివరాలు కోరింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ నవతరం పార్టీ ధర్మాసనం ముందు నాలుగు అప్పీళ్లు దాఖలు చేసింది.

సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఎలా అసాధారణం అవుతాయి?

ఈ అప్పీళ్ల గురించి నవతరం పార్టీ తరఫు సీనియర్ న్యాయవాదుల్లో ఒకరైన నాదకర్ణి సీజే ధర్మాసనం ముందు ప్రస్తావించారు. నిధుల పంపిణీకి అనుమతినిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై తక్షణమే స్టేటస్ కో ఇవ్వాలని కోరారు. ఇందుకు ధర్మాసనం నిరాకరించింది. అందరి వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వబోమని తేల్చి చెప్పింది. సింగిల్ జడ్జి రాత్రి 10.35 గంటల సమయంలో అసాధారణ ఉత్తర్వులు జారీ చేశారని నాదకర్ణి అనగా.. ఎలా అసాధారణం అవుతాయని ధర్మాసనం గట్టిగా ప్రశ్నించింది. 'సంక్షేమ పథకాల నిధులనే కదా సింగిల్ జడ్జి పంపిణీ చేయవచ్చని చెప్పింది. అందులో తప్పేముంది? ఆ పథకాలు పాతవే కదా' అని వ్యాఖ్యానించింది. ఎన్నికల సమయంలో నిధుల పంపిణీ మిగిలిన పార్టీల అవకాశాలను దెబ్బతీస్తుందని పిటిషనర్ తరఫున మరో సీనియర్ న్యాయవాది దేవ్‌దత్ కామత్ చెప్పారు. అసలు ఈ పథకాల నిధుల పంపిణీ ఎప్పటి నుంచి జరుగుతోందని ధర్మాసనం ప్రశ్నించగా ఎవరూ నేరుగా సమాధానం చెప్పలేదు.

ఇవి రాష్ట్రంలో చాలా పాపులర్ పథకాలు..

ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా, సంక్షేమ పథకాల కింద నిధుల పంపిణీకి వీల్లేదని నాదకర్ణి అన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. 'నియమావళి అమల్లో ఉండగా, పథకాలు అమలుకు ఈసీ అనుమతులు తప్పనిసరా? ఏ చట్టంలో ఉందో చెప్పాలి' అనగా.. నాదకర్ణి ఎన్నికల నియమావళి గురించి చెప్పడం మొదలు పెట్టారు. ధర్మాసనం కల్పించుకొని.. 'ఈసీ ఏదైనా ఉత్తర్వులిస్తే కోర్టులు ఏమీ చేయకూడదంటారా? కోర్టులకన్నా ఈసీ ఎక్కువని భావిస్తున్నారా?' అంటూ నిలదీసింది. ప్రస్తుతం కోర్టు ముందున్న పథకాలు పాతవని, రాష్ట్రంలో చాలా పాపులర్ పథకాలని ధర్మాసనం గుర్తు చేసింది. వాస్తవాలనే కోర్టు ముందుంచాలని స్పష్టం చేసింది. అసలు పిటిషనర్ ఏ పార్టీకి చెందిన వారని, గతంలో ఎన్నికల్లో పోటీ చేశారా? ఎన్ని సీట్లలో పోటీ చేశారని ప్రశ్నించింది. నవతరం పార్టీ ఈ అప్పీళ్లు దాఖలు చేసిందని, ఆ పార్టీ 6 ఎంపీ, 4 ఎమ్మెల్యే స్థానాల్లో పోటీ చేసిందని నాదకర్ణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సుప్రీంకోర్టు తీర్పులను ప్రస్తావించగా.. 'మీరు చెబుతున్న తీర్పులో సుప్రీంకోర్టు పాత పథకాలను కొనసాగించుకోవచ్చని, కొత్త లబ్ధిదారులకు మాత్రమే నిధులివ్వొద్దని చెప్పింది' అని ధర్మాసనం గుర్తు చేసింది. తెలంగాణలో రైతుబంధుకు ఎన్నికల సంఘం అనుమతినిచ్చిన విషయాన్ని ధర్మాసనం ప్రముఖంగా ప్రస్తావించింది. తెలంగాణలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారానే నిధుల పంపిణీ జరిగిందని, ఇక్కడ మాత్రం ఎందుకు అనుమతించరని నిలదీసింది.

మా అధికారులనే బెదిరిస్తారా?

అసలు ఈ అప్పీళ్ల దాఖలు చేసేందుకు ఎప్పటి నుంచి ప్రయత్నిస్తున్నారని ధర్మాసనం నాదకర్ణిని ప్రశ్నించింది. తనకు తెలిసినంత వరకు ఉదయం 6, 7 గంటల నుంచి అని ఆయన చెప్పారు. అది తప్పని ధర్మాసనం చెప్పింది. ఈ అప్పీల్ దాఖలులో నవతరం పార్టీ న్యాయవాదుల తీరుపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. 'సింగిల్ జడ్జి ఉత్తర్వులపై హౌస్ మోషన్ పిటిషన్ వేయాలంటూ ఫోన్ చేసి మా రిజిస్ట్రీని, మా అధికారులనే బెదిరిస్తారా? తీవ్ర పర్యవసానాలు ఉంటాయని హెచ్చరిస్తారా?' అంటూ గట్టిగా నిలదీసింది. 'మీ దెబ్బకు రిజిస్ట్రీ నాకు ఫోన్ చేసింది. ఉదయాన్నే లేచి చూస్తే రిజిస్ట్రీ నుంచి నా ఫోన్‌కు మెసేజ్‌లతో పాటు మిస్డ్ కాల్స్ ఉన్నాయి. మా రిజిస్ట్రీని మీరు ఉదయం 5 గంటలకే నిద్ర లేపుతారా? అంత ఉదయాన్నే నిద్ర లేచి మీ సేవలో ఉండాలని భావిస్తున్నారా? మేము ఆ సమయంలో నిద్ర లేచి మీ పిటిషన్‌ను హౌస్‌మోషన్ రూపంలో విచారించాలని భావిస్తున్నారా' అంటూ అసహనం వ్యక్తం చేసింది. ఇంకా నయం తనకు నేరుగా ఫోన్ చేయలేదని సీజే ఘాటుగా వ్యాఖ్యానించారు. తమ వైపు నుంచి ఎవరైనా రిజిస్ట్రీని బెదిరించి ఉంటే అందుకు కోర్టును క్షమాపణలు కోరుతున్నానని నాదకర్ణి చెప్పారు.

ఐదేళ్లుగా అమలవుతున్న పథకాలను ఎందుకు అడ్డుకుంటున్నారు?

అనంతరం ధర్మాసనం కేంద్ర ఎన్నికల సంఘంపై నిప్పులు చెరిగింది. 'సింగిల్ జడ్జి ఉత్తర్వులపై మీరు అభ్యంతరం చెప్పలేదు. మీకు అభ్యంతరం ఉంటే మా ముందు అప్పీల్ చేసేవారు. అప్పీల్ చేయనప్పుడు సింగిల్ జడ్జి ఉత్తర్వులు అమలు చేయాలి. అప్పీల్ వేయకుండా సింగిల్ ఉత్తర్వులను అమలు చేయకుండా ఉండటం ఏమిటి? మీ తీరును ఎలా అర్థం చేసుకోవాలి? ప్రజలను వారి సొమ్ము వారు పొందకుండా ఎందుకు అడ్డుకుంటున్నారు? గత ఐదేళ్లుగా అమలవుతున్న పథకాలను ఎందుకు అడ్డుకుంటున్నారు? ఎన్నికల బరిలో ఉన్న వారందరికీ సమాన అవకాశాలు (లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్) కల్పించేందుకే పథకాల అమలును ఆపామని మీరు చెబుతున్నారు. కానీ గతంలో పసుపు కుంకుమ, అన్నదాత సుఖీభవ, రైతు బంధు పథకాలకు అనుమతినిచ్చి, ఇప్పుడు ఇక్కడ పథకాలను ఆపడం ద్వారా లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్ లేదన్న విషయాన్ని మీరే రుజువు చేశారు. ఎన్నికలు జరుగుతున్న ప్రతి రాష్ట్రంలో మీరు ఇలాగే ప్రభుత్వ పథకాలను ఆపుతున్నారా' అంటూ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఒక్కో ప్రభుత్వం విషయంలో ఒక్కో రకంగా వ్యవహరిస్తోంది

అసలు నిధుల పంపిణీ సంగతి ఏమిటని ధర్మాసనం రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. 10వ తేదీన నిధుల పంపిణీకి సింగిల్ జడ్జి అనుమతినిచ్చిన విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఎన్నికల సంఘానికి లేఖ ద్వారా తెలియజేశారన్నారు. నిధుల పంపిణీకి ఎన్‌వోసీ జారీ చేయాలని కోరారన్నారు. ఎన్‌వోసీ విషయాన్ని తేల్చని ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వాన్ని బడ్జెట్ కేటాయింపులు, పథకాలు అమలవుతున్న తేదీల వివరాలను అడుగుతూ సీఎస్‌కు లేఖ పంపిందని వివరించారు. ఎన్‌ఈవోసీ విషయాన్ని ఏం చేసిందో ఈసీనే అడగాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఎన్నికల సంఘం తీరు ఒక్కో ప్రభుత్వం విషయంలో ఒక్కో రకంగా ఉంటోందన్నారు. గతంలో పసుపు కుంకుమ, అన్నదాత సుఖీభవ పథకాలకు అనుమతిచ్చిందని, ఇందుకు పాత పథకాలన్న కారణం చెప్పిందన్నారు. ఇప్పుడు తాము కూడా పాత పథకాలనే అమలు చేస్తున్నప్పటికీ అభ్యంతరం చెబుతోందన్నారు.

ఈసీ పరిధి దాటి వ్యవహరిస్తోందా?

దీంతో ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వివరణను ధర్మాసనం కోరింది. నిధుల పంపిణీ వద్దంటూ సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో ఎక్కడా నిధులు పంపిణీ చేసుకోవచ్చని చెప్పలేదని అవినాష్ దేశాయ్ అనగా.. ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'మీ ఉత్తర్వులను సింగిల్ జడ్జి అబయన్స్‌లో పెట్టిన తరువాత ఆ ఉత్తర్వులు అమలు చేయడమే మీ పని. కానీ మీరేం చేశారు? కోర్టుకన్నా మీరు ఎక్కువని అనుకుంటున్నారా' అంటూ ప్రశ్నించింది. 'ఈసీ ఇలాగే ప్రతి పథకాన్ని అడ్డుకోవచ్చా? అది ఈ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కావొచ్చు, వేరే రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కావొచ్చు. ఈసీ పరిధి దాటి వ్యవహరిస్తోందా అన్నదే ఇక్కడ ముఖ్యమైన ప్రశ్న' అని ధర్మాసనం స్పష్టం చేసింది. తాము ఈ అప్పీళ్లపై విచారణ జరిపి, సింగిల్ జడ్జి ఉత్తర్వులను పరిశీలించి, తాము నిర్ణయించిన మేరకు ఉత్తర్వులిచ్చి, ఆ ఉత్తర్వుల కాపీ అందుబాటులోకి వచ్చేసరికి రాత్రి అవుతుందని తెలిపింది. బ్యాంకుల పని వేళలు సాయంత్రంతో ముగుస్తాయని, అలాంటప్పుడు ఈ నెల 10న నిధుల పంపిణీ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. ఈ పరిస్థితుల్లో తాము ఈ అప్పీళ్లపై ఇప్పటికిప్పుడు తేల్చడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలిపింది.

ఎన్నికల సంఘం వల్లే నిధులు పంపిణీ చేసే పరిస్థితి లేదు

దీనిపై అడ్వొకేట్ జనరల్ అభిప్రాయాన్ని కోరింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఈసీ అమలు చేయకపోవడం వల్ల, ఎన్‌వోసీ ఇవ్వకపోవడం వల్ల నిధులు పంపిణీ చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఏజీ శ్రీరామ్ వివరించారు. ఈ అప్పీళ్లను ఇప్పటికిప్పుడు తేల్చకపోయినా, ఈసీ తీరును మాత్రం ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సంఘం ఇష్టమొచ్చినట్లు వ్యవహరించవచ్చా అన్న విషయాన్ని తేల్చాలని ధర్మాసనాన్ని కోరారు. ఏజీ చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. '14వ తేదీ నుంచి నిధులు పంపిణీ చేసుకోవచ్చని మీరు (ఎన్నికల సంఘం) చెబుతున్నారు. అప్పుడైనా నిధుల పంపిణీకి అనుమతిస్తారా లేక ఇలాగే ఆ వివరాలు, ఈ వివరాలు కావాలని అడుగుతూ వెళ్తారా' అంటూ ఎన్నికల సంఘాన్ని నిలదీసింది. అలాంటిది ఏమీ లేదని, 14 నుంచి నిధులు పంపిణీ చేసుకోవచ్చని ఈసీ న్యాయవాది అవినాష్ దేశాయ్ చెప్పారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఈసీ అనుమతి ఇవ్వని నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు నిధులు పంపిణీ చేసే పరిస్థితి లేదని, అందువల్ల ఈ మొత్తం వ్యవహారంలో తదుపరి ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదంటూ ఉత్తర్వులిచ్చింది. ఈ అప్పీళ్లపై తదుపరి విచారణను సెప్టెంబర్ 2న చేపడతామని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. చివర్లో సింగిల్ జడ్జి ముందు నిధుల పంపిణీ కోసం పిటిషన్లు దాఖలు చేసిన రైతులు, మహిళలు, విద్యార్థుల తరఫు సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి స్పందిస్తూ.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఈసీ అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమే అవుతుందని వివరించారు. ఇప్పుడు ఆ అంశాల జోలికి వెళ్లబోమని, అన్నీ అంశాలను తరువాత చూస్తామని ధర్మాసనం తెలిపింది.

మున్నా ముఠాకు ఉరిశిక్షను సవరించిన హైకోర్టు

- జీవితఖైదుగా మార్పు
- 45 ఏళ్లు జైల్లోనే ఉండాలని ఆదేశం
- క్షమాభిక్షకు వీల్లేదు
- బాధితులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, అమరావతి: జాతీయ రహదారులపై పట్టపగలే హత్యలు చేస్తూ హైవే కిల్లింగ్ గ్యాంగ్‌గా పేరుపొందిన మున్నా ముఠాకు ఉరిశిక్ష విధిస్తూ ఒంగోలు కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సవరించింది. తొమ్మిదిమందికి విధించిన ఉరిశిక్షను జీవితఖైదుగా మార్చింది. 45 ఏళ్ల పాటు జీవితఖైదు అనుభవించాల్సిందేనని తేల్చిచెప్పింది. వీరికి ఎలాంటి క్షమాభిక్ష ప్రసాదించడానికి వీల్లేదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇప్పటికే అనుభవించిన శిక్షను మినహాయించి ఇక ఎన్నేళ్లు ఉంటే అన్నేళ్లు జైల్లోనే ఉండాలంది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలను పరిహారంగా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బాధితుల పరిహార పథకం కింద కూడా బాధితులకు పరిహారం చెల్లించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం తీర్పు చెప్పారు. అబ్దుల్ సమద్ అలియాస్ మున్నా ఒంగోలు కేంద్రంగా మరికొందరితో కలిసి ఇనుపలోడ్‌లతో వెళుతున్న లారీలను లక్ష్యంగా చేసుకుని ఆ లారీ డ్రైవర్లను, క్లీనర్లను చంపుతూ వచ్చారు. లారీలను కనిపించకుండా చేసి అందులోని సరుకును దోచుకునేవారు. ఈ ముఠా ఇలా మొత్తం 13 మందిని హత్యచేసింది. చివరకు పోలీసులు ఈ ముఠాను పట్టుకుని కోర్టుముందు నిలబెట్టారు. విచారించిన ఒంగోలు కోర్టు పలువురికి ఉరిశిక్ష, కొందరికి జీవితఖైదు, మరికొందరికి పదేళ్లు, ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ 2021లో తీర్పు చెప్పింది. ఉరిశిక్ష ఖరారు విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలంటూ కేసు ఫైళ్లను హైకోర్టుకు పంపింది. ఇదే సమయంలో దోషులు ఒంగోలు కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై జస్టిస్ దుర్గాప్రసాదరావు నేతృత్వంలోని ధర్మాసనం సుదీర్ఘంగా విచారించి తీర్పు చెప్పింది.

నాడు ముద్దులు.. నేడు గుద్దులు

- ఈ సైకో పోవాలి
- ప్రచారసభల్లో బాబు అనుచిత వ్యాఖ్యలు



సాక్షి, మచిలీపట్నం/సాక్షి, భీమవరం/సాక్షి, విశాఖపట్నం/సాక్షి ప్రతినిధి, ఒంగోలు/గన్నవరం/ఏలూరు (ఆర్ఆర్‌పేట)/ఉండి: ఎన్నికల ముందు ముద్దులు పెట్టి.. ఇప్పుడు పిడిగుద్దులు గుద్దుతున్న దుర్మార్గుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర పరిస్థితి దుర్భరంగా మారిందని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు విమర్శించారు. దోపిడీదారుడు, బందిపోటు, పచ్చి మోసగాడు అయిన జగన్ పులివెందుల రాజకీయం చేయాలని చూస్తున్నాడని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరం, పశ్చిమగోదావరి జిల్లా ఉండి, జిల్లా కేంద్రం ఏలూరుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. విశాఖపట్నంలో ముస్లిం మత పెద్దలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఒంగోలులో రోడ్‌షో, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజల జీవితాలు 30 ఏళ్లు వెనక్కి వెళ్లాయన్నారు. రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్‌కి కేంద్రంగా మార్చారని చెప్పారు. ఇచ్చిన హామీలను విస్మరించిన జగన్ పెట్రోల్, డీజిల్ ధరలు, కరెంట్ చార్జీలు పెంచి భారం వేశారన్నారు. మద్యం, ఇసుక అమ్మకాల్లో దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. తాను పోలవరం కాలువలు తవ్విస్తే.. మట్టి దొంగలించారని, భూ కబ్జాలు చేశారని ఆరోపించారు. మద్యం ధర పెంచిన జగన్ కల్తీమందు సరఫరా చేసి రూ.కోట్లు దండుకుంటున్నారని చెప్పారు. ఇలాంటి సైకో పోవాలని, సైకిల్ కూటమి రావాలని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా ల్యాండ్ టైట్లింగ్ చట్టం తెచ్చారని చెప్పారు. ఈ చట్టం గురించి అడిగితే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాకు ఇష్టం వచ్చినట్లు చేస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. ఇది జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ అంటూ యథారీతిన ఈ చట్టం గురించి పలు అబద్ధాలు చెప్పారు. తాడేపల్లి ప్యాలెస్‌లో సైకో ఉంటే, గన్నవరంలో పిల్లసైకో వంశీమోహన్ ఉన్నాడని చెప్పారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే పిల్లసైకో రౌడీయిజం, భూకబ్జాలు చేసి డబ్బు సంపాదించారని ఆరోపించారు. తోక కత్తిరిస్తానని, ఎవరిని వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అవినీతి, దోపిడీ ప్రభుత్వానికి ముగింపు పలకాలన్నారు. 13వ తేదీన ఎండగా ఉందని ఇంట్లో కూర్చుంటే ఆ తరువాత మీ ఇంటికి గొడ్డలి వస్తుందంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ముస్లింలంతా టీడీపీ వైపే ఉన్నారని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని, వైఎస్సార్‌సీపీ డిపాజిట్లు కూడా దక్కకుండా.. చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా ఓడిపోతుందని చెప్పారు. తనను అక్రమ కేసులతో జైల్లో పెట్టారన్నారు. జాబు రావాలంటే చంద్రబాబు రావాలని ఆయన పేర్కొన్నారు.

మీరిచ్చిన డబ్బులు దాహార్తికే సరి

చంద్రబాబు ప్రచారసభలు వెలవెలబోయాయి. ఆయన రాకముందే పలువురు వెనుదిరగటం కనిపించింది. తాగునీటి వసతి కూడా పూర్తిస్థాయిలో కల్పించకపోవడంతో పలువురు విమర్శించారు. రూ.300 ఇస్తే వచ్చామని, ఇక్కడ మంచినీరు కూడా లేకపోవడంతో మీరిచ్చిన డబ్బులు దాహార్తి తీర్చుకోవడానికే సరిపోతున్నాయని కొందరు తమను తీసుకొచ్చిన నాయకులతో గొడవపడటం కనిపించింది. గన్నవరంలో ఎన్నికల షో అట్టర్‌ఫ్లాప్ అయింది. ఒంగోలులో జనాలు లేకపోవటంతో రెండుగంటల ఆలస్యంగా రోడ్‌షో నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ గూండాలను హెచ్చరిస్తున్నా..

- పిఠాపురంలో పవన్‌కళ్యాణ్
- ఇష్టానుసారం రోడ్‌షో

పిఠాపురం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ గూండాలను హెచ్చరిస్తున్నానని, తమ కూటమి ప్రభుత్వం వస్తుందని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చెప్పారు. ఆయన శుక్రవారం కాకినాడ జిల్లా పిఠాపురంలో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల మీదకు వస్తే భయపెడుతున్నారని, సాయిధరమ్‌తేజ్ మీద గాజు సీసాలతో దాడి చేశారని చెప్పారు. దెబ్బ తగిలినా, ప్రాణం పోయినా వెనుతిరగబోమన్నారు. రూ.41 కోట్ల కల్తీ మద్యం అమ్మి, ఇప్పుడు ఎన్నికల్లో జగన్ పంచి పెడుతున్నారని ఆరోపించారు. అది మన రక్తం పీల్చి సంపాదించిన సొమ్ము అని పేర్కొన్నారు. రూ.లక్ష ఇచ్చినా తీసుకోండి.. కానీ జనసేనకే ఓటు వేయండి.. అని చెప్పారు. జగన్‌లా తాను అబద్ధాలు చెప్పనన్నారు. 'వైఎస్సార్‌సీపీ వాళ్లూ మీకు చెబుతున్నా. జాగ్రత్త. ల్యాండ్ గ్రాబింగ్ చట్టం వల్ల మీ ఆస్తులకు ప్రమాదం ఉంది' అని అన్నారు. బలమైన టీడీపీ సీటును తన కోసం త్యాగం చేశారని, ఒక్కసారి గెలిపించాలని కోరారు. ల్యాండ్ గ్రాబింగ్ చట్టాలను రద్దు చేస్తామన్నారు. ఆరుగంటలు ఆలస్యంగా ప్రారంభమైన రోడ్‌షోను అనుమతించిన రూట్‌లో కాకుండా ఇష్టానుసారం నిర్వహించారు. ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిన ప్రకారం రోడ్‌షో పిఠాపురం మండలం చిత్రాడ నుంచి పిఠాపురం మీదుగా గొల్లప్రోలు మండలం దుర్గాడ చేరుకోవాలి. కానీ చిత్రాడ నుంచి బైపాస్ రోడ్డులో గొల్లప్రోలు మండలం చేబ్రోలు వెళ్లిపోయారు. అక్కడి నుంచి మల్లవరం మీదుగా కొత్తపల్లి మండలం వెళ్లి తిరిగి పిఠాపురం చేరుకుని సభలో ప్రసంగించారు.



పిఠాపురంలో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

జై జగన్ నినాదాలు చేసిన బాలుడు

గొల్లప్రోలులో ర్యాలీలో నినాదాలు చేస్తున్న బాలుడిని పవన్‌కళ్యాణ్ పిలిచి ప్రచార వాహనం ఎక్కించుకుని మైక్ ఇచ్చారు. ఆ బాలుడు ఒక్కసారిగా 'జై జగన్' అంటూ నినాదాలు చేశాడు. దీంతో పవన్, నేతలు అవాక్కయ్యారు.

జనసేన కార్యకర్తల వీరంగం

- ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కాన్వాయ్‌పై దాడి
- వైఎస్సార్‌సీపీ ప్రచారరథం ధ్వంసం

రైల్వేకోడూరు అర్బన్: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మైసూరువారిపల్లె పంచాయతీలో శుక్రవారం ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కాన్వాయ్‌పై జనసేన మూకలు దాడిచేశాయి. ఎన్నికల ప్రచారానికి గ్రామంలోకి వెళుతున్న ప్రచారరథాన్ని అడ్డుకుని అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులపైన కూడా వారు తిరగబడ్డారు. కొంతసేపటికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని గ్రామంలో ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికి పిరికిపందలు ఈ చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. ఇలాంటి పనులతో ప్రజల తీర్పును మార్చలేరని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.



ప్రచార రథం అద్దాలు పగులగొట్టిన దృశ్యం

వైఎస్సార్‌సీపీ ర్యాలీపై టీడీపీ దాడి

యువకుడి కంటికి తీవ్ర గాయం

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడులో శుక్రవారం జరిగిన వైఎస్సార్‌సీపీ ర్యాలీపై టీడీపీకి చెందిన వారు రాయితో దాడిచేశారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన యువకుడి కంటికి తీవ్ర గాయమైంది. నూజివీడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నేతృత్వంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు ద్వారకా ఎస్టేట్ వద్ద ప్రారంభమైన ర్యాలీ రాత్రి 7.30 గంటలకు నెహ్రూపేట చేరుకుంది. అదే సమయంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకుడు నత్తా నాగేశ్వరరావు, టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి కొడుకు, కార్యకర్తలు.. వైఎస్సార్‌సీపీ ర్యాలీని చూసి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. అలా అజరయ్యపేట వరకు కవ్విస్తూనే ఉన్నారు. రాత్రి 9 గంటల సమయంలో రెల్లిపేట వద్ద వైఎస్సార్‌సీపీ ర్యాలీపైకి టీడీపీ వర్గీయులు రాయి విసిరారు. ఆ రాయి తగిలి జస్వంత్ (18) అనే యువకుడి కుడికంటికి తీవ్ర గాయమైంది. అతడికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు ఆస్పత్రిలో యువకుడిని పరామర్శించి, వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.



తీవ్రంగా గాయపడిన జస్వంత్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

పోలీసుల వైఫల్యమే..

అనంతరం ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ రాయి దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటన పోలీసుల వైఫల్యం వల్లే జరిగిందని చెప్పారు. తాము వందలాదిమందితో ర్యాలీగా వస్తుంటే.. 30 మంది టీడీపీ కార్యకర్తలను పోలీసులు కంట్రోలు చేయలేకపోయారన్నారు. ఇంటింటికి ప్రచారం చేసుకోవాల్సినవారు ప్రధాన రోడ్డుపై ఉండి కవ్విస్తున్నా నిలువరించలేకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. వారు ఎంత కవ్వించినా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎంతో శాంతియుతంగా, ఓర్పుగా ఉన్నారని ఎమ్మెల్యే చెప్పారు.

---

13 నుంచి 16 వరకు విస్తారంగా వర్షాలు

నేడు, రేపు తేలికపాటి వానలు • ప్రభావం చూపనున్న ద్రోణి, ఆవర్తనాలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వర్షాలు కురవడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ద్రోణి ప్రభావంతో ఇప్పటికే అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శని, ఆదివారాల్లో కూడా ఇవి కొనసాగనున్నాయి. శనివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. ఆదివారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో మోస్తరు నుంచి భారీ వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో 7.9 సెం.మీ. భారీ వర్షపాతం నమోదైంది.

13 నుంచి కొనసాగనున్న వానలు

13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు వానలు మరింత విస్తారంగా కురవనున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. 13న కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో మోస్తరు వర్షాలు.. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపింది.

మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్య శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు ఏపీ ఎస్ఎస్‌డీసీ ఎండీ సీఈవో పీ రాజాబాబు తెలిపారు. న్యూఢిల్లీలో జరుగుతున్న గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ కాన్‌క్లేవ్ 6వ ఎడిషన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజాబాబు మాట్లాడుతూ నైపుణ్య సాంకేతికతను వినియోగించడం ద్వారా సమర్థవంతమైన విద్యా వ్యవస్థతో పాటు పర్యావరణ వ్యవస్థను సృష్టించవచ్చునన్నారు. ఈ సమావేశంలో ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ పాలసీ మేకర్స్, యూనివర్సిటీ ఛాన్సలర్లు, వైస్ ఛాన్సలర్లు, స్కూల్ చైన్ ఓనర్లు, డైరెక్టర్లు, ఎడ్టెక్ లీడర్‌లు, గ్లోబల్ థాట్ లీడర్‌లు 150 మందికిపైగా పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
11-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	260	72,664
నిఫ్టీ ▲	98	22,055

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,329	▼ 18
డోజోన్స్	39,493	▲ 105
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,434	▲ 52
డాక్స్	18,773	▲ 86
షాంఘై	3,155	▲ 1
నికాయ్	38,229	▲ 155

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	73,008 ▲ 1,506
బంగారం (99.5 స్వచ్ఛత)	72,716 ▲ 1,500
వెండి (కిలో)	84,215 ▲ 1,873

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	81.67	85.35
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	102.22	107.11
€	యూరో	భారతీయ	87.81	92.26
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	41.00	66.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	52.81	87.62
S$	సింగపూర్ డాలర్	భారతీయ	59.33	64.05
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.85	23.63
¥	చైనా యువాన్	భారతీయ	10.44	12.51

పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి 5.8 శాతం

న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో (2022-23తో పోల్చి) 5.8 శాతం పురోగమించింది. మార్చిలో 4.9 శాతంగా నమోదైంది. 2023 ఫిబ్రవరి (5.6 శాతం) కన్నా మార్చిలో స్పీడ్ తగ్గినప్పటికీ, 2023 మార్చి కన్నా (1.9 శాతం) పురోగమించడం గమనార్హం. ఆర్థిక సంవత్సరం మొత్తంగా చూస్తే వృద్ధి స్వల్పంగా 5.2 శాతం నుంచి 5.8 శాతానికి పెరిగింది. భారత్ ఎకానమీలో వ్యవసాయ రంగం వాటా దాదాపు 18.4 శాతం. పారిశ్రామిక రంగం వాటా 28.3 శాతం. సేవల రంగం వాటా 53.3 శాతం. పారిశ్రామిక రంగంలో ఒక్క తయారీ రంగం వాటా దాదాపు 70 శాతం.

రంగాల వారీగా..(శాతాల్లో)

విభాగం	2024 మార్చి	2023 మార్చి
తయారీ	5.2	1.5
మైనింగ్	1.2	6.8
విద్యుత్ ఉత్పత్తి	8.6	-1.6
క్యాపిటల్ గూడ్స్	6.1	10
కన్జూమర్ డ్యూరబుల్స్	9.5	-8.0
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	4.9	-1.9
ఇన్‌ఫ్రా/నిర్మాణం	6.9	7.2
ప్రైమరీ గూడ్స్	2.5	3.3
ఇంటర్మీడియట్ గూడ్స్	5.1	1.8



వరుస నష్టాలకు బ్రేక్



ముంబై: స్టాక్ సూచీలు వరుస నష్టాల నుంచి కోలుకున్నాయి. ఎన్నికల అప్రమత్తత, విదేశీ ఇన్వెస్టర్ల వైఖరి, ద్రవ్యోల్బణం వంటి ప్రతికూలతలున్నా.., అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్ షేర్ల రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 260 పాయింట్లు లాభపడి 72,664 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98 పాయింట్లు పెరిగి 22,055 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఇటీవల మార్కెట్ పతనంతో కనిష్టాలకు దిగివచ్చిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. లండన్ మెటల్ ఎక్స్చేంజీలో బేస్ మెటల్ ధరలు అనూహ్యంగా పెరగడంతో మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొంది. అలాగే యుటిలిటీ, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీ, టెలికం, ఆటో షేర్లు రాణించాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 542 పాయింట్లు ఎగసి 72,947 వద్ద, నిఫ్టీ 174 పాయింట్లు బలపడి 22,131 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. మరోవైపు ఐటీ, బ్యాంకులు, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ఆర్థిక గణాంకాలు ఆర్థిక ఫలితాలపై ఆశావహ అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. కాగా, ప్రతి రెండు షేర్లకు ఒక షేరు బోనస్ ప్రకటించడంతో బీపీసీఎల్ షేరు 4.5% లాభపడి రూ.619 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 5% పెరిగి రూ.622 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

టాటా మోటార్స్ స్పీడ్

- క్యూ4 లాభం రూ. 17,529 కోట్లు
- షేరుకి రూ. 6 డివిడెండ్



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ గత ఆర్థిక సంవత్సరం (2023-24) చివరి త్రైమాసిక కన్సాలిడేటెడ్ నికర లాభం మూడు రెట్లు ఎగసి రూ. 17,529 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,05,932 కోట్ల నుంచి పెరిగి రూ. 1,19,986 కోట్లను అధిగమించింది. మరోసారి జేఎల్‌ఆర్ రికార్డులు బ్రేక్ చేస్తూ 7.9 బిలియన్ పౌండ్ల టర్నోవర్‌ను సాధించినట్లు టాటా మోటార్స్ పేర్కొంది. ఇది 11 శాతం వృద్ధికాగా.. నికర లాభం 1.4 బిలియన్ పౌండ్లకు జంప్‌చేసింది. వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. దీనిలో రూ. 3 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది. పూర్తి ఏడాదికి టాటా మోటార్స్ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 2,690 కోట్ల నుంచి రూ. 31,807 కోట్లకు దూసుకెళ్లింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,45,967 కోట్ల నుంచి రూ. 4,37,928 కోట్లకు ఎగసింది. వెరసి కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయంతోపాటు, నికర లాభాన్ని ఆర్జించినట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ తెలియజేశారు.


బీఎస్‌ఈలో టాటా మోటార్స్ షేరు 1.6% బలపడి రూ. 1,047 వద్ద ముగిసింది.

పసిడికి అక్షయ తృతీయ శోభ

ముంబై: అక్షయ తృతీయ పండుగ సందర్భంగా డిమాండ్ పెరగడంతో దేశవ్యాప్తంగా బంగారం ధరలు శుక్రవారం భారీగా పెరిగాయి. ముంబైలో పసిడి రూ.1,506 పెరిగి రూ.73,008 చేరింది. కిలో వెండి ధర రూ. 1873 ఎగసి రూ.84,215 కి చేరింది.

పసిడి దిగుమతులు 30 శాతం అప్

కాగా భారత్ పసిడి దిగుమతులు మార్చితో ముగిసిన గడచిన ఆర్థిక సంవత్సరంలో 30 శాతం పెరిగాయి. విలువలో 45.54 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దేశీయ పటిష్ట డిమాండ్ దీనికి కారణం. భారత్‌కు దిగుమతుల విషయంలో స్విట్జర్లాండ్ (40%) మొదటి స్థానంలో నిలుస్తుండగా, తరువాతి స్థానాల్లో యూఏఈ (16%), దక్షిణాఫ్రికా (10%) ఉన్నాయి. దేశం మొత్తం దిగుమతుల్లో పసిడి వాటా దాదాపు 5 శాతం. పసిడిపై ప్రస్తుతం 15శాతం దిగుమతుల సుంకం అమలవుతోంది. చైనా తర్వాత భారత్ అతిపెద్ద పసిడి వినియోగదారుగా ఉంది. కాగా, 2023-24లో వెండి దిగుమతుల విలువ 2.72 శాతం పెరిగి 5.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది.



టీవీఎస్ హోల్డింగ్స్ చేతికి హోమ్ క్రెడిట్ ఇండియా

81 శాతం వాటా కొనుగోలు • మిగతాది ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ తదితర సంస్థలకు..

న్యూఢిల్లీ: హోమ్ క్రెడిట్ ఇండియా ఫైనాన్స్‌లో (హెచ్‌సీఐఎఫ్‌పీఎల్) 80.74 శాతం వాటా కొనుగోలు చేస్తున్నట్లు టీవీఎస్ హోల్డింగ్స్ వెల్లడించింది. మిగతా 19.26 శాతం వాటాను ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, ఇతర అనుబంధ సంస్థలు కొనుగోలు చేయనున్నట్లు వివరించింది. మొత్తం డీల్ విలువ రూ. 696 కోట్లు. ఇందులో టీవీఎస్ హోల్డింగ్స్ రూ. 554.06 కోట్లు చెల్లించనుంది. ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌కు 11 శాతం వాటాలు ఉంటాయి. చెక్ రిపబ్లిక్‌కు చెందిన హోమ్ క్రెడిట్ ఇంటర్నేషనల్, నెదర్లాండ్స్‌కి చెందిన హోమ్ క్రెడిట్ ఇండియా బీవీ నుంచి హెచ్‌సీఐఎఫ్‌పీఎల్‌లో 80.74 వాటా కొనుగోలు చేస్తున్నట్లు టీవీఎస్ హోల్డింగ్స్ పేర్కొంది. టీవీఎస్ క్రెడిట్‌కి ఇది కూడా కలిస్తే మొత్తం గ్రూప్‌నకు రూ. 31,000 కోట్ల లోన్ బుక్ ఉంటుందని టీవీఎస్ హోల్డింగ్స్ ఎండీ సుదర్శన్ వేణు తెలిపారు.



బీపీసీఎల్ రూ.1.7 లక్షల కోట్ల పెట్టుబడి



న్యూఢిల్లీ: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) రూ.1.7 లక్షల కోట్ల పెట్టుబడి ప్రణాళికల్లో ఉంది. చమురు శుద్ధి సామర్థ్యం పెంపు, ఇంధన విక్రయాలు, పెట్రోకెమికల్ వ్యాపారం విస్తరణ, హైడ్రోజన్ విభాగాల్లో వచ్చే అయిదేళ్లలో ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్లు బీపీసీఎల్ చైర్మన్ జి.కృష్ణకుమార్ వెల్లడించారు. రిఫైనరీలు, పెట్రోకెమికల్స్‌కు రూ.75,000 కోట్లు, మార్కెటింగ్‌కు రూ.20,000 కోట్లు, వ్యూహాత్మక పైప్ లైన్ ప్రాజెక్టుకు రూ.8,000 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. ప్రధానంగా మొజాంబిక్, బ్రెజిల్‌లో చమురు ఉత్పాదన పెంచేందుకు రూ.32,000 కోట్లు, సహజ వాయువు వ్యాపారంపై రూ.25,000 కోట్లు, స్వచ్ఛ ఇంధనంపై రూ.10,000 కోట్లు పెట్టుబడి చేయనున్నట్లు పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-5-2024 ఫామ్ ధర...	
విశాఖ	550-00
చిత్తూరు	598-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

కల్యాణ్ జ్యుయలర్స్ మెరుపులు



ముంబై: కల్యాణ్ జ్యుయలర్స్ క్యూ4 నికర లాభం 97 శాతం పెరిగి రూ. 137 కోట్లకు (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) చేరింది. ఆదాయం 34 శాతం వృద్ధితో రూ. 3,382 కోట్ల నుంచి రూ. 4,535 కోట్లకు చేరింది. 2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి షేరు ఒక్కింటిపై రూ. 1.2 చొప్పున తుది డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు సిఫార్సు చేసింది. గత ఆర్థిక సంవత్సరం పటిష్ట పనితీరు సాధించగలిగామని సంస్థ ఈడీ రమేష్ కల్యాణరామన్ తెలిపారు.

శుక్రవారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు 3 శాతం పెరిగి రూ. 410.85 వద్ద క్లోజయ్యింది.

సిప్లా హైజంప్



న్యూఢిల్లీ: సిప్లా లిమిటెడ్ చివరి త్రైమాసిక కన్సాలిడేటెడ్ నికర లాభం 79 శాతం జంప్‌చేసి రూ. 932 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,739 కోట్ల నుంచి రూ. 6,163 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 4,946 కోట్ల నుంచి రూ. 5,153 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు షేరుకి రూ. 13 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. పూర్తి ఏడాదికి సిప్లా నికర లాభం రూ. 2,833 కోట్ల నుంచి రూ. 4,154 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 22,753 కోట్ల నుంచి రూ. 25,774 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో సిప్లా షేరు 1.4% క్షీణించి రూ. 1,339 వద్ద ముగిసింది.

బీవోబీ లాభం ఫ్లాట్



ముంబై: బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) చివరి త్రైమాసిక స్టాండెలోన్ నికర లాభం 2 శాతం వృద్ధితో రూ. 4,886 కోట్లను తాకింది. కన్సాలిడేటెడ్ లాభం మాత్రం స్వల్పంగా క్షీణించి రూ. 5,132 కోట్లకు పరిమితమైంది. ఇక పూర్తి ఏడాదికి మాత్రం బీవోబీ నికర లాభం రూ. 14,905 కోట్ల నుంచి రూ. 18,767 కోట్లకు ఎగసింది. కాగా.. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 2 శాతం బలపడి రూ. 11,793 కోట్లకు చేరింది. రుణాల్లో 12.5 శాతం వృద్ధి ఇందుకు సహకరించగా.. నికర వడ్డీ మార్జిన్లు 0.26 శాతం నీరసించి 3.27 శాతానికి పరిమితమయ్యాయి. వడ్డీయేతర ఆదాయం 21 శాతం ఎగసి రూ. 4,191 కోట్లయ్యింది. గోఫస్ట్ పేరును ప్రస్తావించనప్పటికీ ఈ కాలంలో రూ. 1,700 కోట్ల రుణాలు తీసుకున్న ఒక ఏవియేషన్ ఖాతాను మొండిబకాయిగా గుర్తించినట్లు బీవోబీ పేర్కొంది. దీంతో ప్రొవిజన్లు రూ. 320 కోట్ల నుంచి రూ. 1,485 కోట్లకు భారీగా పెరిగినట్లు వెల్లడించింది.

బీఎస్‌ఈలో బీవోబీ షేరు 2.7 శాతం నష్టంతో రూ. 256 వద్ద ముగిసింది.

బీవోఐ లాభం అప్

- క్యూ4లో రూ. 1,439 కోట్లు
- షేరుకి రూ. 2.8 డివిడెండ్



ముంబై: బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) క్యూ4 నికర లాభం 7 శాతం వృద్ధితో రూ. 1,439 కోట్లను తాకింది. వాటాదారులకు షేరుకి రూ. 2.8 డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 16,549 కోట్ల నుంచి రూ. 17,913 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం రూ. 5,523 కోట్ల నుంచి రూ. 5,937 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 7.31 శాతం నుంచి 4.98 శాతానికి, నికర ఎన్‌పీఏలు సైతం 1.66 శాతం నుంచి 1.22 శాతానికి దిగివచ్చాయి. మొండి రుణాలకు కేటాయింపులు రూ. 546 కోట్ల నుంచి రూ. 2,043 కోట్లకు భారీగా పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి మాత్రం బీవోఐ నికర లాభం 57 శాతం జంప్‌చేసి రూ. 6,318 కోట్లయ్యింది. మొత్తం ఆదాయం రూ. 54,748 కోట్ల నుంచి రూ. 66,804 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ మార్జిన్లు 3.3 శాతానికి చేరాయి.

బీఎస్‌ఈలో బీవోఐ షేరు యథాతథంగా రూ. 139 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



రెజ్లింగ్‌లో భారత్‌కు ఐదో ఒలింపిక్ బెర్త్... 68 కేజీల విభాగంలో ఫైనల్లోకి నిషా

ఇస్తాంబుల్: ఒలింపిక్స్ రెజ్లింగ్ చరిత్రలో తొలిసారి మహిళల విభాగంలో భారత్ నుంచి అత్యధికంగా ఐదుగురు బరిలోకి దిగనున్నారు. వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో మహిళల 68 కేజీల విభాగంలో నిషా దహియా ఫైనల్‌కు చేరుకొని భారత్‌కు ఐదో ఒలింపిక్ బెర్త్‌ను ఖరారు చేసింది. సెమీఫైనల్లో నిషా 8-4తో అలెగ్జాండ్రా ఎంగెల్ (రొమేనియా)పై గెలిచింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన నిషా ప్రిక్వార్టర్ ఫైనల్లో 3-0తో అలీనా షొచుక్ (టర్కీ)పై, క్వార్టర్ ఫైనల్లో 7-4తో అడెలా హాంజ్లికోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించింది. 62 కేజీల విభాగంలో భారత రెజ్లర్ మాన్సి తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. నిషా కంటే ముందు అంతిమ్ పంఘాల్ (53 కేజీలు), వినేశ్ ఫొగాట్ (50 కేజీలు), అన్షు మలిక్ (57 కేజీలు), రీతిక హుడా (76 కేజీలు) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందారు. నేడు పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్ నుంచి ఆరుగురు రెజ్లర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

ద్రవిడ్ మళ్లీ దరఖాస్తు చేయాల్సిందే!

- భారత జట్టు కొత్త హెడ్ కోచ్ ఎంపిక కోసం త్వరలో ప్రకటన
- బీసీసీఐ కార్యదర్శి జై షా స్పష్టీకరణ



ముంబై: టి20 వరల్డ్ కప్ ముగిసిన వెంటనే భారత క్రికెట్ జట్టుకు కొత్త హెడ్ కోచ్ బాధ్యతలు స్వీకరిస్తారని బీసీసీఐ కార్యదర్శి జై షా వెల్లడించారు. దాని కోసం మరికొద్ది రోజుల్లోనే దరఖాస్తులు కోరతామని కూడా ఆయన స్పష్టం చేశారు. భారత జట్టు వరల్డ్ కప్‌కు బయల్దేరే ముందే ఈ ప్రక్రియ మొదలవుతుందని కూడా జై షా చెప్పారు. గత ఏడాది రాహుల్ ద్రవిడ్ పదవీకాలం పూర్తయిన తర్వాతే కొత్త కోచ్‌పై చర్చ జరగడంతో కొంత గందరగోళం నెలకొంది. దాంతో ద్రవిడ్‌నే మరో ఏడాది కొనసాగించారు. ఈసారి అలాంటి స్థితి రాకుండా బోర్డు ముందే జాగ్రత్త పడుతోంది.

• ఒప్పందం ప్రకారం వచ్చే జూన్‌లో ద్రవిడ్ పదవీకాలం పూర్తవుతుంది. ద్రవిడ్ మళ్లీ కోచ్‌గా కొనసాగాలనుకుంటే మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుందని... కొన్ని ఇతర జట్ల తరహాలో వేర్వేరు ఫార్మాట్‌లకు వేర్వేరు కోచ్‌లను ఎంపిక చేసే ఆలోచన లేదని కూడా షా పేర్కొన్నారు. కొత్త హెడ్ కోచ్‌కు మూడేళ్ల పదవీ కాలం ఇస్తామని, 2027 వన్డే వరల్డ్ కప్ వరకు అతను కొనసాగుతాడని బోర్డు కార్యదర్శి ప్రకటించారు. కోచ్ ఎంపిక విషయంలో క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ)దే తుది నిర్ణయమన్న షా... విదేశీ కోచ్ అయినా అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు.

• ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు చేరని జట్లలో ఉన్న ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది కలిసి మే 24న తొలి బృందంగా టి20 వరల్డ్ కప్ కోసం అమెరికా బయలుదేరతారని జై షా వెల్లడించారు. ఐపీఎల్‌లో 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనను ప్రయోగాత్మకంగానే పెట్టామని, అవసరమైతే దీనిపై మళ్లీ చర్చించి కొనసాగించాలా వద్దా అనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

• మరోవైపు శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను బీసీసీఐ వార్షిక కాంట్రాక్ట్ జాబితాలో చేర్చకపోవడంలో తన పాత్ర ఏమీ లేదని... ఇది పూర్తిగా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ నిర్ణయమని ఆయన సందేహ నివృత్తి చేశారు.

గిల్, సాయి శతకాల మోత

- తొలి వికెట్‌కు 210 పరుగుల భాగస్వామ్యం
- చెన్నైపై 35 పరుగులతో నెగ్గి ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన గుజరాత్
- మిచెల్, అలీ పోరాటం వృథా



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్



సాయి సుదర్శన్

అహ్మదాబాద్: గుజరాత్‌పై గెలిచి ప్లే ఆఫ్స్ రేసులో పడదామనుకున్న డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు టైటాన్స్ ఓపెనర్లు శుబ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ చుక్కలు చూపించారు. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న సూపర్‌కింగ్స్ ఊహించని ఉపద్రవంతో చేతులెత్తేసింది. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 35 పరుగుల తేడాతో చెన్నైపై విజయం సాధించింది. మొదట టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 231 పరుగులు చేసింది. గిల్ (55 బంతుల్లో 104; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు), సుదర్శన్ (51 బంతుల్లో 103; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) చెలరేగారు. తుషార్ దేశ్‌పాండేకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసి ఓడింది. డారిల్ మిచెల్ (34 బంతుల్లో 63; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), మొయిన్ అలీ (36 బంతుల్లో 56; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. మోహిత్ శర్మ 3, రషీద్ ఖాన్ 2 వికెట్లు తీశారు.

జోరు కాదు... ఓపెనర్ల హోరు...

పవర్ ప్లేలో 58/0 స్కోరు చేసిన టైటాన్స్ ఓపెనర్లు ఆ తర్వాత మరింత రెచ్చిపోయారు. ఈ క్రమంలో ముందుగా సాయి సుదర్శన్ 32 బంతుల్లో, గిల్ 25 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేశారు. పేస్, స్పిన్, స్లో మీడియం ఇలా ఆరుగురు చెన్నై బౌలర్లు 17 ఓవర్ల వరకు వైవిధ్యం చూపినా... వాళ్లిద్దరు మాత్రం అడ్డు అదుపు లేకుండా శరవేగంగా పరుగుల్ని రాబట్టారు. సెంచరీ మాత్రం ముందుగా శుబ్‌మన్ 50 బంతుల్లో పూర్తి చేయగా, తర్వాత సుదర్శన్ కూడా 50 బంతుల్లోనే శతక్కొట్టాడు. ఈ పరుగుల తుఫాన్‌ను ఎట్టకేలకు డెత్ ఓవర్లకు గానీ విడగొట్టలేకపోయారు. తుషార్ వేసిన 18వ ఓవర్లో భారీ షాట్‌కు యత్నించిన సాయి సుదర్శన్... శివమ్ దూబేకు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. దీంతో ఓపెనింగ్ వికెట్‌కు 210 పరుగుల భాగస్వామ్యానికి తెరపడటంతో చెన్నై శిబిరంలో తొలిసారి ఆనందం కనబడింది. అదే ఓవర్లో కెప్టెన్ గిల్ కూడా అవుట్ కావడంతో సూపర్‌కింగ్స్ ఊపిరి పీల్చుకుంది.

అన్ని ఫోర్లు, ఇన్ని సిక్సర్లు... ఇద్దరివే!

17.2 ఓవర్లు ఓపెనర్లే ఆడారు. దీంతో స్కోరు బోర్డు పరుగందుకుంది. మెరుపులతో జోరందుకుంది. ఓపెనింగ్‌కు ఇరువైపుల వేగం, వేగం కనిపించడంతో మోదీ స్టేడియం గుజరాత్ అభిమానుల కేరింతలతో మార్మోగింది. సుదర్శన్, గిల్ ఇద్దరు అదేపనిగా దంచేయడంతో ఫోర్లతో సిక్సర్లు కూడా పోటీపడ్డాయి. 14 ఫోర్లు, 13 సిక్స్‌లు బాదేయడంతో 210 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యంలో 134 పరుగులు బౌండరీల రూపంలోనే వచ్చాయి. ఆరో ఓవర్లో 50కి చేరిన గుజరాత్ స్కోరు... 100 పరుగుల్ని పదో ఓవర్లో దాటింది. 150 పరుగుల్ని మరింత వేగంగా 13వ ఓవర్లోనే అధిగమించింది. 17వ ఓవర్లో 200 మైలురాయికి చేరింది.

ఆరంభంలోనే దెబ్బ

తొలి ఓవర్లో రచిన్ రవీంద్ర (1), రెండో ఓవర్లో రహానే (1), మూడో ఓవర్లో కెప్టెన్ రుతురాజ్ (0) వరుస కట్టడంతో కొండంత లక్ష్యఛేదన చెన్నైకి అసాధ్యంగా మారింది. మిచెల్, మొయిన్ అలీ అర్ధసెంచరీలతో చేసిన పోరాటం సూపర్‌కింగ్స్ ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే ఉపయోగపడింది తప్ప... లక్ష్యంవైపు నడిపించలేకపోయింది. హిట్టర్ శివమ్ దూబే (21; 2 ఫోర్లు, 1 సిక్స్), జడేజా (18; 2 ఫోర్లు, 1 సిక్స్) టైటాన్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తలొగ్గారు. ధోని (11 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఆఖర్లో సిక్సర్లతో అలరించాడు.

2 ఐపీఎల్ టోర్నీ చరిత్రలో ఒకే జట్టుకు చెందిన ఇద్దరు ఓపెనర్లు సెంచరీలు సాధించడం ఇది రెండోసారి. 2019లో బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లు బెయిర్‌స్టో, వార్నర్ తొలుత ఈ ఘనత సాధించారు.

100 శుబ్‌మన్ గిల్ శతకం ఐపీఎల్ టోర్నీ చరిత్రలో 100వ సెంచరీ కావడం విశేషం. ఐపీఎల్ ప్రారంభమైన ఏడాది 2008 ఏప్రిల్ 18న జరిగిన తొలి మ్యాచ్‌లోనే కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటర్ బ్రెండన్ మెకల్లమ్ మొదటి సెంచరీ చేశారు. మొత్తం 17 ఐపీఎల్ సీజన్‌లలో ఇప్పటి వరకు 1084 మ్యాచ్‌లు జరిగాయి.

2 ఐపీఎల్ టోర్నీ చరిత్రలో తొలి వికెట్‌కు 200 అంతకంటే ఎక్కువ పరుగుల భాగస్వామ్యం నమోదు కావడం ఇది రెండోసారి మాత్రమే. 2022లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఓపెనర్లు కేఎల్ రాహుల్ (68 నాటౌట్), డికాక్ (140 నాటౌట్) తొలి వికెట్‌కు అజేయంగా 210 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) దూబే (బి) తుషార్ 103; శుబ్‌మన్ గిల్ (సి) జడేజా (బి) తుషార్ 104; మిల్లర్ (నాటౌట్) 16; షారుఖ్ ఖాన్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 231. వికెట్ల పతనం: 1-210, 2-213, 3-231. బౌలింగ్: సాన్‌ట్నర్ 2-0-31-0, తుషార్ 4-0-33-2, శార్దుల్ 4-0-25-0, సిమర్‌జీత్ 4-0-60-0, జడేజా 2-0-29-0, మిచెల్ 4-0-52-0.

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (సి) తెవాటియా (బి) సందీప్ వారియర్ 1; రచిన్ (రనౌట్) 1; రుతురాజ్ (సి) రషీద్ ఖాన్ (బి) ఉమేశ్ 0; మిచెల్ (సి) షారుఖ్ (బి) మోహిత్ 63; అలీ (సి) నూర్ అహ్మద్ (బి) మోహిత్ 56; దూబే (సి) నూర్ (బి) మోహిత్ 21; జడేజా (సి) మిల్లర్ (బి) రషీద్ 18; ధోని (నాటౌట్) 26; సాన్‌ట్నర్ (బి) రషీద్ 0; శార్దుల్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 196. వికెట్ల పతనం: 1-2, 2-2, 3-10, 4-119, 5-135, 6-165, 7-169, 8-169. బౌలింగ్: ఉమేశ్ 3-0-20-1, సందీప్ వారియర్ 3-0-28-1, త్యాగి 4-0-51-0, నూర్ అహ్మద్ 2-0-25-0, రషీద్ ఖాన్ 4-0-38-2, మోహిత్ 4-0-31-3.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	16	1.453
రాజస్తాన్	11	8	3	16	0.476
హైదరాబాద్	12	7	5	14	0.406
చెన్నై	12	6	6	12	0.491
ఢిల్లీ	12	6	6	12	-0.316
లక్నో	12	6	6	12	-0.769
బెంగళూరు	12	5	7	10	0.217
గుజరాత్	12	5	7	10	-1.063
ముంబై	12	4	8	8	-0.212
పంజాబ్	12	4	8	8	-0.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా X ముంబై
వేదిక: కోల్‌కతా
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

నీరజ్‌కు రెండో స్థానం



దోహా: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా కొత్త సీజన్‌లో శుభారంభం చేశాడు. శుక్రవారం జరిగిన దోహా డైమండ్ లీగ్ మీట్‌లో ప్రస్తుత ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ అయిన నీరజ్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. 10 మంది పోటీపడిన ఈ ఈవెంట్‌లో నీరజ్ చివరిదైన ఆరో ప్రయత్నంలో జావెలిన్‌ను 88.36 మీటర్ల దూరం విసిరి రెండో స్థానాన్ని పొందాడు. జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్; 88.38 మీటర్లు) తొలి స్థానంలో నిలువగా... పీటర్సన్ (గ్రెనెడా; 86.62 మీటర్లు) మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన కిశోర్ జేనా 76.31 మీటర్లతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు.

ప్రజ్ఞానందకు మూడో స్థానం

వార్సా: సూపర్‌బెట్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద నిర్ణీత 9 రౌండ్ల తర్వాత 10 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 8 పాయింట్లతో ఆరో స్థానంలో, గుకేశ్ 7 పాయింట్లతో పదో స్థానంలో నిలిచారు.

నిజరూపం.. అపురూపం

- వైభవంగా అప్పన్న చందనోత్సవం
- నిజరూపంలో దర్శనం
- భారీగా తరలివచ్చిన భక్తజనం
- ప్రభుత్వం తరపున స్పెషల్ సీఎస్ కరికాల వలవన్ పట్టువస్త్రాల సమర్పణ



విద్యుత్ కాంతులతో సింహగిరి, క్యూలైన్లలో ఉన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) స్వామి సన్నిధిలో స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, స్వాత్మానందేంద్ర

సాక్షి, విశాఖపట్నం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వైశాఖ శుద్ధ తదియ (అక్షయ తృతీయ)ను పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజాము నుంచే స్వామి వారి దివ్యరూపాన్ని భక్తులు దర్శించుకున్నారు. ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే లభించే ఈ నిజరూప దర్శనం కోసం ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున ఒంటిగంటకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, చందనం ఒలుపును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి 2.15 గంటలకు స్వామివారి తొలి నిజరూప దర్శనం చేసుకుని, తొలి చందనం సమర్పించారు. తదుపరి స్వామి వారిని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. ప్రభుత్వం తరపున స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవన్, దేవదాయ శాఖ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం టీటీడీ తరపున డిప్యూటీ ఈవో లోకనాథం, వేదపండితులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తెల్లవారు జామున 2.30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. పలువురు ప్రముఖులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన న్యాయమూర్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి వరకు స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. రాత్రి 8.30 గంటలకు సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకుల తాకిడి తగ్గినా.. భక్తులు సుమారు లక్షమందికి పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున పర్యవేక్షించారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, అడిషనల్ కమిషనర్ పి.రామచంద్రమోహన్, దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

ఒక్క పిలుపుతో.. 79 లక్షలు

- సామాన్యులే స్టార్ క్యాంపెయినర్లుగా ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ సిద్ధం
- పేదల డబ్బులు అడ్డుకున్న చంద్రబాబుకు బుద్ధి చెబుతామంటున్న స్టార్ క్యాంపెయినర్లు

సాక్షి, అమరావతి: 'నేను మంచి చేశానని నమ్మితేనే నాకు ఓటేయండి.. మీకు మంచి చేసిన మీ బిడ్డకు అండగా నిలవండి.' అంటూ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపునకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. సామాన్యులే నా స్టార్ క్యాంపెయినర్లు అన్న పిలుపును అందిపుచ్చుకుని లక్షలాది మంది స్టార్ క్యాంపెయినర్లు సిద్ధం అంటూ ముందుకు వచ్చారు. 12 మందితో మొదలైన స్టార్ క్యాంపెయినర్ల జాబితా నేడు 79 లక్షలకు చేరిందని వైఎస్సార్‌సీపీ శుక్రవారం ప్రకటించింది. 'జగన్ కోసం సిద్ధం' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు స్టార్ క్యాంపెయినర్లుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. 96120 96120 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా స్టార్ క్యాంపెయినర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుంది.

చంద్రబాబుకు బుద్ధి చెబుతాం



గతంలో రుణమాఫీ పేరిట చంద్రబాబు డ్వాక్రా మహిళలను మోసం చేశారు. ఇప్పుడేమో మహిళలు సీఎం జగన్‌కు మద్దతుగా నిలుస్తున్నారనే కోపంతో ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాసి మహిళలకు అందాల్సిన ఆర్థిక సాయం నిలిపేయించారు. రైతులకు అందాల్సిన తుపాను సాయం అందకుండా చేశారు. తనకు ఓటు వేయని వారిపై చంద్రబాబు కక్ష కడితే.. తనకు ఓటు వేయని వారికి కూడా సాయం అందించిన లీడర్ సీఎం జగన్.

– గంగు కళ్యాణి, శ్రీకాకుళం

పిల్లలకు నాణ్యమైన ఇంగ్లిష్ విద్య



పేదల పిల్లలకు సీఎం జగన్ నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యను అందిస్తున్నారు. సకల సౌకర్యాలు, డిజిటల్ క్లాస్ రూంలు, ట్యాబ్‌లతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను బోధిస్తున్నారు. మరో పదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి బయటికి వచ్చే వారితో రాష్ట్రం మరో ఎత్తుకు ఎదగనుంది. వారి ఇంగ్లిష్ చదువులతో సాధించే ఉద్యోగాలతో కొన్ని లక్షల కుటుంబాల తలరాత మారిపోనుంది.

– అన్వర్, నెల్లూరు జిల్లా

94 శాతం ఇళ్లకు లబ్ధి



రాష్ట్రంలో 94 శాతం ఇళ్లకు ఈ ప్రభుత్వంలో లబ్ధి అందింది. అందులోనూ గ్రామీణ ప్రాంతాల్లో సీఎం జగన్ ప్రభుత్వాన్ని ప్రతి ఇంటి గడపకు తీసుకెళ్లారు. మా పొరుగింట్లో ఉండే శారద 'జగనన్న చేదోడు' ద్వారా లబ్ధి పొంది బట్టల షాపు ఏర్పాటు చేసుకుంది. దాసరి మహాలక్ష్మి అనే మహిళ భర్త మరణిస్తే రూ. 2 లక్షల బీమా పొందింది. దీంతో పాటు పెన్షన్, ఆసరా, అమ్మఒడి పథకాలు అర్హత ఉన్న అందరికీ అందుతున్నాయి. జగనన్న ప్రభుత్వంలో అందిన నవరత్నాలతో మా కుటుంబం రోజు గడవడం కూడా కష్టమయ్యే పరిస్థితుల నుంచి నిలకడ ఆదాయం అందుకునే స్థితికి వచ్చింది.

– ఎ. అనంతలక్ష్మి, రాజమండ్రి, తూర్పు గోదావరి

బాధ్యతగా పథకాలను అందించారు



ప్రజలకు బాధ్యతగా ప్రభుత్వ పథకాలు, సంక్షేమాన్ని అందించిన నాయకుడు సీఎం జగన్. ఈ ఐదేళ్లలో నిజమైన అభివృద్ధిని మా గ్రామంలో మేం చూశాం. మేం చదువుకునే రోజుల్లో కూడా ఇలాంటి ప్రభుత్వం ఉంటే మా జీవితాలు ఎంత బాగుపడేవో అని ప్రతి రోజు అనుకుంటున్నాను. గత ప్రభుత్వంలో కనీసం క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకోవడానికి కూడా వారం రోజులకు పైగా పట్టేది. ఇప్పుడు సచివాలయంలో క్షణాల్లో తీసుకుంటున్నారు.

– ఈశ్వరి, కొండపల్లి, మైలవరం, ఎన్టీఆర్ జిల్లా

వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించండి

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీకి సంఘీభావం ప్రకటిస్తున్న కరుణాకర్‌రెడ్డి తదితరులు

కృష్ణలంక (విజయవాడతూర్పు): ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. జగన్‌ను గెలిపించి మరోసారి సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఓసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత హామీలతో ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఓటమిని గ్రహించిన టీడీపీ ప్రతి నియోజకవర్గంలో తామే గెలుస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రజలు దీన్ని గమనించి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. అగ్రవర్ణ పేదలకు రాష్ట్రంలో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఓసీల్లోని రెడ్డి, కమ్మ, వైశ్య, క్షత్రియ, కాపు తదితర కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం జగన్‌కు ఓసీలందరూ అండగా ఉండి గెలిపించాలని కోరారు. రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు బాలబ్రహ్మారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, ఓసీ సంక్షేమ సంఘం నాయకులు ప్రభాకర్‌శర్మ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి జగన్ ప్రభుత్వం పెద్దపీట

- ఈ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత బ్రాహ్మణులు తీసుకోవాలి
- ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్ పిలుపు



సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలోనే మునుపెన్నడు లేని రీతిలో బ్రాహ్మణులతో పాటు అర్చకుల సంక్షేమానికి పెద్ద పీట వేసిన సీఎం జగన్‌ను బ్రాహ్మణులు, అర్చకులు కలిసికట్టుగా మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడుతూ.. 2019–24 మధ్య ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.783.79 కోట్లను డీబీటీ విధానంలో నేరుగా ఆయా లబ్ధిదారులకు అందజేసిందని ఆయన వివరించారు. 3,34,107 మంది పేద, మధ్య తరగతి బ్రాహ్మణులు ఆయా పథకాల లబ్ధి పొందారని.. గత చంద్రబాబు ప్రభుత్వం ఆ ఐదేళ్ల కాలంలో బ్రాహ్మణుల సంక్షేమానికి చేసిన దానికంటే జగన్ ప్రభుత్వంలో బ్రాహ్మణులకు చేకూరిన లబ్ధి మొత్తం మూడు రెట్లు అధికమన్నారు. మరోవైపు.. దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేసే అర్చకులు ఏళ్ల తరబడి కోరుకుంటున్న అనేక సమస్యలు, అంశాలకు జగన్ ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తు చేశారు. అర్చకుల సంక్షేమానికి సీఎం జగన్ చేపట్టిన చర్యలను ఆయన వివరించారు.

- గతంలో దేవదాయ శాఖ పరిధిలోని అర్చకులు ఎవరైనా 65 ఏళ్లకు పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడు వయసుతో నిమిత్తం లేకుండా ఆరోగ్యం బాగున్నంత వరకూ వారు అర్చకత్వం కొనసాగడానికి వీలుగా 2023 జూలైలో ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీని వల్ల 11,142 మంది అర్చకులు లబ్ధి పొందారు. మరో 3,326 మంది వంశపారంపర్య అర్చకులుగా గుర్తింపు పొందారు.
- రూ.5 వేల వేతనం తీసుకుంటున్న అర్చకుల వేతనాలను రూ.10 వేలకు పెంచడంతో పాటు, అంతకు ముందు రూ.10 వేల వేతనాలతో పని చేసే వారికి రూ.15,625 మొత్తానికి పెంచింది.
- వైఎస్ జగన్ ప్రభుత్వం ధూప దీప నైవేద్యం పథకం ద్వారా 5,338 ఆలయాలకు నెలకు రూ.5000 చొప్పున ఖర్చుతో పాటు.. అర్చకుడి వేతనానికి ఆర్థిక సాయం అందించింది. జగనన్న గృహ నిర్మాణ పథకం కింద 748 మంది అర్చకులకు లబ్ధి చేకూరింది.
- ఈనాం భూములు కలిగి ఉన్న 6,653 మంది అర్చకులకు ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రత్యేకంగా వర్తింపజేసింది. కొత్తగా సంక్షేమ నిధి ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేసి, దీని ద్వారా వేరుగా 2,393 మంది అర్చకులకు రూ.48.33 కోట్ల మేర వివిధ కార్యక్రమాల ద్వారా సాయం అందించారు.
- రాష్ట్రవ్యాప్తంగా 16 ఆగమ వేద పాఠశాలల ద్వారా 400 మంది విద్యార్థులకు ఆగమం, వేదాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు.. శిక్షణ సమయంలో స్టయిఫండ్ కోసం రూ.3.06 కోట్లను ప్రభుత్వం అందించింది. ఆలయాల్లో గోపూజలకు సైతం పెద్దపీట వేసి 10 వేల గోవులను సంరక్షిస్తోంది.
- రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం 8 ఆగమాలతో 2023 మేలో అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీమహాయజ్ఞం వైభవంగా నిర్వహించింది.

గీతాంజలి పిల్లల పేరిట రూ.20లక్షలు ఎఫ్‌డీ

- అందజేసిన వైఎస్సార్‌సీపీ యూకే విభాగం
- మా పాలిట దైవం సీఎం జగన్: బాలచందర్



డిపాజిట్ పత్రాలతో రిషిత, రుషిక

సాక్షి, అమరావతి: టీడీపీ సోషల్ మీడియా ఉన్మాదానికి బలైన తెనాలికి చెందిన గొల్తి గీతాంజలి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ యూకే విభాగం అండగా నిలిచింది. ఆమె ఇద్దరు పిల్లలు రిషిత(10), రుషిక(6) పేర్లతో రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షలను బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసింది. డిపాజిట్ పత్రాలను శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా గీతాంజలి భర్త గొల్తి బాలచందర్, కుమార్తెలు రిషిత, రుషికకు అందజేశారు. పిల్లలను బాగా చదివించాలని, భవిష్యత్తులో ఎలాంటి సహాయం అవసరమైనా వైఎస్సార్‌సీపీని సంప్రదించాలని బాలచందర్‌కు సజ్జల సూచించారు. బాలచందర్ మాట్లాడుతూ గీతాంజలి చనిపోయిన కొన్ని గంటల్లోనే సీఎం వైఎస్ జగన్ స్పందించి బతుకుపై తమ కుటుంబానికి భరోసా కల్పించారని తెలిపారు. 'వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ యూకే విభాగం కన్వీనర్లు డాక్టర్ ప్రదీప్ చింతా, ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యాన ఎ.సురేంద్రరెడ్డి, యూకేలోని వైఎస్సార్‌సీపీ విభాగం సభ్యులు అందరూ కలిసి మా పిల్లల పేరు మీద రూ.20 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలు అందజేశారు' అంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా మధు, ఎన్ఆర్ఐ కాశీపతి పాల్గొన్నారు.

‘పీఎస్ఎల్వీ’ కొత్త ఇంజిన్ పరీక్ష సక్సెస్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు ఎంతో నమ్మకమైన రాకెట్‌గా గుర్తింపు పొందిన పీఎస్ఎల్వీ రాకెట్‌కు నాలుగో దశలో సరికొత్తగా ఒక ఇంజిన్‌ను డిజైన్ చేసి గురువారం పరీక్షించి శాస్త్రవేత్తలు విజయం సాధించారు. ఈ ఇంజిన్‌ను తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో డిజైన్ చేయగా తమిళనాడులోని మహేంద్రగిరిలో ఇస్రో ప్రపల్షన్ కాంప్లెక్స్‌లో ఇంజిన్‌కు పరీక్ష నిర్వహించారు. ఈ ఇంజిన్‌ను 665 సెకన్లపాటు మండించి దాని సామర్థ్యాన్ని నిర్ధారించుకున్నారు. దీని వల్ల ప్రయోగానికి అయ్యే వ్యయం కూడా తగ్గుతుందని శాస్త్రవేత్తలు చెప్పారు. రాబోయే పీఎస్ఎల్వీ రాకెట్‌లో ఈ ఇంజిన్‌ను ఉపయోగించి ప్రయోగాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని పేర్కొన్నారు.



ఇంజిన్‌ను మండిస్తూ సామర్థ్యాన్ని నిర్ధారించుకోవడానికి పరీక్షిస్తున్న దృశ్యం

‘ఈ ఇంట్లో ఓట్లు అమ్మబడవు’

‘ఈ ఇంట్లో ఓట్లు అమ్మబడవు..డబ్బులు తీసుకోము కానీ..తప్పనిసరిగా ఓట్లు వేస్తాము..ఓట్ల పండుగలో పాల్గొందాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం..’ అంటూ ఏలూరు కామవరపుకోటకు చెందిన వీరమల్ల మధు కుటుంబీకులు వేసిన ఫ్లెక్సీ పలువురిని ఆలోచింపజేస్తుంది. మధు మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా సరే వృద్ధులకు పెన్షన్ అందజేయడంతో పాటు ఉచిత విద్య, ఏ ఆసుపత్రికి వెళ్లినా ఉచిత వైద్యం అందజేసినట్లయితే ప్రజలకు ఇతర పథకాలు అందజేయాల్సిన అవసరం ఉండదని అన్నారు.

– కామవరపుకోట



కామవరపుకోటలో మధు ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జగన్ పాలనలోనే పేదల అభివృద్ధి

- ఏపీ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలోనే లక్షలాది ప్రజలు పేదరికాన్ని జయించారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతివ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ (ఏపీసీసీ) పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పాస్టర్లకు నెలకు రూ.5వేలను సీఎం వైఎస్ జగన్ జమచేశారని, పాస్టర్లకు మరింత మేలు చేసేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలబడాలని క్రైస్తవ మత చర్చిలకు చెందిన నాయకులు, స్వతంత్ర చర్చి నాయకులు, వివిధ విద్యా, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ఏపీసీసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఏపీసీసీ అధ్యక్షుడు కేఏఫ్ పరదేశిబాబు, ఉపాధ్యక్షుడు జాన్ ఎస్‌డీఆర్ నక్కా, ప్రధాన కార్యదర్శి జీఎస్ సుధీర్, ఉపాధ్యక్షురాలు పి.స్వర్ణలత, సంయుక్త కార్యదర్శులు డి.జడ్సన్, ఎం.శాంసోన్, పి.వరప్రసాదరావు, కోశాధికారి కె.జయరావు ప్రకటన విడుదల చేసిన వారిలో ఉన్నారు.

ఉద్యోగ,ఉపాధి కల్పనలో రికార్డు సృష్టించిన వైఎస్సార్‌సీపీ

- వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ రెడ్డి వెల్లడి

సాక్షి,అమరావతి: రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి కల్పనలో రికార్డు సృష్టించిందని వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు పూనూరు గౌతమ్ రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఐదేళ్ల క్రితం వరకు చదువు పూర్తి చేసుకున్న యువత ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాల వైపు చూసే పరిస్థితి ఉందన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయని చెప్పారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో 58.22 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడమే ఇందుకు నిదర్శనమన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



అటు మోసం.. ఇటు నమ్మకం

అటు మాటపై నిలబడని చంద్రబాబు.. ఇటు మాటపై నిలబడే సీఎం జగన్

కూటమిది మాయఫెస్టో.. వైఎస్సార్‌సీపీది మేనిఫెస్టో



- మాటలతో మభ్యపెట్టి లబ్ధి పొందడమే చంద్రబాబు అజెండా
- మేనిఫెస్టో అంటే ఈయన దృష్టిలో చిత్తు కాగితం
- ఎన్నికలప్పుడు అలవికాని హామీలు.. ఆ తర్వాత చెత్తబుట్టలో వేయడం బాబు నైజం
- 2014 ఎన్నికల్లో జనసేన, బీజేపీతో జట్టుకట్టి 650 హామీలు
- అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా ముంచిన వైనం
- రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేయకుండా రైతులకు టోపీ
- రూ.25,570.90 కోట్ల డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా మహిళలకు మోసం
- ఇంటికో ఉద్యోగం.. లేదా నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి అంటూ యువతకు వంచన



- మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా చూస్తున్న సీఎం జగన్
- అమలు చేయగలిగిన హామీలు మాత్రమే ఇస్తున్న జననేత
- విశ్వసనీయత లేకపోతే రాజకీయాల్లో ఉండకూడదన్నది జగన్ సిద్ధాంతం
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం జగన్ విధానం
- 2019లో రెండే రెండు పేజీలతో మేనిఫెస్టో విడుదల చేసిన జగన్
- అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం.. ఇప్పటికి 99 శాతం హామీలు అమలు
- సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ
- నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనం
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంతో సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో మరింత పెరిగిన విశ్వసనీయత
- 2024 ఎన్నికల మేనిఫెస్టోను రెండు పేజీలతో విడుదల చేసిన సీఎం జగన్
- **జగనన్న అమ్మ ఒడి కింద ఇస్తున్న సొమ్ము రూ.15 వేల నుంచి రూ.17 వేలకు పెంపు**
- వైఎస్సార్ రైతు భరోసా కింద చేస్తున్న సాయం రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంపు
- వృద్ధాప్య పెన్షన్ రూ.3 వేల నుంచి రెండు విడతల్లో రూ.3,500కు పెంచుతానని హామీ



2014 ఎన్నికల తరహాలోనే మళ్లీ జనసేన, బీజేపీలతో జట్టుకట్టి అలవికాని హామీలతో చంద్రబాబు మేనిఫెస్టో

కర్ణాటక, తెలంగాణల్లో విఫలమైన పథకాలకు సూపర్ సిక్స్ ముసుగు


చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం ఇదే తొలిసారి కాదు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి, 1995లో అధికారంలోకి వచ్చిన బాబు.. 94 ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోలోనూ సంపూర్ణ మద్యపాన నిషేధం, రూ.2కే కిలో బియ్యం హామీలను తుంగలో తొక్కారు. మద్యపాన నిషేధాన్ని ఎత్తేసి, రూ.2 కే కిలో బియ్యాన్ని రూ.5.50కి పెంచి ప్రజలను మోసం చేశారు. 1999 ఎన్నికల్లోనూ అదే కథ. కోటి మందికి ఉపాధి కల్పిస్తానని, 30 లక్షల ఇళ్లు కట్టిస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు.



దివాలాకోరు

బ్యాంకులకు రూ.5,700 కోట్లు కుచ్చు టోపీ

- సుజనా వ్యక్తిగత దివాలా ప్రక్రియకు ఎన్‌సీఎల్‌టీ అనుమతి
- ఎస్‌బీఐలో రూ.500 కోట్ల రుణానికి వ్యక్తిగత పూచీకత్తు
- డొల్ల కంపెనీలను సృష్టించటంలో ఘనుడు
- తప్పుడు పత్రాలతో బ్యాంక్‌లను బురిడీ కొట్టించిన మోసగాడు
- అఫిడవిట్‌లో చూపే స్థిరాస్థులు రూ.34 లక్షలే..
- కోట్ల ఖరీదైన కార్లు, వందల కిలోల బంగారం
- పశ్చిమ ప్రజల ఆశలకు సుజనా గాలిలో మేడలు



సాక్షి ప్రతినిధి, విజయవాడ:/వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): తెలుగు రాష్ట్రాల్లో సుజనా చౌదరి అనగానే వెంటనే గుర్తొచ్చేది బ్యాంకులను దోచుకోవటం. డొల్ల కంపెనీలను సృష్టించి, మాయ చేయడంలో దిట్ట... అని బీజేపీ, టీడీపీ నాయకులే చెబుతారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచేసిన సుజనా నేడు ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రజలకు శ్రీరంగ నీతులు చెబుతున్నారు. వ్యాపారం ముసుగేసుకుని మాయ కంపెనీలను సృష్టించి వేల కోట్ల రూపాయలను దోచేసిన ఈ దోపిడీదారు వాటితో విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. కోట్ల విలువ చేసే కార్లు, వందల కిలోల బంగారంతో సుజనా కుటుంబం ఎంజాయ్ చేస్తోందని పలువురు రాజకీయ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు. 2018లో సాక్షాత్తూ బీజేపీ ప్రభుత్వంలోని నిఘా సంస్థలే ఆయనపై కేసులు నమోదు చేసి కోర్టుకు అప్పగించాయి.

వ్యక్తిగత దివాలా ప్రక్రియకు ఎన్‌సీఎల్‌టీ అనుమతి...

సుజనా చౌదరి వ్యక్తిగత దివాలా ప్రక్రియకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా గత నెల 18నే ఉత్తర్వులు జారీ చేశారు.. దివాలా పరిష్కారకర్త (రిజల్యూషన్ ప్రొఫెషనల్)ను నియమిస్తూ ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆస్తుల క్రయవిక్రయాలను నిలిపేసింది. దివాలా ప్రక్రియకు వెళ్లిన స్లైపండిడ్ మెటల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎస్‌బీఐలో రూ.500 కోట్ల రుణం తీసుకుంది. రుణం తీర్చకపోవడంతో ఈ కంపెనీకి పూచీకత్తు వహించిన సుజనా చౌదరిపై వ్యక్తిగత దివాలా ప్రక్రియ ప్రారంభించి, పరిష్కారాన్ని చేపట్టాలని ఎస్‌బీఐ 2021లో ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేసింది. ఆయన ఆస్తుల మదింపు చేపట్టి, వేలం ద్వారా ఎస్‌బీఐ రుణాలను చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. రుణదాతకు ఏదైనా కంపెనీ, వ్యక్తులు రుణాన్ని ఎగవేసినప్పుడు, దానికి వ్యక్తిగతంగా గ్యారంటీ ఉన్న వ్యక్తులే బాధ్యత వహించాలని చట్టం చెబుతోంది. దీని ప్రకారం దివాలా ప్రక్రియను ప్రారంభించేందుకు పరిష్కారకర్తను నియమించి, ఆస్తులను పరిశీలించి, అయా రుణదాతలకు ఇవ్వాల్సిన నిష్పత్తి మేరకు చెల్లించేలా సూచిస్తారు.

మోసపోయిన చిట్టాలో చాలా బ్యాంకులు..

చెన్నైలోని బెస్ట్ అండ్ క్రాంప్టన్ ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ తప్పుడు ఖాతాలు, వివరాల ఆధారంగా రుణాలు పొందింది. దీనివల్ల తాము రూ.363 కోట్లకు పైగా నష్టపోయామని ఆరేళ్ల క్రితం మూడు బ్యాంకులు కన్సార్టియానికి ఫిర్యాదులు చేశాయి. వాటి ఆధారంగా బెంగళూరు సీబీఐ, బ్యాంకింగ్ సెక్యూరిటీస్ అండ్ ఫ్రాడ్ సెల్‌లు కేసులు నమోదు చేశాయి. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.133 కోట్లు), ఆంధ్రా బ్యాంకు (రూ.71 కోట్లు), కార్పొరేషన్ బ్యాంకు (రూ.159 కోట్లు)లు సహ వ్యవస్థగా ఏర్పడి ఈ రుణాలు ఇచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల మేరకు సీబీఐ, బీఎస్ అండ్ ఎఫ్‌సీ కేసుల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ కింద ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. నిఘా సంస్థలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లలోని బీసీఈపీఎల్‌కు చెందిన అధికారుల ఇళ్లల్లో 2018 అక్టోబరు 8న సోదాలు నిర్వహించి, కొన్ని కీలక పత్రాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు కొనసాగించాయి.

డొల్ల కంపెనీల స్టాంపులన్నీ సుజనా ఆఫీస్‌లోనే...

ఆనాడు విచారణ చేపట్టిన నిఘా సంస్థలు సుజనాకు చెందిన హైదరాబాద్‌లోని నాగార్జున హిల్స్ నుంచి వివిధ డొల్ల కంపెనీలకు సంబంధించిన 200 వరకూ రబ్బర్ స్టాంపులు, లెటర్‌ప్యాడ్‌లు స్వాధీనం చేసుకున్నాయి. అందులో సుజనా గ్రూపునకు చెందిన చాలా సంస్థలు ఉన్నాయి. కీలక పత్రాలు, రికార్డులను పరిశీలించగా బీసీఈపీఎల్‌తోపాటు సుజనా గ్రూప్‌లోని చాలా కంపెనీలు సుజనాచౌదరి ఆధ్వర్యంలో నడుస్తున్నట్లు ధ్రువీకరించామని ప్రభుత్వ నిఘా సంస్థలు అప్పట్లో ప్రకటించాయి. ఇదే కాదు.. సుజనా గ్రూప్‌లోని అన్ని సంస్థల డైరెక్టర్లు సుజనాచౌదరి సూచనల మేరకు నడుచుకుంటున్నట్లు దర్యాప్తులో నిఘా సంస్థలకు వివరించారు. అందుకు సంబంధించిన ఆధారాలనూ దర్యాప్తు సంస్థలు స్వాధీనం చేసుకున్నాయి. గ్రూప్ మొత్తం వ్యవహారాలకు సుజనాచౌదరి ఒక్కరే వ్యక్తిగత బాధ్యుడని చెబుతూ డైరెక్టర్లు స్వచ్ఛందంగా వాంగ్మూలం ఇవ్వడం ఈయన మోసాలకు బలమైన సాక్ష్యంగా నిలిచింది.

కొల్లగొట్టిన సొమ్ముతో విలాసాలు

కొల్లగొట్టిన సొమ్ముతో సుజనా కుటుంబం విలాసాలను అనుభవిస్తోందని పలువురు రాజకీయ నాయకులు విమర్శిస్తున్నారు. నిఘా సంస్థలు తమ విచారణలో లభించిన పత్రాలను బట్టి సుజనా కంపెనీలపై ఫెమా, డీఆర్ఐ, సీబీఐ కేసులు ఉన్నట్లు తేలిందని ఈడీ అధికారులు 2018లో పేర్కొన్నారు. చౌదరి ఇంటి వద్ద ఆరు ఖరీదైన కార్లను గుర్తించారు. అవన్నీ డొల్ల కంపెనీల పేర్లతో రిజిస్టరై ఉన్నాయి. ఆ వాహనాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నామని అప్పట్లో నిఘా సంస్థల అధికారులు తెలిపారు. సుజనా భార్య పద్మజ పేరు మీద 11 కిలోల 477 గ్రాముల బంగారం, 41 కిలోల 250 గ్రాముల వెండి ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇవన్నీ డొల్ల కంపెనీలతో సంపాదించిన ఆస్తుల్లో భాగమేనని ఆరోపణలు ఉన్నాయి.

సుజనాచౌదరిపై బహిరంగ నోటీసు..

దివాలా ప్రక్రియలను పర్యవేక్షించే ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ సంస్థ సుజనాచౌదరికి బహిరంగ నోటీసును జారీ చేసింది. . ఈ మేరకు ఒక పత్రికలో బహిరంగ ప్రకటన కూడా చేసింది. సుజనా చౌదరి రుణదాతలు వారి వివరాలను తమకు తెలియజేయాలని అందులో సూచించింది. క్లైయిములు దాఖలు చేసుకోవచ్చని అందులో పేర్కొంది. ఈ ప్రకటన విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సంచలనం సృష్టించింది. విశేషమేంటంటే...సుజనాచౌదరి తన అఫిడవిట్‌లో తన స్థిరాస్తులు కేవలం రూ.34 లక్షలు మాత్రమే చూపించారు. ఇదే మొత్తంలో ఆస్తులుంటే.. ఇంత పెద్ద మొత్తంలో అప్పులకు ఎలా హామీదారుగా ఉన్నారో విచిత్రంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

సీబీఐ కేసు నమోదు.. ఈడీ సోదాలు

డొల్ల కంపెనీలతో బ్యాంకులకు ఏకంగా రూ.5,700 కోట్ల మేర సుజనా గ్రూప్స్ కుచ్చుటోపీ వేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 2018లో పేర్కొంది. బ్యాంకుల ఫిర్యాదు మేరకు సీబీఐ కేసు నమోదు చేసిందని, ఇందులో భాగంగానే ఆ సంస్థకు చెందిన ఎనిమిది ప్రదేశాల్లో సోదాలు నిర్వహించినట్లు అప్పట్లో ఈడీ వెల్లడించింది. అప్పుడే దీనిపై ప్రకటనను సైతం ఈడీ విడుదల చేసింది. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సుజనా ఆ తరువాత కేంద్రమంత్రిగా ఎదిగారు. ఆ క్రమంలో డొల్ల కంపెనీలతో బ్యాంకులకు రూ.5,700 కోట్ల మేర సుజనా గ్రూప్స్ కుచ్చుటోపీ వేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పేర్కొనడమే సంచలనమయింది. మోసపోయిన బ్యాంకుల ఫిర్యాదు మేరకు సీబీఐ కేసు నమోదు చేయడం అంతా చకచకా జరిగిపోయాయి. అందులో భాగంగానే ఆ సంస్థకు చెందిన కంపెనీల్లో ఈడీ సోదాలు నిర్వహించి అనేక ఆధారాలను సేకరించి, వాటిని చూసి విస్తుపోయింది.

సుజనా గురువు బాబే...

చంద్రబాబు ఆదేశాలతోనే సుజనాచౌదరి మోసాలు చేశారని టీడీపీ కూటమిలోని నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా కేసుల నమోదు, విచారణ జరుగుతున్న సమయంలో సుజానా టీడీపీ ఎంపీగా ఉన్నారు. అదే హోదాలో ఆయన బీజేపీలోకి వెళ్లిపోయారు. కేసుల నుంచి తప్పించుకోవడానికి చంద్రబాబే ఆ పార్టీకి పంపించారని అప్పట్లో పెద్ద దుమారం లేచింది. ఒక పార్టీ ఎంపీగా వేరే పార్టీలోకి వెళ్లినప్పుడు సహజంగా ఆ పదవులకు రాజీనామా చేయటం పరిపాటి. ఈ దోపిడీ ఘటానికి అలాంటి పట్టింపులేమీ లేవు గనుక రాజీనామా ఊసే లేదు. ముందస్తు కుట్రలో భాగంగానే టీడీపీ నాయకులు ఆయన్ని రాజీనామా చేయాలనీ అడగలేదు. దీన్ని బట్టి చంద్రబాబు మార్గదర్శకత్వంలోనే సుజనాచౌదరి ఈ మోసాలకు తెగించారనే బలమైన వాదనలు ఉన్నాయి. ప్రస్తుత ఎన్నికల్లోనూ చంద్రబాబు దర్శకత్వంలోనే బీజేపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

పెత్తందార్లపై యుద్ధం పేదలంతా సిద్ధం

పేదోడి డాక్టర్ కల సాకారం

- 17 ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటు.. కొన్ని ప్రారంభం
- కొత్తగా రాజంపేటలోనూ వైద్య కళాశాల ఏర్పాటుకు హామీ
- అందుబాటులోకి 2 వేలకు పైగా ఎంబీబీఎస్ సీట్లు
- సీఎం జగన్ ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ప్రశంసలు
- 2014–19 మధ్య మెడికల్ పీజీ కోర్సుల ఫీజులను భారీగా పెంచిన చంద్రబాబు
- జగన్ పాలనలో దాదాపు 50 శాతం మేర ఫీజుల తగ్గింపు

సాక్షి, అమరావతి: మెడలో స్టెతస్కోప్.. ఒంటిపై తెల్లటి కోటు.. డాక్టర్ అనే పిలుపు.. ఈ గౌరవం ప్రతి సామాన్య, నిరుపేద బిడ్డకు దక్కాలంటే వైద్య విద్య వ్యాపారంగా మారకూడదు. అందు కోసం సీఎం జగన్ ప్రభుత్వం చేపట్టిన చర్యలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. డాక్టర్ చదువును సామాన్యుల దరికి చేర్చేలా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారు. చంద్రబాబు పాలనలో సామాన్యులు, పేదలకు వైద్య విద్యను దూరం చేయడమే లక్ష్యంగా పావులు కదిపారు. రాష్ట్రంలో ప్రైవేట్ వైద్య కళాశాలల ఏర్పాటును ప్రోత్సహించారు. ఆ ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఫీజులను సైతం అమాంతం పెంచారు. దీంతో పేద, మధ్య తరగతి పిల్లల వైద్య విద్య కలగా మారింది. జగన్ రాకతో పేదింటి బిడ్డలు ఇప్పుడు వైద్య విద్య అభ్యసిస్తున్నారు.

బాబు వస్తే వైద్య విద్య వ్యాపారమే..

2014లో కేంద్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాలను చంద్రబాబు రాబట్టలేకపోయారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని బూచిగా చూపి పేదలకు ద్రోహం చేస్తూ ప్రైవేట్ వైద్య కళాశాలలను ప్రోత్సహించారు. దీంతో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటవకపోవడంతో మన విద్యార్థులు వైద్య విద్య కోసం వలసలు వెళ్లాల్సి వచ్చేది. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు లేక ప్రజలు విలవిల్లాడారు. 2014 తరహాలోనే బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు.. ఇప్పుడు కూడా మాయమాటలు చెబుతూ.. ప్రస్తుత ఎన్నికల్లోను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. బాబు వస్తే.. వైద్య విద్య వ్యాపారంగా

-మిగతా IVలో



ఇదీ విశ్వసనీయత, నిజాయితీకి మారుపేరైన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2024 మేనిఫెస్టో

V, VI పేజీల్లో

ఓటింగ్ శాతం తగ్గినా.. ఓట్లు పెరిగాయ్!

సార్వత్రిక సమరంలో ఎన్నికల 'వేడి' పరాకాష్ఠకు చేరుతోంది. ఇప్పటికే 3 విడతల్లో పోలింగ్ పూర్తికాగా, మరో నాలుగు విడతలు మిగిలి ఉన్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే, ఈసారి తొలి మూడు విడతల్లో పోలింగ్ తగ్గడం అటు పార్టీలతో పాటు ఎన్నికల సంఘాన్ని కూడా కలవరపెడుతోంది. మండుటెండలు, పట్టణ ఓటర్ల నిరాసక్తత వంటివి ఇందుకు కారణమని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే ఓట్ల శాతం తగ్గినా, పోలైన మొత్తం ఓట్ల సంఖ్య మాత్రం 2019తో పోలిస్తే ఎక్కువగానే ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషకులు వెల్లడించారు. అంతేగాక రానున్న విడతల్లో పోలింగ్ శాతం కూడా పెరిగే అవకాశం ఉందని వారంటున్నారు. 2019లో తొలి దశలో 69.4 శాతం, రెండో దశలో 69.3 శాతం, మూడో దశలో 67.3 శాతం చొప్పున ఓటింగ్ నమోదైంది. ఈసారి మొదటి విడతలో 66.1 శాతం, రెండో దశలో 66.7 శాతం, మూడో విడత 65.7 శాతం ఓటింగ్ జరిగింది. శాతాల్లో చూస్తే 2019 కంటే తగ్గినట్టు కన్పిస్తున్నా వాస్తవానికి తొలి రెండు దశల్లో పోలైన ఓట్ల సంఖ్యలో 8.7 లక్షలు పెరుగుదల నమోదైంది. 2019లో తొలి రెండు విడతల్లో 20.61 కోట్ల మంది ఓటేయగా, 2024లో 20.7 కోట్లకు పెరిగింది. పెరిగిన ఓట్లలో మహిళ సంఖ్య ఎక్కువగా ఉండటం విశేషం. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో ఓట్లు పెరగడం మరో కీలకాంశం.

రాష్ట్రాల్లో ఇలా...

రాష్ట్రాల విషయానికొస్తే ఈసారి తొలి రెండు దశల్లో కర్నాటకలో 12.9 లక్షల ఓట్లు అధికంగా పడ్డాయి. గత లోక్‌సభ ఎన్నికల్లోనూ పోలింగ్ ఏడు విడతల్లో జరిగింది. తొలి మూడు విడతల్లో ఓటింగ్ అధికంగా నమోదై ఆ తర్వాత విడతల్లో తగ్గింది. ఈసారి అందుకు భిన్నంగా తొలి మూడు విడతల్లో పోలింగ్ తగ్గింది. కనుక మిగతా నాలుగు విడతల్లో పోలింగ్ భారీగా పుంజుకుంటేనే కనీసం గత ఎన్నికల స్థాయిని అందుకోగలుగుతుంది. అయితే 2019లో మొత్తం ఓటర్ల సంఖ్య 91.2 కోట్లు కాగా 2024లో 96.9 కోట్లకు పెరిగింది. అందుకే ఈసారి ఓటింగ్ తొలి మూడు విడతల్లో శాతాల్లో తగ్గినా సంఖ్యాపరంగా పెరిగిందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎన్నికల సమాచారం సమస్తం... వేలి కొసలపైనే!

ఓటరుగా నమోదు చేసుకోవాలంటే ఒకప్పుడు పెద్ద తతంగమే ఉండేది. సమీపంలోని రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత దాని పరిస్థితేమిటో తెలిసేది కాదు. ఓటర్ల జాబితా విడుదలైనప్పుడు అందులో పేరుంటే ఓటు హక్కు వచ్చినట్టు తెలిసేది! ఇదంతా గతం. ఇప్పుడు ఎన్నికల సంఘం టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగిస్తోంది. సేవలు, విధులను దాదాపుగా డిజిటలీకరించింది. తద్వారా పారదర్శకతను పెంచే దిశగా కృషి చేస్తోంది. ఓటరుగా నమోదు మొదలుకుని తప్పొప్పులు, చిరునామా సవరణలు, ఓటు బదిలీ దాకా ఇప్పుడన్నీ కూర్చున్న చోటినుంచి ఆన్‌లైన్‌లోనే చేసుకోవచ్చు. అంతేనా?! ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది, అక్కడికెలా వెళ్లాలి, అభ్యర్థులు, వారి ఆస్తులు, కేసుల వివరాల వంటివన్నీ స్మార్ట్ ఫోన్ నుంచే తెలుసుకోవచ్చు. ఎన్నికల్లో అవకతవకలపై ఫిర్యాదులు కూడా ఆన్‌లైన్‌లోనే చేసేయవచ్చు. ఇలా గడచిన దశాబ్ద కాలంలో ఎన్నికల సంఘం తీసుకొచ్చిన డిజిటల్ మార్పులు అన్నీ ఇన్నీ కావు. వాటిని ఓసారి తెలుసుకుందాం...

– సాక్షి, నేషనల్ డెస్క్

ఈసీ డిజిటల్ విప్లవం | **అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే** | **ఓటర్ నమోదు నుంచి ఫిర్యాదు దాకా** | **అందుబాటులో డిజిటల్ ఓటర్ ఐడీ**



నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌వీఎస్‌పీ) (2015)

ఈ పోర్టల్ (వెబ్‌సైట్) ద్వారా కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, నియోజకవర్గాలు, వాటి పరిధిలో పోలింగ్ కేంద్రాల సమచారం తెలుసుకోవచ్చు. బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల వివరాలు కూడా ఇక్కడే లభిస్తాయి.

ఎన్‌వీఎస్‌పీ ఆధునీకరణ (2019)

ఓటర్లకు కావాల్సిన సేవలన్నింటికీ ఏకీకృత పోర్టల్‌గా www.nvsp.in పేరుతో ఈసీ దీన్ని అభివృద్ధి చేసింది. తర్వాత voters.eci.gov.inకు అనుసంధానం చేసింది.

ఐటీ నెట్‌వర్క్ (2019)

దేశవ్యాప్తంగా నియోజకవర్గాల స్థాయిలో తాజా సమాచారం, ఓట్ల లెక్కింపు తాలూకు తాజా ఫలితాలు తెలుసుకునేందుకు ఎన్నికల సిబ్బంది కోసం తీసుకొచ్చిన నెట్‌వర్క్. 2019 ఎన్నికల కౌంటింగ్‌కు ముందు దీన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు ఈ ఐటీ సదుపాయం ద్వారా తాజా సమాచారం తెలుసుకుని డిజిటల్ తెరలపై ప్రదర్శించడానికి అవకాశం ఏర్పడింది.

ఆధార్‌తో అనుసంధానం (2022)

ఓటర్ జాబితాలో కచ్చితత్వానికి వీలుగా ఓటర్ల ఎపిక్‌లతో ఆధార్ అనుసంధాన కార్యక్రమాన్ని ఈసీ చేపట్టింది.

ఎలక్ట్రానిక్ పోస్టల్ బ్యాలెట్ (2016)

ఎన్నికల విధుల్లో ఉండే సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లను ఎలక్ట్రానిక్ రూపంలో పంపించేందుకు ఎన్నికల సంఘం దీన్ని ప్రవేశపెట్టింది. ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్‌గా పిలుస్తారు.

ఎరోనెట్ (2018)



ఎలక్టోరల్ రోల్ ఆఫీసర్స్ నెట్‌వర్క్ సంక్షిప్త రూపమే ఎరోనెట్. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉమ్మడి సదుపాయాలు వినియోగించుకునేందుకు వీలుగా డిజిటల్ నెట్‌వర్క్‌ను ఈసీ రూపొందించింది. ఎన్‌వీఎస్‌పీ లేదా ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా పౌరులు నమోదు చేసే డేటాకు ఇది బ్యాకప్‌గా పని చేస్తుంటుంది.

అబ్జర్వర్ యాప్ (2019)

ఎన్నికల పరిశీలకులు (సాధారణ, పోలీసు, వ్యయ) ఈ యాప్ ద్వారా తమ నివేదికలను ఫైల్ చేయవచ్చు. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎక్కడ ఉందన్నది ఈ యాప్ ద్వారా ఎన్నికల అధికారులు చూడవచ్చు. అవసరమైతే స్క్వాడ్‌ను పిలవడం తదితర టాస్క్‌లను నిర్వహించుకోవచ్చు.

ఓటర్ టర్నౌట్ యాప్ (2019)

పోలింగ్ నాడు దేశవ్యాప్తంగా ఏయే ప్రాంతాల్లో ఓటింగ్ శాతం ఎలా ఉందో ఈ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది.

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (2019)

తమ నియోజకవర్గంలో పోలింగ్ ఎప్పుడో ఈ యాప్‌తో తెలుసుకోవచ్చు. ఓటరు జాబితాలో తమ పేరునూ పరిశీంచుకోవచ్చు. అభ్యర్థుల సమాచారం కూడా తెలుసుకోవచ్చు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ ఎంత ఉందన్నది ఎప్పడికప్పుడు తెలుసుకోవచ్చు. ఎన్నికల ఫలితాలు కూడా అందుబాటులో ఉంటాయి.

సి-విజిల్ యాప్ (2018)

ఎన్నికల నియమావళిని అభ్యర్థులు ఉల్లంఘించినా, అభ్యర్థులు పరిమితికి మించి ఖర్చు చేస్తున్నా; ఓటర్లను ధన, వస్తు రూపంలో ప్రలోభాలకు గురి చేస్తున్నా ఎవరైనా సరే ఈ యాప్ ద్వారా నేరుగా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఫొటో, వీడియో రుజువులను లొకేషన్ జియోట్యాగ్ చేసి అప్‌లోడ్ చేయవచ్చు.

గరుడ యాప్ (2020)

బూత్ స్థాయి అధికారుల కోసం తెచ్చిన యాప్. పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, క్షేత్ర స్థాయి తనిఖీలు, డాక్యుమెంట్లు, ఫొటోల అప్‌లోడింగ్‌కు వీలు కల్పిస్తుంది.

క్యాండిడేట్ నామినేషన్ యాప్ (2020)

అభ్యర్థులు తమ నామినేషన్లను ఈ యాప్ ద్వారా డిజిటల్‌గానే దాఖలు చేయవచ్చు. అఫిడవిట్ డిజిటల్ కాపీని అప్‌లోడ్ చేసి, సెక్యూరిటీ డిపాజిట్ కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చు.

సక్షమ్ ఈసీఐ యాప్ (2023)

గతంలో దీన్ని పర్సన్స్ విత్ డిజెబుల్డ్ యాప్ (పీడబ్ల్యూడీ)గా పిలిచేవారు. దివ్యాంగులు ఇందులో అభ్యర్థుల సమాచారం, పోలింగ్ కేంద్రాలకు ఎలా వెళ్లాలి? ఫిర్యాదుల నమోదు, బూత్ వరకు వెళ్లేందుకు సాయం కోరడం తదితర సేవలను పొందవచ్చు.

నో యువర్ క్యాండిడేట్ (2022)

అభ్యర్థులకు సంబంధించిన అన్ని వివరాలు ఈ యాప్ ద్వారా ఓటర్లు తెలుసుకోవచ్చు. అభ్యర్థులు అఫిడవిట్లలో పేర్కొన్న ఆస్తులు, వారిపై క్రిమినల్ కేసులు తదితర పూర్తి సమాచారం లభిస్తుంది.

ఈ-ఎపిక్/డిజిటల్ ఓటర్ ఐడీ కార్డులు (2021)

ఎలక్షన్ ఫొటో ఐడీ కార్డ్ (ఎపిక్) ఎంతో ముఖ్యమైనది. భౌతిక కార్డు లేని వారు ఈ-ఎపిక్‌ను ఈసీ పోర్టల్ నుంచి మొబైల్ ఫోన్లోకి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీన్ని ప్రింట్ చూపించి కూడా ఓటు వేయవచ్చు.

మహారాష్ట్రలో 'మహా' కూటముల కొట్లాట కాక రేపుతోంది. యూపీ తర్వాత అత్యధికంగా ఇక్కడ 48 లోక్‌సభ స్థానాలుండగా తొలి మూడు దశల్లో 24 సీట్లలో పార్టీల భవితవ్యం ఈవీఎంలలోకి చేరిపోయింది. నాలుగో అంకంలో 13న రాష్ట్రంలో మరో 11 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఎన్డీఏ (మహాయుతి), ఇండియా (మహా వికాస్ అగాడీ) కూటములు హోరాహోరీగా తలపడుతున్న కీలక నియోజకవర్గాలపై ఫోకస్...

– సాక్షి, నేషనల్ డెస్క్



పశ్చిమ కనుమల్లోని తమ్హినీ ఘాట్

నాలుగో విడతలోనూ... మహా వార్!

మహారాష్ట్రలో 11 స్థానాలకు 13న పోలింగ్

మహాయుతి, ఎంవీఏ కూటముల హోరాహోరీ



చంద్రకాంత్ ఖైరే



సయ్యద్ జలీల్

ఔరంగాబాద్... మజ్లిస్ మేజిక్!

కాంగ్రెస్, శివసేనలకు కంచుకోటగా నిలిచిన ఈ స్థానంలో గత లోక్‌సభ ఎన్నికల్లో సంచలనం నమోదైంది. శివసేన నుంచి వరుసగా నాలుగు సార్లు విక్టరీ కొట్టిన చంద్రకాంత్ ఖైరే మజ్లిస్ అభ్యర్థి సయ్యద్ ఇంతియాజ్ జలీల్ చేతిలో అనూహ్యంగా ఓటమి చవిచూశారు. 97 ఏళ్ల మజ్లిస్ చరిత్రలో తెలంగాణ వెలుపల ఇదే తొలి ఎంపీ స్థానం! 1980 తర్వాత ఔరంగాబాద్‌లో మైనారిటీ గెలుపొందడం అదే ప్రథమం. స్వతంత్ర అభ్యర్థి హర్షవర్ధన్ జాధవ్‌కు ఏకంగా 2.8 లక్షల ఓట్లు పోలవడం ఖైరే ఓటమికి ప్రధాన కారణం. మజ్లిస్ మళ్లీ జలీల్‌నే బరిలోకి దించింది. విపక్ష మహా వికాస్ అగాడీ తరఫున శివసేన (ఉద్ధవ్) అభ్యర్థిగా ఖైరే కూడా పోయిన చోటే వెతుక్కుంటున్నారు. ఇక అధికార మహాయుతి కూటమి తరఫున శివసేన (షిండే) అభ్యర్థి సందీపన్‌రావ్ భూమ్రే బరిలో ఉన్నారు. ఆయన బలమైన మరాఠ్వాడా నేత. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగానూ చేశారు. మరాఠా రిజర్వేషన్ల పోరుతో మరాఠ్వాడా ప్రాంతంలో ఎంతో పేరు సంపాదించిన హర్షవర్ధన్ ఈసారి కూడా ఇండిపెండెంట్‌గా ప్రధాన పార్టీలకు సవాలు విసురుతున్నారు. ప్రకాశ్ అంబేద్కర్ వంచిత బహుజన్ అగాడీ నుంచి అఫ్సర్ ఖాన్ పోటీలో ఉన్నారు. 32 శాతం ముస్లిం జనాభా ఉన్న ఔరంగాబాద్‌లో ఈసారి చతుర్ముఖ పోరులో ఎలాంటి సంచలనం నమోదవుతుందోనన్న ఆసక్తి నెలకొంది.

జాల్నా... రావ్‌సాహెబ్ డబుల్ హ్యాట్రిక్ గురి



రావ్‌సాహెబ్ దన్వే పాటిల్

ఇది బీజేపీకి మరో కంచుకోట. 1999 నుంచి వరుసగా ఐదుసార్లు విజయ ఢంకా మోగించిన రావ్‌సాహెబ్ దన్వే పాటిల్ డబుల్ హ్యాట్రిక్ లక్ష్యంగా మరోసారి బరిలో నిలిచారు. మోదీ రెండు విడతల్లోనూ కేంద్ర మంత్రి పదవి దక్కించుకున్న దన్వే గత ఎన్నికల్లో 3.3 లక్షల పైగా మెజారిటీతో గెలిచారు. గత రెండు పర్యాయాలూ బీజేపీని ఢీకొన్న విలాస్ ఔతాడేను కాంగ్రెస్ ఈసారి పక్కనపెట్టింది. 2009లో బీజేపీకి గట్టిపోటీ ఇచ్చి కేవలం 8,482 ఓట్ల తేడాతో ఓడిన కల్యాణ్ విజినాథ్ కాలేను రంగంలోకి దించింది.

పుణె.. మాజీ మేయర్ వర్సెస్ ఎమ్మెల్యే

ఇక్కడ గత రెండుసార్లూ బీజేపీదే విజయం. అయితే సిట్టింగ్ ఎంపీ గిరీశ్ బాపట్ గతేడాది మరణించడంతో పుణె మాజీ మేయర్ మురళీధర్ కిశాన్ మొహోల్‌కు ఈసారి బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రవీంద్ర ధంగేకర్‌ను బరిలో నిలిపింది. పుణె లోక్‌సభ స్థానం పరిధిలోని కస్బాపేట అసెంబ్లీ సెగ్మెంట్లో గతేడాది జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని ధంగేకర్ మట్టికరిపించడం విశేషం. 28 ఏళ్లుగా కాషాయ జెండా ఎగురుతున్న ఈ సీటు చేజారడం కమలనాథులకు భారీ షాకే. ఇదే జోరుతో పుణె లోక్‌సభ స్థానాన్నీ కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.



రవీంద్ర ధంగేకర్

షిర్డీ... శివసేన కుస్తీ



సదాశివ లోఖండే

2009లో ఉనికిలోకి వచ్చినప్పటి నుంచీ ఇది శివసేన ఖాతాలోనే పడుతోంది. గత రెండు ఎన్నికల్లో నెగ్గిన సదాశివ లోఖండే ఇప్పుడు శివసేన (షిండే) వర్గం నుంచి మహాయుతి అభ్యర్థిగా హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. షిర్డీ తొలి ఎంపీ, శివసేన (ఉద్ధవ్) నేత భావుసాహెబ్ రాజారామ్ వాక్చౌరే ఎంవీఏ కూటమి తరఫున పోటీ చేస్తున్నారు. రెండు శివసేన వర్గాలకు గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా చీఫ్, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ఈ స్థానం కోసం పట్టుబట్టినా సీఎం షిండే మోకాలడ్డారు. అంబేడ్కర్ మనుమడు ప్రకాశ్ అంబేడ్కర్ పార్టీ వీబీఏ అభ్యర్థి ఉత్కర్ష రూపవతి ఎవరి ఓట్లకు గండి పెడతారన్నది ఆసక్తికరం!

బీడ్.. పంకజకు రిజర్వేషన్ సెగ



మనోహర్ సోన్వానే

ఈ స్థానం బీజేపీ దుర్గం. దివంగత గోపీనాథ్ ముండే కుటుంబానికి గట్టి పట్టున్న స్థానం. ఈసారి అదే కుటుంబం నుంచి సిట్టింగ్ ఎంపీ ప్రీతం ముండే బదులు అక్క, మాజీ మంత్రి పంకజా ముండేను బీజేపీ బరిలోకి దించింది. అయితే మారాఠా రిజర్వేషన్లపై అట్టుడుకుతున్న ఈ నియోజకవర్గంలో మహాయుతి కూటమిపై తీవ్ర వ్యతిరేకత ఉంది. దాంతో పంకజ ఎదురీదాల్సిన పరిస్థితి! అయితే 2019లో పర్లీ అసెంబ్లీ స్థానంలో పంకజను ఓడించిన సోదరుడు ఎన్సీపీ (అజిత్) నేత ధనంజయ్ ముండే దన్నుగా నిలవడం ఆమెకు కలిసొచ్చే అంశం. 2019లో 5 లక్షల పై చిలుకు ఓట్లతో ప్రీతం మెజారిటీకి భారీగా గండికొట్టిన భజరంగ్ మనోహర్ సోన్వానే ఎంవీఏ కూటమి నుంచి ఎన్సీపీ (శరద్) టికెట్‌పై బీజేపీకి మళ్లీ సవాలు విసురుతున్నారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న దంగర్ సామాజిక వర్గం ఎప్పటి నుంచో ఎస్టీ రిజర్వేషన్లు డిమాండ్ చేస్తోంది. మరాఠా కోటా, ఈ ఎస్టీ హోదా డిమాండ్లు ఎవరిని ముంచుతాయన్నది ఆసక్తికరం.

జల్గావ్... టఫ్ ఫైట్



కరన్ పాటిల్

రెండు దశాబ్దాలకు పైగా ఇక్కడ పాతుకుపోయిన కమలనాథులకు ఈసారి మహా వికాస్ అగాడీ నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. గత ఎన్నికల్లో బీజేపీ నేత ఉన్మేశ్ పాటిల్ 4 లక్షల పైగా బంపర్ మెజారిటీతో విక్టరీ కొట్టారు. అయినా ఈసారి ఆయన్ను కాదని స్మితా వాఘ్‌కు బీజేపీ టికెటిచ్చింది. ఎంవీఏ నుంచి శివసేన (ఉద్ధవ్) నేత కరన్ బాలాసాహెబ్ పాటిల్ పోటీ చేస్తున్నారు. గతంలో గట్టి పోటీ ఇచ్చిన ఎన్సీపీ (శరద్) దన్నుండటం కరన్‌కు కలిసొచ్చే అంశం. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లూ మహాయుతి కూటమి చేతిలోనే ఉన్నాయి.





పశ్చిమబెంగాల్‌లోని బిష్ణుపూర్ లోక్‌సభ స్థానం మాజీ భార్యాభర్తల మధ్య రాజకీయ యుద్ధానికి వేదికగా మారింది! బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ సౌమిత్రఖాన్‌పై ఆయన మాజీ భార్య సుజాత మోండల్ బరిలో దిగారు. ఆమె టీఎంసీ తరఫున పోటీ చేస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో సౌమిత్ర విజయం కోసం అన్నీ తానై కష్టపడ్డ సుజాత, ఈసారి తన గెలుపు గ్యారంటీ అంటున్నారు. ఈ మాజీ దంపతుల దంగల్‌లో గెలుపెవరిదన్నది ఆసక్తికరంగా మారింది. బిష్ణుపూర్‌లో మే 25న ఆరో విడతలో పోలింగ్ జరగనుంది...

మాజీ దంపతుల దంగల్!

బిష్ణుపూర్ లోక్‌సభ స్థానంలో ఆసక్తికర పోటీ

కేలకం

రాజకీయ విడాకులు...!

సౌమిత్ర ఖాన్ 2014లో తృణమూల్ పార్టీ తరఫున విజయం సాధించి బిష్ణుపూర్‌పై వామపక్షాల పట్టును బద్దలు కొట్టారు. తరువాత బీజేపీలో చేరి 2019లోనూ గెలిచారు. అనంతరం ఆయన వ్యక్తిగత జీవితంలో ఆటుపోట్లు వచ్చాయి. ఉద్యోగాల ఆశ చూపి బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారంటూ 2019 లోక్‌సభ ఎన్నికల ముందు సౌమిత్రపై కేసు నమోదైంది. బీజేపీలోకి మారినందునే మమత సర్కారు తనను తప్పుడు కేసులో ఇరికించిందని ఆయన ఆరోపించారు. ఈ కేసు కారణంగా 2019 ఎన్నికలప్పుడు ఆయన బంకురా జిల్లాలోకి ప్రవేశించకుండా కలకత్తా హైకోర్టు నిషేధించింది. దాంతో భర్త కోసం సుజాత అన్నీ తానై బిష్ణుపూర్‌లో ప్రచారం చేశారు. ఆమె కారణంగానే 2019లో ఖాన్ విజయం సాధించారంటారు. అయితే బీజేపీ తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదంటూ సుజాత 2020లో పార్టీని వీడారు. ఈ విషయంలో భర్త తనకు మద్దతుగా నిలవడం లేదని ఆయనకూ దూరమయ్యారు! ఆమె టీఎంసీలో చేరి 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఆరంబాగ్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడంతో సౌమిత్ర విడాకులిచ్చారు. ఆ వెంటనే సుజాత తన పేరు నుంచి ఖాన్‌ను తొలగించుకున్నారు. స్థానిక ఎన్నికల బరిలో దిగి బంకురా జిల్లా పరిషత్ సభ్యురాలిగా గెలిచారు.

ఒకప్పుడు సీపీఎం కంచుకోట

బిష్ణుపూర్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం. 2014 దాకా సీపీఎంకు కంచుకోట. దీని పరిధిలోకి వచ్చే ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదు స్థానాలు బీజేపీ ఖాతాలోనే ఉన్నాయి! తృణమూల్ రెండింట్లోనే గెలిచింది. ఈసారి సీపీఎం శీతల్ కైబర్తా అనే టీచర్‌ను బరిలో దింపింది. ఆమెకు కూడా నియోజకవర్గంలో మంచి ఆదరణ లభిస్తోంది. జిల్లాను గొప్ప పర్యాటక స్థలంగా తీర్చిదిద్దడంతో పాటు నిరుద్యోగం, నీటి కొరత సమస్యలను పరిష్కరిస్తానన్న హామీలకు ప్రజలు బాగా స్పందిస్తున్నారు.

సౌమిత్రపై అసంతృప్తి...

తాగునీటి ఎద్దడి, రోడ్ల దుస్థితి బిష్ణుపూర్‌లో ప్రధాన సమస్యలు. ఎంపీగా ఇచ్చిన హామీలేవీ సౌమిత్రా నెరవేర్చలేదనే విమర్శ ఉంది. ఎన్నికల తర్వాత ఆయన కన్పించనే లేదన్నది స్థానికుల ఆరోపణ. రోడ్ల దుస్థితికి తోడు నేత కార్మికుల దుస్థితి కూడా ఈ చారిత్రాత్మక పట్టణంలో మరో పెద్ద సమస్య. బిష్ణుపూర్ పట్టు చీరలకు ప్రసిద్ధి. కానీ చేనేత ఉత్పత్తులను సేకరణకు ఏర్పాట్లే లేవని కార్మికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి గెలుపు తనదేనని సుజాత విశ్వాసంతో ఉన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పెత్తందార్లపై యుద్ధం.. పేదలంతా సిద్ధం..

వైఎస్సార్‌సీపీకే ప్రజల మద్దతు



గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి తేడా విశ్వసనీయత. విద్య, వైద్య ఆరోగ్య రంగాల్లో జరిగిన అభివృద్ధి చాలా బాగుంది. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం చాలా సాయం చేస్తోంది. జగన్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో రైతులు చాలా ఆనందంగా ఉన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో జరిగిన మేలును ప్రజలు బేరీజు వేసుకుని ఓటేయాలి. ఉద్యోగులకు 27 శాతం ఐఆర్ ఇచ్చింది జగనే. కేంద్రం ఎగ్గొట్టిన డీఏను కూడా చెల్లించాలి. ఉద్యోగులు కాస్త ఆలోచిస్తే.. వారికి జగన్ వల్లే మేలు జరిగిందని తప్పక గుర్తిస్తారు.

- ఎస్కే గౌస్ బాషా, ఎస్ఐ(రిటైర్డ్), కనిగిరి, ప్రకాశం జిల్లా

మా బతుకుల్లో వెలుగులు నింపారు



వైఎస్సార్ ఆసరాతో మహిళల జీవితాలలో వెలుగులు నింపారు జగనన్న. అనారోగ్యానికి గురై నా భర్త మంచానికే పరిమితమయ్యారు. ఇద్దరు పిల్లల చదువులు, కుటుంబ భారం నాపైనే పడింది. ఆ సమయంలో వైఎస్సార్ ఆసరా పథకం మా జీవితాలకు ఎంతగానో ఉపయోగపడింది. లంకెలపాలెం వైఎస్సార్ కాలనీలో పాన్‌షాప్ నడుపుతూ కుటుంబాన్ని ధైర్యంగా పోషించుకుంటున్నా. నా పిల్లల చదువు జగనన్నే చూసుకుంటున్నాడు. పేదలకు మేలు జరిగింది జగనన్న పాలనలోనే. ఆయనే మళ్లీ సీఎం అవుతారు.

-కండిపల్లి లక్ష్మి, చిరు వ్యాపారి, పినమడక, గాజువాక, విశాఖపట్నం

అటు మోసం - ఇటు నమ్మకం

సాక్షి, అమరావతి:

మేనిఫెస్టో అంటే ప్రజలకు నాయకుడు ఇచ్చే మాట.. పార్టీకి, ప్రజలకు మధ్య ఒప్పంద పత్రం.. నాయకుడికి, ప్రజలకు మధ్య బంధం. అందుకే మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా పవిత్రంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూస్తారు. విశ్వసనీయత లేకపోతే రాజకీయాల్లో ఉండకూడదన్నది ఆయన సిద్ధాంతం. అందుకే అమలు చేయదగిన హామీలతో మేనిఫెస్టోను ప్రకటించారు. 2014, 2019, 2024 వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలే అందుకు నిదర్శనం. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తద్భిన్నం. ఎన్నికలప్పుడు అలవికాని హామీలతో.. అబద్ధాలకు రెక్కలు కడుతూ మేనిఫెస్టోను విడుదల చేయడం, అధికారంలోకి వచ్చాక దానిని తుంగలో తొక్కడం, ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో మేనిఫెస్టోను మాయం చేయడం చంద్రబాబు నైజం. 2014 ఎన్నికల మేనిఫెస్టో అమలే అందుకు తార్కాణం.


విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో జట్టుకట్టిన చంద్రబాబు.. వ్యవసాయ, డ్వాక్రా రుణాల మాఫీ సహా అలవికాని హామీలతో మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆ సమయంలో రూ.లక్ష వరకు రైతు రుణమాఫీ ప్రకటించాలని సీఎం జగన్‌కు సన్నిహితులు సూచించినా.. దాన్ని అమలు చేయలేమని, అలాంటప్పుడు ఆ హామీ ఇవ్వలేనని తేల్చిచెప్పారు. ఆ ఎన్నికల్లో మోదీ ప్రభంజనంలో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో సీఎం జగన్ అధికారంలోకి రాలేకపోయారు. అప్పుడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. మేనిఫెస్టోను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారు. వంచించిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన శాస్తి చేశారు. 2019 ఎన్నికల్లో చారిత్రక విజయంతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్.. తొలి ఏడాదే 95 శాతం హామీలు అమలు చేసి మేనిఫెస్టోకు సరి కొత్త నిర్వచనం చెప్పారు. కరోనా మహమ్మారి ప్రభావం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉత్పన్నమైనా ఏ ఒక్క పథకాన్ని ఆపలేదు. ఇప్పటికి 99 శాతం హామీలు అమలు చేశారు. అర్హతే ప్రామాణికంగా.. ఎలాంటి వివక్ష చూపకుండా.. లంచాలకు తావు లేకుండా.. పారదర్శకంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.2.70 లక్షల కోట్లను జమ చేశారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చారు. డీబీటీ, నాన్‌డీబీటీ కలిపి మొత్తం రూ.4.49 లక్షల కోట్ల ప్రయోజనాన్ని పేదలకు చేకూర్చారు.

2014 ఎన్నికల్లో సీపీఎస్ రద్దు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక దాన్ని తుంగలో తొక్కారు. 2019 ఎన్నికల్లో సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన వైఎస్ జగన్.. అధికారంలోకి వచ్చాక దానిపై విస్తృతంగా అధ్యయనం చేసి.. పదవీ విరమణ అయ్యే నాటికి చివరి నెల జీతంలో 50 శాతం పెన్షన్ వచ్చేలా జీపీఎస్‌ను తెచ్చారు. హామీలన్నీ అమలు చేయడంతో సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత మరింతగా పెరిగింది. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండే రెండు పేజీలతో సీఎం జగన్ మేనిఫెస్టో విడుదల చేశారు. అమ్మ ఒడి పథకం కింద ఏటా ఇస్తున్న రూ.15 వేలను రూ.17 వేలకు పెంచుతానని.. రైతు భరోసా కింద ఏటా ఇస్తున్న రూ.13,500ను రూ.16 వేలకు పెంచుతానని.. వృద్ధాప్య పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రెండు దశల్లో రూ.3,500కు పెంచుతానని కొత్తగా హామీలు ఇచ్చారు. కానీ.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 2014 తరహాలోనే మళ్లీ జనసేన, బీజేపీతో జట్టుకట్టి.. తెలంగాణ, కర్ణాటకల్లో విఫలమైన పథకాలకే సూపర్ సిక్స్ ముసుగేసి అలవికాని హామీలతో మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆ మేనిఫెస్టో అమలు సాధ్యం కాదని భావించే బీజేపీ దాన్ని ముట్టుకోవడానికి కూడా ఇష్టపడలేదు. ఇచ్చిన మాటపై నిలబడే సీఎం జగన్ ఓ వైపు.. చెప్పిన మాటపై నిలబడిన చరిత్ర ఎన్నడూ లేని చంద్రబాబు మరో వైపు.. ఎవరు కావాలో తేల్చుకోవాల్సింది ప్రజలే.

మీ ఓటు

విశ్వసనీయతకా? మోసానికా?

టీడీపీ కూటమి 2014 మేనిఫెస్టో



హామీ: అధికారంలోకి రాగానే వ్యవసాయ రుణాల మాఫీపై తొలి సంతకం చేస్తా.
అమలు: రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీపై తొలి సంతకం చేయకుండా సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే 2014, జూన్ 8న చంద్రబాబు మోసం చేశారు. వ్యవసాయ రుణాల మాఫీపై కోటయ్య కమిటీని వేసి.. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పేరుతో కోతలు పెట్టి రూ.15,297 కోట్లను మాత్రమే మాఫీ చేశారు. మిగతా రూ.72,315 కోట్లు మాఫీ చేయకుండా రైతులకు చంద్రబాబు టోపీ పెట్టారు.

హామీ: డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తా.
అమలు: టీడీపీ సర్కార్ అధికారంలోకి వచ్చే నాటికి రూ.14,205 కోట్లు పొదుపు సంఘాల మహిళలు బకాయిపడ్డారు. ఆ రుణాల్లో ఒక్క పైసా కూడా మాఫీ చేయకుండా మహిళలను చంద్రబాబు వంచించారు.

హామీ: ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందజేస్తా.
అమలు: 2014, జూన్ 8 నుంచి 2019, మే 29 వరకూ కేవలం 32 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేశారు. రాష్ట్రంలోని కోటికిపైగా ఇళ్ల(కుటుంబాలు)కు ఉద్యోగాలు ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి కింద పైసా కూడా ఇవ్వలేదు. ఒక్కో ఇంటికి నెలకు రూ.2 వేల చొప్పున 60 నెలలకు రూ.1.20 లక్షలు ఇవ్వకుండా ఎగ్గొట్టి చంద్రబాబు మోసం చేశారు.

హామీ: ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద బ్యాంకులో రూ.25 వేలు డిపాజిట్ చేస్తా.
అమలు: ఐదేళ్లలో పుట్టిన ఒక్క ఆడబిడ్డ పేరుతో ఒక్క పైసా కూడా డిపాజిట్ చేయకుండా చంద్రబాబు మోసం చేశారు.

హామీ: అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం ఇచ్చి.. పక్కా ఇళ్లు కట్టిస్తాం.
అమలు: మూడు సెంట్లు స్థలం మాట దేవుడెరుగు.. కనీసం ఏ ఒక్కరికీ సెంటు స్థలం కూడా ఇవ్వకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేశారు.

హామీ: ఏటా రూ.పది వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేస్తా.
అమలు: ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.పది వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేల కోట్లను బీసీ సబ్ ప్లాన్ కింద ఆ వర్గాల సంక్షేమం కోసం ఖర్చు చేయాలి. కానీ.. ఐదేళ్లలో రూ.36 వేల కోట్లను మాత్రమే ఖర్చు చేసి, అందులోనూ అవినీతికి పాల్పడి బీసీలను మోసం చేశారు.

హామీ: చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు మాఫీ చేస్తా.
అమలు: ఒక్క రూపాయి రుణాన్ని కూడా మాఫీ చేయకుండా చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులకు చంద్రబాబు టోపీ పెట్టారు.

హామీ: సింగపూర్‌ను మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తా. ప్రతి నగరంలో, జిల్లా కేంద్రంలో హైటెక్ సిటీ నిర్మిస్తా.
అమలు: సింగపూర్‌ను మించి అభివృద్ధి మాటేమోగానీ అడ్డగోలు, అవినీతి, అక్రమాలకు పాల్పడి రాష్ట్రంలో చంద్రబాబు విధ్వంసం సృష్టించారు. జిల్లా కేంద్రాల మాట దేవుడెరుగు కనీసం ఏ ఒక్క నగరంలో కూడా హైటెక్ సిటీ నిర్మాణానికి పునాదిరాయి కూడా వేసిన పాపాన పోలేదు.

హామీ: మహిళల భద్రతకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తా. ఆపదలో ఉన్న మహిళలకు సెలఫోన్ల ద్వారా 5 నిమిషాలలో సహాయం అందించే వ్యవస్థ ఏర్పాటు చేస్తా.
అమలు: ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటుకు చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. విజయవాడలో కాల్‌మనీ సెక్స్ రాకెట్ మహిళల మానప్రాణాలతో చెలగాటమాడటం రాష్ట్రాన్ని కుదిపేసింది. ఇసుక దోపిడీకి అడ్డుతగిలిన తహసీల్దార్ వనజాక్షిని అప్పటి టీడీపీ ఎమ్మెల్యే జుట్టుపట్టుకుని లాగి, దాడిచేసినా చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

హామీ: పేద పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య, కాలేజీ విద్యార్థులకు ఐప్యాడ్, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు తెస్తా.
అమలు: విద్యా విధానంలో మార్పుల మాట దేవుడెరుగు కనీసం ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలను పెంచేందుకు చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాలేజీ విద్యార్థులకు ఐప్యాడ్‌లు ఇవ్వకుండా మోసం చేశారు. ఫీజు ఎంత ఉన్నా

-మిగతా IVలో



వైఎస్సార్‌సీపీ 2019 మేనిఫెస్టో



హామీ: ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేసి.. అదే ఊరిలోని పది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తాం. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దకే ప్రజలకు అందిస్తాం. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం.
అమలు: రాష్ట్రంలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను సీఎం జగన్ ఏర్పాటు చేశారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.35 లక్షల మంది ఉద్యోగులను నియమించారు. సగటున 50 నుంచి 75 ఇళ్లకు ఒకరు చొప్పున 2.65 లక్షల మంది వలంటీర్లను నియమించి.. ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి గుమ్మం వద్దకే అందించి.. గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారు. వివిధ శాఖల్లో 2.31 లక్షల ఉద్యోగులను నియమించారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే.. ఈ 59 నెలల్లోనే 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగులను నియమించడం గమనార్హం. ప్రభుత్వ, ప్రైవేట్, ఎంఎస్ఎంఈలు, స్వయం ఉపాధితో కలిపి 58.22 లక్షల మందికిపైగా ఉద్యోగాలు, ఉపాధి కల్పించారు.



హామీ: వైఎస్సార్ ఉచిత పంటల బీమా, రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరలు కల్పించి.. రైతులకు దన్నుగా నిలుస్తాం.
అమలు: రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. దీన్ని నీతి ఆయోగ్ అత్యుత్తమ పథకంగా ప్రశంసించింది. ఐదేళ్లలో పంటలు దెబ్బతిన్న 54.76 లక్షల మంది రైతులకు రూ.7,802.05 కోట్ల పరిహారాన్ని అందించారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటుచేసి.. మార్కెట్లో ధరలేని పంటల ఉత్పత్తులు 21.73 లక్షల టన్నులను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రూ.7,796 కోట్లను వెచ్చించి, రైతులకు అండగా నిలిచారు. తుఫాన్‌లు, అధిక వర్షాల వల్ల తడిచిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచారు. పంట నష్టపోయిన 34.41 లక్షల మంది రైతులకు అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.3,261.61 కోట్లు అందించారు.

హామీ: వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉన్న వారందరికీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని వర్తింపజేస్తాం. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తాం. చికిత్సల అనంతరం విశ్రాంతి సమయానికి వైఎస్సార్ ఆరోగ్య ఆసరాగా కింద ఆర్థిక సహాయం అందిస్తాం.
అమలు: ఆరోగ్యశ్రీ కింద చికిత్స విధానాలను 1059 నుంచి 3,257కు పెంచారు. చికిత్స ఖర్చు రూ.వెయ్యి దాటిన అందరికీ ఆరోగ్యశ్రీని వర్తింపజేశారు. ఐదేళ్లలో 45.10 లక్షల మందికి ఆరోగ్యశ్రీ కింద చికిత్సల కోసం రూ.13,421 కోట్లు ఖర్చు చేశారు. విశ్రాంతి సమయంలో రోగులకు ఆరోగ్య ఆసరా కింద 24.59 లక్షల మందికి రూ.1,465 కోట్లను అందించారు. ఈ రెండు పథకాలను నీతి ఆయోగ్ ప్రశంసించింది. మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినప్పటికీ మరో అడుగు ముందుకేసి ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షల వరకూ పెంచారు. గతంలో ఇది రూ.5 లక్షల వరకే ఉండేది.

హామీ: పేద విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు వసతి, భోజనం కోసం అదనంగా ఏటా రూ.20 వేలు అందిస్తాం.
అమలు: ఇచ్చిన మాట మేరకు జగనన్న విద్యా దీవెన పథకం 29.65 లక్షల మంది విద్యార్థులకు రూ.12,609.68 కోట్లను ఫీజురీయింబర్స్‌మెంట్‌గా చెల్లించారు. 2017–19 మధ్య చంద్రబాబు 16.73 లక్షల మంది విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,778 కోట్లను సీఎం జగన్ చెల్లించారు. జగనన్న వసతి దీవెన కింద 25.17 లక్షల మంది విద్యార్థులకు రూ.4,275.76 కోట్లను అందించారు. 2022–23 విద్యా సంవత్సరంలో గరిష్ఠంగా 1.80 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువు పూర్తిచేసుకున్న వెంటనే క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందారు.

హామీ: వైఎస్సార్ ఆసరా పథకం కింద ఎన్నికల రోజు వరకూ అక్క చెల్లెమ్మలకు ఉన్న పొదుపు సంఘాల రుణాల మొత్తం సొమ్మును నాలుగు దఫాలుగా వారి చేతికే అందిస్తాం. మళ్లీ సున్నా వడ్డీకే రుణాల విప్లవం తెస్తాం.
అమలు: 2019, ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాల మహిళలు 78.94 లక్షల మందికి ఉన్న రూ.25,570.90 కోట్లను నాలుగు విడతల్లో నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేశారు. సున్నా వడ్డీ కింద పొదుపు సంఘాల మహిళలకు రూ.4,969.04 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు.

హామీ: జలయజ్ఞం ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. పోలవరాన్ని పూర్తి చేస్తాం. సాగునీటి కలను నిజం చేస్తాం.
అమలు: కరోనా మహమ్మారి ప్రభావం వల్ల లాక్‌డౌన్‌తో రెండేళ్లు పనులు చేయలేని పరిస్థితి. మిగతా మూడేళ్లలో రూ.35,268.05 కోట్లతో ఆరు ప్రాజెక్టులు (సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్, లక్కవరం ఎత్తిపోతల, అవుకు సొరంగం, కుప్పం బ్రాంచ్ కెనాల్, వెలిగొండ జంట సొరంగాలు–తొలి దశ) పూర్తి చేశారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించి పులిచింతల, సోమశిల, కండలేరు, గండికోట, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్.. దయాఫ్రమ్ వాల్‌తో మట్టికట్ట టీకేజీలకు

-మిగతా IVలో

హామీ: వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి కోసం ఏడాదికి రూ.12,500 అందిస్తాం.
అమలు: మేనిఫెస్టోలో చెప్పిన దాని కంటే అధికంగా.. ఏడాదికి ఒక్కో రైతు కుటుంబానికి రూ.13,500 రైతు భరోసా కింద ఇచ్చారు. ఐదేళ్లలో రూ.67,500 రైతు భరోసా కింద ఇచ్చారు. ఈ పథకం కింద ఐదేళ్లలో 53,58,366 మంది రైతులకు రూ.34,378.16 కోట్లను వారి ఖాతాల్లో నేరుగా జమ చేశారు.



హామీ: వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ.4 వేల నుంచి రూ.పది వేలకు పెంచుతాం. మత్స్యకారులకు ఇచ్చే డీజిల్ సబ్సిడీని డెడికేటెడ్ పెట్రోల్ బంక్‌ల ద్వారా డీజిల్ పట్టుకునేటప్పుడు వారి చేతికి అందేటట్టు అమలు చేస్తాం. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.పది లక్షలను పరిహారంగా చెల్లిస్తాం.
అమలు: వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ.పది వేలకు పెంచారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద ఐదేళ్లలో 2.43 లక్షల మందికి రూ.538.06 కోట్లను అందించారు. డీజిల్ సబ్సిడీని అమలు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.పది లక్షలను పరిహారంగా అందిస్తున్నారు.






హామీ: పిల్లల చదువులకు ఏ పేదింటి తల్లీ భయపడొద్దు. పిల్లలను బడికి పంపితే చాలు ప్రతి తల్లికి సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తాం.
అమలు: జగనన్న అమ్మ ఒడి పథకం కింద 44.48 లక్షల మంది తల్లులకు రూ.26,067.30 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థి నికర నమోదు నిష్పత్తి రేటు 98.73 శాతానికి పెరిగింది.



హామీ: ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కింద అభివృద్ధి చేస్తాం. విద్యా ప్రమాణాలు పెంచుతాం. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడతాం. పుస్తకాలు, యూనిఫాంలు సరైన సమయానికి ఇస్తాం. మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచుతాం.
అమలు: నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేసే పనులను రెండు దశల్లో చేపట్టారు. తొలి దశ ఇప్పటికే పూర్తయింది. రెండో దశ పనులు వేగంగా సాగుతున్నాయి. కోర్టులకు వెళ్లి టీడీపీ అడ్డుకున్నా సరే.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టారు. పాఠశాలలు ప్రారంభమైన రోజే జగనన్న విద్యాకానుక పథకం కింద పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాంలు, బూట్లు సాక్స్‌లు అందిస్తున్నారు. జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్నం నాణ్యమైన భోజనంతోపాటు చిక్కీ ఇస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఐబీ సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నారు. మూడో తరగతి నుంచే టోఫెల్ శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), వైట్‌హౌస్ వేదికలపై రాష్ట్రంలో అమలవుతున్న విద్యా విధానం, సంస్కరణలపై అనర్గళంగా ప్రసంగించడం దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసింది.



హామీ: అవ్వాతాతలకు పెన్షన్ల అర్హత వయసు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించి.. పెన్షన్‌ను రూ.3 వేల వరకూ పెంచుకుంటూపోతాం.
అమలు: ఇచ్చిన మాట మేరకు వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద వృద్ధాప్య పెన్షన్‌ను రూ.2,000 నుంచి రూ.2,250కు పెంచే ఫైలుపై 2019, మే 30న సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక జగన్ తొలి సంతకం చేశారు. దశలవారీగా పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచి వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దే వృద్ధులకు పంపిణీ చేస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా ఎలాంటి వివక్ష చూపకుండా 66.34 లక్షల మందికి పెన్షన్ పంపిణీ చేస్తున్నారు. గత 59 నెలల్లో పెన్షన్ రూపంలో రూ.90,590.6 కోట్లను పంపిణీ చేశారు.

మహిళలకు పట్టం కట్టిన జగనన్న



గతంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు పనిచేసినప్పటికీ మహిళలకు పట్టం కట్టిన ముఖ్యమంత్రి జగనన్న మాత్రమే. పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో, ప్రభుత్వ పనుల నామినేషన్లలో సగభాగం ఇచ్చిన గొప్ప నాయకుడు జగనన్న. కొన్ని ప్రభుత్వాల క్యాబినెట్‌లో మహిళలు ఒక్క మంత్రి పదవికీ నోచుకోలేదు. జగనన్న మాత్రం నారీ శక్తిని గుర్తించి వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చారు. డిప్యూటీ సీఎం, హోం, హెల్త్ మినిస్టర్లు మహిళలే. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్న సీఎం కావడం ఖాయం.

- స్వర్ణ సంధ్య, టీచర్, అద్దంకి, బాపట్ల జిల్లా

చదువులపై సీఎం జగన్ ఆలోచన గొప్పది



ఇంగ్లిష్ మీడియం గురించి ఎందుకు ఇంత దుష్ప్రచారం చేస్తున్నారో తెలియట్లేదు. నేను టెన్త్ వరకు గవర్నమెంట్ స్కూల్లో తెలుగు మీడియంలోనే చదివా. ఇంటర్ బైపీసీలో ఇంగ్లిష్ మీడియం. పదాలను అర్థం చేసుకోవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆ తర్వాత ఫిజియోథెరపీలో కూడా ఇబ్బంది పడ్డా. పదేళ్లు తెలుగు మీడియంలో చదివి, తర్వాత ఇంగ్లిష్ మీడియం అంటే చాలా కష్టపడాలి. వైఎస్సార్ వల్లే నేను, మా అక్క(ఇంజినీరింగ్) ఉన్నత చదువులు చదవగలిగాం. చదువు పట్ల సీఎం జగన్ ఆలోచన చాలా గొప్పది.

- పి.జీవిత, ఫిజియోథెరపిస్ట్, నగరి, చిత్తూరు జిల్లా

పెత్తందార్లపై యుద్ధం.. పేదలంతా సిద్ధం..

మరికొన్ని దశాబ్దాలపాటు జగనే సీఎం



పేదల ఉన్నతికే సంక్షేమ పథకాల అమలు

- విద్య, వైద్య రంగాలకు ఊపిరి పోసిన నాయకుడు ఆయన
- మెడికల్ కాలేజీల నిర్మాణంతో ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ ఆవిష్కరణ
- పోర్టులు... ఫిషింగ్ హార్బర్లతో అభివృద్ధి దిశగా పయనం
- సచివాలయాలు, ఆర్బీకేలతో గ్రామ స్వరాజ్య స్థాపన
- ఆయన సంస్కరణలే మళ్లీ విజయపథంలో నడిపిస్తాయి
- సాక్షి ఇంటర్వ్యూలో సినీ హీరో కృష్ణుడు



'రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే ఆ పథకాలు ఉచితాలు కావు. వారి ఉన్నతికి దోహదపడే మార్గాలు. ఇప్పుడవి సత్ఫలితాలిస్తున్నాయి. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపును తప్పనిసరిగా కొనియాడాల్సిందే. ఆయన నాయకత్వంలో రాష్ట్రం మరెంతగానో పురోగమించాల్సి ఉంది. ఈ దఫా కూడా ఆయనే ముఖ్యమంత్రి కావడం తథ్యం. అంతేనా... మరికొన్ని దశాబ్దాలు ఆయన పాలన మన రాష్ట్రానికి ఎంతో అవసరం.' అన్నారు సినీ హీరో కృష్ణుడు. జగన్ పాలనా సామర్థ్యం వల్లే ఆయన అభిమానిగా మారానని సాక్షికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

సత్యార్థ్

అవి అనవసర ఆరోపణలు

రాష్ట్రంలో రోడ్ల సమస్య గురించి కొందరు చేస్తున్నవన్నీ అనవసర ఆరోపణలు మాత్రమే. రాజోలు ప్రాంతానికి చెందిన నేను తరచుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు పలు మారుమూల ప్రాంతాల్లో కూడా వ్యక్తిగత వాహనం మీద తిరుగుతుంటా. ఎక్కడా రోడ్లు వాహనాలు నడవలేనంతగా బాగోకపోవడం అనేది లేనేలేదు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లపాటు ప్రకృతి కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవడం వల్ల అక్కడక్కడ రోడ్లు కొంత దెబ్బతిని ఉంటే వాటిని అడ్డం పెట్టుకుని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. ఎందరు ఎన్ని పొత్తులు పెట్టుకుని వచ్చినా జగన్‌ను ఓడించడం సాధ్యం కాదనేది నిరుపేదల గుండెచప్పుడు విన్నవారికి అర్థమవుతుంది.

అక్షరమే ఐశ్వర్యం.. ఆరోగ్యమే మహా భాగ్యం..

చదువును మించిన సంపద లేదని... ఆరోగ్యాన్ని మించిన భాగ్యం లేదని గుర్తించిన ఏకైక నేత వైఎస్ జగన్. ఆయన అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పరిశీలిస్తే ఈ రెండు రంగాలకు ఇచ్చిన ప్రాధాన్యం ఏమిటో అర్థమవుతుంది. నాడు-నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను ఆధునికీకరించడం ద్వారా విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పుల్ని ఆయన తీసుకొచ్చారు. అభివృద్ధికి తొలిమెట్టు లాంటి ఆంగ్ల విద్యను, అధునాతన డిజిటల్ విద్యను నిరుపేద చిన్నారులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పేద, ధనిక మధ్య అంతరాలను తగ్గించేందుకు బాటలు వేస్తున్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు

రాష్ట్రంలో ఎన్నడూ లేనన్ని మెడికల్ కాలేజీల నిర్మాణం ఇప్పుడు జరుగుతోంది. శరవేగంతో పూర్తవుతున్న ఫిషింగ్ హార్బర్లు, పోర్టులు వంటివన్నీ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించడం తథ్యం. సినిమా నటుడిగా వృత్తిరీత్యా ఎక్కడ ఉంటున్నా... జన్మతః నేనూ పల్లెవాసినే. పల్లెల్లో ఏర్పాటైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ వంటివి వైఎస్ జగన్ మార్క్ అభివృద్ధికి నిదర్శనాలు. ఆయన సమర్థ నాయకత్వంలో అవన్నీ కొనసాగితే గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సుసాధ్యం కానుంది.

ఆర్టీసీ ఎంతో హ్యాపీ

- ఆర్టీసీలో జగనోదయం
- ప్రభుత్వంలో విలీనంతో కొత్త చరిత్రకు జగన్ శ్రీకారం
- 52 వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం
- చంద్రబాబు జమానాలో కుదేలైన ఆర్టీసీ



సాక్షి, అమరావతి:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి... ఈ పేరు వింటనే ఆర్టీసీ ఉద్యోగులకు భరోసా

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు...ఈ పేరు చెవిలో పడితేనే ఆ ఉద్యోగుల్లో హడల్

ఎందుకంటే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నది ఉద్యోగుల దీర్ఘకాలిక పోరాటం...కల కూడా. గతంలో చంద్రబాబుకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా విలీనం సాధ్యం కాదని కొట్టిపారేశారు. అంతేకాదు ఆర్టీసీని పూర్తిగా ప్రైవేటీకరించి తన రాజగురువు రామోజీరావుకు అప్పగించాలన్న దురాలోచన కూడా చేశారన్నది బహిరంగ రహస్యమే. కానీ అందుకు పూర్తి విరుద్ధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారు. దశాబ్దాల ఆర్టీసీ ఉద్యోగుల కలను సాకారం చేస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న ఈ చరిత్రాత్మక నిర్ణయం 52 వేల మంది ఆర్టీసీ ఉద్యోగుల జీవితాల్లో నవోదయాన్ని తీసుకువచ్చింది. ఉద్యోగులకు ఎన్నో ప్రయోజనాలను కల్పించడమే కాకుండా ఆర్టీసీని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తోంది. ఆర్టీసీ పట్ల చంద్రబాబు వైఖరి? ఆయన విధానాలు ...ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలోచన అనే అంశాలను ఓసారి సింహావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

బాబు మాటల మోసం

- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రసక్తే లేదు.
- ఉద్యోగుల జీతాల కోసం ప్రతి నెలా అప్పులు చేయాల్సిన దుస్థితి.
- ఉద్యోగుల జీతాల కోసం చేసిన అప్పులే ఏడాదికి రూ.350 కోట్ల వడ్డీ చెల్లించాల్సి వచ్చేది.
- టీడీపీ అవసరాల కోసం బస్సుల వినియోగం. బిల్లులు చెల్లించని టీడీపీ.
- రూ.4,500 కోట్ల నష్టాల్లో ఉండేది
- ఉద్యోగుల పరపతి సంఘానికి రూ.200 కోట్ల బకాయి పడడంతోరుణాలు ఇవ్వలేని దుస్థితి
- ప్రమాద బీమా రూ.30 లక్షలు మాత్రమే
- ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 ఏళ్లకే పరిమితం
- కారుణ్య నియామకాలు చేపట్ట లేదు
- గ్రాడ్యుటీ, పదవీ విరమణ ప్రయోజనాలు, సరెండర్ లీవులు పెండింగ్
- కొత్త బస్సులు కొనుగోలు లేదు
- పూర్తిగా ప్రైవేటుపరం చేసేందుకు సన్నాహాలు

జగన్ విలీన హాసం

- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. 52 వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం.
- ఉద్యోగుల జీతాల కోసం ఒక్క నెల కూడా అప్పు చేయలేదు. ఉద్యోగుల జీతాల కోసం ప్రభుత్వం నెలకు రూ.300 కోట్లు చెల్లించింది. ఇప్పటికి 52 నెలల్లో రూ.15,600 కోట్లు చెల్లించిన ప్రభుత్వం.
- జీతాల కోసం అప్పులే చేయలేదు కాబట్టి... వడ్డీ సమస్యే లేదు
- వైస్సార్‌సీపీ కోసం అద్దెకు తీసుకున్న బస్సులకు తక్షణమే పార్టీ ఖాతా నుంచి బిల్లుల చెల్లింపు
- జీతాల చెల్లింపునకు ఐదేళ్లలో రూ.2,500 కోట్లు అప్పు తీర్చింది. అప్పు రూ.2 వేల కోట్లకు తగ్గింది.
- ఆర్టీసీ ఉద్యోగుల పరపతి సంఘం బకాయి రూ.200 కోట్లు చెల్లింపు దాంతో ఉద్యోగులకు సులభంగా తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు
- ఆర్టీసీ ఉద్యోగులకు కార్పొరేట్ శాలరీ ప్యాకేజీ కింద ప్రమాద బీమా సదుపాయం ప్రమాద బీమా మొదట రూ.45 లక్షలకు...అనంతరం ఏకంగా రూ.1.10 కోట్లకు పెంపు
- ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు
- 2016 నుంచి పెండింగులో ఉన్న కారుణ్య నియామకాల కింద ఉద్యోగాల కల్పన
- 2016 నుంచి 2019 మధ్య పెండింగులో ఉన్న 845 మందికి ఉద్యోగాలు
- 2020 తరువాత మరణించిన 955 మంది ఉద్యోగుల వారసులకు ఉద్యోగాలు
- 2020 తరువాత అనారోగ్య కారణంతో పదవీ విరమణ చేసిన 100 మంది ఉద్యోగుల వారసులకు ఉద్యోగాలు.
- 2020 తరువాత రిటైరైన ఉద్యోగులకు గ్రాడ్యుటీ రూ.23.25 కోట్లు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కింద రూ.271.89 కోట్లు, సరెండర్ లీవుల కింద రూ.165 కోట్లు చెల్లింపు
- ఇప్పటికి 1,406 కొత్త బస్సులు కొనుగోలు. మరో 1,500 కొత్త బస్సుల కొనుగోలుకు ప్రతిపాదన. తొలిసారిగా ఈ-బస్సులను ప్రవేశపెట్టిన ఆర్టీసీ. తిరుమల-తిరుపతి ఘాట్‌లో 100 ఈ-బస్సులు. రానున్న ఐదేళ్లలో 7 వేల ఈ-బస్సుల కొనుగోలుకు నిర్ణయం
- ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదు. ఎందుకంటే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు.



పేదరికం అంతానికి నొక్కుతున్న బటన్లు
సామాజిక విప్లవానికి పడిన అడుగులు

పేదోడి డాక్టర్ కల సాకారం

▶ మొదటి పేజీ తరువాయి

మారుతుందని, మన పిల్లలకు వైద్య విద్య అందని ద్రాక్షగానే మిగిలిపోతుందని పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

రూ.8 వేల కోట్లతో వైద్య కళాశాలలు

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లా చేసి, ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా మన విద్యార్థులకు వైద్య విద్యను సీఎం జగన్ అందుబాటులోకి తెచ్చారు. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు కూడా చేరువయ్యాయి. 2019లో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వ రంగంలో ఏకంగా రూ.8 వేల కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. 2023-24 విద్యా సంవత్సరంలో విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను ప్రారంభించి 750 సీట్లను కొత్తగా అందుబాటులోకి తెచ్చారు. 2024-25 విద్యా సంవత్సరంలో పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పాడేరు కళాశాలలను ప్రారంభించబోతున్నారు. మిగిలిన ఏడు 2025-26లో ప్రారంభించనున్నారు. వీటి ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో కొత్తగా 2,550 ఎంబీబీఎస్ సీట్లను సీఎం జగన్ సమకూరుస్తున్నారు. వాస్తవానికి.. 2019 నాటికి రాష్ట్రంలో కేవలం 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఉన్నాయి. వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేనట్లుగా ఒకేసారి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు స్థాపించడానికి చర్యలు తీసుకున్న ఏకైక ప్రభుత్వంగా కూడా సీఎం జగన్ ప్రభుత్వం రికార్డుకెక్కింది. రాజంపేటలో మరో కొత్త వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని తాజాగా సీఎం జగన్ హామీ ఇచ్చారు. దీంతో భవిష్యత్‌లో రాష్ట్రంలో 18 కళాశాలలు ప్రభుత్వ రంగంలో అందుబాటులోకి రానున్నాయి.

పీజీ కోర్సుల ఫీజు తగ్గించిన ప్రభుత్వం

2019కు ముందు టీడీపీ పాలనలో పేద, మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి విద్యార్థులు మెడికల్ పీజీ కోర్సులు చేయడానికి వీల్లేని పరిస్థితులను సృష్టించారు. పీజీ కోర్సుల ఫీజులను అమాంతం పెంచేశారు. అప్పటి వరకూ కన్వీనర్ కోటాలో క్లినికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రైవేట్ కళాశాలల్లో రూ.2.90 లక్షలుగా ఉన్న ఫీజును, 2017-18లో ఏకంగా రూ.6.90 లక్షలకు పెంచారు. యాజమాన్య కోటాలో రూ.5.25 లక్షల నుంచి రూ.24.20 లక్షలకు పెంచారు.

అండగా నిలిచిన జగన్ సర్కారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో వైద్య విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. సీఎం జగన్ ప్రైవేట్ కళాశాలల్లో పీజీ మెడికల్ కోర్సుల ఫీజులను 40 నుంచి 50 శాతానికి తగ్గించారు. నిరుపేద, మధ్యతరగతి వారికి భారీ ఊరట కల్పించారు.

మీ ఓటు

విశ్వసనీయతకా? మోసానికా?

టీడీపీ కూటమి 2014 మేనిఫెస్టో

▶ 3వ పేజీ తరువాయి

రూ.35 వేలు మాత్రమే ఫీజురీయింబర్స్‌మెంట్ కింద ఇవ్వడం వల్ల విద్యార్థుల తల్లితండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడింది.

హామీ: ఆరోగ్యశ్రీ కంటే మెరుగైన వైద్య సేవలు అందిస్తా.
అమలు: ఆరోగ్యశ్రీ పేరును ఎన్టీఆర్ వైద్య సేవగా మార్చిన చంద్రబాబు.. బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేయడం వల్ల ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు చికిత్స అందించడానికి యాజమాన్యాలు నిరాకరించాయి. దాంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే ఆరోగ్యశ్రీని చంద్రబాబు నీరుగార్చారు. ఆరోగ్యశ్రీ కింద చంద్రబాబు పెట్టిన రూ.600 కోట్ల బకాయిలను సీఎం జగన్ చెల్లించారు.

హామీ: రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తా.. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్ట నివారణకు రైతుల వారీగా బీమా సౌకర్యం కల్పిస్తా.
అమలు: ధరల స్థిరీకరణ నిధి కింద ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గిట్టుబాటు ధరలు దక్కక ధాన్యం, అపరాలు, ఉల్లి, టమాటా, మామిడి, బత్తాయి తదితర రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా రైతులను మోసం చేశారు.

హామీ: ప్రతి జిల్లాకూ, పట్టణానికి, మండలానికి, గ్రామానికి ఒక దార్శనిక పత్రం (విజన్ డాక్యుమెంట్)ను తయారుచేసి అభివృద్ధి చేస్తాం.
అమలు: ప్రతి జిల్లా, పట్టణం, మండలం, గ్రామం అభివృద్ధి మాటేమోగానీ.. అడ్డగోలుగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు బ్యాచ్ అధోగతిపాలు చేశాయి.

హామీ: అవినీతిరహిత సుపరిపాలన, పాలనలో పారదర్శకత తెస్తా. పెరుగుతున్న నిత్యావసరాల ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటా.
అమలు: అక్షర క్రమంలో ముందున్న ఆంధ్రప్రదేశ్‌ను అవినీతిలోనూ చంద్రబాబు అగ్రగామిగా నిలిపారు. చంద్రబాబు మానసపుత్రిక అయిన జన్మభూమి కమిటీల్లోని టీడీపీ నేతలు లంచాల కోసం ప్రజలను పీడించాయి.

హామీ: కొత్తగా కళింగపట్నం, నరసాపురం ఓడరేవు, నిజాంపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులను నిర్మించి, పాత పోర్టులతో అనుసంధానం చేస్తూ ఇండస్ట్రియల్ క్లస్టర్స్‌ను అభివృద్ధి చేస్తా.
అమలు: ఐదేళ్లలో కొత్తగా ఒక్కటంటే ఒక్క పోర్టు నిర్మాణ పనులు కూడా చంద్రబాబు ప్రారంభించలేదు. ఇండస్ట్రియల్ క్లస్టర్స్‌ను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

హామీ: వివిధ జిల్లాలను అనుసంధానం చేస్తూ బుల్లెట్ ట్రైన్స్ (ర్యాపిడ్ రైల్వే ట్రాన్స్‌పోర్టు వ్యవస్థ)ను ప్రవేశపెడతాం.
అమలు: బుల్లెట్ ట్రైన్స్ పేరుతో ఎన్నికల్లో అరచేతిలో వైకుంఠం చూపిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ఎన్నడూ ఆ మాట ఎత్తడానికి కూడా సాహసించలేదు.

హామీ: పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తా. గాలేరు-నగరి, హంద్రీ-నీవా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెలిగొండ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేస్తాం.
అమలు: కమీషన్ల కక్కుర్తితో జాతీయ పోలవరం ప్రాజెక్టులో చంద్రబాబు విధ్వంసం సృష్టించారు. పోలవరం ప్రాజెక్టును కమీషన్ల కోసం చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారంటూ 2019, ఏప్రిల్ 1న రాజమహేంద్రవరంలో ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేయడమే అందుకు నిదర్శనం. గాలేరు-నగరి, హంద్రీ-నీవా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెలిగొండ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లతో కుమ్మక్కై భారీ ఎత్తున నిధులు దోచేశారు. దాంతో ఆ ప్రాజెక్టులు పూర్తి కాలేదు.

హామీ: కేంద్రం రాజధాని లేకుండా విభజించి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టింది. సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని రాజధానిగా ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మిస్తా.
అమలు: ప్రపంచస్థాయి నగరం మాటేమోగానీ.. ఆ ముసుగులో ఓత్ ఆఫ్ సీక్రసీని తుంగలో తొక్కి.. రాజధానిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి అంతర్జాతీయ స్థాయి భూ కుంభకోణానికి చంద్రబాబు పాల్పడ్డారు. అమరావతిలో ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క శాశ్వత భవనాన్ని నిర్మించలేకపోయారు. కనీసం రహదారి సౌకర్యాన్ని కూడా కల్పించలేకపోయారు.

వైఎస్సార్‌సీపీ 2019 మేనిఫెస్టో

▶ 3వ పేజీ తరువాయి

అడ్డుకట్ట వేసి బ్రహ్మంసాగర్‌లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశారు. పోలవరంలో చంద్రబాబు చేసిన తప్పులను సరిదిద్దుతూ.. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన స్పిల్ వే, స్పిల్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేసి.. గోదావరి వరదను మళ్లించారు. చంద్రబాబు చారిత్రక తప్పిదం వల్లే దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌పై కేంద్రం నిర్ణయం వెల్లడించడమే తరువాయి.. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపట్టి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సీఎం జగన్ సిద్ధంగా ఉన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఏటా ఖరీఫ్, రబీలలో కోటి ఎకరాలకు నీళ్లందించి రైతుల సాగునీటి కలను నిజం చేశారు.

హామీ: బీసీల అభ్యున్నతికి ఏడాదికి రూ.15 వేల కోట్లు చొప్పున 5 ఏళ్లలో రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తాం. బీసీల్లోని అన్ని ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి, వైఎస్సార్ చేయూత ద్వారా ఎంత అవసరమైతే అన్ని నిధులు కేటాయించి వారి అభ్యున్నతికి తోడుగా ఉంటాం. నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం తెస్తాం. బీసీ జనగణన చేసి.. చట్టసభలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం. శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పిస్తాం.
అమలు: బీసీల అభ్యున్నతికి చెప్పిన దాని కంటే అధికంగా నిధులు ఖర్చు చేశారు. డీబీటీ రూపంలో రూ.1.28 లక్షల కోట్లను బీసీ లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమా చేశారు. నాన్ డీబీటీ రూపంలో రూ.52 వేల కోట్ల ప్రయోజనం చేకూర్చారు. డీబీటీ, నాన్‌డీబీటీ కలిపి మొత్తం రూ.1.80 లక్షల కోట్లను బీసీల అభ్యున్నతి కోసం ఖర్చు చేశారు. బీసీల్లోని ఉప కులాలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి, ఆ వర్గాల వారినే చైర్మన్‌లు, డైరెక్టర్‌లుగా నియమించారు. నామినేటెడ్ పనుల్లో, పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ ఆ వర్గాలకు ప్రయోజనం చేకూర్చారు. బీసీ జనగణన చేయించి.. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడంతోపాటు ఇదే అంశంపై పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టారు. శాశ్వత బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించారు. వెనుకబడిన వర్గాలను సమాజానికి వెన్నెముకగా తీర్చిదిద్దుతానంటూ ఆ వర్గాలకు ఇచ్చిన మాటను సీఎం జగన్ నిలబెట్టుకున్నారు.



హామీ: షాపులు ఉన్న నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు ఏడాదికి రూ.పది వేలు ఆర్థిక సహాయం చేసి తోడుగా ఉంటాం.
అమలు: చెప్పిన మాట మేరకు ఐదేళ్లలో 3.37 లక్షల మందికి జగనన్న చేదోడు పథకం కింద రూ.1,260.17 కోట్లను సహాయంగా అందించి, తోడుగా నిలిచారు.

హామీ: మగ్గం ఉన్న చేనేత కార్మికుల కుటుంబాలకు ఏడాదికి రూ.24 వేలను ప్రోత్సాహకంగా ఇస్తాం.
అమలు: వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద 82,130 మంది మగ్గం ఉన్న చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేల చొప్పున ఐదేళ్లలో రూ.982.98 కోట్లను ప్రోత్సాహకంగా అందించారు.

హామీ: కులవృత్తిదారులు, చిరు వ్యాపారులకు సున్నా వడ్డీకే రూ.పది వేలు ఇస్తాం.
అమలు: జగనన్న తోడు పథకం కింద 15.87 లక్షల మందికి సున్నా వడ్డీకే రుణాలు ఇచ్చారు. సున్నా వడ్డీ కింద వారికి రూ.88.33 కోట్లు ఇచ్చారు.

హామీ: వైఎస్సార్ చేయూత పథకం కింద 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్క చెల్లెమ్మలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో రూ.75 వేలు ఇస్తాం.
అమలు: చెప్పిన మాట మేరకు 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కలు 33.15 లక్షల మందికి రూ.19,189.59 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు. వాటిని సద్వినియోగం చేసుకున్న మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ.. ఆదాయం పొందుతూ ఆర్థిక సాధికారత సాధిస్తూ సొంత కాళ్లపై నిలబడే దిశగా అడుగులు వేస్తున్నారు.

హామీ: ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తాం. ఆ స్థలాలను అక్క చెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తాం. ఇళ్లు కూడా కట్టిస్తాం.
అమలు: ఇచ్చిన మాట మేరకు 31 లక్షల మందికిపైగా అక్క చెల్లెమ్మలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసి.. వాటిపై సర్వహక్కులు కల్పిస్తూ వారి పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఈ స్థలాల మార్కెట్ విలువ రూ.76 వేల కోట్లకుపైగానే పలుకుతోంది. అంతే కాకుండా 22 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి.. ఇప్పటికే 9 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇవ్వడంతో పాటు రూ.35 వేలు పావలా వడ్డీకే రుణంగా అందించారు. ఉచితంగా ఇసుక, సబ్సిడీపై ఇతర నిర్మాణ సామగ్రిని సరఫరా చేసి.. ఒక్కో లబ్ధిదారుకు రూ.55 వేల చొప్పున ప్రయోజనం



చేకూర్చారు. స్థలం, ఇంటి రూపంలో ఒక్కో లబ్ధిదారుకు రూ.6 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ స్థిరాస్థిని సమకూర్చారు.

హామీ: పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకంగా ఇస్తున్న రాయితీల (భూమి, పన్ను, విద్యుత్)తో పాటు ఏపీఐడీసీని పునరుద్ధరించి.. నిరుద్యోగ యువతకు సబ్సిడీ అందించి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడతాం.
అమలు: అధికారం చేపట్టినప్పటి నుంచి పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక సంస్కరణల ద్వారా సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో ఏటా రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్‌గా నిలుపుతున్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఏటా సగటున రూ.14,896 కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. ఏపీఐడీసీని పునరుద్ధరించారు. ప్రభుత్వం ఇచ్చిన తోడ్పాటుతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) 1.9 లక్షల నుంచి ఏడు లక్షలకు చేరుకున్నాయి. 22.07 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. పరిశ్రమల స్థాపనతో గత 59 నెలల్లోనే కొత్తగా 28.92 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. ప్రభుత్వ, ప్రైవేట్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ అన్నీ కలిపి ఏకంగా 6,48,087 మందికి ఉద్యోగాలు, ఉపాధి లభించింది. హామీ ఇవ్వకున్నా నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, పది ఇండస్ట్రియల్ నోడ్స్ నిర్మాణంతో పారిశ్రామికాభివృద్ధిని పరుగులెత్తిస్తున్నారు.

హామీ: పార్లమెంటు నియోజకవర్గం యూనిట్‌గా ఒక జిల్లాను ఏర్పాటు చేసి.. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తా.
అమలు: 13 జిల్లాలను పునర్వ్యవస్థీకరించి 26 జిల్లాలను ఏర్పాటు చేశారు. కొత్తగా 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నారు. 2023-24లో ఐదు మెడికల్ కాలేజీలను ప్రారంభించారు. 2024-25లో మరో ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. మిగిలిన ఏడు 2025-26లో ప్రారంభించనున్నారు.



ఎస్సీ, ఎస్టీ సంక్షేమం

ఎస్సీలకు డీబీటీ ద్వారా 5 ఏళ్లలో ఇప్పటికే రూ.45,412 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.23,469 అందించాం.

ఎస్టీలకు డీబీటీ ద్వారా 5 ఏళ్లలో ఇప్పటికే రూ.13,389 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.5,963 కోట్లు అందించాం.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- ఎస్సీల(మాల, మాదిగ, రెల్లి తదితర కులాల)కు 3 కార్పొరేషన్లు, పారదర్శకంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ల అమలు.
- అసైన్డ్ భూములపై శాశ్వత హక్కులు కల్పించాం.
- 500 మంది గిరిజన జనాభా ఉన్న ప్రతి తండా, గూడెంను పంచాయతీగా వర్గీకరిస్తూ 165 గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేశాం.
- ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గిరిజన తండాల్లో 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇచ్చాం.
- గిరిజన ప్రాంతాల్లోని 497 సచివాలయాల్లో అన్ని ఉద్యోగాలూ స్థానిక గిరిజనులకే ఇచ్చాం.
- గిరిజనులకు ప్రత్యేకంగా అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలు ఏర్పాటు చేశాం.
- పార్వతీపురం, పాడేరులో రెండు మెడికల్ కాలేజీలు, కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ, సాలూరులో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశాం.
- సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, దోర్నాల, బుట్టాయిగూడెంలో 5 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం.
- అటవీ భూములను సాగుచేసుకునే రైతులకు ఆర్వోఎఫ్ఆర్, డీకేటీ పట్టాలిచ్చాం. తద్వారా 1.54 లక్షల గిరిజన కుటుంబాలకు 3.22 లక్షల ఎకరాల భూమి పంపకం జరిగింది. ఇలా ఇవ్వడమే కాకుండా రైతు భరోసా సొమ్ము కూడా పెట్టుబడి సాయం కింద ఇస్తున్నాం.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- ఎస్సీ, ఎస్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చాం.
- విజయవాడలో రూ.404 కోట్లతో 206 అడుగుల అంబేడ్కర్ 'సామాజిక న్యాయ మహాశిల్పం' నిర్మించాం.
- ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్షతో గిరిజనులకు మెరుగైన వైద్యం. గిరిజన ప్రాంతాల్లో 24/7 వైద్య సౌకర్యం కల్పించాం.
- రాష్ట్ర స్థాయిలో ఒక చైర్మన్, ఐదుగురు సభ్యులతో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేశాం. వచ్చే ఐదేళ్లు ఇది కొనసాగుతుంది.

వచ్చే 5 ఏళ్లలో... మొత్తం జనాభాలో కనీసం 50% దళితులు ఉండి, దళితుల జనాభా 500కు పైన ఉన్న ఆవాసాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేస్తాం

క్రిస్టియన్ మైనార్టీలు

- మైనార్టీ సబ్ ప్లాన్ పారదర్శకంగా అమలు.
- పాస్టర్లకు వివాహ రిజిస్ట్రార్ లైసెన్స్ సచివాలయ స్థాయిలోనే అప్లికేషన్, సర్టిఫికెట్ డెలివరీ అయ్యేలా సులభతరం చేశాం.
- పాస్టర్లకు మొట్టమొదటిసారిగా రూ.5 వేల గౌరవవేతనం ఇస్తున్నాం.
- హోలీ ల్యాండ్ వెళ్లే క్రిస్టియన్లకు సాయం.
- వైఎస్సార్ బీమా
- పాస్టర్లకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం

వచ్చే 5 ఏళ్లలో... ప్రార్థనా స్థలాల నిర్వహణకు ప్రత్యేక నిధి

పరిశ్రమలు

ఈ 5 ఏళ్లలో రూ.85,543 కోట్ల పెట్టుబడులు, 28.89 లక్షల ఉద్యోగాలు వచ్చాయి.

- 2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా... పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం ఇచ్చాం.
- మేనిఫెస్టోలో చెప్పకపోయినా.. ఎంఎస్ఎంఈలకు రూ.2,087 కోట్ల ప్రోత్సాహకాలు అందించాం.

మౌలిక సదుపాయాలు/వసతులు

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- సుమారు రూ.20,000 కోట్లతో 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, రూ.4,592 కోట్లతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్నాం.

వచ్చే 5 ఏళ్లలో... వీటిని పూర్తి చేస్తాం

వచ్చే 5 ఏళ్లలో...

- ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరుపై ప్రత్యేక శ్రద్ధ.
- రోడ్ల మరమ్మతులు, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ.
- రోడ్లు, పార్కులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలతో స్మార్ట్ సిటీలుగా జిల్లా కేంద్రాలను అభివృద్ధి చేసేలా తొలి దశలో రూ.2,000 కోట్ల కేటాయింపు.
- ప్రతి జిల్లాలో పీపీపీ పద్ధతిలో ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేసే దిశగా అడుగులు.
- ఎంఎస్ఎంఈలకు ఇప్పటికే రెండుసార్లు ప్రోత్సాహకాలు ఇచ్చాం. ఇకపై ప్రతి సంవత్సరం ఇచ్చే విధంగా అడుగులు.

బీసీ సంక్షేమం

ఇప్పటికే డీబీటీ ద్వారా రూ.1.28 లక్షల కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.53 వేల కోట్లు అందించాం.

175 అసెంబ్లీ, 25 లోక్‌సభ.. మొత్తం 200 స్థానాల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకంగా 50 శాతం అంటే 100 సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే 2024 ఎన్నికల్లో కేటాయించాం.

బీసీలను బ్యాక్ బోన్ క్లాస్ చేశాం. డిప్యూటీ సీఎం, స్పీకర్, మంత్రి పదవులు, రాజ్యసభ సభ్యత్వాలు, నామినేటెడ్ పదవులు.. ఇలా రాజకీయ సాధికారతనూ సాకారం చేశాం.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా....

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజకీయ ఎదుగుదల కోసం అన్ని నామినేటెడ్ పదవుల్లో 50% రిజర్వేషన్లు, వారి ఆర్థిక ఎదుగుదల కోసం అన్ని నామినేటెడ్, కాంట్రాక్ట్ వర్క్స్‌లో కూడా 50% రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేశాం.
- బీసీ ఉప ప్రణాళిక అమలు చేశాం.
- శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు చేశాం.
- కుల సర్వేని చేపట్టాం.
- బీసీల్లో ఉప కులాలకు 56 కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు.
- తిరుమలలో శ్రీవారి గర్భగుడి తలుపులు సన్నిధి గొల్లలు తెరిచే సంప్రదాయం పునరుద్ధరించాం.
- గొర్రెల కాపరులకు చనిపోయిన ప్రతి గొర్రెకూ రూ.6 వేల బీమా.
- వైఎస్సార్ బీమా ద్వారా సహజ మరణానికి రూ.లక్ష, ప్రమాదంలో చనిపోతే రూ.5 లక్షల సాయం ఇస్తున్నాం.

నాయీ బ్రాహ్మణులు

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- 'మంగలి' వంటి అభ్యంతరకర పదాలను నిషేధిస్తూ జీవో.
- దేవాలయాల్లో క్షురకర్మ చేసే నాయీ బ్రాహ్మణులకు కనీసం రూ.20 వేల గౌరవ వేతనం.
- ఆలయాల పాలక మండళ్లలో మొదటిసారిగా నాయీ బ్రాహ్మణులకు చోటు.
- నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్
- షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

ముస్లిం మైనార్టీలు

మైనార్టీ సబ్ ప్లాన్ పారదర్శకంగా అమలు

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- వక్ఫ్ బోర్డ్, ముస్లిం మైనార్టీల ఆస్తుల రీసర్వే, పరిరక్షణ
- హజ్ యాత్రకు సాయం చేశాం
- వైఎస్సార్ బీమా
- ఇమామ్‌లకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చాం.
- ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు పెంచిన గౌరవ వేతనం ఇచ్చాం

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- డిప్యూటీ సీఎం, మండలిలో డిప్యూటీ చైర్‌పర్సన్ ఇచ్చి గౌరవించాం.
- రెండో అధికారిక భాషగా ఉర్దూను చేశాం.
- హజ్ యాత్రకు విజయవాడ నుంచే వెళ్లేలా ఎంబార్కేషన్ పాయింట్.
- ఏపీ మైనార్టీస్ కాంపోనెంట్ చట్టం చేశాం.

వచ్చే 5 ఏళ్లలో... ప్రార్థనా స్థలాల నిర్వహణకు ప్రత్యేక నిధి

కాపు సంక్షేమం

5 ఏళ్లలో రూ.34 వేల కోట్లకుపైగా ఖర్చు

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- కాపు సంక్షేమం కోసం 5 ఏళ్లలో రూ.10 వేల కోట్లు కేటాయించి ఖర్చు చేస్తామని చెప్పాం. కానీ అంతకంటే మిన్నగా ఇప్పటికే రూ.34 వేల కోట్లకుపైగా కాపు కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేశాం.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- ఉప ముఖ్యమంత్రి, కీలక మంత్రి పదవులు ఇచ్చాం.

ఓసీల సంక్షేమం

- 2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, నిధులు వెచ్చించాం.
- ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. ఆర్యవైశ్య సత్రాలు నడిపే హక్కు వారికే ఇచ్చాం.
- వచ్చే 5 ఏళ్లు వీరి సంక్షేమం ఇలాగే కొనసాగుతుంది.

జగనన్న చేదోడు


ఇక పై రూ.1 లక్ష వరకు

- షాపులున్న నాయీ బ్రాహ్మణులు, టైలర్లు, రజకులకు ఏటా రూ.10 వేలు చొప్పున 5 ఏళ్లలో ఒక్కొక్కరికీ రూ.50 వేల సాయం.
- ఇప్పటికే 3.38 లక్షల మందికి రూ1,260 కోట్లు ఇచ్చాం.
- వచ్చే 5 ఏళ్లు ఈ పథకం కొనసాగిస్తాం.

వచ్చే ఐదేళ్లు వీరందరి సంక్షేమం ఇలాగే కొనసాగిస్తాం

సామాజిక భవనాల కట్టడాలకు ప్రత్యేక నిధి

ఇదీ వైఎస్ జగన్ 2024 మేనిఫెస్టో



హిందూ దేవాలయాలు

ఇప్పటిదాకా రూ.1,376 కోట్లతో 1056 పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం చేశాం.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- అర్చకులకు రిటైర్మెంట్ విధానం రద్దు చేశాం.
- అర్చకుల వేతనాల పెంపు అమలు చేశాం.
- అర్చకులకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం చేశాం.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు పెంచాం.
- 5,416 ఆలయాలకు నిత్య ధూప, దీప, నైవేద్యాలకు నిధులు ఇచ్చాం.
- గత ప్రభుత్వం కూల్చేసిన ఆలయాల పునర్నిర్మాణం చేశాం.
- దేవాలయ బోర్డుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50% రిజర్వేషన్ కల్పించాం.
- విజయవాడలోని కనకదుర్గమ్మ గుడిలో రూ.216 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం.
- శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవాలయంలో రూ.175 కోట్లతో అభివృద్ధి పనులు. 5,300 ఎకరాల భూవివాదాలు పరిష్కారం.

వచ్చే 5 ఏళ్లలో... దేవాలయాల నిర్వహణకు ప్రత్యేక నిధి.

కులవృత్తిదారులు, చిరు వ్యాపారులు

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- కులవృత్తిదారులు, చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇచ్చాం.
- జగనన్న తోడు ద్వారా సున్నావడ్డీకే రూ.10 వేల రుణ సదుపాయం కల్పించాం. మొత్తం రూ.3,373 కోట్ల రుణ సదుపాయంతో 16 లక్షల మందికి మేలు చేశాం.

వచ్చే 5 ఏళ్లలో... జగనన్న తోడు రుణ పరిమితి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు తక్షణమే పెంపు. సక్రమంగా రుణాలు చెల్లించేవారికి ఏటా రూ.1,000 పెంపుతో వచ్చే 5 ఏళ్లలో గరిష్టంగా రూ.20,000 వరకు వడ్డీలేని రుణాలు అందజేస్తాం.

ప్రభుత్వ ఉద్యోగులు

రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు ఇప్పటికే పెంచాం.

- ఓపీఎస్ విధానానికి వెళ్లలేకపోయినా.. ఉద్యోగుల భద్రత, భవిష్యత్తరాలు, రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని.. పదవీ విరమణ చేయబోతున్న ఉద్యోగుల కోసం గ్యారెంటీడ్ పెన్షన్ విధానం(జీపీఎస్) తీసుకొచ్చాం.
- అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మునిసిపల్ పారిశుధ్య కార్మికులు, హోంగార్డులు, 108, 104 వాహనాల డ్రైవర్లు, ఆశా వర్కర్లు... ఇలా వివిధ ప్రభుత్వ ఉద్యోగుల జీతాలను గతానికంటే భిన్నంగా భారీగా పెంచాం. ఫలితంగా 3 లక్షలకుపైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరింది.
- ప్రభుత్వంలో ఏపీఎస్ ఆర్టీసీ విలీనం. ఏటా రూ.3,600 కోట్ల భారం. తద్వారా 52 వేల మందికి మంచి చేశాం.
- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్. తద్వారా 10 వేల మందికి మంచి చేశాం.
- పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రతి జిల్లాలో ప్రత్యేక సెల్, సైనికులు, మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశాం.
- పోలీసులకు వీక్లీ ఆఫ్ ఇచ్చాం. చిన్న చిన్న సమస్యలనూ పరిష్కరిస్తాం.
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఆప్కాస్ ఏర్పాటు. తద్వారా కమీషన్లు, దళారీలు లేకుండా జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ వారికి అందేలా చూస్తున్నాం.

వచ్చే 5 ఏళ్లలో...

జగనన్న విదేశీ విద్యా దీవెనకు ఎంపిక కాని ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు, ఈ ఏడాది నుంచి విదేశీ విద్యకు వారు తీసుకునే రుణంలో రూ.10 లక్షల వరకు.. పూర్తి వడ్డీని కోర్సు పూర్తయ్యే వరకు లేదా గరిష్టంగా 5 ఏళ్లపాటు చెల్లిస్తాం.

రూ.25 వేల వరకు జీతం పొందే ఆప్కాస్, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు విద్య, వైద్యానికి, ఇళ్లకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో విద్య, వైద్యానికి, ఇళ్లకు సంబంధించిన అన్ని నవరత్న పథకాలు వారికీ వర్తింపు.

ఇల్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు తమ సొంత జిల్లాలోనే ఇళ్ల స్థలాలు. 60 శాతం ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది.

అగ్రిగోల్డ్

10.40 లక్షల మందికి రూ.906 కోట్లు ఇప్పటికే అందించాం.

జీవన బీమా

వైఎస్సార్ జీవన బీమా ద్వారా సహజ మరణానికి రూ.లక్ష, ప్రమాదంలో చనిపోయినా, శాశ్వత వికలాంగులైనా రూ.5 లక్షలు సాయం చేశాం.

వచ్చే 5 ఏళ్లలో... గిగ్ వర్కర్స్(స్విగ్గీ, జొమాటో, అమెజాన్ వంటి సంస్థల్లోని డెలివరీ బాయ్స్) ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షల బీమా కల్పిస్తాం.

జర్నలిస్టులు

60% ఖర్చును ప్రభుత్వమే భరిస్తూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

వచ్చే 5 ఏళ్లు వీరందరి సంక్షేమం ఇలాగే కొనసాగిస్తాం.

రాజధాని

2024లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఏర్పడగానే విశాఖ పరిపాలనా రాజధానిగా పాలన. రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌లా పనిచేసేలా విశాఖను అభివృద్ధి చేస్తాం.

అమరావతిని శాసన రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా అభివృద్ధి చేస్తాం.

వైఎస్సార్ జలయజ్ఞం

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- ఎన్ని అడ్డంకులు వచ్చినా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అడుగులు వేశాం. రక్షిత మంచినీరు, సాగునీరు కల నిజం చేస్తున్నాం.
- నెల్లూరు, సంగం బ్యారేజీలు, అవుకు రెండో టన్నెల్ పూర్తి చేశాం.
- వెలిగొండ 2 సొరంగాలు పూర్తి చేశాం. కుప్పం బ్రాంచి కెనాల్ పూర్తి చేసి కుప్పానికి కృష్ణా జలాలు అందించాం.
- పత్తికొండ, డోన్, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల్లో 77 చెరువుల అనుసంధానం పూర్తి చేశాం.
- బ్రహ్మంసాగర్, గండికోట, చిత్రావతి రిజర్వాయర్ల ఆర్ అండ్ ఆర్ సమస్యలు, సాంకేతిక సమస్యలు పరిష్కరించి పూర్తి సామర్థ్యంతో నీరు నింపాం.

వచ్చే 5 ఏళ్లలో... జలయజ్ఞం ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం.

సుపరిపాలన

లంచాలు, అవినీతి, వివక్ష లేకుండా, కులం, మతం, పార్టీలు, ప్రాంతం చూడకుండా సుపరిపాలన అందించాం.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లా చేశాం.
- పథకాల డోర్ డెలివరీ చేశాం. రేషన్ బియ్యం డోర్ డెలివరీ చేశాం.
- గ్రామ, వార్డు సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం సాకారం.
- 50 నుంచి 70 ఇళ్లకు ఓ వలంటీరుని నియమించాం.
- పథకాలకు సంబంధించిన సమస్యలేవైనా 72 గంటల్లోనే పరిష్కారం, 6 నెలలకోసారి బై యాన్యువల్ శాంక్షన్స్ చేశాం. ఫ్రీ జోన్‌గా రాజధాని ప్రాంతం. వికేంద్రీకరణ లక్ష్యంగా 3 ప్రాంతాల అభివృద్ధి.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేశాం.
- జగనన్న సురక్షతో కోటి సర్టిఫికెట్లు వారి ఇళ్ల వద్దనే ఇచ్చాం.
- భూ సమస్యలకు పరిష్కారం చెబుతూ 100 ఏళ్ల తర్వాత సమగ్ర భూ సర్వే చేపట్టాం.

వచ్చే 5 ఏళ్లు ... ఈ సుపరిపాలన ఇలాగే కొనసాగిస్తాం.

వచ్చే 5 ఏళ్లలో పూర్తి చేస్తాం

- పోలవరం ప్రాజెక్టు
- 17 మెడికల్ కాలేజీల నిర్మాణం
- నిర్మాణంలో ఉన్న 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు
- భోగాపురం ఎయిర్‌పోర్ట్
- ప్రభుత్వ బడులు, హాస్టళ్లు, అంగన్‌వాడీలు, ఆస్పత్రుల్లో నాడు–నేడు
- పేదలందరికీ ఇళ్ల స్థలాలు, మొదలు పెట్టిన ఇళ్ల నిర్మాణ విప్లవం పూర్తి చేస్తాం
- భూముల రీసర్వే
- ఆక్వా యూనివర్సిటీ
- లా యూనివర్సిటీ
- డాక్టర్ అబ్దుల్ హక్ యూనివర్సిటీ
- గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ, గిరిజన యూనివర్సిటీ
- ఇప్పటికే మొదలుపెట్టిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు, కోల్డ్ స్టోరేజీలు, గొడౌన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు
- ఎడెక్స్ ద్వారా మరిన్ని ఆన్‌లైన్ వర్టికల్స్, ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలతో సర్టిఫికేషన్ మరింత ముందుకు.
- ఇప్పటికే ఉన్న ఇంగ్లిష్ మీడియంతో పాటు ఏటా ఒక్కో తరగతికీ ఐబీ సిలబస్ అమలు.

మహిళలు

కడుపులో ఉన్న బిడ్డ దగ్గర నుంచి, పండుముసలి వయసు వరకు ప్రతి ఒక్కరికీ తోడుగా జగనన్న ప్రభుత్వం

వైఎస్సార్ చేయూత

తమ కాళ్లపై తాము నిలబడేలా.

ఇకపై రూ.1.50 లక్షల వరకు

33.15 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ప్రతి ఏటా రూ.18,750 చొప్పున 4 విడతల్లో రూ75 వేలు ఇచ్చాం. ఇలా ఇప్పటికే రూ.19,189 కోట్లు అందించాం. వచ్చే ఐదేళ్లలో 4 విడతల్లో రూ.18,750 చొప్పున మరో రూ.75 వేలు అందిస్తాం. మొత్తంగా 8 విడతల్లో రూ.1.50 లక్షల లబ్ధి.

వచ్చే 5 ఏళ్లు కొనసాగుతుంది

- 45–60 ఏళ్ల వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు ఏదో ఒక ఆదాయం ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని భావించి.. అది పెన్షన్ కావొచ్చు, లేదా చేయూత కావొచ్చు.. ఇలా ఉండేలా చేయూత పథకాన్ని కొనసాగిస్తూ ఏటా రూ.18,750 చొప్పున 4 విడతల్లో వచ్చే 5 ఏళ్లలో మరో రూ.75 వేలు ఇస్తాం. బ్యాంకులతో, ప్రఖ్యాత సంస్థలతో టై అప్ కోసం సూచనలు, సలహాలు ఇస్తూ, లేదా వారి సొంత వ్యాపారం ద్వారా వారు నిలదొక్కుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుంది.

వైఎస్సార్ కాపు నేస్తం

కాపు అక్కచెల్లెమ్మలకు భరోసా

ఇకపై రూ.1.20 లక్షల వరకు

4.63 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ప్రతి ఏటా ఈ 5 ఏళ్లలో రూ.15,000 చొప్పున 4 విడతల్లో రూ.60 వేలు ఇచ్చాం. ఇలా ఇప్పటికే రూ.2,030 కోట్లు అందించాం. వచ్చే 5 ఏళ్లలో 4 విడతల్లో రూ.15,000 చొప్పున మరో రూ.60 వేలు అందిస్తాం. మొత్తంగా 8 విడతల్లో రూ.1.20 లక్షల లబ్ధి.

వచ్చే 5 ఏళ్లు కొనసాగుతుంది

- కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల అక్కచెల్లెమ్మలకు ఏదో ఒక ఆదాయం ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని భావించి.. అది పెన్షన్ కావొచ్చు, కాపు నేస్తం కావొచ్చు. ఇలా ఉండేలా వైఎస్సార్ కాపు నేస్తం పథకాన్ని కొనసాగిస్తూ 45 నుంచి 60 ఏళ్లలోపు ఆ వర్గాల నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.15 వేల చొప్పున నాలుగు విడతల్లో వచ్చే 5 ఏళ్లలో మరో రూ.60 వేలు అందిస్తాం.



వైఎస్సార్ ఈబీసీ నేస్తం

అగ్రవర్ణాల పేద అక్కచెల్లెమ్మలకు చేదోడు

ఇకపై రూ.1.05 లక్షల వరకు

ఈ 5 ఏళ్లలో ఇప్పటికే 4.95 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.1,877 కోట్లు అందించాం. వచ్చే 5 ఏళ్లలో 4 విడతల్లో రూ.15,000 చొప్పున మరో రూ.60 వేలు అందిస్తాం. మొత్తంగా 7 విడతల్లో రూ.1.05 లక్షల లబ్ధి.

వచ్చే 5 ఏళ్లు కొనసాగుతుంది

- రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతోపాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన పేద అక్కచెల్లెమ్మలకు ఏదో ఒక ఆదాయం ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని భావించి అది పెన్షన్ కావొచ్చు, ఈబీసీ నేస్తం కావొచ్చు.. ఇలా ఉండేలా వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని కొనసాగిస్తూ 45 నుంచి 60 ఏళ్లలోపు ఆ వర్గాల నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.15 వేల చొప్పున 4 విడతల్లో వచ్చే 5 ఏళ్లలో మరో రూ.60 వేలు అందిస్తాం.

-మిగతా VIలో

జైత్రయాత్ర 2024

జగనన్న అమ్మఒడి - పిల్లల చదువులకు తోడుగా..

ఇకపై రూ.17,000కు పెంచి కొనసాగిస్తాం

పిల్లలను బడులకు పంపే పేద తల్లులకు ఏటా రూ.15 వేల చొప్పున 44.48 లక్షల మందికి రూ.26 వేల కోట్లకుపైగా ఇప్పటికే అందించాం. వచ్చే 5 ఏళ్లలో ఏటా రూ.17 వేల చొప్పున మరో రూ.85 వేలు అందిస్తాం. మొత్తంగా రూ.1.45 లక్షల లబ్ధి.

వచ్చే 5 ఏళ్లూ రూ.17 వేలకు పెంచి కొనసాగిస్తాం

- జగనన్న అమ్మ ఒడి ద్వారా పిల్లలను బడికి పంపే ప్రతి పేద తల్లికి ఏటా రూ.15 వేల చొప్పున వచ్చే 5 ఏళ్లలో మరో రూ.75 వేలు అందిస్తాం. తల్లులకు ప్రశ్నించే హక్కు కల్పిస్తూ ఏటా మరో రూ.2 వేల చొప్పున 5 ఏళ్లలో రూ.10వేల మొత్తాన్ని వారి పిల్లల ప్రభుత్వ స్కూళ్ల బాగోగుల కోసం SMF, TMF రూపంలో స్కూళ్లకు జమ చేస్తాం. మొత్తంగా అమ్మ ఒడి ద్వారా మరో రూ.85 వేల లబ్ధి. చదువులను ప్రోత్సహించడానికి 75% హాజరు తప్పనిసరి ఇప్పటిలాగే.

వైఎస్సార్ ఆసరా, '0' వడ్డీ రుణాలు

అక్కచెల్లెమ్మలకు బాసటగా...

ఇప్పటికే వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.25,571 కోట్లు ఇచ్చాం.
'0' వడ్డీ రుణాలు మరో రూ.4,969 కోట్లు ఇచ్చాం.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా..

- 2019 ఎన్నికల రోజు వరకు అక్కచెల్లెమ్మలకు ఉన్న పొదుపు సంఘాల రుణాల మొత్తం రూ.25,571 కోట్లను ఇచ్చిన మాట ప్రకారం 4 దఫాల్లో ఇప్పటికే చెల్లించామని సగర్వంగా తెలియజేస్తున్నాం.
- రూ.3 లక్షల దాకా రుణాల మీద '0' వడ్డీ కార్యక్రమం వచ్చే 5 ఏళ్లు కూడా కొనసాగుతుంది.



వైఎస్సార్ కల్యాణమస్తు షాదీ తోఫా

చదువులను ప్రోత్సహిస్తూ.. పేదింట పెళ్లి వేడుక

ఈ 5 ఏళ్లలో ఇప్పటికే 56 వేల మంది చెల్లెమ్మలకు రూ.427 కోట్లు అందించాం.

- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ చెల్లెమ్మల వివాహానికి రూ.లక్ష, బీసీ చెల్లెమ్మలకు రూ.50 వేలు, విభిన్న ప్రతిభావంతులకు ఇప్పటికే రూ.లక్షన్నర అందిస్తున్నాం. వచ్చే 5 ఏళ్లూ కొనసాగిస్తాం.
- చదువులను ప్రోత్సహిస్తూ పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి.

మహిళా సాధికారత

- అక్కచెల్లెమ్మలకు ఆర్థిక, రాజకీయ స్వావలంబన

- 2019 కేబినెట్‌లో మహిళలకు 3 మంత్రి పదవులు ఇస్తే, 2022లో పునర్ వ్యవస్థీకరణలో 4 మంత్రి పదవులు దక్కాయి. వార్డు మెంబర్ నుంచి మేయర్ల వరకు చట్టం చేసి మరీ అన్నింటా 50% పదవులు అక్కచెల్లెమ్మలకే.
- దేశంలో తొలిసారి నామినేటెడ్ పదవుల్లో, నామినేషన్ పనుల్లో 50% మహిళలకే కేటాయించేలా చట్టం చేశాం. ఆలయ కమిటీల్లోనూ చట్టం చేసి మరీ 50% రిజర్వేషన్ కల్పించాం.

పేదలందరికీ ఇళ్లపట్టాలు, ఇళ్లు - సొంతింటి కల సాకారం

- ఇప్పటికే 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు అందించాం

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా..

- పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టిస్తున్నాం. 22.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి, ఇప్పటికే 9.2 లక్షలకు పైగా పూర్తి చేశాం. మిగిలినవి వేగంగా పనులు జరుగుతున్నాయి.
- అక్కచెల్లెమ్మల పేరిటే ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్, ఇంటి నిర్మాణానికి పావలా వడ్డీకే రూ.35 వేల రుణం, ఉచితంగా ఇసుక, తక్కువ ధరకే నిర్మాణ సామగ్రి అందించాం. దేశంలోనే తొలిసారిగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలపై సర్వహక్కులూ కల్పిస్తూ కన్వేయన్స్ డీడ్స్, రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇచ్చాం.

వచ్చే 5 ఏళ్లలో....

- అర్హులై ఉండి, ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని కొనసాగిస్తూ, వచ్చే 5 ఏళ్లలో మిగిలిపోయిన మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపడతాం.
  మొత్తం: 22.5 లక్షలు + 10 లక్షలు = 32.5 లక్షల ఇళ్లు

పట్టణ గృహ నిర్మాణం

- పట్టణ పేదల సొంతింటి కల సాకారం

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- పట్టణ పేదలకు 300 చదరపు అడుగుల ఇళ్లపై అప్పుల భారాన్ని ప్రభుత్వమే భరించి సొంతింటి కల సాకారం చేశాం. 300 చదరపు అడుగుల ఇళ్లను ఉచితంగా ఇచ్చాం. 360, 430 చ.అ. ఇళ్లపై లబ్ధిదారులు మొదట కట్టాల్సిన వారి వాటాలో 50% సబ్సిడీ ఇచ్చాం.
- అన్ని మౌలిక సదుపాయాలతో 2.62 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణంలో 1.5 లక్షల ఇళ్లను పూర్తి చేసి ఈ ఒక్కో 300 చదరపు అడుగుల ఇంటినీ లబ్ధిదారులకు రూపాయికే అందించాం. అంతేకాకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాం.
- వచ్చే 5 ఏళ్లలో.. రూ.1,000 కోట్లు ఏటా ఇస్తూ రూ.2,000 కోట్ల కార్పస్ ఫండ్‌తో పట్టణ ప్రాంతాల్లో, మధ్యతరగతి వారి కోసం దశలవారీగా ఎంఐజీ లేఅవుట్ల అభివృద్ధి.

- అక్కచెల్లెమ్మల రక్షణ కోసం దిశ యాప్ తీసుకొచ్చాం. దిశ పోలీసు స్టేషన్లు, గ్రామంలోనే మహిళా పోలీస్, దిశ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ఏర్పాటు చేశాం. ఇది ఇలానే కొనసాగుతుంది.
- **వైఎస్సార్ సంపూర్ణ పోషణ** ద్వారా గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తున్నాం.
- గర్భిణులకు ప్రసవం అయ్యాక **వైఎస్సార్ ఆరోగ్య ఆసరా** ద్వారా రూ.5 వేలు అందిస్తున్నాం.
- అధునాతన వసతులు, ఏసీ సౌకర్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 500 **వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్** వాహనాలు తీసుకొచ్చాం.
- మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవు 180 రోజులకు పెంచాం. సర్వీసులో ఎప్పుడైనా వాడుకునే వీలు కల్పించాం.
- **జగనన్న పాల వెల్లువలో** భాగంగా అమూల్‌తో ఒప్పందం వల్ల పోటీ పెంచి 3.60 లక్షల మంది మహిళలు లీటరుపై అదనంగా రూ.10 నుంచి రూ.20 వరకు అధిక ధరలు పొందేలా చేశాం.

ఇదీ వైఎస్ జగన్ మేనిఫెస్టో

అక్కచెల్లెమ్మలకు ఇప్పటికే డీబీటీ ద్వారా రూ.1,89,519 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.94,347 కోట్లు, మొత్తం 2,83,866 కోట్లు అందించాం.

పింఛన్ల కొనసాగింపు

- ఒకటో తేదీనే ఆర్థిక భరోసా

- పెన్షన్ కానుకను రూ.3,000 నుంచి రూ.3,500కు క్రమంగా పెంచుకుంటూ పోతాం. జనవరి 2028 నుంచి 3,250, జనవరి 2029 నుంచి రూ.3,500 ఇస్తాం.
- – ఏటా రూ.24,000 కోట్ల చొప్పున పెన్షన్ల కోసం ఇప్పటికే చేసిన మొత్తం వ్యయం రూ.88,650 కోట్లు.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- ప్రతి నెలా ఒకటో తేదీనే, సూర్యోదయానికంటే ముందే గుడ్ మార్నింగ్ చెబుతూ, పెన్షనర్ల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, గడప వద్దనే వలంటీర్ల ద్వారా పెన్షన్ అందిస్తున్నాం.
- పింఛన్ల అర్హత వయసు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించాం.
- అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల పింఛన్ రూ.3 వేలకు పెంచాం. దీర్ఘకాలిక రోగులకు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ఇస్తున్నాం.
- ఈ పెన్షన్లు ఇంటి వద్దనే వలంటీర్ల ద్వారా ఇచ్చే కార్యక్రమం వచ్చే 5 ఏళ్లూ కొనసాగిస్తాం



దేశంలోనే అత్యధిక పెన్షన్ రూ.3,000 ఇస్తున్న రాష్ట్రం, ఏటా పెన్షన్ల కోసం రూ.24 వేల కోట్ల అత్యధిక వ్యయం చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.

రాష్ట్రం	జనాభా	పెన్షనర్లు	నెలకు ఇచ్చేది	ఏటా వ్యయం
ఆంధ్రప్రదేశ్	5.10 కోట్లు	66.34 లక్షలు	రూ.3,000	రూ.24,000 కోట్లు
తెలంగాణ	4.01 కోట్లు	43.09 లక్షలు	రూ.2,016	రూ.12,230 కోట్లు
ఉత్తరప్రదేశ్	24.02 కోట్లు	80.64 లక్షలు	రూ.1,000	రూ.9,592 కోట్లు
రాజస్థాన్	8.31 కోట్లు	90.15 లక్షలు	రూ.750	రూ.8,114 కోట్లు
కేరళ	3.46 కోట్లు	48.14 లక్షలు	రూ.1,600	రూ.7,295 కోట్లు

స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తూ... మత్స్యకారులు

మత్స్యకార భరోసా ఇకపై రూ.1 లక్ష వరకు

వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా ఇప్పటికే 2.43 లక్షల మందికి రూ.538 కోట్లు అందించాం. 5 విడతల్లో ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున రూ.50 వేల లబ్ధి చేకూరింది. ఈ పథకాన్ని కొనసాగిస్తూ వచ్చే 5 ఏళ్లలో ఒక్కొక్కరికీ మరో రూ.50 వేలు అందిస్తాం. మొత్తంగా ప్రతి మత్స్యకారుడికి రూ.1 లక్ష లబ్ధి.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- డీజిల్ సబ్సిడీని లీటరుకు రూ.6 నుంచి రూ.9కి పెంచి ఇప్పటికే అందిస్తున్నాం. డెడికేటెడ్ పెట్రోల్ బంకుల్లో డీజిల్ నింపుకొనేటప్పుడే ఈ సబ్సిడీ ఇచ్చేలా ఏర్పాటు చేశాం.
- వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు ఇప్పటికే పెంచాం.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- మత్స్యకారుల బంగారు భవితకు 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు నిర్మిస్తున్నాం.

ఆటో /ట్యాక్సీ

ఇకపై రూ.1 లక్ష వరకు

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- సొంత ఆటో, ట్యాక్సీ నడిపేవారికి వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా ఏటా రూ.10 వేల చొప్పున ఒక్కొక్కరికీ రూ.50 వేలు అందించాం. ఇలా 5 ఏళ్లలో ఇప్పటికే 2.76 లక్షల మందికి రూ.1,302 కోట్లు ఇచ్చాం. ఈ పథకాన్ని కొనసాగిస్తూ వచ్చే 5 ఏళ్లలో ఒక్కొక్కరికీ మరో రూ.50 వేలు అందిస్తాం. మొత్తంగా ఒక్కొక్కరికీ రూ.1 లక్ష లబ్ధి.

వచ్చే 5 ఏళ్లలో...

సొంత టిప్పర్ లారీ నడిపేవారికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం.

ఆటో, మ్యాక్సీక్యాబ్, ట్యాక్సీ, టిప్పర్/లారీ డ్రైవర్లు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల బీమా

ఆటో, ట్యాక్సీ, లారీ కొనుగోలు కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే వారికి రూ.3 లక్షల వరకు.. వారిపైన 6% వరకే వడ్డీ భారం ఉండేలా, మిగతా వడ్డీ భారాన్ని మేమే భరిస్తాం.

చేనేత కార్మికులు

ఇకపై రూ.2.4 లక్షల వరకు

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- ఈ 5 ఏళ్లలో నేతన్నల సంక్షేమం, అభివృద్ధి కోసం ఇప్పటికే చేసిన మొత్తం వ్యయం రూ.3,706 కోట్లు. వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికీ ఏటా రూ.24 వేల చొప్పున 5 ఏళ్లలో ఇప్పటికే రూ.1.20 లక్షలు అందించాం. ఈ పథకాన్ని కొనసాగిస్తూ వచ్చే 5 ఏళ్లలో మరో రూ.1.20 లక్షలు అందిస్తాం. మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికీ మొత్తంగా రూ.2.4 లక్షల లబ్ధి.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- ఆప్కోకు (గత ప్రభుత్వ బకాయిలు రూ.103 కోట్లతో సహా) రూ.468 కోట్లు ఇప్పటికే చెల్లించాం.
- పద్మశాలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశాం.

వచ్చే 5 ఏళ్లూ ఈ పథకాలు, వీరందరి సంక్షేమాన్ని ఇలాగే కొనసాగిస్తాం.

న్యాయవాదులు

- వైఎస్సార్ లా నేస్తం ద్వారా జూనియర్ న్యాయవాదులకు మూడేళ్లపాటు ప్రతినెలా రూ.5 వేల స్టైఫండ్ చొప్పున 6 నెలలకోసారి రూ.30 వేలు ఇప్పటికే ఇస్తున్నాం. ఈ 5 ఏళ్లలో ఇప్పటికే 5,781 మందికి సుమారు రూ.42 కోట్లు ఇచ్చాం. వచ్చే 5 ఏళ్లూ ఈ పథకాన్ని కొనసాగిస్తాం. న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్ కింద రూ.100 కోట్లు ఇప్పటికే కేటాయించాం.

యువత - ఉపాధి

-జాబ్ ఓరియంటెడ్ కరిక్యులమ్

- 5 ఏళ్లలో ఇప్పటికే ఇచ్చిన మొత్తం ఉద్యోగాలు 6.48 లక్షలు
- రాష్ట్రంలోని 175 స్కిల్ హబ్‌లు, 26 స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీలు, ఒక స్కిల్ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తూ.. వాటిలో నైపుణ్య శిక్షణ పొందే యువతకు ప్రతి నెలా పెయిడ్ ఇన్‌టర్న్‌షిప్ ఇస్తాం.
- అబ్బాయిలకు - రూ.2,500, అమ్మాయిలకు రూ.3,000.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- గ్రామ సచివాలయాల ఏర్పాటు ద్వారా 1,35,819 శాశ్వత ఉద్యోగాలు ఇప్పటికే కల్పించాం.
- 50 నుంచి 70 ఇళ్లకు ఓ వలంటీర్ చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 2.66 లక్షల వలంటీర్ల నియామకం ఇప్పటికే చేశాం.
- డీఎస్సీ ద్వారా 21 వేలకుపైగా ఉద్యోగాలు, వైద్య ఆరోగ్య శాఖలో 54 వేలకుపైగా ఉద్యోగాలు.. ఇలా 2.31 లక్షల శాశ్వత ఉద్యోగాలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కలిపి 5 ఏళ్లలో ఇచ్చిన మొత్తం ఉద్యోగాలు 6.48 లక్షలు. పరిశ్రమల్లో 75% ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టం చేశాం.
- ప్రత్యేక హోదా కోసం చిత్తశుద్ధితో ప్రయత్నాలు కొనసాగించాం.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- జగనన్న విదేశీ విద్యాదీవెనతో.. క్యూఎస్ ర్యాంకింగ్/టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ ప్రకారం 21 ఫ్యాకల్టీల్లో ప్రపంచంలోని టాప్ 50 ర్యాంకుల్లో ఉన్న 320 కాలేజీల్లో సీటు సంపాదించిన వారికి గరిష్టంగా రూ.1.25 కోట్ల వరకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పటికే అందిస్తున్నాం.
- ఎంఐటీ, హార్వర్డ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, కొలంబియా యూనివర్సిటీ వంటి ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలు, కాలేజీలు అందించే 2,000కు పైగా ఖరీదైన కోర్సులను ఎడెక్స్ ద్వారా ఉచితంగా ఆన్‌లైన్‌లో మన కరిక్యులమ్‌లో భాగంగా వారిచ్చే సర్టిఫికెట్లతో మన కాలేజీల్లోనే అందుబాటులోకి తెచ్చాం.
- జాబ్ ఓరియంటెడ్ కరిక్యులమ్, నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులు, కంపల్సరీ ఇన్‌టర్న్‌షిప్, మైక్రోసాఫ్ట్, సేల్స్ ఫోర్స్ వంటి 2.5 లక్షల సర్టిఫికేషన్స్‌తో స్కిల్స్ అభివృద్ధి

వచ్చే 5 ఏళ్లలో...

- క్రమం తప్పకుండా గ్రూప్-1, గ్రూప్- 2 మొదలైన పోటీ పరీక్షల నోటిఫికేషన్లు ప్రకటించి.. యూపీఎస్సీ తరహాలో నిర్దిష్ట సమయంలో పరీక్షల నిర్వహణ.
- తిరుపతిలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. విశాఖలో స్టార్టప్ హబ్, ప్రతి జిల్లా కేంద్రంలో స్కిల్ కాలేజీ, ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తాం. పదో తరగతి డ్రాపవుట్లు, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులను ఒకే క్యాంపస్‌లోకి తీసుకొచ్చి శిక్షణ ఇచ్చేలా స్కిల్ హబ్స్.
- ప్రతి జిల్లాలోనూ క్రీడా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ. విశాఖలో ప్రపంచ స్థాయి క్రీడా స్టేడియం.
- స్థానిక క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు 'ఆడుదాం ఆంధ్రా' కొనసాగింపు.
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్ జీపీటీ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు బోధించేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులను ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్టులుగా నియమించి వారికి రూ.12 వేల స్టైపెండ్, క్రెడిట్లు ఇస్తాం.
- విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని చర్యలు.
- ప్రత్యేక హోదా కోసం నిరంతర కృషి కొనసాగిస్తాం.

విద్యారంగం

మన పిల్లలను గ్లోబల్ సిటిజన్లుగా...

విద్యారంగంలో కేవలం సంస్కరణల కోసమే ఇప్పటికే చేసిన వ్యయం రూ.73 వేల కోట్లు

- ప్రభుత్వ బడుల్లో నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియం, 6వ తరగతి నుంచి డిజిటల్ క్లాస్ రూములు, డిజిటల్ ఎడ్యుకేషన్, 8వ తరగతి పిల్లలకు ట్యాబులు, 3వ తరగతి నుంచే టోఫెల్ శిక్షణ, సబ్జెక్ట్ టీచర్, బైలింగ్వల్ టెక్స్ట్‌బుక్స్, బైజూస్ కంటెంట్, సీబీఎస్ఈ నుంచి ఐబీ సిలబస్ వరకు ప్రయాణం. ఇలా మన పిల్లలకు అంతర్జాతీయ స్థాయి విద్య అందించే దిశగా అడుగులు వేయగలిగాం.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- జగనన్న అమ్మఒడి
- ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం చదువులు
- జగనన్న విద్యాదీవెన
- మనబడి నాడు-నేడు
- జగనన్న వసతి దీవెన
- జగనన్న గోరుముద్ద

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- జగనన్న విద్యా కానుక ద్వారా ఉచితంగా యూనిఫాం, బ్యాగు, షూస్, సాక్సులు, బెల్టు, బైలింగ్వల్ టెక్స్ట్‌బుక్స్, వర్క్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ మొదలైనవి ఇస్తున్నాం.
- ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం. 8వ తరగతి పిల్లలకు, టీచర్లకు బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబులు ఇప్పటికే ఇచ్చాం.
- 62,000 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌తో 6వ తరగతి నుంచి ప్రతి తరగతిలోనూ డిజిటల్ బోధన. ఇవి ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ పని చేస్తాయి. ప్రతి బడిలోనూ ఇంగ్లిష్ ల్యాబులు, 1 నుంచి 5వ తరగతి పిల్లలకు ప్రతి బడిలోనూ ఒక స్మార్ట్ టీవీ చొప్పున 45,000 స్మార్ట్ టీవీలు, ఇంగ్లిష్ ల్యాబులకు ఇప్పటికే అనుసంధానం.
- 3వ తరగతి నుంచే టోఫెల్ శిక్షణ, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్.
- 7 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 10 లక్షల మంది విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్స్.
- 6,100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. మొత్తంగా 21,108 టీచర్ పోస్టులను భర్తీ చేశా.
- ప్రతి మండలంలోనూ ఒక బాలికల జూనియర్ కాలేజీ ఏర్పాటు.

వచ్చే 5 ఏళ్లలో... :

- వచ్చే 5 ఏళ్లలో అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన కొనసాగిస్తాం.
- అన్ని ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చే మనబడి నాడు-నేడు కొనసాగిస్తాం. అన్ని సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీలు, డిగ్రీ కాలేజీల రూపురేఖలను మారుస్తాం.
- 2025 నుంచి ఒకటో తరగతికి ఐబీ విద్యావిధానం. ఇలా ప్రతి ఏడాది ఒక క్లాస్ పెంచుకుంటూ 2035 నాటికి పదో తరగతి విద్యార్థులకు ఐబీ, రాష్ట్ర బోర్డుల జాయింట్ సర్టిఫికేషన్.
- 8వ తరగతి విద్యార్థులకు ప్రతి ఏటా ట్యాబ్‌లు అందజేసే కార్యక్రమం కొనసాగిస్తాం.
- 18 యూనివర్సిటీల్లో కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్న 3,295 అధ్యాపకుల పోస్టులు భర్తీ చేసే ప్రక్రియను కోర్టు కేసులను అధిగమించి మొదలుపెట్టాం. దాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం.
- డిజిటల్ ఎడ్యుకేషన్‌తో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తాం.
- వచ్చే 5 ఏళ్లూ ఈ సంక్షేమం, అభివృద్ధి ఇలాగే కొనసాగిస్తాం.

వైద్యరంగం..: వైద్యం పేదలకు చేరువైంది

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం
- విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల నుంచి మెడికల్ కాలేజీల వరకు నాడు-నేడుతో అభివృద్ధి చేశాం. 17 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టాం. 54 వేలకుపైగా వైద్య సిబ్బంది నియామకం, మన గడప వద్దనే వైద్యం అందేలా వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు... ఇలా దేశానికే దిక్సూచిగా ప్రతిష్టాత్మక కార్యక్రమాలు చేపట్టాం.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వార్షికాదాయ పరిమితి రూ.5 లక్షలకు పెంచాం. దీంతో రాష్ట్రంలోని 90%కిపైగా కుటుంబాలకు లబ్ధి చేకూరింది.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుమారు 54 వేల మంది వైద్య సిబ్బందిని నియమించాం. దేశంలో స్పెషలిస్టు వైద్యుల కొరత జాతీయ స్థాయిలో 61% ఉంటే మన రాష్ట్రంలో కేవలం 3.94% మాత్రమే.
- ఆరోగ్య ఆసరా ద్వారా చికిత్స అనంతరం కోలుకునే సమయంలో ఆ కుటుంబానికి ఆర్థిక సాయం. రోజుకు రూ.225 లేదా గరిష్టంగా నెలకు రూ.5,000 వరకు చెల్లింపు. డాక్టర్ల సూచన మేరకు ఎన్ని రోజులైనా వర్తింపు.
- వైద్య రంగంలో నాడు-నేడు అమలు చేశాం.
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10,000 వరకు పింఛన్ అందిస్తున్నాం.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాం. క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులకూ ఉచితంగా వైద్యం. ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్లు 1,059 నుంచి 3,257కు పెంచాం. నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఖ్య 919 నుంచి 2,309కి పెంచాం.
- కోవిడ్ విపత్తును సమర్థంగా ఎదుర్కొని దేశానికే ఆదర్శంగా నిలిచాం. కోవిడ్, బ్లాక్ ఫంగస్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చిన తొలి రాష్ట్రం మనదే.
- 104, 108 సేవల కోసం కొత్తగా 1,704 వాహనాలు, 500 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు అందుబాటులోకి తెచ్చాం.
- అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో డబ్ల్యూహెచ్‌వో/ జీఎంపీ ప్రమాణాలున్న మందులు ఉంచాం.
- వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా విలేజ్ క్లినిక్స్‌తో అనుసంధానమై ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించి ప్రతి కుటుంబాన్నీ జల్లెడ పట్టి, గడప వద్దే ఆరోగ్య సమస్యలు గుర్తించి, ఉచితంగా వైద్యం, టెస్టులు, మందులు అందిస్తున్నాం.
- 17 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం. తద్వారా మల్టీ స్పెషాలిటీ డాక్టర్ల సేవలు, టెర్షియరీ కేర్‌ను జిల్లా కేంద్రాలకు తెచ్చాం. 2023-24 విద్యా సంవత్సరంలో 5 కాలేజీల్లో ప్రారంభమైన అడ్మిషన్లు. వీటివల్ల అదనంగా వచ్చిన ఎంబీబీఎస్ సీట్లు 750.
- ఈ 5 ఏళ్లలోనే వచ్చిన పీజీ సీట్లు 801.
- 10,132 విలేజ్ హెల్త్ క్లినిక్స్, పట్టణ ప్రాంతాల్లో 542 అర్బన్ హెల్త్ క్లినిక్స్.
- ఉద్దానం కిడ్నీ వ్యాధుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం. రూ.785 కోట్లతో వైఎస్సార్ సుజలధార మంచినీటి ప్రాజెక్టు, పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ - సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాం.
- వెలిగొండ ప్రాజెక్టు 2 టన్నెళ్లను పూర్తి చేశాం. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని ఫ్లోరైడ్ ప్రభావిత మండలాల్లో 15.25 లక్షల జనాభాకు సురక్షిత తాగునీరు అందిస్తున్నాం.
- గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం చేపట్టాం.
- తిరుపతిలో పిల్లల హార్ట్ సెంటర్, కడపలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్, క్యాన్సర్ ఆసుపత్రి, మానసిక ఆరోగ్య కేంద్రం నిర్మించాం. **వచ్చే 5 ఏళ్లూ ఈ సంక్షేమం, అభివృద్ధి ఇలాగే కొనసాగిస్తాం**

వచ్చే 5 ఏళ్లలో...:

- 5 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు మిగతా 12 కొత్త మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకొస్తాం. మొత్తం 2,550 ఎంబీబీఎస్ సీట్లు, 2,737 పీజీ మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి.
- హృద్రోగ బాధితుల కోసం విశాఖ, గుంటూరు, కర్నూలులో 3 వైద్య హబ్‌లు.
- గుంటూరు, కర్నూలు, విశాఖ, కడప, కాకినాడ, అనంతపురంలో క్యాన్సర్ కేర్ సెంటర్లు అందుబాటులోకి తెస్తాం.
- కొత్తగా 17 నర్సింగ్ కాలేజీలు, వీటి ద్వారా 1,020 నర్సింగ్ సీట్లు అందుబాటులోకి తెస్తాం.

వ్యవసాయ రంగం

రైతు రాజయ్యాడు

- 5 ఏళ్లలో రైతుల సంక్షేమం కోసం ఇప్పటికే ఖర్చు చేసింది రూ.1,84,567 కోట్లు
- ఇప్పుడు ఏటా ఇస్తున్న రూ.13,500 ఇకపై రూ.16,000కు పెంపు. వచ్చే 5 ఏళ్లలో వైఎస్సార్ రైతు భరోసా రూ.80 వేలు
- 5 ఏళ్లలో రూ.50 వేలు ఇస్తామని చెప్పినా ఇప్పటికే రూ.67,500 ఇచ్చాం. 54 లక్షల మందికి లబ్ధి. రాబోయే 5 ఏళ్లలో మరో రూ.80 వేలు ఇస్తాం. మొత్తంగా ఒక్కో రైతు కుటుంబానికి రూ.1.47 లక్షల లబ్ధి.

2019 మేనిఫెస్టోలో చెప్పినట్టుగా...

- రైతు భరోసా ద్వారా రూ.50,000 ఇస్తామని చెప్పినా.. చెప్పిన దానికంటే మిన్నగా ప్రతి రైతుకు ఏటా వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.13,500 చొప్పున 5 ఏళ్లలో ఇప్పటికే రూ.67,500 ఇచ్చాం.
- ఉచిత పంటల బీమా + సున్నా వడ్డీ పంట రుణాలు
- దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలు, అటవీ, దేవదాయ భూముల సాగుదారులకూ 'రైతు భరోసా'.
- వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల ఉచిత కరెంట్
- 'వైఎస్సార్ జలకళ' ద్వారా ఉచితంగా బోర్లు వేసేందుకు అడుగులు పడ్డాయి.
- రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశాం. వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్ ట్యాక్స్, టోల్ ట్యాక్స్ రద్దు.
- ఆక్వా జోన్లో ఉన్న 10 ఎకరాలలోపు ఆక్వా రైతులకు కరెంటు యూనిట్ రూ.1.50కే ఇచ్చాం.
- రూ.2 వేల కోట్లతో ప్రకృతి విపత్తుల సహాయ నిధి ఏర్పాటు చేశాం.
- వైఎస్సార్ బీమా ద్వారా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.7 లక్షలు ఇస్తున్నాం.
- ప్రతి నియోజకవర్గంలో శీతలీకరణ గిడ్డంగులు, గోదాములు, జిల్లా స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు అవసరం మేరకు ఏర్పాటు చేస్తున్నాం
- సహకార రంగాన్ని పునరుద్ధరించాం. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో అమూల్‌తో ఒప్పందం ద్వారా పోటీ పెంచి పాడి రైతులు లీటరుపై అదనంగా రూ.10 నుంచి రూ.20 వరకు అధిక ధరలు పొందేలా చేశాం.

కౌలు రైతులు

- భూ యజమానులకు ఇబ్బంది లేకుండా కౌలు రైతులకు పంటపై హక్కు ఉండేలా (11 నెలలకు మించకుండా) రైతుల భూములకు రక్షణ కల్పిస్తూ చట్ట సవరణ చేశాం.
- దేశంలో తొలిసారిగా కౌలు రైతులను గుర్తించేందుకు చట్టబద్ధమైన ప్రక్రియ తీసుకొచ్చాం.
- సులభతరమైన విధానంలో కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు (సీసీఆర్సీ కార్డులు) గ్రామ సచివాలయాల్లోనే జారీ. మొత్తం 5 ఏళ్లలో 8.31 లక్షల మందికి కార్డులు ఇచ్చాం.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కూడా రైతు భరోసా ఇస్తున్న ప్రభుత్వం మనదే.
- కౌలు రైతులకు కూడా రైతు భరోసా కింద పెట్టుబడి సొమ్మును ఇస్తున్న ప్రభుత్వం మనదే.
- నవరత్నాల్లో రైతులకు అమలు చేస్తున్న అన్ని పథకాలూ వీరికీ వర్తింపజేశాం.
- కౌలు రైతులకు సులభంగా రుణాలు అందించేందుకు చర్యలు తీసుకున్నాం.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా...

- రైతులకు విత్తనం నుంచి పంట విక్రయం వరకు అన్ని సేవలూ వారి ఊళ్లోనే అందించేందుకు 10,778 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతర సేవలు రైతు ముంగిటకే తెచ్చాం.
- 162 కొత్త వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబుల ఏర్పాటు. వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా ప్రతి ఆర్బీకే స్థాయిలోనూ సీహెచ్‌సీల ద్వారా యంత్రాలు అందుబాటులో ఉంచాం.
- ఈ-క్రాప్ బుకింగ్ + చిత్తూరు డెయిరీ పునరుద్ధరించాం.
- వైఎస్సార్ పశు బీమా అమలు చేశాం.
- వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ- 340 వాహనాలు.
- చేపలు, రొయ్యల మార్కెటింగ్‌కు 2,151 'ఫిష్ ఆంధ్రా' రిటైల్ దుకాణాలు ఏర్పాటు చేశాం.
- పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి.
- ఆర్బీకే స్థాయిలో, మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో వ్యవసాయ సలహా మండళ్లు ఏర్పాటు చేశాం.
- గతంలో ఎన్నడూ లేని విధంగా, దళారుల ప్రమేయం లేకుండా, పొలం వద్దే ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నాం. ఇంతకు ముందు ఎన్నడూ జరగని విధంగా ధాన్యం కొనుగోలులో జీఎల్టీ పేరిట ఎంఎస్పీతో కలిపి రైతులకు అదనంగా చెల్లిస్తున్నాం. వేరే రాష్ట్రాల్లో బోనస్ మాత్రమే ఇస్తారు. మన రాష్ట్రంలో అదనంగా ఏడాది పొడవునా జీఎల్టీ ఇస్తున్నాం. ఇలా ఇప్పటివరకు రూ.341 కోట్లు చెల్లించాం. దీని వల్ల ప్రతి రైతుకూ ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు అదనంగా.. ఎంఎస్పీ కన్నా ఎక్కువ రైతుల చేతుల్లో పెడుతున్నాం.
- కేంద్రం మద్దతు ధర ప్రకటించిన పంటలకు కాకుండా మరో 6 పంటలకు కూడా మనం కనీస మద్దతు ధర ప్రకటించాం. ఆర్బీకేల్లో పోస్టర్లు పెట్టి ప్రకటిస్తున్నాం. శనగ, ఆయిల్ పామ్ రైతులను ఆదుకున్నాం.
- పొలంబడి ద్వారా మేలైన వ్యవసాయ పద్ధతుల్లో రైతులకు శిక్షణ.
- రైతులకు ప్రతిబంధకంగా ఉన్న అనేక భూ సమస్యలను పరిష్కరించాం.
- అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు, 22ఏలో ఉన్న ఇనామ్ భూముల తొలగింపు, భూములు లేని నిరుపేదలకు భూముల అసైన్‌మెంట్ చేయడం, లంక భూములు, చుక్కల భూములు, షరతులు గల పట్టాలు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు, గిరిజనులకు ఇచ్చిన డీకేటీ భూములు.. ఇలాంటి కార్యక్రమాల వల్ల లబ్ధి పొందిన వారు 20.24 లక్షల మంది, ఈ మొత్తం భూములు 35.45 లక్షల ఎకరాలు.

వచ్చే 5 ఏళ్లలో...

రైతు సంక్షేమం, అభివృద్ధి ఇలాగే కొనసాగిస్తాం.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 11 । మే । 2024



అకాల వర్షం
విజయవాడలో శుక్రవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో బెంబేలెత్తించింది. రోడ్లు జలమయమయ్యాయి.



కళా సేవకు సత్కారం
మధురానగర్: జయశ్రీ కూచిపూడి కళా నృత్య నిలయం రజతోత్సవం సందర్భంగా భరత చూడామణి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ డైరెక్టర్ నెమలికంటి సువర్ణలతను సత్కరించారు.



	కనిష్టం	గరిష్టం
మచిలీపట్నం	29	36
గుడివాడ	28	37
నందిగామ	28	38.1
జగ్గయ్యపేట	27	38

న్యూస్‌రీల్

బంగారు తాపడం పనులకు విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు విజయవాడకు చెందిన భక్తులు శుక్రవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ పైపుల రోడ్డుకు చెందిన సంబంగి లావణ్య కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది.ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళాన్ని అందజేసింది.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం
దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన నగరూరు రామాంజనేయులు, సుచరిత రూ. 1,11,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

తైక్వాండో జాతీయ రిఫరీ కోర్సులో జిల్లా క్రీడాకారుల సత్తా



విజయవాడస్పోర్ట్స్: తైక్వాండో జాతీయ రిఫరీ కోర్సుల్లో ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు ఉత్తీర్ణత సాధించారు. న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యాన ఇటీవల విజయనగరంలో జరిగిన జాతీయ రిఫరీ సెమినార్‌లో దేశ వ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు పోటీ పడ్డారు. ఈ సెమినార్‌కు జిల్లా నుంచి హాజరైన 24 మంది క్రీడాకారులు ఉత్తీర్ణులయ్యారు. ఫ్రెషర్, రిఫ్రెషర్‌గా అర్హత సాధించిన ఎం.అంకమ్మరావు, పి.గౌరీశంకర్, పి.విక్టర్‌ఆదిత్య, సంజన, పావనిసాయి, శివనాగరాజు, దుర్గాప్రసాద్, బి.శిరీష, వంశీ, దినేష్, టి.హెలి, టి.సామి, రోహిత్, రవి, దైవకుమారి, నాగఅరవింద్, వినీల, డింపుల్, బాలచందర్, సూర్య, ప్రియా, సిరి, సింధు, అనూప్‌కుమార్‌లను అంతర్జాతీయ రిఫరీ తిరుమల్‌జయపాల్ అభినందించారు.

ఫిర్యాదులు వీరికి తెలియజేయండి

చిలకలపూడి(మచిలీపట్నం): సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు విజ్ఞాపనలు, ఫిర్యాదులు ఉంటే విషయ తీవ్రతను బట్టి ఎన్నికల పరిశీలకులను సంప్రదించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి, పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ స్థానాలకు సాధారణ పరిశీలకులు జాన్ కింగ్ స్లే (8712693649), ఎన్నికల వ్యయ పరిశీలకులు మనీష్ చవడ(8712693650)ను సంప్రదించాలన్నారు. గన్నవరం, గుడివాడ, పామర్రు, పెనమలూరు శాసనసభ స్థానాలకు సాధారణ పరిశీలకులు నరహరిసింగ్ భంగర్ (8712693654), ఎన్నికల వ్యయ పరిశీలకులు వికాస్ చంద్ర కరోల్ (8712693652)ను సంప్రదించాలన్నారు. మచిలీపట్నం, అవనిగడ్డ, పామర్రు, పెనమలూరు శాసనసభ స్థానాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులు చవాన్ ప్రవీణ్ మోహన్‌దాస్(8712693651), మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి పోలీస్ పరిశీలకులు ప్రసాద్ ప్రహ్లాద్ అక్కనూరు(8712693653) సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఆర్.కృష్ణయ్యపై టీడీపీ గూండాల దాడి దుర్మార్గం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బీసీల సంక్షేమాభివృద్ధి కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి ఆర్.కృష్ణయ్య అని.. అటువంటి వ్యక్తిపై తెలుగుదేశానికి చెందిన దుండగులు దాడికి పాల్పడడం దుర్మార్గమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ అన్నారు. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యపై జరిగిన దాడిని ఖండిస్తూ సింగ్‌నగర్‌లో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం, బీసీ ప్రజల అభ్యున్నతి కోసం కృష్ణయ్య చేసిన కృషి ఎనలేనిదని.. ఆయన చేసిన పోరాటాల వల్ల నేడు ఎంతోమంది బీసీలు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. అలాంటి మంచి వ్యక్తిపై రాయితో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రంగు విక్రమ్ మాట్లాడుతూ ఆర్.కృష్ణయ్యపై దాడి చేయడం యావత్ బీసీలపై దాడి చేసినట్లేనన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కోస్తాంధ్ర ఇన్‌ఛార్జ్ చింతా శ్రీనివాస్,సురేష్,భవాని పాల్గొన్నారు.

ప్రచార పర్వం



మంచిని గెలిపించండి.. వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం పటమట సమీపంలోని డీమార్ట్ వద్ద ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఆడపడచులు ఆదరించాలి.. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం 30వ డివిజన్ మధ్య కట్ట వద్ద ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విజయం మనదే.. వైఎస్సార్ సీపీ పెనమలూరు ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉయ్యూరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి వీధి వీధికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. - ఉయ్యూరు

సాయంత్రానికి గప్‌చుప్



నేటితో ప్రచారానికి తెర

- సాయంత్రం ఆరు గంటల తర్వాత మూగబోనున్న మైకులు
- 48 గంటల పాటు మద్యం విక్రయాలకూ బ్రేక్
- ఇప్పటికే ఊపందుకున్న ప్రలోభాల పర్వం
- పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- కట్టుదిట్టమైన భద్రత నడుమ పోలింగ్

విజయవాడ స్పోర్ట్స్: సార్వత్రిక సమరం ఆఖరి అంకానికి చేరుకుంది. ఓటర్లు వారివారి ప్రియతమ నాయకుడిని ఎన్నుకునే సమయం ఆసన్నమైంది. రానున్న ఐదేళ్లకు సేవ చేసే నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటర్లు సైతం సిద్ధంగా ఉన్నారు. ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించేందుకు వీలుగా అధికార యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ సాగేలా భద్రతా చర్యలు తీసుకునేందుకు పోలీస్ శాఖ సన్నద్ధమవుతోంది.

సకుటుంబ సపరివార సమేతంగా..
2019 ఎన్నికల ముందు కేవలం అభ్యర్థులు, ఆయా పార్టీల క్యాడర్ మాత్రమే ప్రచారం చేసేవారు. గతానికి భిన్నంగా ఈ ఎన్నికల్లో అన్ని పార్టీల అభ్యర్థుల కుటుంబ సభ్యులు రంగంలోకి దిగారు. కొన్నికొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల కంటే అతని భార్య, కుమార్తెలు, కుమారులు, అళ్లుల్లు, బావలు, బామ్మర్దులు.. ఇలా వారి చుట్టాలే ఎక్కువ ప్రచారం చేశారు. పోటీ చేసే అభ్యర్థి ఒక ప్రాంతంలోనే తిరిగితే.. వారి కుటుంబ సభ్యులు ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతాన్ని చుట్టేసి.. ఆయా పార్టీల గుర్తులు, మేనిఫెస్టో కాగితాలతో ప్రతి ఇంటిని నింపేశారు. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ముమ్మర ప్రచారం చేశారు. టిఫిన్లు, భోజనాలు సైతం ప్రజలతో కలిసి కొందరు అభ్యర్థులు చేసిన ఉదంతాలు కనిపించాయి. ఈ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ కాస్త కటువుగా వ్యవహరించడంతో డీజే, మైక్‌ల మోత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగింది. ఏది ఏమైనా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీ శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రచారానికి తెరపడనుంది. ఇన్నాళ్లు అన్ని పార్టీల అభ్యర్థుల హామీలు, వాగ్దానాలు విని విసిగి పోయిన ప్రజలు.. వివేకంతో సరైన అభ్యర్థిని ఎంచుకునేందుకు 36 గంటలు వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది.

మద్యానికి బ్రేక్..
ఎనిక్నల నేపథ్యంలో మద్యానికి బ్రేక్ పడనుంది. ఈ రోజు(శనివారం) సాయంత్రం ఆరు నుంచి వైన్ షాపులతో పాటు బార్ రెస్టారెంట్‌లు మూత పడతాయి. 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు మద్యం దుకాణాలన్నీ మూత పడే ఉంటాయి. అల్లర్లు, అవాంఛనీయ ఘటనలకు చెక్ పెట్టేందుకు ఎన్నికల సంఘం మద్యానికి 48 గంటల పాటు బ్రేక్ ఇచ్చింది.

ప్రలోభాల పర్వం ఆరంభం..
ప్రచార పర్వం ముగియనుండటంతో.. చివరి అస్త్రం పోల్ మేనేజ్‌మెంట్‌కు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలు వారీగా ఓట్ల లెక్కలు.. సర్వేల్లో ఇప్పటి వరకు మునిగి తేలిన అభ్యర్థులు వారివారి జయాపజయాలపై ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలను ఎక్కువగా ప్రభావితం చేసే పోల్ మేనేజ్‌మెంట్‌ను సమర్థంగా నిర్వహించాలనే ఆలోచనలో పడ్డారు. దీని కోసం అత్యంత నమ్మకస్తులను బరిలోకి దించారు. ఒక్కొక్కరికీ ఒక్కో ప్రాంతాన్ని కేటాయించి ప్రలోభాల పర్వానికి తెర తీశారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు డబ్బు, మద్యం, చీరలు, ఇతర గృహోపకరణాలు పంపిణీని గుట్టుచప్పుడు కాకుండా చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

మైకులు బంద్..
ఏప్రిల్ 16వ తేదీన సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి(ఎన్నికల కోడ్) అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే నోటిఫికేషన్ మాత్రం ఏప్రిల్ 18న వచ్చింది. దేశ వ్యాప్తంగా ఈ కోడ్ ఒకేసారి అమలులోకి వచ్చింది. అయితే రాష్ట్రంలో నాల్గో దశలో పోలింగ్ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయిస్తూ.. దీనికి సంబంధించిన ఆదేశాలను జారీ చేసింది. అధికార వైఎస్సార్ సీపీ ఎన్నికల కోడ్ రాక ముందే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేసింది. అయితే అప్పటికీ పొత్తులపై సరైన కసరత్తు పూర్తి చేయలేని టీడీపీ, జనసేన, బీజేపీ వారి వారి పార్టీల అభ్యర్థుల ఖరారు విషయంలో కాస్త వెనకబడ్డాయి. ఎలాగోలా కిందా.. మీదా పడి కొన్ని రోజుల విరామం తర్వాత ఆయా పార్టీల్లోని అసంతృప్తి జ్వాలల నడుమ మూడు పార్టీలకు సంబంధించిన అభ్యర్థులను కూటమి ఖరారు చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడానికి ముందే వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారంలో ముందున్న విషయాన్ని ప్రజలు గ్రహించారు. అప్పటికీ గడిచిన 59 నెలల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల కోడ్ విడుదలైన తర్వాత ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు దూకుడు పెంచారు. ఈ విషయంలో టీడీపీ కాస్త వెనుకబడిందని ప్రజలు చెబుతున్నారు. ఏదేమయినా 24 రోజుల పాటు అభ్యర్థులు క్షణం తీరిక లేకుండా ప్రజలతో మమేకమయ్యారు. హామీలు, వాగ్దానాలు ఇస్తూ.. భవిష్యత్తులో ఏమేమి చేస్తామో ప్రజలకు వివరిస్తూ కొందరు ప్రచారంలో ముందుకు సాగుతుంటే.. కొందరు అభ్యర్థులకు ప్రజల నుంచి ఛీదరింపులు, ఛీత్కారాలు ఎదురయ్యాయి. ఎలాగైనా గెలవాలనే ఆకాంక్షతో ప్రచారంలోనే అభ్యర్థులు మునిగి తేలారు.

పటిష్ట బందోబస్తు..
ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు నేతృత్వంలో నిర్దేశించిన పోలింగ్ బూత్‌లకు ఇప్పటికే పోలింగ్ సామగ్రి సరఫరా పూర్తయింది. పోలింగ్‌కు అవసరమైన సిబ్బంది నియామకం పూర్తి చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను దృష్టిలో ఉంచుకుని పోలీస్ యంత్రాంగం రక్షణ పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ ప్రకటించారు. ఎన్నికల కోడ్ విడుదలైన నాటి నుంచే పోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటూనే ఉంది. పారామిలటరీ బలగాలు జిల్లాలో మోహరించాయి. ప్రజలకు రక్షణ పరమైన భరోసా కల్పిచేందుకు పోలీసులు, పారామిలటరీ బలగాలతో అన్ని ప్రాంతాల్లోనూ మార్చ్‌పాస్ట్‌లు నిర్వహించారు.

చంద్రబాబుకు ఓటేస్తే రిజర్వేషన్‌లు మాయం



మాట్లాడుతున్న కర్నూలుఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, ఎమ్మెల్యే అభ్యర్థి జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: చంద్రబాబు అధికారంలోకి వస్తే ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్‌లు రద్దవుతాయని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుతో కలిసి శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటేస్తే ముస్లింలకు తీరని నష్టం వాటిల్లుతుందని ముస్లింలంతా జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉండాలని కోరారు.

ముస్లింలకు సముచిత స్థానం..
ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ముస్లింలకు సముచిత స్థానం కల్పించామని వైఎస్సార్ సీపీ నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, ఎంపీపీగా ముస్లింలకు అవకాశం కల్పించిన ఘనత తమకే దక్కిందని చెప్పారు. అంతే కాకుండా కౌన్సిల్ సభ్యులుగా, కోఆప్షన్ సభ్యులుగా, సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు అన్ని రంగాలలో ముస్లింలకు గౌరవప్రదమైన స్థానం కల్పించామని చెప్పారు. నాయకులు షేక్ కరిముల్లా, ఎండీ అమీన్, షేక్ యాకుబ్ అలీ, జాఫర్, డాక్టర్ హసీనా బేగం, మున్నా, రసూల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తమ్ముళ్లలో ఓటమి భయం

ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ అభ్యర్థులు డీలా

- పోలింగ్ సమీపించే కొద్దీ నీరుగారుతున్న తెలుగుదేశం పార్టీ
- వారు చేసిన పాపాలే.. శాపాలుగా మారుతున్న వైనం
- పట్టి పీడిస్తున్న వర్గపోరు
- వెంటాడుతున్న కాల్‌మనీ, సెక్స్‌రాకెట్ వ్యవహారాలు
- జనసేన, టీడీపీ, బీజేపీల మధ్య కొరవడిన సమన్వయం

సాక్షి ప్రతినిధి,విజయవాడ: ఎన్నికల పోలింగ్ సమీపించే కొద్దీ టీడీపీ అభ్యర్థులు డీలా పడుతున్నారు. మాయ మాటలు, గిమ్మిక్కులు, చీప్ ట్రిక్స్ అమలు చేస్తూ విష ప్రచారం చేసినా వారి గ్రాఫ్ పెరగటం లేదు. దీంతో ఓటమి భయం అభ్యర్థులను వెంటాడుతుంటే, ఎటూ పాలుపోక విలవిల్లాడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా జిల్లా అభివృద్ధి జరిగి ప్రగతి పథంలో దూసుకుపోయింది. సంక్షేమ ఫలాలు, అభ్యర్థులు నిత్యం ప్రజల్లో మమేకం కావడం ఇవన్నీ వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు అదనపు బలంగా మారాయి. దీంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపు ధీమాతో రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో పాల్గొంటూ ఓటర్లను తనదైన శైలిలో ఆకర్షిస్తున్నారు. టీడీపీ అభ్యర్థులకు ప్రచారంలో ఓటర్ల మద్దతు లభించడం లేదు. చివరి అస్త్రంగా కవ్వింపు చర్యలకు దిగుతున్నారు.

విజయవాడ నగరంలో..

- సెంట్రల్ నియోజక వర్గంలో టీడీపీ అభ్యర్థి బొండా ఉమా గూండాగిరీ ఓటర్లను దూరం చేస్తోంది. అతని అనుచరుల కాల్‌మనీ, సెక్స్‌రాకెట్ వ్యవహారాలు శాపంగా మారుతున్నాయి. కుమారుల దౌర్జన్యాలు ప్రతి బంధకాలుగా తయారవుతున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గంలోని డాబా కొట్ల సెంటర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై జరిగిన రాయిదాడిని, పేద ప్రజలంతా తమపై జరిగినా దాడిగా భావిస్తున్నారు. ఈ రాయి దాడి మూలాలన్నీ టీడీపీ అభ్యర్థి బొండా వైపే చూపుతుండటంతో, ఓటమి భయంతో బొండా ఉమా వణికిపోతున్నారు. పోలింగ్ రోజు ఓటర్లు బుద్ధి చెబుతారనే భావన టీడీపీ వర్గాల్లోనే వ్యక్తం అవుతోంది.
- పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరికి ఎదురుగాలి వీస్తోంది. ఇక్కడ టీడీపీ, జనసేన పార్టీల నుంచి మద్దతు లభించడం లేదు. గతంలో రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలో సైతం విజయవాడ నగరానికి చేసింది ఏమీ లేదు. ఎన్నికల సమయంలో హఠాత్తుగా బీజేపీ టికెట్ తీసుకొని ఊడిపడటంతో స్థానిక ఓటర్ల నుంచి మద్దతు కొరవడింది. ఆత్మీయ సమావేశాల పేరుతో సామాజిక వర్గాల సమావేశాలు ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున హామీలు గుప్పిస్తున్న ప్రజలు మాత్రం వాటిని నమ్మటం లేదు. దీనికి తోడు ముస్లిం, మైనార్టీ వర్గాలతో పాటు, పేద వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. డబ్బులు వెదజల్లి ఓటర్లను ప్రలోభపెట్టాలని చేసిన ప్రయత్నాలు బెడిసి కొడుతుండటంతో, ఆయన ఓటమి అంచున కొట్టు మిట్టాడుతున్నారు.
- తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహనరావు గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యం. దీంతో ఆయన ప్రచారంలో చెప్పుకోవటానికి కూడా ఏమీ లేక ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికల్లో చీప్ ట్రిక్స్ ప్లే చేసి, ఓటర్ల సానుభూతి పొందే యత్నాలను ఓటర్లు పసిగట్టడంతో ఎటూ పాలుపోక తలపట్టుకొంటున్నారు. దీనికితోడు కాల్‌మనీ, సెక్స్ రాకెట్ వ్యవహారాలు పట్టిపీడిస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా ఆయన గలీజు బాగోతం ఇటీవల బట్టబయలైంది. ఏన్నో ఏళ్లుగా ఆయన రాసలీలల వ్యవహారం గురించి అందరికీ తెలిసిందే. కాగా ఆయన ఎంతగా బరితెగించి స్త్రీలోలుడిగా మారాడదనేది సోషల్ మీడియా వేదికగా మరోసారి వెలుగులోకి రావటం చర్చనీయాంశంగా మారింది.



విజయవాడ పార్లమెంట్ స్థానంలో..
లోక్‌సభ పరిధిలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి చిన్నికి ఓటమి తప్పదని గ్రహించి, తట్టాబుట్ట సర్దేస్తున్నట్లు టీడీపీ వర్గాలే పేర్కొంటున్నాయి. దీనికి తోడు అసెంబ్లీ అభ్యర్థులకు, ఈయనకు పూర్తిగా సఖ్యత కొరవడటం మైనస్‌గా మారింది.

ఎన్టీఆర్ జిల్లా రూరల్ పరిధి..

- జగ్గయ్యపేటలో శ్రీరాం తాతయ్య కష్టాల సుడిగుండంలో కొట్టు మిట్టాడుతున్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ఆయన చేసిన దౌర్జన్యాలు ఇప్పుడు వెంటాడుతున్నాయి. దీనికి తోడు తెలుగుదేశంలోని గ్రూపుల గోల ఆయన తలబొప్పి కట్టేలా చేస్తోంది. సొంత పార్టీలోనే మూడు గ్రూపులు ఉన్నాయి. రెండు గ్రూపుల నుంచి ఆయనకు అంతంత మాత్రమే సహకారం లభిస్తుండటంతో ఎదురీదుతున్నారు.
- నందిగామలో టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్యకు ప్రచారంలో ఎదురుగాలి వీస్తోంది. పోలింగ్ సమీపించే కొలదీ ఆమె గ్రాఫ్ పడిపోతుండటంతో డీలా పడిపోయారు. సొంతంగా నిర్ణయాలు తీసుకోలేని ఆమె, టీడీపీ సామాజిక వర్గనేతల కనుసన్నల్లోనే పనిచేస్తుండటం మిగతా సామాజిక వర్గాలను దూరం చేస్తోంది. ఆ నియోజకవర్గంలో ఇద్దరు టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు ఆమె కొంపముంచుతోంది.
- మైలవరంలో టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ పార్టీ మారటంతో నియోజక వర్గ ఓటర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సామాన్యుని ఢీకొట్టడం ఇబ్బందిగా మారింది. డబ్బు మూటలతో నాయకులను కొనుగోలు చేయటంపై ఓటర్లు మండిపడుతున్నారు. డబ్బుతో ఏదైనా చేయొచ్చనే ధోరణికి ఓటర్లు చెక్ పెట్టే విధంగా ఆలోచిస్తున్నారు. దీనికితోడు మాజీ మంత్రి దేవినేని ఉమా ఇంటికే పరిమితమై సైలెంట్‌గా మారటంతో ఎక్కడ వెన్నుపోటు పొడుస్తారనే భయం ఆయనను పట్టి పీడిస్తోంది.

- వైఎస్ జగన్ యజ్ఞంలో భాగస్వామ్యం కావడం సంతోషదాయకం
- ఆయన అడుగుల్లో నేనూ అడుగు వేసి ముందుకు వెళ్తా
- ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధి ఎంతో చేసినా దుష్ప్రచారం చేయడం దారుణం
- గెలిస్తే బందరులో క్యాన్సర్ హాస్పిటల్
- 'సాక్షి'తో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు



నాన్నే స్ఫూర్తి.. సేవే దీప్తి

సాక్షి, మచిలీపట్నం: 'వైద్య రంగంలో 35 ఏళ్లుగా విశేష సేవలు అందించి.. ప్రజా సేవ కోసం ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చా.. తండ్రి దివంగత సింహాద్రి సత్యనారాయణరావు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా చేశారు.. నీతి, నిజాయితీగల నాయకునిగా పేరు పొందారు.. ఆయనలాగే మంచి నాయకుడిగా పేరు తెచ్చుకుంటా.. సీఎం జగన్ ఐదేళ్లలో సంక్షేమం, ఎంతో అభివృద్ధి చేసినా దుష్ప్రచారం చేస్తున్నారు.. రాష్ట్రం బాగుండాలని ఆయన మహాయజ్ఞం చేస్తున్నారు.. దీనిలో నేను భాగస్వామి కావడానికే ఎంపీగా పోటీ చేస్తున్నా' అని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. దేశంలోనే ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడిగా పేరు తెచ్చుకున్న ఆయన ఇప్పుడు తాను పుట్టి పెరిగిన ఈ ప్రాంతానికి మరింతగా సేవ చేయాలన్న తలంపుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెబుతున్నారు.ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్న చంద్రశేఖరరావు 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఐదేళ్లలో ఎంతో మార్పు..
జిల్లాపై అవగాహన ఉంది. నేటి ఎన్నికలు ఖర్చుతో కూడుకున్నవి అయినా అన్నింటినీ డబ్బుతో ముడిపెట్టలేం. మంచి చేయాలనుకునే వారికి ప్రజలు ఆశీర్వదిస్తారు. అసెంబ్లీ అభ్యర్థుల సహకారంతో అందరినీ కలుపుకొని వెళ్తున్నాను. ఐదేళ్ల పాలనను చూడండి. పిల్లలు చదువుకుంటే ఆ కుటుంబ సామాజికంగా, ఆర్థికంగా స్థిరపడుతుంది.

సేవ కోసమే రాజకీయాల్లోకి..
వైద్య రంగంలో 35 ఏళ్లుగా సేవలందించా. నా వృత్తికి, రాజకీయాలకు మధ్య దూరం ఉన్నా.. పూర్తి అవగాహన ఉంది. డాక్టర్‌గా మంచి సేవలు అందించి డబ్బును సంపాదించా. డబ్బే లక్ష్యం కాకుండా పేద రోగులకు తక్కువ ఫీజు/ఉచిత వైద్యం అందించా. నేను డబ్బు సంపాదించాలని రాజకీయాల్లోకి రాలేదు. ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చా. మాటలు చెప్పి మోసం చేయాలనుకునే వారికి ఎత్తులు, పై ఎత్తులు పనికి వస్తాయి. ప్రజా సేవ చేయాలనుకునే వారికి కాదు. ప్రజల్లో చైతన్యం వచ్చింది.

మచిలీపట్నంలో క్యాన్సర్ ఆస్పత్రి..
వైద్య రంగానికి సీఎం జగన్ ఎంతో చేశారు. నేను గెలిస్తే జిల్లాలో తాగు, సాగునీటి సమస్య పరిష్కారంతో పాటు బందరులో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తా. ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యం ఇస్తా.

ప్రజలే బలం..
ప్రజలే మా బలం. సీఎం జగన్ గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే మమ్మల్ని గెలిపిస్తాయి. ప్రత్యర్థులు ఎంత మంది కలిసినా ఏమి చేయలేరు. 2014–19 మధ్య జరిగిన అభివృద్ధి, 2019–24 మధ్య సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూడండి.

క్లుప్తంగా

విశ్వబ్రాహ్మణులకు గుర్తింపు ఇచ్చింది సీఎం జగనన్నే

రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకాంత్



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణ సామాజికవర్గానికి గుర్తింపు ఇచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచ వృత్తులు చేసుకుని జీవనం సాగించే విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు గత ఐదేళ్లలో అనేక అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేశానని చెప్పుకునే చంద్రబాబు విశ్వబ్రాహ్మణులను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకున్నాడు తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు చేసే ఏకైక సీఎం జగన్ అన్నారు. రేపు జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు మద్దతు ఇచ్చి అత్యధిక మెజారిటీ గెలిపించాలని విశ్వబ్రాహ్మణులకు పిలుపు ఇచ్చారు. రానున్న ఐదేళ్ల కాలంలో బీసీలు మరింత అభివృద్ధి చెందాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడం ఒక్కటే మార్గమని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

దాలిపర్రు(ఘంటసాల): ఘంటసాల మండలం, దాలిపర్రు జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు జరిగిన ఆటో ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఘంటసాల పోలీసులు అందించిన వివరాల మేరకు ఘంటసాల పెద్దగూడెంకు చెందిన కొక్కిలిగడ్డ ఇస్సాకు(60) మచిలీపట్నం నుంచి చల్లపల్లి వైపు ఆటోలో వస్తున్నాడు. దాలిపర్రు వద్దకు రాగానే ఆటో ముందు భాగంలో కూర్చున్న ఇస్సాకు అదుపుతప్పి పడిపోతుండగా ఆటో డ్రైవర్ పట్టుకోవడానికి ప్రయత్నం చేయగా ఆటోతో పాటు ఇస్సాకు పడిపోయాడు. దీంతో అతని తలకు గాయం కావడంతో ఇస్సాకు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఆటోలో ఐదుగురు ప్రయాణికులు ఉండగా ఒక వృద్ధురాలికి కాలు విరగ్గా కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇస్సాకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ కె.ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ జగన్ నాయకత్వంలోనే మహిళలకు రక్షణ

- పోతుల సునీత, వాసిరెడ్డి పద్మ
- పశ్చిమంలో మహిళల భారీ ర్యాలీ



జగనన్ననే నమ్ముతాం ర్యాలీలో కదంతొక్కిన మహిళలు

పన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే మహిళలకు రక్షణ లభించిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ మహిళా విభాగం ఆధ్వర్యంలో 'జగనన్ననే నమ్ముతాం' పేరుతో మహిళల భారీ ర్యాలీని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. నియోజకవర్గంలోని నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీనివాసమహల్ సెంటర్, చిట్టినగర్, కేఎల్‌ఆర్ నగర్ తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. ర్యాలీని ఎమ్మెల్సీ పోతుల సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించటమే కాకుండా సామాజిక, ఆర్థిక రంగాల్లోనూ వారు ఎదగటానికి వైఎస్ జగన్ అండగా నిలిచారన్నారు. దిశ వంటి చట్టాలను ప్రవేశ పెట్టి మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించారని గుర్తు చేశారు. అన్ని పథకాలు మహిళల పేరు మీదనే సీఎం అందిచారన్నారు. అలాగే రాష్ట్రంలో 33 లక్షల మంది మహిళలకు వారి పేరు మీద సొంతింటి కలను నెరవేర్చారన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలందరూ జగన్‌కు మద్దతుగా నిలుస్తారని చెప్పారు.

రాష్ట్రానికి పట్టిన శని చంద్రబాబు

రాష్ట్రానికి పట్టిన శని చంద్రబాబు అని ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడి పద్మ అన్నారు. మహిళా ర్యాలీలో పాల్గొన్న వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ.. చంద్రబాబు కూటమిని తరిమికొట్టడానికి రాష్ట్రంలోని రెండున్నర కోట్ల మంది మహిళలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు పాలనలో అన్ని రంగాల్లోని మహిళలపై దాడులు జరిగాయన్నారు. మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్న వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

మహిళా సంక్షేమం జగన్ అజెండా

మహిళా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ అజెండా అని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. మహిళల రక్షణకు సీఎం అత్యధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. రాజకీయాల్లోనూ మహిళలకు అత్యధిక సీట్లు కేటాయించారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో మహిళలందరూ వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు పి.చైతన్యరెడ్డి, మైలవరపు రత్నకుమారి, గోదావరి గంగ, అత్తులూరి ఆదిలక్ష్మి, నగర మహిళా అధ్యక్షురాలు సుభాషిణి, స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పోతుల సునీత, వాసిరెడ్డి పద్మ, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్

ఎయిర్‌పోర్ట్ నిర్వాసితులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం సమీకరించిన స్థలం

గన్నవరం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు గత టీడీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో ఎన్నో చిక్కుముడులు ఉన్నాయి. నిర్వాసితులకు స్థలాల కేటాయింపు, రిజిస్ట్రేషన్లు, గృహ నిర్మాణాలకు నిధుల కేటాయింపు తదితర అంశలపై అప్పటి ప్ర భుత్వం జారీచేసిన జీఓలో నిర్దిష్టమైన విధివిధానాలు లేవు. నిర్వాసితులకు ఎటువంటి న్యాయం చేయకుండనే 2019 ఎన్నికల్లో ఘోర ఓటమితో టీడీపీ ప్రభు త్వం దిగిపోయింది. అనంతరం అధికారాన్ని చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విమానాశ్రయ నిర్వాసితుల విషయంలో పూర్తి సానుకూలత చూపించింది. గత టీడీపీ ప్రభుత్వం జారీచేసిన జీవోలోని లోపాలను సవరించుకుంటూ నిర్వాసితులకు న్యాయం చేసేందుకు అడుగులు ముందుకు వేసింది. ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీమోహన్ కూడా నిర్వాసితుల పక్షాన నిలిచి వారి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభు త్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరానికి చొరవ చూపారు. ఫలితంగా నిర్వాసితులతో పలు దఫాలుగా సమావేశాలు జరిపిన తర్వాత ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి ఒక రూపు తీసుకువచ్చారు. అనంతరం లబ్ధిదారులుగా గుర్తించిన 423 మంది నిర్వాసిత కుటుంబాలకు లాటరీ పద్ధతిలో ఐదు సెంట్లు చొప్పున ప్లాట్లు కేటాయించారు.

ఉచిత రిజిస్ట్రేషన్లు..

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా చిన్నఆవుటపల్లి పరిధిలో సమీకరించిన 52 ఎకరాల్లో లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లను ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసింది. అయితే స్టాంప్ డ్యూటీ మినహాయింపుపై అప్పటి ప్రభుత్వం ఇచ్చిన జీఓలో స్పష్టత లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో పడ్డాయి. ఈ విషయాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వంశీమోహన్ తీసుకువెళ్లడంతో నిర్వాసితులు చెల్లించాల్సిన రూ.3.78 కోట్లు స్టాంప్ డ్యూటీని మినహాయించారు. దీంతో లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను పంపిణీ చేశారు.

గృహ నిర్మాణానికి రూ.9 లక్షలు..

గృహ నిర్మాణాలకు ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.9 లక్షలు రెండు విడతలుగా చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. గృహ నిర్మాణాలు, మౌలిక వసతులు కల్పన, అద్దె బకాయిలకుగాను మొత్తం రూ.80.48 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంట్లో మొదటి విడతగా రూ.4.50 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినప్పటికి ఎన్నికల నోటిఫికేషన్ వల్ల బ్రేక్ పడింది. ఎన్నికల అనంతరం పూర్తి స్థాయిలో గృహ నిర్మాణాలు చేపడతామని లబ్ధిదారుల్లో వంశీమోహన్ భరోసా కలిపించారు. గత టీడీపీ ప్రభుత్వం తమను గాలికి వదిలివేస్తే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం అండగా నిలిచిందని నిర్వాసితులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల అదుపులో సుజనా తరుఫున నగదు పంచుతున్న వ్యక్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న యలమంచిలి సత్యనారాయణ చౌదరి అలియాస్ సుజనా చౌదరి గెలుపు కోసం అతని తరుఫున ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్–5 ఇన్‌చార్జి పి.శివప్రదీప్ రెడ్డి, కొత్తపేట పోలీసులు కలిసి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వారు నైజాం గేటు అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకునే సరికి కానూరుకు చెందిన వీరమాచనేని గణేష్, పంజా సెంటర్ వించిపేటకు చెందిన మానికొండ భాస్కర్‌లు సుజనా చౌదరి గెలుపును కాంక్షిస్తూ ఓటర్లకు డబ్బులు పంచేందుకు రూ.70 వేలు, ఓటర్ల జాబితా తీసుకుని కొంత మందికి డబ్బు పంచి మిగిలిన వారికి కూడా పంచబోతుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని రూ.69 వేలు, బీజేపీ పాంప్లేట్లు, ఓటర్ల జాబితా స్వాధీనం చేసుకున్నారు. కాగా ఆ ఇద్దరు వ్యక్తులు తాము బీజేపీ కార్యకర్తలమని, ఇక్కడ పార్టీ బలహీనంగా ఉందని, ఓటర్లకు డబ్బు పంచాలని బీజేపీ చెప్పటంతో వచ్చామని పోలీసులకు చెప్పారు.

విధి నిర్వహణలో నిజాయతీగా వ్యవహరించాలి



శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విధి నిర్వహణలో అధికారులు నిష్పక్షపాతంగా, నిజాయతీగా వ్యవహరించాలని, నైతికత కూడా అత్యంత కీలకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో 2023 బ్యాచ్‌కు చెందిన శిక్షణలో ఉన్న 8 మంది ఐపీఎస్ అధికారులు కలెక్టర్ ఢిల్లీరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు వీరంతా జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా వారితో కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికలు నిర్వహించడంలో ప్రతి దశ కీలకమేనన్నారు. ఖచ్చితమైన విషయ పరిజ్ఞానం, స్పష్టమైన అవగాహన ద్వారా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రం, జిల్లాకు సంబంధించిన భౌగోళిక, ఆర్థిక, సామాజిక విశిష్టతలను వివరించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నాటి నుంచి కౌంటింగ్ ముగిసి ఫలితాలు వెల్లడించే వరకు కీలక అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, చెక్‌పోస్టుల ఏర్పాటు, సీజర్ మేనేజ్‌మెంట్ వంటి పలు అంశాలపై ఐపీఎస్‌లకు అవగాహన కల్పించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అంశాలను కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి డి.కె.బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13న నిర్వహించనున్న పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ కోరారు. కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం 6 గంటల తర్వాత ఎలాంటి రాజకీయ ప్రచారాలు చేయకూడదని సూచించారు. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు చేయకూడదన్నారు. పత్రికా సమావేశాలు, ఇంటర్వ్యూలు నిర్వహించకూడదన్నారు. బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు వినియోగించకూడదని చెప్పారు. నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు ఉండకూడదన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు మాక్ పోల్ జరిగేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించుకోవాలన్నారు. ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించినప్పుడు అభ్యర్థులు వారి ప్రతినిధులు అందుబాటులో ఉండాలని సూచించారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. జిల్లాలో పోలైన పోస్టల్ బ్యాలెట్లు కలెక్టరేట్‌లోని ట్రెజరీ స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచామన్నారు. సమావేశంలో పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీరామ పరిణయ నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీధర్మపరిషత్ కళా ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం జయశ్రీ కూచిపూడి కళా నృత్య నిలయం రజతోత్సవ వేడుకల్లో భాగంగా నృత్య శిరోమణి, ఉగాది పురస్కార గ్రహీత నాట్యాచార్య చదలవాడ ఆనంద్ శిష్య బృందంచే శ్రీ రామ పరిణయం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. శ్రీరామపరిణయ నృత్యప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను భక్తితన్మయత్వంలో ముంచెత్తింది. కళాకారులు చక్కటి అభినయాలతో చేసిన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆంధ్ర లయోల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మొవ్వ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అద్దంకి సివిల్ జడ్జి జె.సీత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రముఖ కూచిపూడి, భరతనాట్యం నాట్యాచార్యులు భాగవతుల వెంకట రామశర్మ మాట్లాడుతూ.. జయశ్రీ కూచిపూడి కళా నృత్య నిలయం సేవలను అభినందించారు. అనంతరం కళారంగంలో సేవలు అందిస్తున్న భరత చూడామణి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ డైరెక్టర్, హైదరాబాద్ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ మాజీ ప్రిన్సిపాల్ నెమలికంటి సువర్ణలతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాట్యాచార్యులు గానుగపాటి పార్వతీదేవి, పీఆర్ అఖిలాండేశ్వరి, సంగీత విద్వాంసులు కొండ శశిధర్, సీహెచ్ సుధారాణి పెద్ద సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి యాగం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం మహాలక్ష్మి యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి స్వామివారి ఆలయం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను చేపట్టారు. తొలుత అమ్మవారికి ప్రీతికరమైన ఎర్రకలువ పూలతో ఆలయ అర్చకులు విశేష అర్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఈవో కె.ఎస్. రామరావు దంపతులు పాల్గొనగా, వైదిక కమిటీ, అర్చక బృందం వేద మంత్రోచ్చరణ మధ్య యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. యాగంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఉభయదాతలకు ఆశీర్వచనం అనంతరం అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్ మార్గంలో అనుమతించారు. శుక్రవారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన మహాలక్ష్మి యాగాన్ని వీక్షించి యాగ ఫలాన్ని పొందారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, యజ్ఞనారాయణ మూర్తి, రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.17.50 లక్షల విలువైన మద్యం సీజ్



సీజ్ చేసిన మద్యం, నిందితుడితో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



తిరువూరులో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, అదుపులో నిందితులు

ఉయ్యూరు: మద్యం అక్రమ నిల్వలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జి.గంగాధర్ హెచ్చరించారు. పమిడిముక్కల మండలం వేల్పూరులో నిర్వహించిన తనిఖీల్లో 129 కేసుల మద్యం సీజ్ చేశారు. బహిరంగ మార్కెట్‌లో మద్యం ధర రూ.11.50 లక్షలుగా నిర్ధారించారు. ఈ మేరకు ఉయ్యూరులోని ఎస్ఈబీ కార్యాలయంలో శుక్రవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. శుక్రవారం తెల్లవారుజామున వేల్పూరు గ్రామంలో ఇంటెలిజెన్స్ వింగ్‌తో కలిసి వాహన తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీల్లో కాసాని శ్రీనివాస్ అనే వ్యక్తి మినీ వ్యాన్‌లో రూ.11.50 లక్షలు విలువైన 129 మద్యం కేసులను తరలిస్తున్నట్లు గుర్తించి మద్యం కేసులు, వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని గంగాధర్ తెలిపారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు, ఉయ్యూరు ఇన్‌స్పెక్టర్ జి.వి.లక్ష్మి, ఎస్‌ఐలు ఎం.దుర్గాప్రసాద్ రావు, కె.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరులో 3,960 మద్యం బాటిళ్ల పట్టివేత

తిరువూరు: ఎన్నికల సమయంలో పంపిణీ నిమిత్తం తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న మద్యాన్ని తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. విస్సన్నపేట సమీపంలోని మోతేరావుపేట బస్టాప్ వద్ద ఎస్ఈబీ అధికారులు వాహనాల తనిఖీ చేస్తుండగా, తెలంగాణ నుంచి రూ.6 లక్షల విలువైన 3,960 మద్యం సీసాలను రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వకు రవాణా చేస్తున్న వ్యాన్‌ను గుర్తించి స్వాధీనపరచుకున్నారు. మద్యం అక్రమ రవాణా చేస్తున్న రెడ్డిగూడెం మండలానికి చెందిన అంబటి పరమేశ్వరరావు, అంబటి పవన్‌కుమార్, పులా నరసింహారావులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. ఏ.కొండూరు మండలం రేపూడి తండాలో తెలంగాణ మద్యం సీసాలను ద్విచక్రవాహనంపై తరలిస్తున్న భూక్యా బద్రు, బాణావతు రాంబాబుల నుంచి 84 మద్యం సీసాలను స్వాధీనపరచుకున్నారు. కేసులు నమోదు చేసినట్లు అశోక్ తెలిపారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.

వేర్వేరు ప్రాంతాల్లో అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి

మైలవరం: మైలవరం మండలం పుల్లూరు గ్రామం శివారు కొత్త మంగాపురం గ్రామానికి చెందిన వేమిరెడ్డి అచ్చిరెడ్డి(52) జి.కొండూరు మండలం చెరువు మాధవరం రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ పక్కన అనుమానాస్పద స్థితిలో గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. మార్చురీలో మృతదేహం భద్రపర్చడంలో ఆస్పత్రి సిబ్బంది అలసత్వం వహించారని మృతుని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అందజేశారు.

జగ్గయ్యపేటలో మహిళ..



కస్తూరి మృతదేహం

జగ్గయ్యపేట: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన గురువారం అర్ధరాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం పెద్ద శివాలయం వీధికి చెందిన కోడుకూరి నాగేశ్వరరావు, కస్తూరి దంపతులు స్థానికంగా అద్దెకు ఉంటున్నారు. భర్త నాగేశ్వరరావు కిరాణా షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో భర్త ఇంటికి వచ్చి తలుపులు తీయగా భార్య కస్తూరి(50) తలకు గాయమై మృతి చెంది ఉంది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ–1 సూర్యభగవాన్ సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకుని బంగారపు కొట్లు సెంటర్, ముక్త్యాల రోడ్డు మీదుగా పాత మున్సిపల్ ఆఫీస్ వరకు వెళ్లి ఆగింది. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు నగలు అపహరించి హత్య చేసినట్లు సమాచారం.

ఆర్టీసీ బస్సు ఢీ కొని వ్యక్తి దుర్మరణం



కపిల్ బారాక్ మృతదేహం

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ బస్సు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గవర్నర్ పేట–2 డిపోకు చెందిన సర్వీస్ నంబర్ 308 ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి విసన్నపేటకు వెళ్తుండగా గాంధీనగర్ జింఖానాగ్రౌండ్ వద్ద ఎదురుగా వస్తున్న వ్యక్తిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిని వద్ద లభించిన ఆధారాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన కపిల్ బారాక్(30)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సత్యనారాయణపురం పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య



శ్రావ్య మృతదేహం

కంకిపాడు: ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... కంకిపాడు పట్టణానికి చెందిన వల్లూరు కృపాబాయమ్మ, సుజన్‌రాజు భార్యాభర్తలు. పట్టణంలోని పులిరామారావు వీధిలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. రెండో కుమార్తె వల్లూరు శ్రావ్య(23) ఆంధ్రా యూనివర్సిటీలో డిగ్రీ మూడో సంవత్సరం విద్యనభ్యసిస్తుంది. ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనెల 9వ తేదీ రాత్రి కృపాబాయమ్మ, సుజన్‌రాజు ఇద్దరూ బయటకు వెళ్లారు. ఇంటికి వచ్చి చూసే సరికి శ్రావ్య చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే ఆమెను కిందకు దించి వైద్యం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. ఆస్పత్రి వర్గాల సమాచారం, తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక మార్గంపై చిన్నారులకు శిక్షణ

ఆటోనగర్(విజయవాడతూర్పు):చిన్నారులను చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మికంగా తీర్చదిద్దితే మంచి మార్గాన నడుస్తారని ది సాల్వేషన్ ఆర్మీ చర్చి పాస్టర్ మేజర్ అబ్రహాం అన్నారు. గుణదల అరుల్‌నగర్‌లోని సాల్వేషన్ చర్చిలో వీబీఎస్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. సుమారు 100 మందికి పైగా చిన్నారులు హాజరయ్యారు. క్రైస్తవ గీతాలు ఆలపించారు. పాస్టర్ మేజర్ అబ్రహాం మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి వేసవిలో వీబీఎస్ నిర్వహిస్తున్నారన్నారు. చిన్నారులకు బైబిల్‌లోని అంశాలపై పట్టు పెంచే విధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం నైపుణ్యత ప్రదర్శించిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు ఐ.విజయకుమార్, సీహెచ్ కనకాంబ్రం, కె.రాజేష్, ఎస్.రాము, ఎం.బాబురావు, డి.రాజకుమార్, డి.ఇమ్మానుయేలు, వీబీఎస్ టీచర్స్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో జూన్ 28 నుంచి జాతీయ స్థాయి సెమినార్



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూన్ 28, 29వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సెమినార్ బ్రోచర్‌ను శుక్రవారం ఉన్నత విద్య కళాశాల కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికి తీసేందుకు సెమినార్‌లు దోహదపడతాయని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వచ్చే నెల 28, 29 తేదీల్లో 'మేథమెటికల్ మెథడ్స్, మోడల్స్ అండ్ అప్లికేషన్స్ ఇన్ మల్టిడిసిప్లినరీ రీసెర్చ్ అండ్ ఆక్వా కల్చర్ ఫ్రమ్ జెనెస్ టు ఎకోసిస్టమ్' అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆ సెమినార్‌లో రీసెర్చ్ ఆర్టికల్స్ అండ్ అబ్‌స్ట్రాక్ట్స్‌ను ఈనెల 11వ తేదీ నుంచి స్వీకరిస్తామని తెలిపారు. సంబంధిత పత్రాలు యూజీసీ కేర్‌లిస్ట్‌లో ప్రచురింపబడతాయని పేర్కొన్నారు. పోస్టర్, ఓరల్ ప్రజంటేషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఇస్తామని తెలిపారు. కె.సుధాకర్‌రావు, జె.నాగేశ్వరరావు, కె.నాగలక్ష్మి, కె.సుధాకర్, ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

లిటిల్ బ్రెయిన్స్ స్కూల్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):స్కూల్ ఎక్స్‌లెన్స్–2024 అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి తెలిపారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ కాంక్లేవ్–2024 సమిట్‌లో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) న్యూఢిల్లీ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారామ్ నుంచి ఈ అవార్డును తాను అందుకున్నానని ఫణి ప్రసాద్ ముక్తేవి ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో అనుసరిస్తున్న సూక్ష్మ బోధన పద్ధతులు, ఆధునిక విధానాలు, పరిమిత సంఖ్యలో తరగతి గదిలో విద్యార్థులను చేర్చుకుని ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా ప్రత్యేక కార్యక్రమాలు, సృజనాత్మకత పెంచే శిక్షణ తరగతులు నిర్వహించడం వల్లే ఈ అవార్డు పొందామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) సీఈవో పి.రాజాబాబు ఈ కార్యక్రమానికి ప్యానల్ స్పీకర్‌గా హాజరై తమను అభినందించారని స్కూల్ ప్రిన్సిపాల్ సుధాప్రవీణ పేర్కొన్నారు. అవార్డు పొందటానికి కారకులైన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఫణి ప్రసాద్ ముక్తేవి, సుధా ప్రవీణ కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయండి

పాయకాపురం(విజయవాడరూరల్): ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. కండ్రికలో శుక్రవారం సెంట్రల్ నియోజకవర్గం ముస్లిం యువకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడారు.

బెంజిసర్కిల్‌లో చలివేంద్రం ఏర్పాటు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బెంజిసర్కిల్‌లో వేసవిలో దాహార్తిని తీర్చేందుకు కాకాని ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శుక్రవారం ట్రాఫిక్ పోలీసులతో కలిసి సమితి చైర్మన్ డాక్టర్ తరుణ్ కాకాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకాని ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు.

ప్రగతి పథంలో తూర్పు

- ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి
- రూ.673 కోట్లతో పనుల నిర్వహణ
- కృష్ణలంకకు రక్షణ కవచంలా రిటైనింగ్‌వాల్
- కొండ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు

ఇది కదా.. అభివృద్ధి

లబ్బీపేట(విజయవాడతూర్పు): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గం ఐదేళ్ల వ్యవధిలో ప్రగతి పథంలో పయనించింది. కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి సాధించింది. ఓ పక్క సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే మరో పక్క నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా రూ.673 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. తూర్పు నియోజకవర్గం వ్యాప్తంగా అభివృద్ధి పరుగులు పెట్టింది. ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి కనిపిస్తుంది. గత ప్రభుత్వాలు గ్రాఫిక్స్ చూపిస్తూ అభివృద్ధి పేపర్లకే పరిమితం చేశాయి. కానీ నేడు ప్రజలు కళ్ల ముందే అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయి. కృష్ణలంక ప్రాంత వాసులకు ముంపు సమస్య తొలగిపోగా, కొండ ప్రాంత వాసుల కష్టాలు తీరాయి. పేదలకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. విద్యుత్‌లో వోల్టేజ్ సమస్యలు లేకుండా అధునాతన సబ్‌స్టేషన్‌లు అందుబాటులోకి వచ్చాయి. కొత్తగా రెండు రైతు బజార్లు కూడా ఏర్పాటు చేశారు. కాలనీల రూపురేఖలు మారిపోయాయి. గతంలో గుంతలు మయంగా ఉన్న రోడ్లు ఇప్పుడు బీటీ, సీసీ రోడ్లుగా మారిపోయాయి. పార్కులు ఆహ్లాదకరంగా రూపుదిద్దుకున్నాయి.

ఒక్కో డివిజన్‌లో రూ.8 కోట్లు నుంచి రూ.15 కోట్లు అభివృద్ధి పనులు చేశారు. ముఖ్యంగా గత పాలకులు నిర్లక్ష్యం చేసిన కనకదుర్గనగర్, కరెన్సీనగర్, కామినేని నగర్, ఏపీఐఐసీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ , వెటర్నరీ కాలనీ, భారతీనగర్, సిద్ధార్థనగర్, గాయత్రినగర్, రామిలింగేశ్వరనగర్ వంటి ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా జరిగిందని ఆ ప్రాంత వాసులే చెబుతున్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా నియోజకవర్గం అంతటా సమాంతర అభివృద్ధి చేశారు.



అధునాతనంగా వేసిన పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు



కొండ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెట్ల మార్గాలు

కళ్లకు కనిపించే అభివృద్ధి



నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి కళ్లకు కనిపిస్తుంది. మిళ మిళ మెరిసే రోడ్లు, కాలనీల్లో ఆహ్లాదంగా పార్కులు రూపుదిద్దుకున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో కృష్ణలంక ముంపు సమస్యను తొలగిస్తూ రిటైనింగ్ వాల్ నిర్మాణం చేశారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి ఈ ఐదేళ్లలో జరిగింది.

–పాల భాగ్యరాజ్, మొగల్రాజపురం

కొండ ప్రాంతాల్లో సౌకర్యాలు



తూర్పులో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి జరిగింది. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో రూ. కోట్లు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించాం. మెట్ల మార్గాలు నిర్మించడంతో పాటు, డివిజన్‌లో సీసీ రోడ్లు వేశాం. మంచినీటి సమస్య పరిష్కరించేందుకు కొత్తగా పైప్‌లైన్ వేశాం. డ్రైనేజీ పనులు చేపట్టాం. ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను దేవినేని అవినాష్ సారథ్యంలో చేపట్టారు.

–వియ్యపు అమర్నాథ్, కార్పొరేటర్ , 6వ డివిజన్

అభివృద్ధి ఇలా..

- రిటైనింగ్‌వాల్ ఫేస్2, ఫేస్ 3 కి వెచ్చించిన మొత్తంః రూ. 370 కోట్లు
- కృష్ణమ్మ జల విహారం పార్కు కోసం రూ. 12.50 కోట్లు
- బెంజిసర్కిల్ రెండో ఫ్లైఓవర్ః రూ.110 కోట్లు
- మూడు సబ్‌స్టేషన్లు రూ. 21 కోట్లు
- మన బడి నాడు–నేడుః రూ.20 కోట్లు
- మౌలిక సదుపాయాల కోసం కాలనీలోః రూ. 140 కోట్లు
- ఇలా మొత్తంః రూ. 673.50 కోట్లు
- ఇంకా ప్రభుత్వాస్పత్రిలో నాడు–నేడుః రూ. 170 కోట్లు
- సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌కు ఇచ్చినవిః రూ.30 కోట్లు
- సంక్షేమ పథకాల రూపంలో రూ.924 కోట్లు

రూ.21 కోట్లుతో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు..

ఒకప్పుడు కాలనీలో విద్యుత్ వినియోగం పెరిగినా, తగ్గినా సరఫరాలో హెచ్చుతగ్గులు వచ్చేవి. దీంతో ఒక్కోసారి ఇంట్లోని గృహోపకరణాలు కూడా కాలిపోయేవి. ఆ పరిస్థితిని గతంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాలనీల్లోని మూడు ప్రాంతాల్లో అధునాతన సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. కరెన్సీనగర్, మారుతీ కో ఆపరేటివ్ కాలనీ, అయ్యప్పనగర్‌లలో సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయడంతో విద్యుత్ సమస్య పరిష్కారం అయింది.

కొండంత అభివృద్ధి.....

ఒకప్పుడు కొండ ప్రాంతాల్లో అభివృద్ధి ఉండేది కాదు. శిథిలమైన మెట్లతో పై నుంచి కిందకు దిగాలంటేనే ఇబ్బందులు పడేవారు. విద్యుత్ లైట్లు కూడా కొన్ని ప్రాంతాల్లో ఉండేవి కాదు. దీంతో రాత్రి వేళల్లో పైకి వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వచ్చేది. మంచినీరు కూడా సరిగా వచ్చేది కాదు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మెట్ల మార్గాలు వేయడంతో పాటు, రూ.5.50 కోట్లుతో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దీంతో మంచినీటి సమస్య తీరింది.



కృష్ణలంకలో ఏర్పాటు చేసిన రైతు బజార్



రెవెన్యూ కాలనీలో అభివృద్ధి చేసిన పార్కు



వారధి ఎగువ వైపున నిర్మించిన రక్షణ గోడ



మారుతీనగర్ కాలనీలో అధునాతన సబ్‌స్టేషన్

అవినాష్‌ను గెలిపించేందుకు కృషి

రాష్ట్ర యాదవ సంఘ నాయకులు లాకా వెంగళరావు

గుణదల(విజయవాడతూర్పు): ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతగా పనిచేశారని, ఆయన సంక్షేమ పాలనకు ఆకర్షితులై తమ మద్దతు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెలియజేస్తున్నట్లు రాష్ట్ర యాదవ సంఘ నాయకులు లాకా వెంగళరావు తెలిపారు. గుణదలలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ కృషి చేశారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఆయన పథకాలు అమలుచేశారని పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గం అభ్యర్థి దేవినేని అవినాష్‌కు తమ మద్దతు తెలియచేస్తున్నామని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తూర్పులో రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు మౌలిక వసతులు కల్పించారన్నారు. నిస్వార్థంగా దేవినేని అవినాష్ పనిచేశారని చెప్పారు. గత ఐదేళ్లలో తూర్పు నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. అవినాష్‌ను గెలిపించే దిశగా తాము కృషి చేస్తామని స్పష్టం చేశారు. కొలుసు మోహన కృష్ణ యాదవ్, శ్రీనివాస్, యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్యపై దాడికి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి బెజవాడ గణేష్

పటమట(విజయవాడతూర్పు): బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్యపై దాడి చేయటం హేయమైన చర్యని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సెల్ యువజన విభాగం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర జనరల్ కార్యదర్శి బెజవాడ గణేష్ అన్నారు. కృష్ణయ్యపై దాడిని వ్యతిరేకిస్తూ శుక్రవారం గురునానాక్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కృష్ణయ్యపై టీడీపీ దుండగులు సహనం కోల్పోయి దాడి చేశారని చెప్పారు.

బీసీలపై దాడులకు తెగబడే టీడీపీని ఎన్నికల్లో భూ స్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ వెంటనే కృష్ణయ్యకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

రెట్టింపు అభివృద్ధి చేస్తా

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్

పటమట (విజయవాడ): తూర్పు నియోజకవర్గంలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి ప్రజలు ఓటు వేయాలని, తనను గెలిపిస్తే మునుపటి కంటే రెట్టింపు అభివృద్ధి చేస్తానని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. 12, 13, 14, 9 డివిజన్లలో శుక్రవారం ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఐదుసార్లు గడప గడపకు వెళ్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించామని చెప్పారు. అన్ని డివిజన్లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని తెలిపారు. డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలను తీర్చామని తెలిపారు. కృష్ణా వరద ముంపు నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు రిటర్నింగ్‌వాల్ నిర్మించామని పేర్కొన్నారు. జాతీయ రహదారి వెంబడి పటమటలంకకు అండర్ పాస్ నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. అన్ని డివిజన్లలో వైఎస్సార్ సీపీ మార్కు అభివృద్ధి కనబడుతుందని వివరించారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పచ్చ మీడియాకు, నాయకులకు కనబడకపోవటం శోచనీయమని తెలిపారు. ఇప్పటి వరకు తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఆయనో అసమర్థ ఎమ్మెల్యేగా చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు.



పటమట సమీపంలో నిర్వహించిన ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న దేవినేని అవినాష్



ఓటు వేయాలని వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న అవినాష్

ప్రజల కష్టాలు తీర్చేందుకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. కోవిడ్ సమయంలో కన్పించని టీడీపీ నాయకులకు ఓట్లు అడిగే అర్హత కూడా లేదన్నారు. సంక్షేమ పథకాలను అడ్డుకోవటమే ఎజెండాగా పెట్టుకున్న టీడీపీ ప్రజలకు డీబీటీల ద్వారా వచ్చే ఫలాలను అడ్డుకోవటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. దీనిపై ఇచ్చిన కోర్టు తీర్పు టీడీపీకి చెంపపెట్టని అన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే మరింత ఉత్సాహంగా నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు.

ఆ గుర్తును తొక్కేసిందెవరు ?

- గ్లాసుతో లాభమెవరికి..నష్టమెవరికి
- ప్రచారం చేయకుండా అడ్డుకుందెవరు
- డబ్బులిచ్చి ఇంట్లో కూర్చుబెట్టారా.. బెదిరించారా?
- ఇప్పుడు తూర్పులో ఎక్కడ చూసినా ఇదే చర్చ

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో ఒకరికి ఎన్నికల కమిషన్ గాజు గ్లాసు గుర్తును కేటాయించింది. అయితే గాజు గ్లాసు గుర్తు కేటాయించిన అభ్యర్థి ఒక్కరోజు కూడా ప్రచారం చేయలేదని, గ్లాసును ప్రచారం చేయకుండా తొక్కేసిందెవరని ఇప్పుడు తూర్పు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అదే చర్చ జరుగుతుంది. గాజు గ్లాసును కనిపించకుండా చేసేశారని, ఆ గుర్తుపై అంత అక్కసు ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. ఎన్నికల కమిషన్ గుర్తు కేటాయించినా నియోజకవర్గంలో ప్రచారం చేయకపోవడానికి కారణాలు ఏమై ఉంటాయనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

గ్లాసుతో లాభమెవరికీ..నష్టమెవరికి...

తూర్పులో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు, పలువురు స్వతంత్ర అభ్యర్థులతో కలిసి 15 మంది పోటీలో ఉన్నారు. వారిలో ఒక స్వతంత్ర అభ్యర్థికి ఎన్నికల కమిషన్ గాజు గ్లాసు గుర్తును కేటాయించింది. అయితే అభ్యర్థి ఒక్కరోజు కూడా ప్రచారం చేయలేదని తూర్పు ప్రజలు అంటున్నారు. గాజు గ్లాసు గుర్తు ఉంటే లాభమెవరికీ, నష్టమెవరికీ అనే చర్చ కూడా సాగుతుంది. గాజు గ్లాసుతో నష్టం చేకూరేవారే ఆ అభ్యర్థిని బెదిరింపులకు గురిచేసో, మభ్యపెట్టో ప్రచారం చేయకుండా చేశారంటున్నారు. గాజు గ్లాసు గుర్తుపై వారికి అంత అక్కసు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రచారం చేస్తే ఆయనకు వచ్చే ఓట్లు వచ్చేవంటున్నారు.

గాజు గ్లాసు గుర్తు వచ్చిన స్వతంత్ర అభ్యర్థి పవన్ కళ్యాణ్ అభిమానిగా ప్రజలు చెప్పుకుంటున్నారు. ఆయనకు ఎన్నికల కమిషన్ కూడా గాజుగ్లాసు గుర్తు కేటాయించిందని, కానీ ఎందుకు ప్రచారం చేయలేదోనని ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. తమ అభిమాన గుర్తును తొక్కేయడం ఏమిటని అంటున్నారు.

అన్న సంతర్పణ సమితి సేవా కార్యక్రమాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు):అక్షయ, తృతీయ సందర్భంగా అన్న సంతర్పణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా పాత ప్రభుత్వాస్పత్రి, కొత్త వంతెన సెంటర్‌లలో అన్నదానంతోపాటు, పెరుగన్నం, మజ్జిగలను అందజేశారు. వేసవిని పురస్కరించుకుని చెప్పులు లేకుండా ప్రభుత్వాస్పత్రికి వచ్చిన పలువురి పాదరక్షలు పంపిణీ చేశారు. గొడుగులు, విసనకర్రలు అందిచారు. పేదలతో పాటు, వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు పంపిణీ చేశారు. వికలాంగులకు చేతికర్రలు అందచేశారు. దాతల సహకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు గుండు దిలీప్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి పీఎస్ఆర్ మూర్తి, కోశాధికారి రాధాకృష్ణ, చిట్టూరి కుముదాకర్, జూలూరు గుప్తా, కాశీ విశ్వనాథ్, గుర్రం శ్రీనివాస్, నరేంద్ర, రామ్మూర్తి కన్నన్ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులకు నడిచేందుకు సపోర్టింగ్ కర్రలు పంపిణీ చేస్తున్నట్లు అన్నసంతర్పణ సమితి సభ్యులు

బెజవాడలో భారీ వర్షం



బెజవాడలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గంటసేపు కుంభవృష్టిగా వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో జలమయమయ్యాయి. బెంజిసర్కిల్ సమీపంలో రోడ్ల మధ్యలో వర్షపు నీరు చేరింది. నిర్మల కాన్వెంట్ రోడ్డులో రోడ్లు నీట మునిగాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





- నున్న(విజయవాడ రూరల్): గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా మూడవ రోజు గంగానమ్మ విగ్రహ పునఃప్రతిష్ట చేసిన రోజు, అక్షయ తృతీయ పురస్కరించుకొని నున్న గ్రామంలోని శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం నుంచి 108 మంది భక్తులు మహిళలు, కన్యలు, జల బిందెలతో అమ్మవారికి అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. భక్తులు పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీతోనే మాదిగ బిడ్డల భవిష్యత్తు

మాదిగ మహాసేన అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మాదిగ బిడ్డలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మాదిగ మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు కొరటిపాటి ప్రేమ్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా శుక్రవారం కొండపల్లిలో పర్యటించారు. మాదిగ మహాసేన తరఫున ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావులకు సంఘీభావం ప్రకటించారు. వార్డుల్లో పర్యటించి ఐదేళ్ల పాటు ప్రతి మాదిగ కుటుంబానికి సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. పథకాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. మాదిగల ఆశయ సాధనకు మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. మహాసేన రాష్ట్ర, వివిధ జిల్లాల సభ్యులు గుద్దేటి జోషి, బుట్టి కిరణ్, పచ్చిగోళ్ల పండు, మందా నాగమల్లేశ్వరరావు, కూచిపూడి గోపి, చిలుక రమేష్, వినయ్, యలమంద తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలి!

మోకాళ్లపై దుర్గగుడి మెట్లు ఎక్కిన అభిమాని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఏపీలో జరుగుతున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావాలని కోరుకుంటూ తెలంగాణకు చెందిన విద్యార్థి నాయకుడు మోకాళ్లపై దుర్గగుడి మెట్లు ఎక్కాడు. హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకుడు బీటెక్ రవి శుక్రవారం ఇంద్రకీలాద్రి పాత మెట్ల మార్గాన్ని మోకాళ్లపై ఎక్కి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలని కోరుతూ అమ్మవారి మెట్లను మోకాళ్లపై ఎక్కానని, అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ తన మొక్కును చెల్లించుకుంటానన్నారు.

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య సమన్వయం కొరవడిన నేపథ్యంలో ఆ పార్టీ ఓటమి దిశగా పయనిస్తోంది. ముఖ్యంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. దీనికి తోడు తాజాగా ఎమ్మెల్యే అభ్యర్థి రాసలీలల వ్యవహారం సోషల్ మీడియాలో బట్టబయలవడంతో ఆ పార్టీ ఆత్మరక్షణలో పడింది. జరుగుతున్న పరిణామాలన్నీ రానున్న ఎన్నికల్లో పార్టీ ఓటమికి సంకేతాలుగా ఆ పార్టీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు.



తూర్పులో అస్తమిస్తున్న టీడీపీ

- తూర్పులో తమ్ముళ్ల మధ్య కొరవడిన సమన్వయం
- ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య కోల్డ్ వార్
- పెత్తనం ఇవ్వలేదని ఇటీవల పార్టీలో చేరిన నాయకుడి అలక
- అభ్యర్థిని వెంటాడుతున్న సెక్స్ రాకెట్ వ్యవహారాలు
- నైరాశ్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ తూర్పు నియోజకవర్గంలో తమ్ముళ్ల మధ్య అంతరం రోజు రోజుకు పెరుగుతోంది. పోలింగ్ తేదీ సమీపించే కొద్దీ నాయకుల మధ్య సమన్వయం పూర్తిగా కొరవడింది. విజయవాడ లోక్‌సభ అభ్యర్థి కేశినేని చిన్ని, విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామ్మోహనరావు మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయి, ఇద్దరూ కలిసి కనీసం ప్రచారంలో కూడా పాల్గొనటం లేదు. ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు. ఓటర్లకు డబ్బు పంపకాలలో సైతం గద్దె రామ్మోహనరావు, ఎంపీ అభ్యర్థిని పరిగణనలోకి తీసుకోకుండా సొంత మనుషులతోనే పంపకాలు చేస్తున్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన బొప్పన భవకుమార్ సైతం గద్దె వ్యవహరిస్తున్న తీరుపై గుర్రుగా ఉన్నారు. ఓటర్లకు డబ్బు పంపిణీ విషయంలో ఆయన్ను దూరంగా పెట్టడంతో కినుక వహించారు. గద్దె వ్యవహారం నచ్చక ఆయన అలకబూనారు. దీంతో పాటు పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న సీనియర్లు సైతం గద్దె రామ్మోహన్ తీరుపై గుర్రుగా ఉన్నారు. ఆయనకు ప్రచారంతోపాటు, డబ్బు పంపిణీ కార్యక్రమాల్లో సైతం దూరంగా ఉంటున్నారు. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో నిస్తేజం నెలకొంది. నానాటికీ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి దిగజారుతుండటంతో, కొంత మంది నేతలు సైలెంట్ అయిపోతున్నారు. ఈ పరిణామాలన్నీ ఓటమికి సంకేతాలుగా సూచిస్తున్నాయని సొంత పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే పరిస్థితి చేజారిపోయిందని, ఓటమి ఖాయం అనే భావనకు టీడీపీ వర్గాలు వచ్చాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

గద్దె అసంతృప్తి సెగలు తాకకుండా...

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఓటర్లు గద్దె పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. తాను ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి గురించి పట్టించుకోలేదని అసంతృప్తితో ఉన్నారు. మాయ మాటలతో ప్రతిసారీ ఎన్నికల్లో మభ్యపెట్టడం, దుష్ప్రచారం చేసి నెట్టుకొస్తున్నాడనే భావన నియోజకవర్గ ఓటర్లలో వ్యక్తం అవుతోంది. దీనికితోడు తాజాగా గద్దె గలీజు బాగోతం బట్టబయలైంది. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న ఆయన రాసలీలల వ్యవహారం సోషల్ మీడియా వేదికగా వెలుగులోకి రావటం విజయవాడలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఈయన నిజస్వరూపం తెలిసి తూర్పు నియోజకవర్గ ప్రజలు ఛీకొడుతున్నారు. దీనికితోడు టీడీపీ ప్రభుత్వ హయంలో కాల్‌మనీ వేధింపుల కేసుల్లో నిందితులు కూడా ఈయన అండతోనే అలా వ్యవహరించారనే విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు పట్టించుకోలేదని, ఇన్నాళ్లకు గద్దె పాపాలు పండాయని వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల గద్దె ప్రధాన అనుచరుడు మహిళలను వేధింపులకు గురి చేసి, దాడి చేయడంతో అతనిపై పటమట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇప్పుడు ఏకంగా గద్దె రామ్మోహనరావు వాట్సప్ చాటింగ్ వెలుగులోకి రావడంతో టీడీపీ ఆత్మరక్షణలో పడింది. ఇలా పోలింగ్ తేదీ సమీపించే కొద్దీ టీడీపీకి వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. దీంతోపాటు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల మధ్య కోల్డ్ వార్ సాగుతోంది. వీరిరువురు విడివిడిగా ప్రచారం చేసుకొంటున్నారు. గద్దె రామ్మోహనరావు ఎంపీ అభ్యర్థికి సహకరించటం లేదు. గత రెండేళ్ల నియోజకవర్గంలో ఏ పార్టీ కార్యక్రమం జరిగినా తానే ఖర్చు భరించానని, తీరా ఎన్నికల సమయానికి వచ్చేసరికి గద్దె పట్టించుకోకపోవడంతో ఆయన తీరుపై ఎంపీ అభ్యర్థి కారాలు మిరియాలు నూరుతున్నారు. మొత్తం మీద తూర్పు నియోజక వర్గంలో జరుగుతున్న పరిణామాలన్నీ ఈసారి ఎన్నికల్లో ఆ పార్టీ పుట్టి ముంచడం ఖాయం అనే సంకేతాలను ఇస్తున్నాయి.

పాపం బుద్దా వెంకన్న!

- కేశినేని చిన్ని, సుజనా చౌదరి ఇద్దరూ పట్టించుకోని వైనం
- ఆర్థిక అంశాలను తనకు అప్పజెబుతారని ఆశించిన బుద్దా
- రెండు శిబిరాలు దూరం పెట్టడంతో ఇంటికే పరిమితం
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులపై బుద్దా అనుచరుల ఆగ్రహం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇప్పటివరకు ప్రతి ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నేత బుద్దా వెంకన్న హవా నడిచింది. కానీ ఈ సారి ఎన్నికల్లో మాత్రం బుద్దా వెంకన్న ఇంటికే పరిమితమయ్యారు. భారతీయ జనతా పార్టీకి చెందిన సుజనాచౌదరితో పాటు తెలుగుదేశం ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని కూడా బుద్దా వెంకన్నను పూర్తిగా దూరం పెట్టారు. దాంతో నియోజకవర్గంలో బుద్దా వెంకన్న వర్గం సైలెంట్ అయిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి బీజేపీ అభ్యర్థిగా సుజనాచౌదరిని పోటీకి దింపారు. సుజనాచౌదరి వచ్చిన తొలి నాళ్లలో బుద్దా వెంకన్న తన క్యాడర్‌తో కాస్త హడావుడి చేశారు. కానీ గడిచిన 15 రోజులుగా ఆయన ఎన్నికలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు.

ఆర్థిక అంశాలను తనకు అప్పజెబుతారనుకున్న బుద్దా

లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని చిన్ని, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి ఇద్దరూ ఎన్నికలకు సంబంధించిన ఆర్థిక అంశాలను తనకు అప్పగిస్తారని బుద్దా వెంకన్న ఆశించారు. నియోజకవర్గంలో కేశినేని చిన్నితో గడిచిన ఏడాదిన్నర కాలంగా అనేక కార్యక్రమాలను సైతం బుద్దా వెంకన్న నిర్వహించారు. కానీ ఎన్నికల సమయంలో మాత్రం చిన్ని బుద్దా వెంకన్నను నమ్మకపోవటంతో ఆయనను దూరంగా ఉంచారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక సుజనాచౌదరి ఆర్థిక కార్యకలాపాలన్నీ తన ద్వారానే నిర్వహిస్తారని బుద్దా వెంకన్న భావించారు. కానీ సుజనా చౌదరి సైతం బుద్దా వెంకన్నను నమ్మకుండా దూరంగా ఉంచారు. ఇద్దరూ వేరువేరుగా నియోజకవర్గంలో తమ తాలుకా వ్యక్తులను రంగంలోకి దింపి ఆర్థిక అంశాలను చక్కబెట్టే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు.

ఆర్థిక వ్యవహారాల కమిటీ సభ్యుడైనప్పటికీ...

పశ్చిమ నియోజకవర్గంలో ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి ఒక కమిటీని వేసి దాని ద్వారా ఖర్చులు చేయాలని తెలుగుదేశం పార్టీ అధిష్టానం సూచన చేసింది. అందులో బుద్దా వెంకన్నను సైతం సభ్యునిగా సూచించారు. కానీ సుజనాచౌదరి ఆ కమిటీ ఏర్పాటుకు, దాని ద్వారా నిర్వహణకు వ్యతిరేకించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బుద్దా వెంకన్నను నమ్మకపోవటం వలనే సుజనాచౌదరి వ్యతిరేకించినట్లు సమాచారం. దాంతో అటు కేశినేని చిన్ని, ఇటు సుజనాచౌదరి రెండు శిబిరాలు వెంకన్నను దూరంగా పెట్టాయి. అందువలన ఇద్దరికీ బుద్దా వెంకన్న దూరంగా ఉంటూ ఇంటికి మాత్రమే పరిమితమయ్యారని పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. తమ నాయకుడిని పట్టించుకోకపోవటంతో బుద్దా వెంకన్న క్యాడర్ సైతం ఎన్నికల్లో ఉత్సాహంగా పని చేయటం లేదని తెలుగుదేశం సీనియర్ నాయకుడు ఒకరు చెబుతున్నారు.

న్యాయవాదుల సమస్యలను పరిష్కరిస్తాం

చిలకలపూడి(మచిలీపట్నం): న్యాయవాదులకు ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మచిలీపట్నం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సింహాద్రి మాట్లాడుతూ తమ కుటుంబం అంతా న్యాయవాద వృత్తిలో పనిచేసిన వారేనని న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు తమకు తెలుసునని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బార్ అసోసియేషన్ హాలులో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు తాను పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన వెంటనే అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ న్యాయవాదులకు ఇబ్బంది కలిగించే అంశాలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, న్యాయవాదులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఎస్ఎస్ సాయిబాబు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పల్లపోతు అంకరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పచ్చి అబద్ధాలకోరు





గంపలగూడెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో భారీగా పాల్గొన్న ప్రజలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని

- వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని
- గంపలగూడెంలో భారీ రోడ్ షో
- కేశినేని నాని, నల్లగట్ల స్వామిదాసులకు ఘనస్వాగతం
- జనసంద్రమైన ప్రధాన రహదారి

గంపలగూడెం: నారా చంద్రబాబు నాయుడు పచ్చి అబద్ధాల కోరు అని, అధికార దాహంతో ప్రజల్ని మభ్యపెట్టేందుకు అన్ని రకాల ఎత్తుగడలు వేస్తున్నాడని వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) విమర్శించారు. ఆయన తన ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసుతో కలిసి శుక్రవారం గంపలగూడెం, లింగాల, గుళ్లపూడి గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ముందుగా గంపలగూడెం షిర్డీసాయిబాబా ధ్యాననిలయం వద్ద నాని, స్వామిదాసులకు పూలవర్షంతో ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ప్రధాన రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఊసరవెల్లి రంగులు మార్చినట్లు చంద్రబాబుకు మాట మార్చటం పుట్టుకతో వచ్చిన విద్య అన్నారు. సబ్సిడీ పథకాల అమలుతో రాష్ట్రాన్ని శ్రీలంకగా మారుస్తున్నారని విమర్శించిన చంద్రబాబు ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్న ఏకైక ఆలోచనతో తాము అధికారంలోకి వస్తే జగనన్న అమలుచేసిన సంక్షేమ పథకాలకు మించి అమలు చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై తెలుగుదేశం, జనసేనలు లేనిపోని అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయని, ఈ యాక్టు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని స్వయాన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఒప్పుకొన్నారని అన్నారు. తెలుగుదేశం నాయకులు పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారని, నీతిఅయోగ్ సైతం ఈ యాక్టు మంచిదేనని చెప్పిందన్నారు. కరోనా లాంటి క్లిష్ట కాలంలో కూడా జగనన్న అమలుచేసిన సంక్షేమ పథకాల కారణంగా ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడలేదన్నారు. రాష్ట్రంలో పేదరికం కొంతమేర తగ్గిందన్నారు. రాష్ట్రంలో 1.65 కోట్ల కుటుంబాలు ఉంటే గడచిన 58 నెలలుగా 1.35 కోట్ల కుటుంబాలు సంక్షేమ పథకాల వల్ల ప్రయోజనం పొందాయన్నారు. కొన్ని పత్రికలు, టీవీ చానల్స్‌కు వైఎస్సార్ సీపీ హయాంలో చేసిన అభివృద్ధి కన్పించటం లేదని, వారి స్వలాభం కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్న ఆశతో ప్రజలను పక్కదారి పట్టించేలా అబద్ధాల రాతలు రాస్తూ, ప్రచారం చేస్తున్నాయన్నారు.

కేంద్రం నుంచి నిధులు తెచ్చా

చంద్రబాబు ఐదు సంవత్సరాల పాలనలో విజయవాడలో ఏమాత్రం అభివృద్ధి జరగలేదని, తాను కేంద్రప్రభుత్వం నుంచి తెచ్చిన నిధులతోనే రహదారులు, ఫ్లై ఓవర్‌ల నిర్మాణం చేశామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం యథావిధిగా జరగాలంటే మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలించాలన్నారు. తిరువూరు ఎమ్మెల్యేగా నల్లగట్ల స్వామిదాసును, విజయవాడ ఎంపీగా తనను ఓటర్లు ఆశీర్వదించి చట్టసభలకు పంపితే ఈ ప్రాంత సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, కొత్తగుండ్ల నరసింహారావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో వ్యవసాయం దండగలా భావించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రైతు పక్షపాత ప్రభుత్వం ఏర్పడ్డాక వ్యవసాయం పండగలా మారింది. ప్రతి గ్రామంలో ఆర్బీకేల ఏర్పాటు ద్వారా దళారీలకు ఆస్కారం లేకుండా రైతుకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. సాగు సంబరంగా మారింది. రైతు ఆనందం అంబరమైంది.

సంబరంగా సాగు ఆనందంగా రైతు



మొక్కజొన్న ఎండబెడుతున్న కూలీలు

- గడిచిన ఐదేళ్లలో వ్యవసాయానికి వైఎస్సార్ సీపీ చేయూత
- సాగునీటి అవస్థలకు చెక్
- ఎన్నడూ లేని విధంగా సాగుకు 'భరోసా'
- ప్రకృతి విపత్తుల వేళ అన్నదాతలకు అండగా...
- మద్దతు కల్పించి పంట కొనుగోళ్లు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో సాగు సంబరం



ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

కంకిపాడు: గతంలో సాగు ఆరంభమైనా సకాలంలో నీరందక పంట పొలాలు ఎండిపోయి రైతులు నష్టాలను చవిచూడాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగు మొదట్లోనే ప్రకాశం బ్యారేజీ నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన కాలువలు అన్నింటికీ నీటిని మళ్లించి సాగు నీరు సమృద్ధిగా అందుబాటులో ఉంచింది. కాలువ చివరి భూములకు సైతం సాగునీరు అందేందుకు కాలువల ఆధునికీకరణ, పూడికతీత పనులు పూర్తి చేసి శివారు భూములకు సాగునీరు అందించింది.

కష్ట సమయంలో కన్నీటిని తుడిచి...

గత ఏడాది డిసెంబరులో మిచాంగ్ తుపానుతో పంట దెబ్బతింటే రంగు మారిన ధాన్యం నిబంధనలు సడలించి మద్దతు ధరకు కొనుగోలు చేసింది. వైఎస్సార్‌సీపీ హయాంలో సంభవించిన పలు ప్రకృతి వైపరీత్యాల్లో కృష్ణాజిల్లాలో పంట నష్టపోయిన 1,64,849 మంది రైతులకు రూ.126.03 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందించింది. ఎన్టీఆర్ జిల్లాలో 2019–24 సంవత్సరాల్లో 56,156 మంది రైతులు పంట నష్టపోగా వారికి రూ.47.77 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి భరోసా ఇచ్చింది.

రైతు సేవలో రైతు భరోసా కేంద్రాలు

గతంలో మండల కేంద్రాల్లో ఉన్న అధికారుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. విత్తనాలు కావాలన్నా, సాగు సమాచారం కావాలన్నా అధికారుల వద్దకు పరుగులు తీయాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృష్ణాజిల్లాలో 317, ఎన్టీఆర్ జిల్లాలో 267 రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లలో సీజన్‌కు అవసరమైన విత్తనాలు, సాగు సంరక్షణకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను అందించింది. మార్కెట్ ఒడుదొడుకుల్లో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అండగా నిలిచింది. ధాన్యం రైతులు దళారుల చేతిలో చిక్కి నష్టపోకుండా ఆర్బీకేల ద్వారా పంట కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించింది. హమాలీ, రవాణా చార్జీలు రైతులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ఆ సొమ్ము కూడా ప్రభుత్వమే చెల్లించింది. గత ఖరీఫ్‌లో కృష్ణా జిల్లాలో 55,671 మంది రైతుల నుంచి రూ.1068.90 కోట్లు విలువైన రూ.4.89 లక్షల టన్నులు ధాన్యం సేకరించి రైతులకు ప్రతి రూపాయి చెల్లించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ఎన్టీఆర్ జిల్లాలో 2.25 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.445 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేసింది.

యాంత్రీకరణ దిశగా అడుగులు

యంత్రసేవ ద్వారా రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలు, ఇతర వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందించి సాగుకు చేయూత అందించింది. కృష్ణాజిల్లాలో 363 రైతు గ్రూపులను ఏర్పాటుచేయించి వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా 244 ట్రాక్టర్లు, 45 వరి కోత యంత్రాలు, 965 యంత్ర పరికరాలను సమకూర్చింది. రూ.36 కోట్లు విలువైన పరికరాలను అందించగా ప్రభుత్వ సబ్సిడీ రూ.14 కోట్లు ఇచ్చింది. ఎన్టీఆర్ జిల్లాలో 1667 పరికరాలను పంపిణీ చేశారు. ట్రాక్టర్లు 183, వరి కోత యంత్రాలు 35 ఇచ్చారు. రూ.32.48 కోట్లు విలువైన పరికరాలు ఇవ్వగా సబ్సిడీ రూ.11.83 కోట్లు పొందారు.

సాగుకు భరోసా

కృష్ణాజిల్లాలో 3,69,116 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 3,13,177 ఎకరాల్లో సాగు భూమి ఉంది. వరి, పసుపు, చెరకు, మిర్చి, సుబాబుల్, పత్తి, వేరుశనగ, మామిడి, కూరగాయ, ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట తప్పకుండా సీఎం జగన్ రైతులకు అండగా నిలిచారు. సాగు మొదట్లో పెట్టుబడులకు రైతులు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని గుర్తించి పెట్టుబడికి అవసరమైన భరోసా రైతులు, కౌలు రైతులకు అందించారు. ఏడాదికి రూ.13500 (దీనిలో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.7,500) చొప్పున ఆర్థిక చేయూత అందించి వెన్నుతట్టి ప్రోత్సహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2019–2024 వరకూ ఐదేళ్లలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా రూ.979.29 కోట్లు రైతుభరోసా కింద రైతులకు లబ్ధి చేకూరింది. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.లక్ష రుణం తీసుకుని సకాలంలో రుణం చెల్లించిన రైతులకు సున్నా వడ్డీ కింద 1,66,185 మందికి రూ.30.23 కోట్లు మేర లబ్ధి చేకూర్చింది. ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 30,405 మంది రైతులు రూ.7.72 కోట్లు లబ్ధి పొందారు. రైతుభరోసా కింద రూ.2021లో 12,171 మందికి రూ.66.94 కోట్లు, 2022లో 1,31,084 మందికి రూ.59.82 కోట్లు, 2023లో 1,34,338 మందికి రూ.29.33 కోట్లు, 2023–24 సంవత్సరం 1.42 లక్షల మందికి రూ.28.73 కోట్లు లబ్ధి చేకూర్చి సాగును సంబరం చేసింది.

మంచి ధర అందింది



సీజన్ ఏదయినా, పంట ఏదైనా ప్రభుత్వం రైతు పక్షానే నిలిచింది. గత డిసెంబరులో పంట చేతికి వచ్చాక తుపాను విరుచుకుపడింది. పంట దెబ్బతింటే నిబంధనలు సడలించి పంటను కొనుగోలు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ కూడా వెంటనే జమ చేశారు.మంచి చేసే ప్రభుత్వానికి వెన్నంటి నడుస్తాం.

–ఉయ్యూరు సుబ్బారావు, రైతు, నెప్పల్లి

రైతు సంక్షేమ పాలన



రైతుభరోసా, సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ యంత్రసేవ, మద్దతు ధరకే పంట కొనుగోళ్లు అన్నీ ఇన్నీ కావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. దళారులకు చెక్ పడింది. రైతు సంక్షేమ పాలన సాగుతోంది. ఒక రైతుగా నా మద్దతు సంక్షేమానికే.

–మసిముక్కు సాంబశివరావు, రైతు, దావులూరు